

THE LARGEST CIRCULATED TELUGU WEEKLY
స్వాతి
ESTABLISHED 1984
₹20
15.6.2018
సపరివార పత్రిక
ఒత్తిడికి చెక్


GRT
JEWELLERS
Since 1964
స్త్రీ సౌందర్యం
స్వర్ణ సౌందర్యం
సౌందర్యరాశియైన
సంగమం



VKC
Walkaroo
FOR ALL WALKS OF LIFE
Rohit Sharma
Art No. 13102
MRP : ₹ 289.00*
Art No. 10527
MRP : ₹ 497.00*
Art No.12305
MRP : ₹ 289.00*
* MRP mentioned is per 2N (1 pair) inclusive of all taxes
Follow us on
U4iC INTERNATIONAL PVT. LTD.,
Surampalli, Vijayawada, Krishna, Andhra Pradesh - 520015, Ph: 8499803629.
Ibrahimpatnam, Hyderabad, Telangana - 501506 Ph: 8498095426.
www.vkcgroup.com




THE LARGEST CIRCULATED TELUGU WEEKLY

సపరివార పత్రిక

స్వాతి

FOUNDER PROPRIETOR EDITOR : VEMURI BALARAM



పాఠక దేవుళ్ళకు నమస్కారం

ఎడిటర్

వేమూరి బలరామ్

ESTABLISHED 1984 | సంపుటి 34 | 15.6.2018 | సంచిక 50

అనిల్ బిల్డింగ్స్ సూర్యారావుపేట పోస్ట్ బాక్స్ 339 విజయవాడ 520 002

A good leader is a person of both action and intellect

సీరియల్స్

కథలు

శీర్షికలు



ముఖచిత్రం
కురులూ గిరులూ
Courtesy : GRUHASOBHA

స్పెషల్ ఫీచర్స్

క్రమశిక్షణే సర్వరక్షణ

లౌకికజ్ఞానం గలవారు చీమల్లా జీవించాలి. చీమలు ఎక్కడికి వెళ్ళినా వరస తప్పవు. వరసగా క్రమశిక్షణాబద్ధంగా నడుస్తాయి. మానవులు ఆ విధంగా నడవలేకపోతున్నారు.

వాటినుండి ఎనిమిది ధర్మాలను నేర్చుకోవాలి. వాటినే 'పిపీలికా అష్టాంగ ధర్మాలు' అంటారు.

క్రమశిక్షణాబద్ధంగా ఎక్కడకు వెళ్ళినా వరసగా వెళ్ళాలి. ఇది శోభనీయం.సహకార సంపాదన అనగా అందరూ కలసి సహకారులుగా సంపాదించుకోవాలి. పొదుపుచేసి భద్రపరచి అవసరమైనప్పుడు సామూహికంగా అనుభవించాలి.

పాలకులమీద భక్తివిశ్వాసాలు కలిగి వారిఆజ్ఞను పాలించాలి. కులతత్వమును విడనాడాలి.

చీమలకు 'నాది' అను భ్రాంతి, నేను సంపాదించాననే అహంకారం వుండవు. ఈ పుట్ట నాదనే ఆలోచన వుండదు. ఏ ప్రాంతంనుండి ఏ ప్రాంత పుట్టకు చీమ వచ్చినా అది తన స్వంతపుట్టగానే భావించి నివసిస్తుంది. నాది నీదనే తేడా వుండదు. మానవులు ఇది నా ఇల్లు నేను కట్టించాననే భ్రాంతితో అహంకారంతో వుంటారు.

చీమలలో రాగద్వేషాలుండవు.వాటి సంఘంలో విరోధానికి చోటులేదు. చీమలకు కామ, క్రోధ,లోభ, మద, మాత్సర్యాలు లేవు. అస్ఖలిత బ్రహ్మచర్యంతో గడుపుతాయి. రాణీ చీమ ఒక్కటే సంతానోత్పత్తి చేస్తుంది. మిగిలిన చీమలన్నీ ఆ సంతతిని పోషించి, రక్షిస్తాయి. వాటికి క్రోధం లేదు. లోభత్వం లేదు. అన్నీ సమంగా అనుభవిస్తాయి.

మనమంతా ఈ ఎనిమిది ధర్మాలను చీమల నుండి నేర్చుకోవాలి.

శివయోగి

చందాను www.swatipublications.com వెబ్‌సైట్ ద్వారా చెల్లించవచ్చు
E-mail: advtswati@gmail.com swativja@eth.net

విడిప్రతి ₹20 12 నెలలకు ₹1076
విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిల్) ₹6666 (100 డాలర్లు)

Editor : VEMURI BALARAM Swati Publications Anil Buildings Suryaraopet Vijayawada 520 002 Printed and Published by the owner VEMURI BALARAM
Printed at Anil Swati Press Autonagar Vijayawada Cover at Kala Jyothi Process Pvt.Ltd., Hyderabad
Tel.: (0866) 243 1862 243 4017 Advt. 243 1233 Mktg. 243 3938 Fax: 0866-243 0433


EPSON
EXCEED YOUR VISION
ఎక్స్‌క్యూజ్ నం. 13
నాన్న నా ప్రింట్స్‌ను తన ఆఫీసులో మరిచిపోయారు
ప్రింట్స్ కేవలం 7 పైసల* నుండి ప్రారంభమవుతాయి
India's No.1 Inkjet Printer
2 MILLION HAPPY USERS IN INDIA
ప్రింట్ ప్రాజెక్ట్స్,
ఆర్ట్ & క్రాఫ్ట్స్,
బుక్ రిపోర్ట్స్,
మరియు మరెన్నో.
ఈ సంవత్సరం,
స్కూల్ వర్క్‌ను సునాయాసంగా చేసుకోండి
ఎప్సన్ ఇంక్‌ట్యాంక్ ప్రింటర్స్
ప్రింట్ చేయడానికి ఏకైక మార్గం
Visit jointherevolution.co.in or call
ANDHRA PRADESH Vijayawada 98852 22296, Vizag 95028 85566, Tirupati 75696 95781 TELANGANA 99896 33221
Epson Helpline: For product info or service - 1800 425 0011
For service - 1860 3000 1600 (9AM - 6PM) (Mon - Sat)
Email: think@eid.epson.co.in
SMS EPSON TO 58558
*Total Colour Cost Per Print - 18 Paise (CMY) + 7 Paise (K) = 25 Paise. Cost Per Print (CPP) is calculated based on quoted Page Yield for Black (4,500 pages) and Composite (Cyan/Magenta/Yellow - 7,500 Pages) ink bottles, and MRP of Epson genuine ink bottles. Quoted yields are based on the ISO 24711/24712 patterns of mixed text and colour graphics with Epson methodology. Quoted yields are based on the replacement ink bottles purchased. Part of the ink from the included bottles is used for printer startup so yields could be lower than those of replacement ink bottles. Actual yields vary due to reasons including images printed, print settings, temperature and humidity. Yields may be lower when printing infrequently or predominantly with one ink colour. Ink is used for both printing and printhead maintenance. All inks are used for both black and colour printing. Quoted CPP applicable for L130, L310, L380, L365, L485 and L565. *Source: IDC Asia Pacific Quarterly Hardcopy Peripherals Tracker 2017 Q4. Volume and Value Market share of A4 Inkjet Printers and MFPs.



అత్యధిక సర్క్యులేషన్‌గల ఏకైక తెలుగు వారపత్రిక

1.6.2018

'హృదయం ఎక్కడున్నదీ', 'వేట' 'సామ్రాట్ సముద్రగుప్త' 'మనిషిలో మనిషి', సీరియల్స్ ఇంట్రెస్టింగ్‌గా సాగుతున్నాయి. 'నేనెవరో తెలుసా!' శీర్షిక ద్వారా వారం వారం ఎందరో మహానుభావుల జీవితచరిత్రలను తెలుసుకుంటున్నాం.

'అంతా రాజకీయమే' శీర్షిక ప్రస్తుత రాజకీయ పరిస్థితులను వివరిస్తున్నది. 'B హ్యాపీ', 'చిలిపి', 'Whats App' శీర్షికలు చాలా బాగున్నాయి.

ఎస్‌కె.యాకుబ్‌పాషా ఖమ్మం

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి 'దివ్యమార్గం' అందరికి అనుసరణీయం. కర్మలను చేయుటయందు అహంకారమును ప్రదర్శించకూడదు. మానవసేవ మనిషికి దివ్యత్వాన్ని ప్రకటింపజేసినందుకు ధన్యవాదాలు.

'ప్రేమించండి' ప్రతి ఒక్కరు చదవవలసిన ఫీచర్. నిన్ను నువ్వు ప్రేమిస్తేనే ఇతరులను ప్రేమించగలవని తెలియజేసినందుకు ధన్యవాదాలు.

లక్ష్మీ గిరిజకుమార్ రాజమహేంద్రవరం

నిరాశావాదాన్ని దగ్గరకు రానీయకూడదు వెలుగుని చూసే ప్రయత్నాలనే ఎల్లవేళలా చూడాలని 'ఆల్ ఈజ్ వెల్'ద్వారా మంచివిషయాలను చర్చించారు. 'గెలుపెవరిది' అద్భుతమైన కథ. సీరియల్ 'సామ్రాట్ సముద్రగుప్త' ఆసక్తికరంగా ఉంటోంది.

జి.వి.మురళీమోహన్ కోటరామచంద్రపురం

ఎదిగే పిల్లలతో డిన్నర్ టేబుల్‌వద్ద చెప్పుకునే కబుర్లు ఫ్రెండ్లీగా సాగాలని 'మంచి తల్లిదండ్రులు' ఫీచర్ ద్వారా ఎన్నో పాఠాలను నేర్పించారు.

అలాగే కోపం తప్పు అని తరచూ పిల్లలతో చెబుతుంటే ఉపయోగం వుండదు తగిన చర్యలతో వారిలో మార్పుకు ప్రయత్నించాలని 'అనిల్' పేజీలోని వివరణ బాగుంది.

బి.రాజశేఖర్ హైదరాబాద్

కాలం విలువ, కర్మ, సేవలగురించి దివ్యమార్గం చదివి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు వెలిబుచ్చిన విలువైన అభిప్రాయాలూ తెలుసుకున్నాం. 'చివరి రోజుల్లో...' మంచి శీర్షిక.

వి.నారాయణ గుంటూరు

వచ్చేవారం స్పెషల్

అందమైన కురులు

'గెలుపెవరిది' కథ చాలాబాగుంది. అలాగే 'వేట' 'హృదయం ఎక్కడున్నదీ...', 'సామ్రాట్ సముద్రగుప్త', 'మనిషిలో మనిషి' సీరియల్స్ ఆసక్తికరంగా ఉంటున్నాయి.

ఎ.వి.సోమయాజులు కాకినాడ

'మంచి తల్లిదండ్రులు', 'ఆల్ ఈజ్ వెల్' చదువదగ్గ ఫీచర్స్.

'హెల్దీ హ్యాబిట్స్', 'మిమ్మల్ని మీరు బాగా ప్రేమించండి' ఫీచర్స్ వదిలితే ఎంతో కోల్పోవడం తథ్యం. ప్రింటింగ్ టెక్నాలజీకి ఆద్యుడైన జాన్‌గూటెన్‌బర్గ్ తన పరిశోధనవల్ల మానవాళికి చేసిన సేవ ఆచంద్రార్కం నిలిచివుంటుంది.

పి.నరసయ్య హైదరాబాద్

ఇది మంచి సమయం



7.6.2018 నుండి 13.6.2018 వరకు శ్రీ విలంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, అధిక జ్యేష్ఠం, కృష్ణపక్షం.

7.6.2018 గురువారం

తిథి: అష్టమి మ.12.37 వరకు
నక్షత్రం: పూర్వాభాద్ర రా.10.15 వరకు
వర్జ్యం : లేదు
దుర్ముహూర్తం : ప. 9.51-10.43 వరకు. మ. 3.04-3.56 వరకు
రాహుకాలం: మ. 1.39-3.16 వరకు
మంచి సమయం : మ.12.50 నుండి 2.30 వరకు
సూర్యోదయం: 5.30కి
సూర్యాస్తమయం: 6.33కి

8.6.2018 శుక్రవారం

తిథి: నవమి మ.1.13 వరకు
నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.11.02 వరకు
వర్జ్యం: ప. 8.04-9.44 వరకు
దుర్ముహూర్తం: ప.8.06 నుండి 8.58 వరకు. మ. 12.26-1.18 వరకు
రాహుకాలం: ప.10.24-12.01 వరకు
మంచి సమయం: మ.2.30-4.20 వరకు
సూర్యోదయం: 5.30కి
సూర్యాస్తమయం: 6.33కి

9.6.2018 శనివారం

తిథి: దశమి మ.12.59 వరకు
నక్షత్రం: రేవతి రా.11.10 వరకు
వర్జ్యం: ప. 11.06-12.42 వరకు
దుర్ముహూర్తం: ఉ.5.30-7.14 వరకు
రాహుకాలం: ప. 8.47-10.24 వరకు
మంచిసమయం: మ. 3.00 నుండి 4.40 వరకు
సూర్యోదయం: 5.30కి
సూర్యాస్తమయం: 6.33కి

10.6.2018 ఆదివారం

తిథి: ఏకాదశి ప.11.55 వరకు
నక్షత్రం: అశ్విని రా.10.29 వరకు
వర్జ్యం: సా.6.36 నుండి 8.09 వరకు
దుర్ముహూర్తం: సా.4.47 నుండి 5.39 వరకు
రాహుకాలం: సా. 4.53-6.31 వరకు
మంచిసమయం : ప.10.20 నుండి 11.50 వరకు
సూర్యోదయం: 5.30కి
సూర్యాస్తమయం: 6.34కి

11.6.2018 సోమవారం

తిథి: ద్వాదశి ప.10.04 వరకు
నక్షత్రం: భరణి రా.9.05 వరకు
వర్జ్యం: ఉ.7.32-9.02 వరకు
దుర్ముహూర్తం : మ. 12.27 నుండి 1.19 వరకు. మ. 3.03-3.55 వరకు
రాహుకాలం: ఉ. 7.09-8.47 వరకు
మంచిసమయం : లేదు
సూర్యోదయం: 5.30కి
సూర్యాస్తమయం: 6.34కి


12.6.2018 మంగళవారం

తిథి: త్రయోదశి ఉ.7.34 వరకు చతుర్దశి తె.4.34 వరకు
నక్షత్రం: కృత్తిక సా.6.07 వరకు
వర్జ్యం : ప.8.06 నుండి 9.34 వరకు
దుర్ముహూర్తం: ప. 8.06 నుండి 8.58 వరకు. రా.10.55-11.47 వరకు
రాహుకాలం: ప. 3.16-4.53 వరకు
మంచి సమయం: లేదు
సూర్యోదయం: 5.30కి
సూర్యాస్తమయం: 6.34కి

13.6.2018 బుధవారం

తిథి : అమావాస్య రా.1.13 వరకు
నక్షత్రం: రోహిణి సా.4.43 వరకు
వర్జ్యం : ప.9.31 నుండి 10.57 వరకు, రా. 9.42 నుండి 11.07 వరకు
దుర్ముహూర్తం : ప. 11.35 నుండి 12.27 వరకు
రాహుకాలం: మ. 12.02-1.39 వరకు
మంచి సమయం : లేదు
సూర్యోదయం: 5.31కి
సూర్యాస్తమయం: 6.35కి

* మీరు చేసే ప్రతిపనిలో ఆనందాన్ని పొందుతారు.


asianpaints
3 YEARS* WARRANTY
లోపల
TRACTOR
బయట
ACE
asianpaints
TRACTOR
EMULSION
Smooth wall finish
asianpaints
ACE
EXTERIOR EMULSION
పెయింట్‌కి వారంటీ ఉంటుంది మూడేళ్ళు, కానీ ఇంటిగౌరవం నిలుస్తుంది ఎన్నో ఏళ్ల.
*షరతులు, నియమాలు వర్తిస్తాయి.

నాలుగేళ్ళ నరేంద్రమోడీ పాలన

నరేంద్రమోడీ ప్రధాని బాధ్యతలు చేపట్టి నాలుగేళ్ళు పూర్తయింది. ఈ నాలుగేళ్ళకాలంలో నరేంద్రమోడీ సాధించిన విజయాలు, సాధించలేక పోయిన వాగ్దానాలు, ప్రారంభించి విఫలమైన పథకాల ఆధారంగా అయిదో సంవత్సరం అంతంలో తీర్పు ఇవ్వటానికి సిద్ధమవుతుంది.

నరేంద్రమోడీ నాలుగేళ్ళ పాలన గురించి చేసే ఏ విశ్లేషణ అయినా అతని రాజకీయ, ఆర్థిక, పాలనా అంశాలమీదా ఉంటుంది.

క్లుప్తంగా చెప్పాలంటే నరేంద్రమోడీ నాలుగేళ్ళ పరిపాలన ప్రతిపక్షాలు చెప్పేటంత చెత్తగా సాగలేదు, బిజెపి చెప్పుకునేంత ఘనంగానూ లేదు. అయితే ఒక రకమైన విశ్వాసాన్ని ప్రజలలో నింపగలిగింది. నరేంద్రమోడీ గత ప్రధానులకన్నా భిన్నమైనవాడన్న మాటను తెచ్చుకున్నాడు.

ప్రతిక్షణం దేశంగురించే ఆలోచించే నేతగా గుర్తింపుపొందాడు. విదేశీ నేతలందరు నరేంద్రమోడీని ప్రత్యేకంగా గౌరవిస్తున్నారు. ప్రపంచస్థాయి నేతగా అంగీకరిస్తున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీలను మించిన అంతర్జాతీయ గుర్తింపు నరేంద్ర మోడీకి లభించింది. అగ్రరాజ్యాధినేతల సరసన ఆత్మవిశ్వాసంతో నిలబడుతున్నాడు.

గతంలో ప్రధానిగా పదేళ్ళు పనిచేసిన మన్మోహన్‌సింగ్‌తో పోల్చినపుడు నరేంద్రమోడీ తాను దేశ ప్రధానిని అని అడుగడుగునా విశ్వాసం ప్రదర్శించటం స్పష్టం.

ఎవరి నీడలోనో పనిచేయాల్సిన అవసరం లేక పోవడం నరేంద్రమోడీకి కలిసివచ్చిన విషయం.రాజకీయంగా నరేంద్రమోడీ అద్భుతవిజయాలనే అందుకున్నాడు. సాధారణంగా ఏ ప్రభుత్వమైనా తన నాలుగేళ్ళ పాలన తర్వాత ఐదవ సంవత్సరంలో ఎన్నికల మూడ్‌లోకి వెళుతుంది.

కాని నరేంద్రమోడీ ప్రధాన మంత్రిత్వంలోబిజెపిని నిరంతరం ఎన్నికల మూడ్‌లోనే వుంచాడు. 2014లో లోక్‌సభ ఎన్నికల విజయంతర్వాత బిజెపి ప్రతి ఎన్నికలను నరేంద్ర మోడీ పేరునే ప్రచారం నిర్వహించారు. ప్రతి రాష్ట్ర ఎన్నికకు ఆయన వ్యక్తిగతంగా రోజుల తరబడి ర్యాలీలు నిర్వహించాల్సిన పరిస్థితి. నరేంద్రమోడీ తప్పించి మరో నాయకుడు ఎవరూ ఆ పార్టీలో లేరా అనే సందేహం కలిగించిన పరిస్థితి.

ఒకనాడు ఇందిరాగాంధి కాంగ్రెస్ పార్టీని నడిపించిన తీరుకు నేడు బిజెపిని నరేంద్రమోడీ నడిపిస్తున్న దానికి పెద్దగా తేడా లేదు. ఆనాడు పార్టీ, ప్రభుత్వం రెండూ ఇందిరాగాంధీ గుప్పిట్లో వుండేవి.ఇప్పుడు బిజెపి,ఎన్.డి.ఎ. ప్రభుత్వం నరేంద్రమోడీ కనుసన్నల్లో నడుస్తున్నది.

బిజెపి నేడు 20 రాష్ట్రాలలో అధికారంలో వుంది. ప్రతి రాష్ట్రంలో అంచనాలను మించి విజయం సాధించింది. మధ్యలో ఢిల్లీ, పంజాబుల్లో ఓడిపోయింది. బీహార్ ఓటమి షాక్‌నుండి తేరుకుని తిరిగి నితీష్ కుమార్‌ని తనవైపు తిప్పుకుంది.

అస్సాం, త్రిపురలో ఘనవిజయం సాధించింది. బెంగాల్,ఒరిస్సాల్లో రెండవస్థానంలోకి ఎదిగింది.

దక్షిణాది రాష్ట్రాలలోకి విస్తరించే యత్నంచేస్తున్నది. ఓటర్లు తిరస్కరించిన గోవా, మణిపూర్, మేఘాలయ వంటి చోట్ల కూడా ఏదోకరకంగా తమపార్టీ లేదాతమ పార్టీ అనుకూల ప్రభుత్వాలను ఏర్పాటు చేయించుకున్నారు. గవర్నర్‌ని తమకు అనుకూలంగా ఉపయోగించుకుంది. కర్ణాటకలోనూ అటువంటి ప్రయత్నమే చేసినా సుప్రీమ్‌కోర్టుజోక్యంతో విఫలమైంది.

నరేంద్రమోడీ నేతృత్వంలో జరుగుతున్న బిజెపి రాజకీయవిస్తరణకు ప్రతిస్పందనే ఇటీవలి కర్ణాటకలో కాంగ్రెస్, జెడి(ఎస్) సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు. అన్ని ప్రాంతీయపార్టీలు ఒకే వేదికపైకి వచ్చాయి. కాంగ్రెస్‌ని తీవ్రంగా వ్యతిరేకించే పార్టీలు కూడా కాంగ్రెస్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమయ్యాయి. ఒకవిధంగా బిజెపి రాజకీయ విస్తరణ ప్రతిపక్షాల ఐక్యతను ప్రోత్సహించింది. 2019లో బిజెపిని కలిసికట్టుగా ఎదుర్కొని, అమిత్‌షా-నరేంద్రమోడీ ద్వయాన్ని అధికారానికి దూరం చెయ్యకపోతే తమ రాజకీయ మనుగడ కష్టమన్న భయాన్ని సృష్టించారు. ఇది ఇప్పుడు బిజెపి ఎదుర్కోబోతున్న పెద్దసవాలు.

2014 ఎన్నికల్లో బిజెపికి లభించింది 30-32 శాతం ఓట్లు మాత్రమే. మిగిలిన 60 శాతం ఓట్లు బిజెపిని వ్యతిరేకించే పార్టీల చేతిలో ఉన్నాయి.

అవన్నీ పూర్తిగా ఏకం అవలేకపోయినా కనీసం 40 శాతం ఓటు వారి వైపుకు మొగ్గితే నరేంద్రమోడీ పాలనకు ముగింపు అవుతుంది.

అయితే రాజకీయాలు లెక్కలమీద ఆధారపడి నడవవు. పలు అనేక ఇతర అంశాలు ప్రభావితం చేస్తాయి. నరేంద్రమోడీ ఇమేజ్ నాలుగేళ్ళ పాలన తర్వాత కూడా తగ్గకపోవడం గమనించాల్సిన విషయం. తాజాగా వస్తున్న సర్వేలన్నీ ఎన్.డి.ఎ. నరేంద్రమోడీకి అనుకూలంగానే వున్నాయి.

57 శాతం ఓటు నరేంద్రమోడీనితిరిగి ప్రధానిగా చూడాలని వుంది.ఆయన పాలన, విధానాలపట్ల ప్రజలలో ఆమోదముంది. నాలుగేళ్ళ తన పాలనలో మోడీ ఒకరకమైన ఆశను, నమ్మకాన్ని పెంచగలిగాడు.ఇది వరలో ప్రధానులెవరూ సాహసంగాతీసుకోలేని పలు నిర్ణయాలు నరేంద్రమోడీ తీసుకున్నాడు. దేశం కోసం శ్రమిస్తున్న నేతగా ఆమోదం పొందాడు.

నరేంద్రమోడీ తీసుకున్న కీలక ఆర్థిక నిర్ణయాలు ఆయనను విశేషంగా అభిమానించే మధ్యతరగతి, వ్యాపారవర్గాలను దెబ్బతీశాయి. పెద్దనోట్ల రద్దు బ్యాంకింగ్ రంగాన్ని అతలాకుతలం చేసింది.

ఎ.టి.ఎమ్‌లను తలచుకుని భయపడింది మధ్యతరగతి. అవసరానికి చేతిలో డబ్బుఆడని పరిస్థితి. మరోవైపు బ్యాంకుల్లో డిపాజిట్లకు భరోసావుండని విధానం మధ్యతరగతిని ఆందోళనకు గురిచేస్తున్నది. తమ సక్రమ సంపాదనలను అక్రమ వ్యాపార సామ్రాజ్య నిర్మాతలకు అప్పనంగా కట్టపెడుతున్నారన్న భావం బలపడింది.

దేశం వదిలి పారిపోయిన నీరవ్‌మోడీ, విజయ్ మాల్యాల బహిరంగ బ్యాంక్‌దోపిడీ భారమంతా పన్నులు కట్టే ప్రజలమీదే పడుతోంది.మధ్యతరగతి ఆర్థికరంగంలో నిర్ణయాలవల్ల బాధితులుగా మారితే, జి.ఎస్.టి. అమలుతో చిన్న, మధ్యస్థాయి వ్యాపారులు ఘనంగా దెబ్బతిన్నారు. తనకు అండగా నిలిచేవర్గాల భవిష్యత్తుతో

> మా పార్టీ (బి.జె.పి.) 15 ఏళ్ళ పాలన తీరును వివరిస్తూ ఎన్నికల్లోకి వెళ్ళి గెలుస్తాం.
>
> -శివరాజ్‌సింగ్ చౌహాన్,
> మధ్యప్రదేశ్ సి.ఎమ్.



పురుషుడినైన నాకు కూడ...!



తిరుపతిరావు గారు

నా గురించి నేను పరిచయం చేసుకుంటాను. నా పేరు తిరుపతిరావు. మీరంతా అనూస్ సిస్టర్స్‌గా పిలిచే ఆ నలుగురమ్మాయిలు మా అమ్మాయిలే. నా కుమార్తెలు బ్యూటీ ఫీల్డ్‌లో ఉన్నందువల్లను, వాళ్ళు హెర్బల్ ఉత్పత్తులు తయారు చేస్తుండటం వల్ల నేను ఏ కెమికల్ హెయిర్ డైల జోలికి వెళ్ళలేదు. నేను నా యాభయ్యో ఏట నుంచి అంటే నా జుట్టు తెల్లబడటం మొదలయిన దగ్గర్నుంచి మా అమ్మాయిలు ప్రత్యేకంగా తయారుచేసిన "అనూస్ హెన్నా" వాడటం మొదలు పెట్టాను. ఇలా వాడటం వల్ల నా జుట్టు ఎంత ఎరుపుగా అయ్యిందంటే అంతా నన్ను "ఎర్ర జుట్టు తిరుపతిరావు"గా పిలిచేవాళ్ళు. అయితే కొంత కాలం క్రితం మా అమ్మాయిలు "నాన్నగారూ! మేము అనూస్ బ్లాక్ ఎక్స్‌పర్ట్ తయారు చేశాము, అది వాడటం వల్ల జుట్టు ఖచ్చితంగా నల్లగా మారుతుంది" అని చెప్పగానే నాకు చాల ఆనందం కలిగింది.

అయితే మా అమ్మాయిలు ఏ ప్రోడక్ట్ తయారు చేసినా స్త్రీల కోసమే చేస్తారని మీ అందరిలాగే నాకు నమ్మకం. మరి పురుషులకు కూడ కొన్ని ప్రత్యేక సమస్యలుంటాయి కదా? మీసాలు, గడ్డాలు నెరుస్తుంటాయి తల మీది జుట్టుకి అంటే ఏదో ధైర్యం చేసి హెయిర్ డై వాడతాం. కాని ముఖం మీదుండే గడ్డాలకు మీసాలకు అలా వాడలేం కదా? అందుకే అమితాబ్, చంద్రబాబు లాంటి ప్రముఖులంతా అలా తెల్లటి గడ్డాలతో మీసాలతో తిరుగుతుంటారు. ఈ సమస్యని అధిగమిస్తే బావుణ్ణు కదా అనిపించింది. ఆ సంగతే అడిగాను. "అవును! ఈ బ్లాక్ ఎక్స్‌పర్ట్ ప్రత్యేకత ఏంటంటే ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. సున్నితమైన ముఖ చర్మం మీద కూడ నిరభ్యంతరంగా వాడొచ్చు" అని చెప్పారు. మా ఇంట్లో మేమంతా వాడి చూశాం... మా బంధువులంతా హ్యాపీ... బ్యూటీ ప్రపంచంలో ఇది ఒక మైలు రాయిగా నేను భావిస్తున్నాను. డెబ్బై యేళ్ళ వయసులో కూడ నేను ప్రకృతి సహజ సిద్ధంగా కనిపించే నల్లని జుట్టుతో బయటకు వెళ్ళటానికి ఇష్టపడతాను. ఐ యామ్ వెరీ హ్యాపీ... మరి మీరు...? – **తిరుపతిరావు**

మా నాన్న గురించి : మా నాన్న తిరుపతి రావు గారికి ఏ ఆడపిల్లను చూసినా ప్రాణమే. వారు ఎందులోనూ తక్కువ కాకూడదని ప్రతి ఆడపిల్లలకి నూరి పోయడంలో ముందుంటారు. 7th మానేసిన మా అమ్మని ఆ రోజులలో దగ్గరుండి చదివించారు. మా అమ్మకి నాన్న ఇచ్చే స్వతంత్రం చూస్తే ప్రతి భర్తా తన భార్యకు ఇంత స్వతంత్రం ఇస్తే బాగుంటుందనిపిస్తుంది. – **అనూస్ సిస్టర్స్**



కెమికల్ హెయిర్ డైకి 'నో' చెప్పండి

కెమికల్స్ ఏమాత్రం లేని బ్లాక్ ఎక్స్‌పర్ట్ 100% నేచురల్ బ్లాక్ హెయిర్ కలర్ ట్రై చేయండి

- ఇది జుట్టుకు సహజమైన నలుపు రంగును ఇవ్వడంతో పాటు తెలుపు జుట్టును తగ్గిస్తుంది.
- ప్రకృతి సిద్ధమైన పదార్థముల వల్ల దీనిని ముఖ చర్మం మీద (గడ్డం, మీసాలకు) కూడ ఎటువంటి సందేహం లేకుండా వాడవచ్చు.
- ఇది జుట్టుకు కండిషనింగ్‌ను ఇచ్చి, చక్కని ఎక్స్‌ఫోలియేటర్‌గా పనిచేస్తుంది.
- జుట్టు రాలకుండా, డాండ్రఫ్ రాకుండా కాపాడుతుంది
- ఈ ప్రోడక్ట్ పి.పి.డి అండ్ గ్లూటెన్ ఫ్రీ. 100% వేగాన్, సల్ఫేట్ ఫ్రీ.

ఫ్రీ అప్లికేషన్ కొరకు కాల్ చేయండి
70972 98070

- అనూస్ ప్రోడక్ట్స్ ఆన్‌లైన్‌లో కూడ లభ్యమవుతాయి **www.anoos.com**
- అనూస్ హెర్బల్ ప్రోడక్ట్స్ మీ దగ్గరలోని సూపర్ మార్కెట్స్‌లోగాని, షాపులోగాని పొందాలంటే, పదే పదే అడిగి ఒత్తిడి పెంచండి.
- అనూస్ వీడియోస్‌కై మీ వాట్సప్ నంబరును ఈ **91000 34054** కు షేర్ చేయండి.
- అనూస్ బ్లాక్ ఎక్స్‌పర్ట్ అప్లికేషన్‌కై ఈ క్రింది లింక్‌ను క్లిక్ చేయండి : https://www.youtube.com/watch?v=JIuUHIbfGxk&t=29s

మా సేవలకై మీ ప్రశ్నలను ఈ నంబరుపై 99596 16106 సంప్రదించండి – అనూస్ సిస్టర్స్

ANOO'S
SALON & CLINIC Since 1982
TELANGANA | ANDHRAPRADESH
KARNATAKA | TAMILNADU | USA

Watch Anoo's Programme
Every Friday in TV'9 at 12.30 PM
Every Saturday in STAR MAA at 7.30 AM
Every Saturday in HMTV at 1.30 PM.

Services &
Beauty Courses: 99596 16106
Product Enquiries: 9100034054

ఆటలు ఆడే పొరపాటు నరేంద్రమోడీ చేశాడు.

తాజా సర్వేలు,ఆర్థికవ్యవస్థ తిరిగి కోలుకుంటున్న దన్న సంకేతాలిస్తున్నాయి. వృద్ధిరేటు తిరిగి 7 శాతానికి అటూఇటూగా స్థిరపడింది. ద్రవ్యోల్బణం అదుపులో వుంది. ధరలు అదుపులోకి వచ్చాయి. కాని చమురుధరలు పెరుగుతున్నాయి.

ఇంతకాలం అంతర్జాతీయంగా ముడిచమురు చౌకగా లభించింది. అది నరేంద్రమోడీ ప్రభుత్వానికి కలిసివచ్చింది. తగ్గిన ఆ ధరలకనుగుణంగా పన్నులు తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించలేదు.

అయితే అదనంగా ప్రజలనుండి తీసుకున్న డబ్బును విదేశీచమురు కంపెనీలకున్న బకాయిలను తిరిగి చెల్లించేందుకు ఉపయోగించారు. పెట్రోల్, డీజిల్ మీద సబ్సిడీలను దాదాపుగా ఎత్తివేశారు.

ఇక ఇప్పుడు పెట్రోల్, డీజిల్‌ని జి.ఎస్.టి. పరిధిలోకి తీసుకురావటం ద్వారా మధ్యతరగతి వర్గాల భారాన్ని తగ్గించే యత్నం చేస్తారు.

మోడీది ఆర్థికపరమైన ఆలోచనల ప్రభుత్వం. సబ్సిడీలను వ్యతిరేకించే మనస్తత్వం.వ్యాపారాలను ప్రోత్సహించాలన్నది లక్ష్యం. ఆ మేరకు ఆర్థికపరమైన సూచికలన్నింటిలో నాలుగేళ్ళ నరేంద్రమోడీ మెరుగైన ర్యాంకుల్లోనే వున్నాయి.

సులభతర వ్యాపార ర్యాంక్ మెరుగైంది.బ్యాంకుల మొండిబకాయిల విషయంలో కఠినతరమైన నిర్ణయాలు తీసుకుంది. దివాలా చట్టం వంటిదానిని, స్థిరాస్తి వ్యాపారంపై కొత్త చట్టం వంటివి సంస్కరణల్లో భాగంగా తెచ్చారు.

విద్యుత్ రంగంలో మోడీ ప్రభుత్వానిది విజయమే. విద్యుత్ ఉత్పత్తి పెరిగింది. విద్యుత్ పంపిణీవ్యవస్థ మెరుగైంది. గ్రామీణ విద్యుదీకరణలో లక్ష్యాలు సాధించింది. రహదారుల నిర్మాణం పరుగులు తీస్తున్నది. ఆర్థిక అంశాలను నరేంద్రమోడీ ప్రభుత్వం సక్రమంగానే నిర్వహిస్తున్నదన్న నమ్మకం వినియోగదారులలో, వ్యాపార, పారిశ్రామిక, వాణిజ్యవర్గాలలో వుందని సర్వేలన్నీ తెలియజేస్తున్నాయి.

నాలుగేళ్ళ తర్వాత కూడా ర్యాంకుల్లో వెనకపడకుండా నిలవగలగటం నరేంద్రమోడీ సాధించిన ఘనతే. నరేంద్రమోడీ ప్రభుత్వం నాలుగేళ్ళకాలంలో ఎదుర్కొన్న అవినీతి ఆరోపణలు అంతగా లేవు.

ప్రతిపక్షాలు అడపాదడపా చేసిన ఆరోపణల్లో కూడా పసలేక వెనక్కితగ్గాయి. ఇది నిజాయితీ ఆధారంగా పనిచేసే ప్రభుత్వం అని అనిపించుకోగలిగింది. అంతమాత్రాన నాలుగేళ్ళ క్రితం నరేంద్రమోడీచెప్పిన 'అచ్ఛేదిన్' దేశప్రజలకు వచ్చాయనేందుకు వీలులేదు. చేసిన వాగ్దానాలలో నాలుగేళ్ళు గడిచినా నిలబెట్టుకోలేని అంశాలు ఉన్నాయి.

అందులో నల్లధనంపై చర్యలు, విదేశాలలో వున్న నల్లధనాన్ని వెనక్కి తెప్పించే చర్యలు వున్నాయి.

ఆ రెండు అంశాలలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇవ్వలేదు. పెద్దనోట్ల రద్దు నల్లడబ్బును లేకుండా చేయలేకపోయింది.

ఉద్యోగాలను సృష్టించటంలో కూడా నరేంద్రమోడీ ప్రభుత్వం విఫలమైంది. ఏటా కోటి ఉద్యోగాల సృష్టి నినాదంగానే మిగిలిపోయింది.

నాలుగేళ్ళలో కలిపి నికరంగా కోటి ఉద్యోగాలు అందించగలిగారా అన్నది ప్రశ్న.

విద్యాసౌకర్యాలు పెంచి, విద్యాధికులను తయారు చేసి, వారిలో నైపుణ్యాల పెంపుదలకు నిధులను కేటాయించి అంతిమంగా వారికి ఉద్యోగమార్కెట్‌లో అవకాశాలు చూపించలేకపోతే-

ఆ యువతలో పెరిగే నిరాశ నిస్పృహలకు నరేంద్ర మోడీ సమాధానం చెప్పక తప్పదు.

అత్యంత ఆర్భాటంగా ప్రారంభించిన స్మార్ట్ సిటీలు నత్తకన్నా అధ్వాన్నంగా నడుస్తున్నాయి.

మా సిటీ పూర్తిస్థాయిలో స్మార్ట్ సిటీ అయిందని ప్రకటించుకోగలిగిన పరిస్థితి లేదు. దానికి కేటాయించిన నిధులు ఎటు పోతున్నాయి.

ఎందుకు స్మార్ట్ సిటీలు రూపుదిద్దుకోలేదు. స్మార్ట్ గ్రామాల పరిస్థితి ఏమిటి? ప్రతి ఎమ్.పి. దత్తతకు తీసుకున్న రెండు గ్రామాలు ఏమయ్యాయి.

- రాజకీయంగా గెలుపు, పాలనాపరంగా లోపాలు
- ప్రతిపక్షాలు ఏకమయ్యాయి
- ఆర్థిక అంశాలు స్థిరపడ్డాయి
- సామాజిక ఘర్షణలు పెరిగాయి

గత నాలుగేళ్ళలో వెయ్యికి పైగా గ్రామాలు ఎమ్.పి.ల దత్తత స్కీమ్‌లో బాగుపడి వుండాలి కదా! వాటికి సంబంధించిన వివరాలు, ప్రోగ్రెస్ రికార్డు అంత ఆశాజనకంగా లేవు.

స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రజలందరికీ సంబంధించిన కార్యక్రమం. ప్రజల ఆరోగ్యానికి సంబంధించినది కాబట్టి అది విజయవంతమవుతున్నది.

కొత్తగా ప్రకటించిన 'ఆయుష్మాన్‌భవ' అనే ఆరోగ్యపథకం అమలుకూడా విజయవంతం అవుతుంది. వ్యవసాయరంగంలో వస్తున్న సంక్షోభం, వినిపిస్తున్న రైతుల ఆత్మహత్యల మీద నరేంద్రమోడీ ప్రభుత్వం స్పందించాల్సిన రీతిలో స్పందించలేదు. వ్యవసాయరంగానికి మేలుచేయకుండా రెండవసారి గెలిపించమని అడగలేరు.

ఈ సంవత్సరం ఋతుపవనాలు సాధారణస్థాయి కన్నా మెరుగ్గా వుంటాయి కాబట్టి వ్యవసాయదారులు తమ సమస్యలను మరచిపోయి తిరిగి తమకు అధికారం కట్టబెడతారన్న ఆశ బిజెపిది.

సామాజికంగా, ప్రాంతీయపరంగా ఘర్షణలు, ప్రాంతీయ విభేదాలు నరేంద్రమోడీ పాలనలో పెరిగాయన్నది ఆరోపణ. అది పూర్తిగా వాస్తవం కాదు అలాగని అవన్నీ అబద్ధపు ఆరోపణలుకావు.

చట్టాన్ని తమ చేతిలోకి తీసుకుంటున్న గోరక్షకులు, వ్యక్తుల స్వాతంత్ర్యాలను హరించే పరోక్ష కాపలాదారులను ఈ సమాజం అంగీకరించదు. ఆ మేరకు సమాజంలో ఏర్పడే అభద్రతాభావాన్ని తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది.

అల్పసంఖ్యాకవర్గాల మీద దాడులు పెరుగుతున్నాయన్నది గణాంకాలపరంగా వాస్తవమే ఐనా అందుకు నరేంద్రమోడీ ప్రభుత్వం కారణమనలేం. శాంతిభద్రతలు రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత.

భిన్న రాజకీయపార్టీలు అధికారంలో వున్నచోట మహిళలమీద నేరాలు, మతఘర్షణలు జరుగుతున్నాయి. అది సామాజిక జాడ్యం. సెక్యులరిజం నినాదాలు చేసేవారే మతపరమైన హక్కుల గురించి మాట్లాడటం ఈ దేశంలోని చిత్రం.

అందరూ భారతీయులేనన్న భావాన్ని పెంపొందింపచేద్దామని రాజకీయపార్టీలు,మేధావి వర్గాలు మీడియా అనుకోక, సమాజాన్ని మత, కులపరమైన విశ్లేషణలతో విభేదాలు రెచ్చగొడుతున్నాయి.

భారతీయతను పెంపొందింపచేస్తే ఏ వర్గం మరో వర్గం మీద దాడిచెయ్యని సామాజిక వాతావరణం నిర్మాణమవుతుంది. అటువంటి పరిస్థితి నిర్మాణానికి అందరూ కృషిచేయాలి.

నరేంద్రమోడీ విజయాలు, వైఫల్యాలు పరిశీలించి నపుడు యాభై శాతంపై మార్కులు పొందిన ప్రధానిగా నిలుస్తాడు. దేశప్రజల దృష్టిలో శ్రమించే నాయకుడు. నిజాయితీతో పనిచేసే నేత. వ్యవస్థలను చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాడు.

అయితే ఆశించినంత గొప్పఫలితాలను అందుకోలేకపోయాడు. అందుకున్న విజయాలను ప్రభుత్వపరంగా, పార్టీపరంగా ప్రచారం చేసుకోలేకపోతున్నాడు. అంతర్జాతీయ వేదికలమీద భారతదేశ ప్రతిష్ఠను పెంపొందించగలిగాడు.

ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం, న్యూక్లియర్ సప్లై గ్రూప్‌లో సభ్యత్వం వంటివి నరేంద్రమోడీ మాత్రమే సాధించగలడన్న నమ్మకం కలిగించాడు.

అయితే సమాజంలోని అన్నివర్గాల ఆమోదం పొందగలిగాడా అనేది సందేహం. తిరిగి గెలవటానికి అవసరమైనంత ప్రజాబలం లభిస్తుందా!

ఎన్.డి.ఎ.కి మిత్రపక్షాలు దూరమవుతుండగా, కొత్తగా మిత్రులు చేతులు కలిపే అవకాశం కనిపించని వాతావరణంలో ఎన్.డి.ఎ.కి సంపూర్ణ మెజారిటీ రాకపోతే! మద్దతిచ్చే పార్టీలు నరేంద్రమోడీకాక మరెవరైనా ఓకే అంటే!

బిజెపిలోని వ్యతిరేకవర్గాలు పుంజుకుంటే! ఇటువంటి ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పటానికి,సందిగ్ధ పరిస్థితులను తనకు అనుకూలంగా మలచుకోవటానికి ఇక మోడీకి మిగిలింది పదినెలలు మాత్రమే.

డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు

అంతా రాజకీయమే

1 కొత్తరకం వేలం

పల్లెటూరిలో పంచాయతీ అధ్యక్ష పదవులను వేలంవెయ్యటం వినేవుంటారు. ఎవరు ఎక్కువ ఇస్తే వారికి ఆ పదవి దక్కుతుంటుంది అక్కడ.

ఓటర్లు కూడా తమ ఓటును వేలం వేసి అమ్ముకోవటం జరుగుతుంటుంది మరికొన్నిచోట్ల.

పార్టీ టికెట్లు కేటాయించేటప్పుడుకూడా అభ్యర్థులలో ఎవరు ఎక్కువ ఇస్తే వారికి టికెట్లు కేటాయించే సాంప్రదాయం కొన్ని పార్టీలలో వుంది.

ఇప్పుడు ఆ రకాల వేలాలకు మరో కొత్త రకం వేలం జతచేసింది కాంగ్రెస్‌పార్టీ.మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీ గెలిచే అవకాశముందని సర్వేలు తెలియచేస్తూ వుండటంతో ఆ రాష్ట్రకార్యదర్శి పార్టీ టికెట్ ఆశించే వారికి మరో వేలం వేస్తున్నాడు.

రాహుల్‌గాంధీ మీటింగ్‌కి ఏ నాయకుడుఎక్కువ మంది జనాభాని తరలించితెస్తాడో వారికే పార్టీటికెట్టు అన్నది ఆయన ప్రకటన. రట్లాం లోక్‌సభ నియోజకవర్గంలోని శాసనసభ టికెట్లు ఆశించేవారందరికీ ప్రత్యేకమైన టోకెన్లు ఇచ్చాడు.

అవి వారి వాహనాలకు అంటించుకుని,వాహనాలనిండా జనాభాని ఎక్కించుకు తీసుకురావాలి. పదిహేనేళ్ళ తర్వాత అధికారం అల్లంత దూరంలో వుందన్న ఆశ పెరిగిన ఆ కాంగ్రెస్ నేతలందరూ ఇప్పుడు మీటింగ్‌లకు జనాభాను తరలించే పద్ధతుల్లో బిజీబిజీగా వున్నారు. ◆

2 భగ్గుమంటున్న 'సేన'

ఎన్.డి.ఎలో భాగస్వాములు ఒక్కొక్కరే బయటకు వెళ్ళిపోతున్నారు. బయటకు వెళ్ళిన తెలుగు దేశం, బి.జె.పి మీద భారీస్థాయి విమర్శలు చెయ్యటం సహజం.

అయితే ఎన్.డి.ఎ మీద పరుషపదజాలం వాడుతున్న పార్టీ శివసేన. శివసేన మహారాష్ట్రలో అధికారం పంచుకుంటున్నది. అయినా బి.జె.పి మీద తీవ్రంగా విరుచుకుపడుతోంది.

ఏ ఒక్కవిషయంలోనూ బి.జె.పికి సహకరించటం లేదు. వీలైనంతవరకు బి.జె.పిని ఓడించే ప్రయత్నం చేస్తోంది. రాజకీయంగా ఇతర శత్రువర్గ పార్టీలను వదిలి కేవలం మిత్రపక్షంగా వున్న బి.జె.పి మీదే ఎందుకు విరుచుకుపడుతున్నదీ చెప్పటం లేదు. ప్రాంతీయపార్టీలను మింగేసేపార్టీ బి.జె.పి అన్నది శివసేన అభిప్రాయం.

ఆ పార్టీ పత్రిక 'సామ్నా'లో వస్తున్న సంపాదకీయాలు, ఆ పార్టీ నేత ఉద్ధవ్‌ఠాక్రే చేస్తున్న ప్రకటనలు చూసినవారికి 2019 ఎన్నికల్లో శివసేన ఎటువైపు మొగ్గుతుంది అనేది పరిశీలకులు ఎదురుచూస్తున్న విషయం. ◆

3 కూర్పు కుదరటంలేదు

కర్ణాటకలో బి.జె.పిని అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు జె.డి.(ఎస్.), కాంగ్రెస్‌లు ఏకమయ్యాయి. ఆ విషయంలో కలిపిన చేతులు ఆ తర్వాత మరింత బాగా బిగుసుకుంటాయని అనుకున్నారు. కాని వారిద్దరి చేతలు మంత్రివర్గ కూర్పు విషయంలో ఏకం కావటంలేదు.

తమ ఒప్పందం విధాన సౌధవరకే ఎన్నికల క్షేత్రంలో మా దారి మాదే అంటూ జె.డి.(ఎస్.) అగ్రనేత దేవెగౌడ కాంగ్రెస్‌కి షాక్ ఇచ్చాడు. అధిష్ఠానాన్ని అడగకుండా ఏ పని చెయ్యలేదు కాంగ్రెస్ పార్టీ. అటువంటి అధిష్ఠానమైన రాహుల్‌గాంధీ, సోనియా గాంధీలిరువురు కర్ణాటక విషయం వదిలేసి విదేశాలకు వెళ్ళిపోయారు.

ఫలితంగా మంత్రివర్గం కూర్పు వాయిదా పడుతున్నది.ఎవరికెన్ని మంత్రిపదవులు అనేవి తేల్చుకున్నారు. కాని ఏ శాఖలు ఏ పార్టీకి దక్కాలనేదాని మీద ఒక అభిప్రాయానికి రాలేకపోతున్నారు. ఇరు పార్టీలవారికి లాభసాటి శాఖలే కావాలి. ◆

4 మాయానా! మజాకానా!

బహుజన సమాజ్‌పార్టీ(బి.ఎస్.పి)అధినేత మాయావతి రాజకీయంగా చాలా చురుకుగా వ్యవహరిస్తుంటుంది. కర్ణాటకలో ప్రతిపక్షాలన్నింటితో కలిసి, సోనియాతో ఫోటోలు తీయించుకుని తిరిగి ఉత్తరప్రదేశ్‌ని చేరగానే ప్రతిపక్షాలకు షాక్‌లివ్వటం మొదలుపెట్టింది.

నేను అడిగినన్ని సీట్లు ఇస్తేనే పొత్తులు అంటూ మాయావతి చేసిన ప్రకటవ ఇతర పార్టీలన్నింటికి షాకిచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లో బి.జె.పిని ఓడించాలంటే మాయావతి పార్టీ అవసరం.

ఆమె తన ఓటు బ్యాంక్‌ని ఏ పార్టీకి కావాలంటే ఆ పార్టీకి బదిలీ చేయించగలదు. కాని ఇతర పార్టీ నేతలు వారి ఓట్లను మాయావతి పార్టీకి మళ్ళించలేరు. అది మాయావతి బాధ. అందుకే ఆమె ఎక్కువ సీట్లు డిమాండ్‌చేస్తోంది.

అలా డిమాండ్ చేయటంద్వారా తన పలుకుబడిని మిగిలినవారంతా ముందే గుర్తించేలాచేయాలని, తాను లేకుంటే యు.పిలో మహాకూటమి మనుగడలేదన్న విషయం స్పష్టం చెయ్యటం మాయావతి చేస్తోంది. ◆

5 ఒడిషాపై కన్ను

బి.జె.పి తన తదుపరి గెలుపు దృష్టిని ఒడిషా, బెంగాల్‌ల మీద పెట్టింది. ఆ రెండు రాష్ట్రాలలో కలిపి ఇరవై అయిదు ఎమ్.పి. సీట్లు గెలవాలన్నది బి.జె.పి. ఆశ. అందుకే ఇప్పుడు ప్రత్యేకంగా ఒడిషా మీద దృష్టి పెట్టారు. బెంగాల్‌లో బాగానే ఎదిగింది ఆ పార్టీ.

కాంగ్రెస్‌ని నాలుగోస్థానానికి నెట్టింది ఆ రాష్ట్రంలో. ఒడిషాలో కాంగ్రెస్‌ని మూడో స్థానానికి నెట్టింది.ఆ రెండురాష్ట్రాలలో రెండో స్థానంనుండి ఒకటో స్థానానికి వెళ్ళాలన్నది ఆలోచన.

అందుకే కేంద్రమంత్రివర్గ నాలుగేళ్ళ పాలన ముగింపు ఉత్సవాలకు ప్రధాని నరేంద్రమోడీ ఒడిషాని ఎంచుకున్నాడు. ఆ రాష్ట్రంలో జరిగిన నాలుగేళ్ళ ఉత్సవం 2019 ఎన్నికల ప్రచార ప్రారంభంలా సాగింది. తన విజయాలు తక్కువ, ఒడిషా ప్రభుత్వం వైఫల్యాలు ఎక్కువగా ఆ మీటింగ్‌లో మోడీ ప్రస్తావించాడు.

ఒడిషా ప్రభుత్వం మారాలంటూ పిలుపునిచ్చాడు. 15 ఏళ్ళుగా వున్న ప్రభుత్వం పోవాలంటే అంతేకాలంగా అధికారంలో బి.జె.పి వున్నఎమ్.పి. చత్తీస్‌ఘడ్ ప్రభుత్వాలు పోవాల్సిందే కదా... ఆ లాజిక్‌ని మరచిపోతున్నాడు మోడీ. ◆

6 కేరళ కోపం

కేరళరాష్ట్రం పలుఅంశాలలో ముందంజలో వున్నది. దానిని మరింత గొప్ప రాష్ట్రంగా చెయ్యాలన్నది అక్కడి సి.ఎమ్. పినరాయి విజయన్ ఆలోచన. అయితే అధికార యంత్రాంగం వామపక్ష ప్రభుత్వానికి సహకరించటంలేదట.

తాను ప్రతిపాదించిన ప్రతి పథకానికీ ఏదో ఒకరకంగా అడ్డంకులు సృష్టిస్తోంది అధికార యంత్రాంగం అంటూ కేరళ సి.ఎమ్. పినరాయి విజయన్ చిందులు తొక్కుతున్నాడు.

తన ఇష్టమైన ప్రాజెక్టుల ఫైళ్ళు ముందుకు నడవకుండా ఐ.ఎ.ఎస్. అధికారులు అనవసరపు ప్రశ్నలు వేసి వెనక్కిపంపుతున్నారన్నది పినరాయి విజయన్ ఫిర్యాదు. తన మాట వినని ఐ.ఎ.ఎస్‌లను అప్రాధాన్యతా పోస్టుల్లోకి పంపమని ప్రధాన కార్యదర్శికి ఉత్తర్వులు ఇచ్చాడట.

నిబంధనలకు అనుగుణంగా వెళుతూ తిట్లు తినాల్సి వస్తోందనేది కేరళ ఐ.ఎ.ఎస్. అధికారుల బాధ. రాజకీయాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం వుండాలా! అనే ప్రశ్నకి విజయన్ సమాధానం ఇవ్వటం లేదు.

అల్సర్‌కి క్యాన్సర్‌కి తేడా తెలుసుకోండి!



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad.
Ph : 98480 11421
Kurnool : 08518 273001
Guntur : 0863 2223300

నీరు తక్కువ తాగటం వల్లనో, లేక పెరుగుతున్న మానసిక ఒత్తిడి వల్లనో ప్రతి ఒక్కరు జీవిత కాలంలో ఏదో ఒక దశలో అల్సర్స్‌కు గురవటం సహజమే. అందుకనే విద్యార్థులలో పరీక్షలప్పుడు ఎక్కువగా నోటిపూతను గమనిస్తూ ఉంటాము. సాధారణంగా మూడు, నాలుగు రోజులలో తగ్గిపోయే అల్సర్స్ అంతకంటే ఎక్కువగా ఉండి తరుచుగా బాధిస్తూ ఉంటే ఎవ్వరినైనా అనేక అనుమానాలు వేధిస్తూ ఉంటాయి. నోటి పూతతో పాటు, పెప్టిక్ అల్సర్స్, గ్యాస్ట్రిక్ అల్సర్స్, ఈసోఫీగల్ (అన్నవాహిక) అల్సర్స్, కదలలేని పరిస్థితులలో మంచానికే పరిమితమైనప్పుడు ఏర్పడే పుండ్లు, సిఫిలస్, హెర్పిస్ వంటి STD లవలన, ఈస్సీ, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ వలన జెనిటల్ మర్మవయమాలలో అల్సర్స్, డయాబెటిక్స్‌లో కాళ్లలో వచ్చే న్యూరోపతిక్ అల్సర్స్ ఎక్కువగా కన్పిస్తూ ఉంటాయి.

జీర్ణవ్యవస్థకు సంబధించిన అల్సర్స్ పెప్టిక్ అల్సర్స్ ఎక్కువగా చూస్తూఉంటాము చిన్న ప్రేగు మొదట్లో ఉండే ఈ అల్సర్స్ ఎక్కువ చూస్తూ ఉంటాము చిన్న ప్రేగు మొదట్లో ఉండే ఈ అల్సర్స్ ను డుయోడినల్ అల్సర్స్ అనికూడా అంటారు జీర్ణవ్యవస్థలో ఎక్కువగా కన్పించే ఈ పూత 1% వరకు క్యాన్సర్ గా మారే ప్రమాదం ఉంటుంది. జీర్ణాశయంలో వచ్చే అల్సర్స్‌ను గ్యాస్ట్రిక్ అల్సర్స్ అంటారు. పెప్టిక్ అల్సర్స్ కంటే ఇవి తక్కువగా కన్పించినా గ్యాస్ట్రిక్ (Gastricollars) అల్సర్స్ క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఎక్కువ. అన్నవాహికలో అల్సర్స్ చాలా అరుదుగా కన్పిస్తాయి. నోటిపూత కు స్ట్రైస్, విటిమిన్స్‌లోపం, బి విటమిన్ లోపం ప్రధాన కారణాలైతే. జీర్ణావ్యవస్థకు సంబంధించిన మిగతా అల్సర్స్‌కు హెలికోబాక్టరీ పైలోరి (H. Pylori) అనే బ్యాక్టిరియల్ ఇన్‌ఫెక్షన్ ప్రధాన కారణం.

1980 వరకు అల్సర్స్‌కు మసాలా ఆహారం, కారం, ఒత్తిడి అనుకునేవారు, ఆల్కహాల్ త్రాగటం పొట్ట, ప్రేగులుకు సంబంధించిన పూతకు కారణాలు అనుకునేవారు. దాదాపు వంద సంవత్సరాలవరకు అల్సర్స్‌కు కారణాలు అదే అనుకుని వీలైనంత వాటికి దూరంగా ఉండమని సలహాలు ఇచ్చేవారు. 1982లో టారీమార్షల్ మరియు రాబిన్ వారెన్ అనే ఇద్దరు డాక్టర్లు జీర్ణవ్యవస్థ సంబంధించిన అల్సర్స్‌కు కారణం హెలికోబాక్టర్‌పైలోరీ (H.పైలోరి) అనే బ్యాక్టీరియా అని కనుగొన్నారు. దీనికి వారికి నోబెల్ బహుమతి ప్రదానం కూడా జరిగింది. మన జనాభాలో 90% మంది ఎప్పుడొ ఒకప్పుడు ఈ బ్యాక్టిరియా కు గురవుతూ ఉంటారు. కాని ఒత్తిడి, ఎసిడిటి, స్మోకింగ్, ఆల్కహాల్ వంటి కారణాలవల్లనో లేకవారి శరీరతత్వాన్ని బట్టి జీర్ణవ్యవస్థ లైనింగ్ దెబ్బతిని ఉన్నప్పుడు వారికి ఈ బ్యాక్టిరియా వలన అల్సర్స్ ఏర్పడటం జరుగుతుంది. పెయిన్ కిల్లర్స్ ఎక్కువగా తీసుకునే వారికి ఈ బ్యాక్టిరియాకు గురయ్యే ప్రమాదం ఉంది. జీర్ణవ్యవస్థ అల్సర్స్ ఉన్నవారికి కడుపులో నొప్పితో పాటు

1. ఆకలి తగ్గటం, ఎసిడిటీ
2. వికారం, ఎక్కిళ్లు, త్రేన్పులు
3. రక్తపువాంతులు, మలంతో రక్తం పడటం వంటి లక్షణాలు కన్పిస్తాయి.

ఈ లక్షణాలు అల్సర్స్ స్టేజ్ మీద ఆధారపడి ఉంటాయి. మొదటి దశలో కడుపులో మంటగా ఉండటం ఏవైనా తినగానే కొంచెం సేపు తగ్గి, తరువాత కొద్దిసేపటికి మళ్లీ కడుపులో ఇబ్బందిగా ఉండటం జరుగవచ్చు. యాంటాసిడ్, తీసుకున్నప్పుడు కొంచెం సేపు ఉపశమనం కన్పించవచ్చు. రెండు వారాలు యాంటీ బయాటిక్స్ RKP PPL వంటి మందులు ఈ అల్సర్స్‌కు పూర్తిగా నయం చేస్తాయి.

దాదాపు గ్యాస్ట్రిక్ అల్సర్స్ లాగానే పొట్టకు సంబంధించిన క్యాన్సర్స్ లక్షణాలూ ఉంటాయి. స్టమక్ (గ్యాస్ట్రిక్) క్యాన్సర్స్‌కు ప్రధాన కారణం కూడా దీర్ఘకాలికంగా ఉన్న అల్సర్స్. అందుకనే ఒకసారి అల్సర్ వచ్చి తగ్గినవారు రెండోసారి అలాంటి లక్షణాలు కన్పించినా అల్సర్స్ వాడిన మందులు వాడి. తర్వాత తగ్గటం లేదని డాక్టర్‌ను సంప్రదించటం జరుగుతు ఉంటుంది. అందుకనే ఇలాంటి లక్షణాలు కన్పించినప్పుడు ఎండోస్కోప్, బయాప్సి పరీక్షలు చేసి అనుమానంగా ఉంటే CT స్కాన్, అల్ట్రాసౌండ్ ఎండోస్కోపి పరీక్షలు చేసి స్టేజ్‌ను నిర్ధారిస్తారు.

పొట్టకు సంబంధించిన క్యాన్సర్స్ ట్రీట్‌మెంట్స్ కూడా కణితి వచ్చిన ప్రదేశం, స్టేజ్, వయస్సు, ఇతర ఆరోగ్యవిషయాలపై ఆధారపడి ఉంటాయి. పొట్టలో కణితి వచ్చిన ప్రదేశాన్ని బట్టి పొట్టలో కొంత భాగాన్ని తీసివేసి గ్యాస్ట్రెక్టమీ లేక పొట్టని మొత్తంగా తీసివేయటంతో పాటు చుట్టూ ఉన్న లింఫ్‌నాడ్స్, చిన్నప్రేగుల్లో కొంత భాగాన్ని, అన్నవాహికలో కొంత భాగాన్ని తీసివేయటం జరుగుతుంది. క్యాన్సర్‌ను కొంచెం లేటుగా గుర్తించినప్పుడు పొట్ట మొత్తాన్ని తీసివేసి అన్న వాహికను చిన్న ప్రేగులతో కలిపి వేస్తారు. సర్జరీ తర్వాత ఆహారం తీసుకొలేక పోవటం, వాంతులు, వికారం, మలబద్ధకం, విరోచనాలు వంటి లక్షణాలు కన్పిస్తాయి. సర్జరి ముందు చేసి తర్వాత కీమో, రేడియోథెరఫి ఇచ్చినా లేక కీమోథెరఫీ, రేడియోథెరఫిలతర్వాత సర్జరీ చేసినా ఈ లక్షణాలు ఎక్కువగానే ఉంటాయి. పొట్టకు సంబంధించిన క్యాన్సర్స్ విషయంలో ఆహారంపట్ల ఇంకా చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది.

ఈ సర్జరీ తర్వాత సప్లిమెంట్స్, విటిమీన్ డి, కాల్షియం, ఐరన్, విటమిన్ బి 12 (Vitamin B12) ఇంజక్షన్ల అవసరం చాలా ఎక్కువ. పొట్టని తీసివేసినప్పుడు ఆహారం నేరుగా చిన్న ప్రేగులలోకి వెళ్లటం వలన "డంపింగ్ సిండ్రోమ్" వస్తుంది. ఆహారం తక్కువగా, ఎక్కువసార్లు తీసుకోవటం, ఆహారం ముందు తర్వాత ద్రవపదార్థలు తీసుకొవటం వంటి అనేక జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది.

క్యాన్సర్స్‌ను మరీ లేటుగా గుర్తించటం జరిగి కణితి ఆహారం తీసుకోవటానికి అడ్డంకుగా ఉన్నప్పుడు, లేజర్ థెరఫి, రేడియోషన్ థెరఫిలలో కణితిని చిన్నగా చేసి ప్రేగులలో స్టెంట్‌ను అమరుస్తారు. మెటల్ లేక ప్లాస్టిక్‌తో తయారయిన ఈ ట్యూబ్ ద్వారా ఆహారం జీర్ణవ్యవస్థలోకి వెళుతుంది. కాని ఇలాంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు, క్యాన్సర్ మరీ ముదిరి ఇతర అవయవాలకు కూడా వ్యాప్తి చెంది ఉంటుంది అని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

స్టమక్ క్యాన్సర్స్ లక్షణాలు మొదటి దశలో అంత ప్రస్ఫుటంగా ఉండవు. అనుమానించేంత స్థాయిలో లక్షణాలు బయట పడ్డాయి అంటే అప్పటికే క్యాన్సర్ స్టేజ్ ఎక్కువగా ఉండి ఉంటుంది. ప్రతిసంవత్సరం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 8,00,000 మందిని ఈ క్యాన్సర్ పొట్టన పెట్టుకుంటుంది.

హెలికో బ్యాక్టర్‌పైలోరి (H.Pytori) బ్యాక్టిరియా దాదాపు 65-80% వరకు ఈ క్యాన్సర్‌కు కారణం. ఇంకా స్మోకింగ్, మద్యం, జన్యుపరమైన కారణాలు దోహదపడ్తాయి. కాబట్టి అల్సర్స్‌కు సరిఅయిన ట్రీట్‌మెంట్స్ తీసుకొవటం, తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తాజాగా ఉండే ఆహారం, పరిశుభ్రమైన నీరు తీసుకోవటంతో పాటు దురలవాట్లను దూరంగా ఉంచటం చాలా ముఖ్యం. కడుపుఉబ్బరం, మంట, త్రేన్పులు లాంటి లక్షణాలు ఎక్కువగా కన్పిస్తే ఎవ్వరికి తోచిన యాంటాసిడ్స్‌వారు అలా దీర్ఘకాలికంగా వాడకుండా, ఒకసారి డాక్టర్ సలహామేరకు ఎండోస్కోపి చేయించటం మంచిది.

కడుపులో మంట, ఉబ్బరం, పుల్లటి త్రేన్పులు, అజీర్తి ఇలాంటి లక్షణాలు ఎప్పుడో ఒకప్పుడు అందరూ ఎదుర్కొనేవే అయితే ఈ లక్షణాలు తరుచుగా కన్పిస్తున్నా యాంటాసిడు విరివిగా వాడటం, తోచిన చిట్కాలు పాటించటం ద్వారా అల్సర్స్‌ను ముదరబెట్టుకోవటమో లేక క్యాన్సర్స్‌ను నిర్లక్ష్యం చేయటమో జరుగుతూఉంటుంది. కాబట్టి ఇలాంటి లక్షణాలు మన రోజూవారి జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి అంటే సరియైన పరీక్షలు అవసరమైన మందులు వాడటం తప్పనిసరి అని అర్థం చేసుకోవటం మంచిది.

(సశేషం)

బౌండరీ

ఆమె రెండు చేతులు పట్టుకుని ఆపి, మీదకు లాక్కుని పెదవులు అందుకోబోయాడు అతడు. మొహం తిప్పేసి ముద్దును తోసిపుచ్చింది. ఆలింగనం చేసుకోబోయాడు. వెనక్కు అడుగులేసి కౌగిలింతకు కత్తెరేసింది. అలా అందకుండా అవస్థపెట్టి సరసానికి సహకారం మొదలెట్టింది. ఇంతలో...

సి.యమున

శోభనపు రాత్రి... కన్నెపిల్లలు తొలిస్పర్శ, తొలిముద్దు తొలి సమాగమం గురించి కన్నకలలూ, పెళ్ళికాని కుర్రాళ్ళు తమ సామర్థ్యం, తనువుల సాయుధ్యం...

అందులోని స్వర్గపు సుఖం గురించి అల్లుకున్న ఊహలు అనుభవంలోకి వచ్చే మొదటిరాత్రి.

మంచంపైన పరిచిన లిల్లీలు లవ్లీ కపుల్ 'రవళి, సందీప్' రాసక్రీడలో నలిగి తరించటానికి స్వాగతం పలుకుతున్నాయి. ఒకరినొకరు వలచి, వలపించుకుని, ఆపై మనువాడిన జంట అది.

ఆడబోయేహాట్‌గేమ్‌లో వారిఎనర్జీలెవెల్స్‌మెయిన్‌టెయిన్‌చెయ్యటానికి పళ్ళెంలో స్వీట్స్ సిద్ధంగా ఉన్నాయి.మచ్చలేని చందమామలా, వెన్నెలబొమ్మలా తనువులోని అణువణువును సిద్ధం చేసి రాసక్రీడాలాపనకు రెడీ అయ్యి ఉంది రవళి.

డాబామీద పచార్లు చేస్తూ సందీప్ ఎవరితోనో ఫోన్‌లో ఈ లోకంలో లేనట్లు మాట్లాడుతున్నాడు. ఆగలేక పడక దిగి, గది గడపదాటి వెళ్ళి 'దీపూ' అని గోముగా పిలవబోయి ఆగిపోయింది.

ఛీ, ఎంత ప్రేమించి పెళ్ళి చేసుకున్నా 'అందగాడా, అందాలన్నీ అందుకోరా' అన్నట్లు మరీ ఇలా పిలిస్తే సందీప్ ఏమనుకుంటాడు అని సిగ్గు ముంచుకొచ్చి పిలుపును గొంతులోనే నొక్కి, గిరున వెనక్కు వెళ్ళి మంచంమీద కూర్చుండిపోయింది.

“సారీ, రవళీ నా ఫ్రెండ్ ఎంతసేపటికీ ఫోన్ వదలటంలేదు”అంటూ ఫోన్‌కుముగింపు పలికి పడకమీదకు చేరాడు సందీప్.

“ఎవరా ఫ్రెండ్. ఈరోజు కూడానా” అంటూ కాస్త విసుగ్గానే అడిగింది రవళి.

“ఈరోజునే కాస్త ఎక్కువసేపు మాట్లాడాడు” వేసుకున్న లాల్చీ చేతులు పైకి మడుచుకుంటూ హుషారుగా చెప్పాడు.

అయోమయంగా చూసింది రవళి.“మొదటి రాత్రి టిప్స్ చెప్పాడు” అన్నాడు కన్నుగీటుతూ.

“ఛీ...” సిగ్గుతో ముడుచుకుపోయింది.

“అందమైన గులాబీని ఇన్నాళ్ళూ చూశాను... ముడుచుకున్న సిగ్గుల మల్లె మొగ్గని ఇప్పుడే చూస్తున్నాను” అన్నాడు కౌగిట్లో బంధిస్తూ.

అంతలోనే “అణువణువు అందంతో తొణికిసలాడుతున్న నీ అవయవ సౌందర్యం చూస్తుంటే, బొకేలో ఏ పువ్వును ముందుగా ఆఘ్రాణించాలో తెలియనివాడిలా అయోమయానికి గురవుతున్నాను” అన్నాడు దీపిక కళ్ళల్లోకి కళ్ళుపెట్టి గుచ్చి చూస్తూ.

ఆ ఘనకీర్తికి మురిసి 'ఇక్కడనుండి మొదలెట్టరాదూ' అన్నట్లు కమలాల్లాంటి కనురెప్పలు వాల్చేసి ఐడియా ఇచ్చింది రవళి.

కనురెప్పలపై ఒక ముద్దు, చెక్కిలిపై ఇంకోటి, మెడవంపులో ముచ్చటగా మూడోముద్దు...అధరంపైరుధిరం చిప్పిల్లిందా అన్నట్లు గాఢమైన ముద్దు ఎర్రపడ్డ పెదవులు చూసి తనను ఇబ్బందిపెడుతున్నానాఅనేభావనతో టక్కునఆగిపోయాడుసందీప్.

మత్తెక్కిన గొంతుతో “యాయ్...' అన్న గమ్మత్తయిన మూలుగుతో 'ఈ బాధ సౌఖ్యమే స్వర్గ సుఖమే, డోంట్ స్టాప్. ప్రొసీడ్ ఫర్దర్' అని సందేహపడుతున్న సందీప్‌కు సుకుమారంగాసందేశాన్నిచ్చింది రవళి.


ఆమె సిగ్నల్‌తో రెచ్చిపోయాడు సందీప్. రవళి శరీర మైదానంలో సరసాల సిక్సర్లతో, హద్దులుదాటిన బౌండరీలతో చెలరేగిపోతున్నాడు సందీప్.

ఫుల్‌ఫామ్‌లో ఉన్న బ్యాట్స్‌మాన్‌లాగా కట్టలు తెంచుకున్న ఉత్సాహం, దానికి జతకూడిన అనురాగంతో కదంతొక్కుతున్నాడు.

అతని సరసానికి సహకరిస్తూ, ఇస్తూ, అందిస్తూ... పరవశిస్తున్న రవళి అంతలోనే గబుక్కున సందీప్‌ని పక్కకు నెట్టి దూరంగా జరిగింది. అప్పటిదాకా వలపు బంతులు, కౌగిళ్ళ గుగ్లీలు విసిరిన రవళి ఉన్నట్లుండి ఏ ఫీలింగు లేకుండా ఫ్రీజ్ అయ్యి కూర్చుంది.

'ఏదన్నా పొరపాటుగా హ్యాండిల్ చేశానా' అనే ఆలోచనతో రాంగ్ షాట్ కొట్టి అవుటయిన బ్యాట్స్





మన్‌లాగా షాకైపోయాడు సందీప్.

"ఇంతకూ నన్ను ఎందుకు పెళ్ళిచేసుకున్నావు సందూ?"అప్పటిదాకా సంధించిన మన్మథ బాణాల్ని పక్కకునెట్టి అనుమానంగా ప్రశ్నించింది రవళి.

టెన్షన్ పడుతున్న సందీప్ ఆ ప్రశ్న విని తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు.

'భట్టి విక్రమార్కి, ఆ ప్రశ్నను వదలవా" అన్నాడు పుంజుకున్న ఉత్సాహంతో తమ గేమ్‌ను కంటిన్యూ చెయ్యాలని రవళిమీద వాలిపోతూ."ఆ ప్రశ్నను వదిలి పెట్టాలంటే అది మీ చేతుల్లోనే ఉంది" అంటూ సందీప్‌కి అందకుండా చులాగ్గా తప్పుకుంది.

"నిజాయితీగా నిన్ను ప్రేమించాను.పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. నువ్వు ఒప్పుకున్నావు. అదృష్టవంతుడిననుకున్నాను..."

"అది అబద్ధం కాదేమో కాని ఇంకా ఏదో కారణం కూడా ఉంది. లేకపోతే ఇందూ ఎందుకు అలా అంటుంది? ఇద్దరూ కలిసి ఏదో నాటకం ఆడారు. ఆ గుట్టేదో చెప్పిన మరుక్షణం నేను నీ సొంతం" అంది తప్పంతా నీదే అన్నట్లు తర్జనని చూపిస్తూ.

"చెప్పకపోతే..."

"అసలు గుట్టు రట్టుచేసేదాకా మనకి జరగాల్సింది జరగదు" ఖచ్చితంగా తేల్చేసింది రవళి.

ఏ ఆడపిల్ల మొదటిరాత్రి "నన్ను ఎందుకు పెళ్ళి చేసుకున్నావు" అని భర్తను అడగకూడదు.

అదీ ప్రేమించి పెళ్ళి చేసుకున్నవాళ్ళకి ఆ స్థితి అసలు రాకూడదు. కాని రవళి మొండిపట్టు వెనుక పటిష్టమైన కథే ఉంది.

రవళి సందీప్‌కి కాలేజీలో రెండేళ్ళ జూనియర్. సందీప్ మూడో సంవత్సరం బి.టెక్‌లో ఉన్నప్పుడు రవళి ఇంజనీరింగ్‌కాలేజీలో అడుగుపెట్టింది. మొదటి సంవత్సరం సరదార్యాగింగుతో ఆమె వెంట పడేవాళ్ళు ఆ తరువాత కూడా ఆగలేదు.

ర్యాగింగ్ కంటిన్యూ చెయ్యటానికోసం కాదు ఆమె అందానికి దాసోహం అయ్యి ఫాలోవర్స్ అయిపోయారు. దానిలో సందీప్ కూడా ఒకడు.

అందంలోనే కాదు, ఆటపాటల్లోనూ తను ఎక్స్‌పర్ట్. రవళి షటిల్‌పట్టుకుని మెరుపులాగాఆడుతూ 'లవ్ ఆల్' నుండి ముందుకు వెళ్ళినా చూసేవాళ్ళు మటుకు తమ గుండెలను 'లవ్ మి' అని ఫిల్ చేసుకుంటూ ఫీల్ అయిపోతూ ఉండేవాళ్ళు.

"గోదారీగట్టుందీ...' లాంటి పాతపాటల నుండి నేటి 'పిలగాడొచ్చేడే' దాకా పాడి అవలీలగా అందరికీ బిస్కట్ వేసేసింది. రవళి గొంతుకకు మురళీ రవమువిన్న గోపికల్లాగా, గోపాలబాలురులాగా తన్మయత్వంతో ఓలలాడేవారు... అవన్నీ ఓరకంట గమనిస్తూ కిక్ పొందేది రవళి.

రవళి మూడో సంవత్సరం ఎంట్రీ, సందీప్ ఎగ్జిట్ దగ్గరపడింది. సందీప్‌లో ఓ దిగులు, బెంగ ఆపుకోలేక ఓరోజు నువ్వంటే నాకు మహాఇష్టం. నీకూ ఇంట్రెస్ట్ ఉంటే చెప్పు. కెరియర్స్‌ని చెడగొట్టుకోకుండా పీజీలు పూర్తిచేసుకుని మనం లైఫ్‌లో సెటిల్ అయిన తరు



నైట్ షూట్

ఎడతెరిపి లేకుండా నైట్ షూట్స్‌లో పాల్గొం టున్న రకుల్‌ప్రీత్ సింగ్ పొద్దున్నే ప్యాకప్ చెప్పేసి, బ్రేక్‌ఫాస్ట్ చేశాక ఎప్పుడు పడక ఎక్కేద్దామా అని ఆతృతపడుతున్నదట.

కార్తీతో కలసి నటిస్తున్న సినిమా కోసం రకుల్ నైట్ డ్యూటీలు చేసేస్తోంది.

రాత్రి డిన్నర్ అయిపోయాక తెల్లారేదాకా ఉత్సాహంగా షూటింగ్‌లో పాల్గొని, ఇక ఉదయాన్నే నిద్ర ఎప్పుడెప్పుడా అని ఆతృతపడిపోతున్నది.

తమిళ, హిందీ పరిశ్రమల్లో సినిమాలుండడంతో ఇలా వేళల్లో మార్పు తప్పడంలేదేమో!

వాతే పెళ్ళి చేసుకుందాము. అప్పటిదాకా ప్రేమికుల లాగానే ఉందాము" మనసువిప్పి మాట చెప్పాడు.

తన చుట్టూ తిరుగుతూ ప్రపోజ్‌చేసిన గ్రూప్‌లో సందీప్ కూడా జాయిన్ అయ్యి ఇంకో నంబర్ పెరిగినందుకు గర్వపడిందే కాని పెద్ద కేర్ చెయ్య లేదు. అందుకే ఆలోచించకుండా అరక్షణంలో నో చెప్పేసింది రవళి.

కష్టపడ్డ మనసుతో కనుమరుగయ్యాడు సందీప్. ఆ తరువాత ఆరేళ్ళకు ఆమెకు ఎదురయ్యాడు సందీప్, ప్రాజెక్ట్ మేనేజర్ రూపంలో. రవళి అతని కింద ఎంప్లాయీ. అతని అందమైన రూపాన్ని చూసి మూర్ఛబోయినంత పనైంది రవళికి.

అప్పట్లో సాధారణమైన రూపురేఖలతో ఉండే సందీప్ స్థానంలో కండలు తేలిన శరీరం, విశ్వాసం చిందించే కళ్ళు, అందమైన నవ్వుతో ఉన్న సందీప్‌ని చూసి మనసు పారేసుకుంది రవళి.

పాత పరిచయం పలకరించటం వరకే పరిమితం చేశాడు సందీప్. అందరితోలాగానే స్నేహపూర్వకంగా మెదులుతున్నాడు. రవళికిమటుకు అతను మరల ప్రపోజ్‌చేస్తే బాగుండునని లోపల ఎక్కడో ఆశ.

డైరెక్ట్‌గా, ఇన్‌డైరెక్ట్‌గా ఎన్నో సంకేతాలు ఇచ్చింది. అర్థంచేసుకోలేకో లేదా అర్థం కాకో సందీప్‌నుండి ఎటువంటి సందేశమూ లేదు. చివరికి తనే ఆ లీడ్ తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది.

అంతలోనే బాసు కూతురు ఇందు అతనికి ప్రపోజ్ చేసిందనే వార్త ఆఫీసు అంతా గుప్పుమంది. రవళిలో ఒక్కసారిగా దుఃఖం, కసి, నిరాశ ముప్పిరిగొన్నాయి.

ఆ రోజు రాత్రి రవళికంటిపై కునుకు లేదు. నిద్ర లేని తనువూ, శాంతిలేని మనసు తెల్లవారి లేవలేక మొరాయించాయి. సిక్ అంటూ ఆఫీసుకు మెయిల్ పంపించేసింది. మూడురోజులు గడిచిపోయాయి.

గర్వభంగం జరిగిన గంధర్వ కన్యలా ప్రేమ విఫలమైన లైలాలాగా గదికే అంటుకుపోయి తిండీ తిప్పలు లేక పడుంది.

తల్లీ తండ్రీ బంధువుల ఇంట్లో పెళ్ళికని ఊరెళ్ళటంతో అదేమని ప్రశ్నించేవారు కూడా లేరు.

మూడోరోజు ఉషోదయవేళ తెరిచిన ద్వారం నిండుగా వెలుగులాగా నిలబడున్న సందీప్‌ని చూసి మూగబోయిన రవళే అయ్యింది.

ఓ పక్క నీరసం, మరోపక్క అలవికాని ఆనందం, అంతలో నిజమేనా, అనే అనుమానం ముప్పిరిగొన్న భావాల కలయిక భరించలేకేమో బలహీనమైన శరీరం తూలింది. సందీప్ ఒడుపుగా ఒడిసిపట్టుకున్నాడు.

"మూడురోజులుగా నిన్ను చూడక నాకు పిచ్చెక్కిపోయింది. ఏదో మిస్సింగ్ ఫీలింగ్, బాధ తట్టుకోలేక ధైర్యంచేసి ఇంటికొచ్చేశాను..."

అతని హృదయం అర్థమయ్యింది రవళికి. కొన్ని భావాలు పలికించటానికి చేతలతో తప్పితే మాటలు సరిపోవు.తన ప్రేమనంతానింపిగాఢంగా కౌగిలించుకుంది రవళి. అంతలోనే ఆల్చిప్పల్లాంటి కళ్ళెత్తి 'ఒకప్పుడు నీ ప్రపోజల్‌ని కాదన్నాను. పైగా ఇప్పుడు నాకన్నాఅన్నివిధాలా సుపీరియర్ అయిన ఇందు నీకు ప్రపోజ్‌కూడా చేసింది. మరి నువ్వు..."

"దాటిపోయిన గతం తల వద్దు. మూడోమనిషిప్రసక్తి మన మధ్య వద్దు. ఎంతమంది ప్రపోజ్‌చేసినా నా సోల్మేట్‌వి నువ్వే. ఇన్నేళ్ళ నా ఎదురుచూపు ఫలించింది.

మూడుముళ్ళ బంధం, ఆపై ముద్దుముచ్చట్ల గురించే మాట్లాడుదాము" గుసగుసగా అన్నాడు సందీప్. ఆ స్టేట్‌మెంట్‌కు ఫిదా అయిపోయి, సతిగా మారి సదా సంతోషంగా ఉండాలని డిసైడ్ అయిపోయింది. పెళ్ళి ఘనంగా జరిగింది.

రిసెప్షన్‌కి వచ్చిన ఇందు "నువ్వనుకున్నట్లే జరిగింది సందీప్. కంగ్రాట్స్" గుసగుసగా అంటూ సందీప్‌కి బొకే అందించి కన్నుగీటింది.

అది రవళి దృష్టిని దాటిపోలేదు. ఆ క్షణమే అనుమానం మొదలయ్యింది.

"తనకన్నా అన్నివిధాలా బెటర్ అయిన ఇందునే ప్రపోజ్ చేసిందంటే తను అడ్డుచెప్పకుండా ఓకే అంటానని ఆమెని రిక్వెస్ట్ చేసి నాటకమాడించాడు. వాళ్ళ నాటకం సక్సెస్ అయ్యిందనే ఆమె కన్నుగీటి అలా గ్రీట్ చేసింది"

అనుమానం మనసంతా ఆక్రమించుకుంది. ఓర్చుకోలేక అవకాశం అందిపుచ్చుకుని సందీప్‌ని నిలదీసి అడిగింది. ఎంత అడిగినా "నువ్వు నా సోల్మేట్‌వి. ఇన్నాళ్ళకు ఓకే చెప్పినందుకు నాకు ఎంత ఆనందంగా ఉందో తెలుసా? నా అదృష్టం అనుకుంటున్నాను" అదే సమాధానం సందీప్ నుండి.

ఆమెమటుకు సమాధానపరచుకోలేకపోయింది. అదేదో తెలుసుకోవాలనే ఓ కచ్చ... ఉడుకుమోత్తనం. అందుకే అసలైన కార్యక్రమానికి ముడిపెట్టింది. ఆగలేక అలాగన్నా దిగివచ్చి అసలు నిజం చెపుతాడని.

కాలం తుంటరిది.

గమ్మత్తు ఆటలు ఆడు తుంది. దాని ఆటల్లో రవళి, సందీపుల మధ్య రాసకేళికి తెరపడింది.

రోజులు గడుస్తున్నాయి. అసలైనది జరగలేదు. నాటకం ఆడాడని ఆమెలో అనుమానం. తనను నమ్మటంలేదని సందీప్‌లో అసహనం.

అణచుకోలేని తీరని కోరికలతో అందుబాటులోనే ఉన్న ఆలిని ముట్టుకోలేక అల్లల్లాడుతున్నాడు సందీప్. నిద్రపట్టక టి.వి.లోని డే & నైట్ క్రికెట్ మ్యాచ్ చూస్తున్నాడు.

కొన్ని షాట్‌లకు వావ్ అని, మరికొన్ని షాట్స్‌కు అయ్యో అని కేకలు పెడుతున్నాడు. ఆ హడావుడికి నిద్రాభంగమై చిర్రెత్తుకొచ్చింది రవళికి.

"ఏంటి ఈ అర్ధరాత్రి తలనొప్పి" అంది చిరాగ్గా.


"రాసక్రీడలకు దూరంపెట్టి దేహానికి దాహం తీరకుండా చేశావు.

కనీసం ఈ క్రీడను చూసన్నా రిలాక్స్ అవ్వనీ" కసిగా అన్నాడు సందీప్.

రవళికి జాలిగా అనిపించింది. లేచి సందీప్‌కి ఆనుకుని కూర్చుంది. చెయ్యి వెయ్యబోయి-

"ఇలా రెచ్చగొట్టి, సీన్ ఫైనల్‌కి వచ్చేసరికి అర్ధాంతరంగా ఆపి, 'కారణం చెప్పమంటూ' కనికరం లేకుండా అగ్ని

రాజకీయ గుర్తింపు, ఒకరిస్తే తీసుకునేది కాదు.
-పవన్‌కళ్యాణ్, జనసేన నేత



లైంగికదాడులు పురుషులమీద కూడా జరుగుతుంటాయి. వారికి నష్టపరిహారం ఇవ్వాల్సిందే.
-మేనకాగాంధీ, కేంద్రమంత్రి



పరీక్షకు గురిచేసి చిత్రహింసపెడుతోంది.

ఆ హింసకన్నా తనమీద చెయ్యి వెయ్యకపోవటమే మంచిది" అనుకుని తమకాన్ని తనలోనే అణచిపెట్టి టి.వి.కే కళ్ళు అప్పగించాడు.

బ్యాట్స్‌మాన్ సిక్సర్‌కొట్టాడు. ఉత్సాహంగా చప్పట్లు కొట్టింది రవళి.సందీప్ నిర్లిప్తంగాచూశాడు. నాలుగు బాల్స్ తరువాత బ్యాట్స్‌మాన్ షాట్‌కు బాల్ బౌండరీ కేసి పరుగులు తీస్తోంది.

ఫీల్డర్స్ దాన్ని చేజ్ చేస్తున్నారు. ఆడియెన్స్ స్టాండ్‌లో లేచి నుంచున్నారు. బ్యాట్స్‌మాన్ క్రీస్ మధ్య పరుగులు తీస్తున్నాడు.

సందీప్ లేచి ముంగాళ్ళమీద కూర్చున్నాడు.

అందరిలో ఉత్కంఠత... బ్యాట్స్‌మాన్‌కు పరుగులు దక్కుతాయా లేదా ఫీల్డర్‌కు బాల్ చిక్కుతుందా... ఎవరు విజేత గెలుపెవరిది?

అదంతా తనకనవసరమన్నట్లు బాల్ రేసు గుర్రంలా వేగంగా పరుగెడుతోంది... బాల్ బౌండరీ దాటింది. ఉత్సాహంగా చప్పట్లు కొట్టాడు సందీప్. బ్యాట్స్‌మాన్‌కి మించిన ఆనందం సందీప్‌లో.

"ఏంటీ, నీ ఓవర్ యాక్షన్... ఇందాక సిక్సర్‌కి గొప్ప ఎగ్జయిట్‌మెంట్ ఏమీ చూపలేదు. బౌండరీకి మటుకు చిందులేస్తున్నావు. నాటకం ఇక్కడకూడానా" చికాగ్గా అంది రవళి.

"నాకు సిక్సర్ కన్నా బౌండరీనే ఇష్టం" ఆనందంగాచెప్పాడు సందీప్.

"ఆర్ యు క్రేజీ?"

"అవును, ఏమి జరిగిందో అర్థమయ్యేలోపే అతి వేగంగా జరిగిపోయే సిక్సర్‌కన్నా నాకు బౌండరీనే ఇష్టం. గ్రౌండ్‌మీద చిక్కీ చిక్కకుండా పరుగెట్టే బాల్, దాని వెనుక ఫీల్డర్స్ చేజింగ్... క్రీస్‌లో బ్యాట్స్‌మాన్ పరుగులు... ఈలోపు అది దొరకపుచ్చుకుని విసిరేస్తే బ్యాట్స్‌మాన్ రన్ అవుట్ అవుతాడా అనే టెన్షన్...

ఆ విధంగా, ఆడే రెండు టీమ్స్‌తోపాటు చూసే వారి అందరిలో కూడా టెన్షన్ బిల్డ్ చేసే బౌండరీయే నాకు మహా ఇష్టం.

"ఏంటి అర్థంలేని మాటలు"

"ఇందును కాదని నిన్ను పెళ్ళిచేసుకోవటానికి కూడా అదే కారణం"

"వాట్? నువ్వు చెప్పేది నీకు అర్థమవుతోందా?" షాక్‌గా అరిచింది రవళి.

"నిజమే చెపుతున్నాను. తను నాకు ప్రపోజ్ చేసింది. నాకు నీమీద మనసుందని చెప్పాను. 'నా కన్నా తను దేనిలో గొప్పా?' అని నిలదీసింది. 'నాకు సిక్సర్ కన్నా బౌండరీనే ఇష్టం' అని చెప్పాను. అధికారం పక్కనపెట్టి అర్థం చేసుకుంది. అందుకే అడ్డు తగలలేదు..."

"కథలు చెప్పకు"

"అవును రవళీ, ఇందూ అంటే అందరూ పడిచస్తారు. ఆమె అందం, డాబూ, దర్పం అలాంటిది. కాని పెదవి విప్పి ప్రపోజ్ చేసే ధైర్యం ఎవరికీ లేదు. ఆమె అందని ద్రాక్ష.

మన ఆఫీసులో ఆమె గురించి ఆలోచించే వాళ్ళు కూడా లేరు. సో, ఆమె ప్రపోజల్‌కి నేను 'ఊ' అంటే ఒక్క షాట్‌తో టక్కుమని సిక్సర్ పీకినట్లు, తంతే బూరెల బుట్టలో పడ్డట్లు మా మ్యారేజ్ అయిపోయేది. పోటీపడటం, గెలవటం అనేదే లేదు.

అదే నీ చుట్టూతా అయితే కాలేజీ నుండి ఆఫీసు దాకా ఎప్పుడూ పోటీనే. నువ్వు ఎవరికి దక్కుతావనే ఆలోచన... నాకు దక్కాలనే ఆశ.. నువ్వు శాశ్వతంగా నాదానివయ్యి నేను గెలవాలి అనే కోరిక... చివరకు నువ్వు నాకు దక్కావు.

ఇదే ఇందుకి వివరించి చెప్పాను. అందుకే రిసెప్షన్ రోజు 'నీ బౌండరీ దక్కింది.

నువ్వనుకున్నట్లే అయ్యింది' అని ఇందు సరదాగా అంది. దానిని నువ్వు అపార్థం చేసుకున్నావు"

"మరి ఈ విషయం ఎందుకు ఇన్నాళ్ళు చెప్పలేదు?" అనుమానంగా అడిగింది రవళి.

"తనని సిక్సర్ అని, నిన్ను బౌండరీ అంటే నువ్వు చిన్నబుచ్చుకుంటావని" నంగినంగిగా చెప్పాడు సందీప్.

రవళికి సందీప్ చెప్పింది ఒక్కక్షణం అర్థంకాలేదు. అయిన మరుక్షణం "కరక్టే... అలా ఎలా అంటావు" అంటూ పిడికిళ్ళు బిగించి గుద్దుతూ మీదపడింది.

రెండు చేతులు పట్టుకుని ఆపి, మీదకు లాక్కుని పెదవులు అందుకోబోయాడు.

మొహం తిప్పేసి ముద్దును తోసిపుచ్చింది. ఆలింగనం చేసుకోబోయాడు.

వెనక్కు అడుగులేసి కౌగిలింతకు కత్తెరేసింది.

అలా అందకుండా అందించకుండా మొదలెట్టి అవస్థపెట్టి చివరకు మోహ'నాంగ' అయ్యి సరసానికి సహకారం మొదలెట్టింది.

"ఇందాకటినుండి ముద్దులకు హద్దులు గీసి, కౌగిళ్ళను కట్ చేసి అందకుండా ఏడిపించి సతాయించి చేరువవటం ఎంతమజాగా ఉందో తెలుసా? ఇలాంటి బౌండరీలే నాకు ఇష్టం..." అన్నాడు మెడ ఒంపులో మొహాన్ని చేర్చి సందీప్.

"అలాగైతే అబ్బాయిగారు ఇంకో బౌండరీ ట్రై చేస్తారా" అంది కిలకిలా నవ్వుతూ.

"నో... నో..." కంగారుగా అన్నాడు సందీప్.

"పోనీ సిక్సర్..." ముక్కుమీద ముద్దుపెడుతూ ముద్దుముద్దుగా అడిగింది రవళి.

"అస్సలు వద్దు..."

బెంబేలు పడిపోయాడు సందీప్.

"మరి..." అల్లరిగా అడిగింది రవళి.

"నో బౌండరీస్, సిక్సర్స్... విన్ ఓవర్ ఎనదర్ గేమ్... బికం వన్ ఆడదాము" అంటూ అణువణువును ఆక్రమించుకుంటూ సందీప్... తనువు సమర్పిస్తూ తన్మయురాలయ్యి, రసరాజ్యానికి రాణియై, స్వర్గ సుఖాలను కానుకగా అర్పిస్తూ రవళి... ఇద్దరూ విజేతలయ్యే ఆట మొదలయ్యింది.



ఎంతో భయపడ్డా

గత ఏడాది 'సైసావసూల్'లో పరువాలు పరిచేసిన ముస్కాన్‌సేథీ తొలి బాలీవుడ్ చిత్రం చేస్తూ తన భయ సందేహాలను విప్పి చెప్పింది.

రాహుల్ రాయ్‌తో కలిసి నటించడం అంటే మొదట్లో చాలా భయపడ్డానని చెప్పింది.

"ఇటువంటి చిత్రంలో భాగం కావడం చాలా బావుంది. 'అషి'కి చూస్తూ పెరిగాను. రాహుల్ రాయ్‌తో కలిసి నటించాలంటే భయపడ్డాను.

కాని, తనతో కలిసి పనిచేయడం గొప్ప అనుభవం. ఎంతో నేర్చుకున్నాను.

తన నుంచే కాదు యోగ్‌రాజ్ సర్ నుంచి కూడా" అంటూ చెప్పుకొచ్చింది.



ఒక చిన్నమాట

డాక్టర్ జె.భాగ్యలక్ష్మి
E-mail: jbhagyalakshmi43@yahoo.in

ఆ మధ్య ఒక వార్త వచ్చింది. న్యూజిలాండులో మైఖేలు అనే 64 ఏండ్ల వ్యక్తి మళ్ళీ పెళ్ళి చేసుకొన్నాడు. ఇందులో వింతేమిటి అంటే 38 ఏండ్లుగా తన భార్యగా ఉన్న వ్యక్తినే వివాహమాడాడు. మనం జరుపుకొనే షష్ఠిపూర్తి మహోత్సవం కాదు.

ఎనిమిదేళ్ళ క్రితం అల్జీమర్స్ (మతిమరుపు) జబ్బుకు గుర్రైన మైఖేల్‌కు గత జీవితం ఏదీ జ్ఞాపకం లేదు. తనతో నిత్యమూ ఉంటున్న స్త్రీ, తననెంతో ప్రేమగా చూసుకొంటున్న వ్యక్తిమీద అభిమానం ఏర్పడింది. "నీ పేరేమిటి?" అని అడిగాడు.

"లిండా" అని జవాబు చెప్పింది.

ఆ తర్వాత దగ్గరితనాలు, కబుర్లు, ప్రేమాభిమానాలు పెరుగుతూవచ్చాయి. ఒకరోజు "నన్ను పెళ్ళిచేసుకొంటావా?" అని అడిగాడు.

ఆమె సరేనంది. మళ్ళీ కొత్తగా వీళ్ళు భార్యాభర్తలయ్యారు. చర్చిలో ఉంగరాలు మార్చుకొని జరిగిన పెళ్ళి వీడియో ప్రపంచమంతా వైరలైంది.

"ఈ పెళ్ళి నాకో తీపి జ్ఞాపకం. అందరి సమక్షంలో నా భర్తనే పెళ్ళిచేసుకోవటం వింత అనుభూతి" అని లిండా చెప్పింది. కొంతకాలం మాత్రం స్మృతి లోపం ఉండటం తాత్కాలికంగా జ్ఞాపకాలు మాయమవటం (అమ్నీషియా) ఒక మానసిక రోగం.

మెదడుకు దెబ్బతగిలినా ఈ పరిస్థితి వస్తుంది. దీనిని సినిమాల్లో చక్కగా వినియోగించుకొని ఉత్తమ శ్రేణి చిత్రాలు నిర్మించారు. కాని కాల్పనిక జగత్తుకు, నిజ జీవితానికి ఎంతో తేడా ఉంటుంది.

అల్జీమర్స్‌లో నెమ్మది నెమ్మదిగా మెదడు దోపిడీకి గురవుతుంది. జర్మన్ న్యూరాలజిస్టు అల్జీమర్ (1864-1915) ఈ భయంకరమైన వ్యాధిగురించి 1907లో వివరించారు. వయస్సుతోపాటు ఈ వ్యాధి మెదడును ప్రభావితం చేస్తూపోతుంది. చివరికి తామెవరో కూడా తెలియని స్థితికి చేరుకొంటారు.

కొన్ని జబ్బులవల్ల మెదడుకు తగినంత రక్తం అందకపోవటం, కణితులు, టి.బి.కి గురికావటం, ఒక్కొక్కసారి సరయిన పౌష్టికాహారం లేకపోవటం కూడా అల్జీమర్స్‌కు దారితీస్తుందంటారు.

మెట్లెక్కుతున్న వ్యక్తికి తాను ఎక్కుతున్నాడో, దిగుతున్నాడో తెలియదు. చాలా ఆయోమయంగా ఉంటుంది. పడకలో నిద్ర లేచిన వ్యక్తికి నిద్ర లేస్తున్నాడో, నిద్రకు ఉపక్రమిస్తున్నాడో తెలియదు.

జాన్ బెయిలే అనే అతను తన భార్య ఈ వ్యాధికి గుర్రై రోజురోజుకూ దిగజారిపోవటం గురించి "మెట్ల మీదనుండి జారి దొర్లిపడుతూ అడుగడుగునా బొప్పి కట్టించుకొన్నట్లుంది" అని వివరించాడు.

అమెరికన్ ప్రెసిడెంట్ రొనాల్డ్ రీగన్ తనకు ఆ వ్యాధి ఉందని గుర్తింపబడినపుడు "సూర్యాస్తమయం వైపు నా ప్రయాణం ప్రారంభమైంది"అని చెప్పాడు.



మనకు బాగా తెలిసిన వ్యక్తులు గొప్ప చింతకులు, మేధావులు, తత్త్వవేత్తలు, రచయితలు ఈ జబ్బుకు గురయినారంటే నమ్మశక్యం కాదు. అంత తేజోవంతమైన మేధస్సు ఈ విధంగా క్షీణించటమా! అని వ్యథకు గురవుతాము.

నాకు గురుతుల్యులు సంస్కృత, హిందీ, తెలుగు, ఇంగ్లీషు భాషలలో పండితుడు మరెన్నో భాషలతో పరిచయమున్న వ్యక్తిని ఆ స్థితిలో చూసినప్పుడు అది పెద్ద విరోధాభాసమనిపించింది.ఆయన ఉపన్యసిస్తే శ్రోతలు మంత్రముగ్ధులయ్యేవారు.

వేదాలు, ఉపనిషత్తులు, భారత రామాయణాలు అన్నీ తెలుసు. ఎన్నో ఉత్తమ గ్రంథాలు రాశారు. కాని, తన ఎదుట ఉన్న వ్యక్తి ఎవరో తెలియదు. భోజనం చేశారో లేదో తెలియదు.

ఒకసారి పొరపాటున ఇల్లు విడిచివెళ్తే ఇల్లు చేరుకోలేదు. ఢిల్లీ చలిలో పార్కులో స్మృతి తప్పి పడివున్న వ్యక్తిని ఎవరో ఆస్పత్రిలో చేరిస్తే కుటుంబానికి కబురు అందింది. ఆ తర్వాత మాటలూ పోయాయి. చక్రాల కుర్చీకి అంటిపెట్టుకొని, పెట్టుకొని చాలా భారంగా చివరి శ్వాస వదిలారు.

ఇటువంటి దుఃఖభరితమైన జీవితగాథలు ఎన్నో! ఆ జబ్బుకు గురి అయినవారి స్థితి దుఃఖదాయకమయితే చుట్టూవున్నవారి జీవితం మరింత దుర్భరం. వర్ణించటానికి మాటలు చాలవు.

"ఇతర రోగాలగురించి హాస్యం, పరాచికాలు సహించం. మరి అల్జీమర్స్ గురించి హాస్యాస్పదమైన వ్యాఖ్యలు ఎలా చేస్తారు?" అని అల్జీమర్ సొసైటీ విండ్ సర్, ఎసెక్స్ అడుగుతారు.

నిజమే క్యాన్సర్ గురించి జోక్ చెయ్యగలమా? టైఫాయిడ్ అయినా, టి.బి.అయినా, ఎయిడ్స్ అయినా జోక్ చేస్తారా?

అల్జీమర్స్ గురించి డిమెన్షియా (మతి మరుపు) గురించి ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. మందులు వుంటాయి కాని నివారణకు కాదు.

రోగం పెరగకుండా అదుపులో ఉంచటానికి కొన్ని జబ్బులకు నివారణ ఉండదు కాని వైద్యసదుపాయం ఉంటుంది.

అల్జీమర్స్‌ను ఒక కళంకంగా సిగ్గుపడవలసిన విషయంగా కూడా భావించరాదు. ఇది వయస్సువల్ల రాదు.

ఇది ఇతర జబ్బులలాగే ఒక జబ్బు. ఇది ఎవరికో సంబంధించినది కాదు. మన అందరికీ సంబంధించిన విషయమే.

పెద్దవయసులోనే కాదు, పిన్నవయస్సులోనూ దీనికి గురయ్యేవారు చాలామంది వున్నారు. వ్యాధిని త్వరగా గుర్తిస్తే ఎంతో మేలు జరుగుతుంది. వీరు భౌతికంగా, శారీరకంగా చురుగ్గా ఉండాలి.

నవ్వటం, పెద్దగా నవ్వటం మేలు చేస్తుందంటారు. ప్రపంచంలో మతిమరుపుతో బాధపడేవారిలో భారతదేశం రెండోస్థానంలో 41 లక్షలమంది రోగులతో ఉంది. నమోదుకాని కేసులు మరెన్నో.

శరీరానికి వున్నట్లే మెదడుకూ వ్యాయామం అవసరం. చదవటం, రాయటం, లెక్కలు చేయటం, క్విజ్‌లు, పజిల్స్ పరిష్కరించటంవంటివి మెదడును చురుగ్గా ఉంచుతాయి. పౌష్టికాహారం చాలా కీలకం. రక్తపీడనం (బ్లడ్‌ప్రెషర్) అదుపులో ఉండాలి.

అన్ని రోగాలకూ నివారిణిగా పనిచేసే పసుపు కూడా ఎంతో మేలుచేస్తుంది.

సాహస కథల పోటీ

(ది కాంపిటీషన్ ఆఫ్ ఎడ్వెంచరస్ స్టోరీస్)



ఒక్కో కథకి ₹10 వేలు బహుమతి

అలా పది కథలకు లక్ష రూపాయల బహుమతులు

కత్తి పట్టి కదనరంగంలోకి దూకడమే కాదు, ఎక్కుపెట్టిన విల్లంబులతో మట్టు పెట్టడమే కాదు, శత్రులక్ష్యంవైపు టార్గెట్‌ను ఎయిమ్ చేయడమే కాదు... సాహసమంటే! అటువంటి సాహసంతోపాటు ఇంటా, బయటా, సమాజంలో, చేసే వృత్తిలో తీసుకునే నిర్ణయాలు సాహసంతో కూడినవై ఎందరికో మేలు జరిగితే అవిగో అవీ అసలుసిసలైన సాహస కథలు. మీరు రాసే కథ ఎందరికో ఇన్‌స్పైర్ కావచ్చు. వారి జీవితాలను ప్రభావితం చేయొచ్చు. 'ధైర్యే సాహసే లక్ష్మి' అనుకుని మాంచి ఓ సాహస కథ రాసి పంపండి. విజేతలు మీరే!

సాధారణ ప్రచురణకు తీసుకున్న ప్రతి కథకు ₹ 2,000

: నిబంధనలు :

మీ సాహస కథ, స్వాతి సపరివార పత్రికలో బొమ్మతో సహా, ప్రచురణలో రెండు పేజీలు మాత్రమే రావాలి. అనగా మీ వ్రాతప్రతి <u>ఆరు అరఠావులకు</u> మించకుండా ఉండాలి. కాగితానికి ఒకవైపున మాత్రమే రాయాలి. ప్రతి అరఠావుకు సుమారుగా ఇరవై ఐదు లైన్లు ఉండాలి.

1. సాహస కథల ఎంపికలో స్వాతి సంపాదకునిదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు లేదు. ఈ పోటీ గడువు తేదీని పొడిగించేందుకుగానీ, పోటీని రద్దుచేసేందుకుగానీ, స్వాతి పబ్లికేషన్స్ యాజమాన్యానికి సర్వహక్కులూ ఉన్నాయి.
2. అనువాదాలూ, అనుకరణలు, ఇతర పత్రికలకి పంపబడి పరిశీలనలో ఉన్న రచనలను పంపవద్దు.
3. సాహస కథలు తమ స్వంతమే అని, అముద్రితమని, తమ స్వదస్తూరితో రాసిన హామీపత్రాన్ని విధిగా జతపరచాలి.
4. బహుమతియోగ్యం కానివాటిని సాధారణ ప్రచురణకు తీసుకునే హక్కు మాకుంది.
5. ప్రచురణార్హం కాని కథలను తిప్పి పంపగోరువారు తగినన్ని స్టాంపులు అంటించిన స్వంత చిరునామాగల కవరు జతపరచాలి. 'సాహస కథల పోటీ'కి అని కవరుమీద స్పష్టంగా రాయాలి.

కథలను పంపవలసిన చిరునామా : ఎడిటర్, స్వాతి సపరివార పత్రిక, అనిల్ బిల్డింగ్స్, సూర్యారావుపేట, పోస్ట్ బాక్స్ 339, విజయవాడ 520 002

సాహస కథలు మాకు చేరవలసిన ఆఖరు తేది : 30.6.2018



ఎక్కువ ఎక్కువ ఆలోచించవద్దు

సమస్యలు లేనివారుండరు. సమస్యలు ఎదురు కాని జీవితం అనేది ఉండనే వుండదు. తేడా అంతా సమస్యలను ఎదుర్కొనే తీరులోనే ఉంటుంది. సమస్య, పరిష్కారం అనేవి రెండూ మన మనసులో నెలకొన్న పరిస్థితిని బట్టే వుంటాయి. ఇందుకు ఉదాహరణగా అందరం చిన్నప్పుడు మన పెద్దలు చెప్పిన మూడు చేపల కథ గుర్తుచేసుకోవాలి.

చెరువులో నీరు ఎండిపోవటం అనేది ఆ మూడు చేపలకు ఎదురైన సమస్య. దానికి పరిష్కారంగా ఆ సమస్య కనిపించగానే ఆ చెరువు వదిలేసి భద్రమైన మరో చెరువుకు వెళ్ళిపోతుంది.

మరో చేప సమస్య వచ్చినప్పుడు చూసుకుందాంలే అని వాయిదావేసి, చివరికి సమస్య నెత్తిమీదికి వచ్చిన తర్వాత దానినుండి తప్పించుకునే మార్గంలేక జాలర్ల చేతిలో చిక్కి మరణిస్తుంది. మూడవ చేప జాలర్లు పట్టుకున్నప్పుడు చచ్చిన చేపలా నటించి సరైన సమయంలో తప్పించుకుని పారిపోతుంది.

ఒక్కొక్కరి మనస్తత్వం ఒక్కోలా వుంటుందని ఎదిగే పిల్లలకు వ్యక్తిత్వ వికాసంలో భాగంగా పెద్ద వాళ్ళు తయారుచేసిన కథ అది. అది ఎంతకాలం నుండి చెపుతున్న కథో. ఎన్ని తరాలవారు విన్నారో తెలియని కథ. అయినా నేటికీ మళ్ళీ మళ్ళీ కొత్తతరం అర్థంచేసుకోవాల్సిన కథ.

సమస్యలు తప్పవు అన్న వాస్తవాన్ని గుర్తిస్తే ఆ మూడుచేపల కోవలోనే వుండనక్కరలేదు. అటూ ఇటూగా మరో కొత్త రకం ఆలోచనలను చేయవచ్చు. ఆలోచన చెయ్యటం, ఒకటికన్నా ఎక్కువ పరిష్కార మార్గాల గురించి మనసులో విశ్లేషించుకోవటం మనిషికి దక్కిన వరం. అయితే ఆ ఆలోచనలను సక్రమంగా, పరిమితమార్గంలో చెయ్యటం కొందరు చేస్తే, అనవసరపు ఆలోచనలతో చిన్నచిన్న విషయాలను భూతద్దంలో చూసుకుంటూ సమస్యలు తమ జీవితాన్ని మింగేసేలా చేసుకుంటారు.

ఆలోచనలమీద అదుపు కోల్పోవటంతో చిన్న చిన్న సమస్యలమీద అదనపు సమయం వెచ్చించి వీటిని మరింత పెద్దవిగా, భయపెట్టేవిగా చేసుకుంటారు కొందరు. ఆ ఆలోచనలు అతివేగం, అక్రమ కోణంలో జరిగినందున సమస్యలో అనుకూల అంశాల వ్యతిరేక అంశాలుగా రూపుదిద్దుకుంటాయి. అతి ఆలోచనలు సమస్యలను పెంచుతాయి.

పరిష్కారం లభించనంత జటిలంగా సమస్య ముడిపడుతుంది. అతి ఆలోచనలు శారీరకంగాకూడా ఇబ్బందులను తెస్తాయి. ఆలోచనలు ఒత్తిడిని పెంచుతాయి. శరీరంలో ఒత్తిడి లక్షణాలు తెచ్చే హార్మోన్లు అధికమవుతాయి. ఒక నిర్ణయానికి రానివ్వని మానసిక స్థితికి చేరుతారు.

ఏదో ఒక పరిష్కారమార్గంగా కనిపించినా దాని వెంట వెళ్ళలేని పరిస్థితి. అన్నింటిమీదా సందేహాలు. అందరిమీదా అనుమానాలు. ఫలితంగా ఆలోచనలన్నీ వ్యతిరేకభావాలలోనే వుంటాయి. నిర్ణయం తీసుకోలేని పరిస్థితినుండి మరింత వెనక్కి వెళ్ళి అసలు ఆలోచనే చెయ్యలేని స్థితికి వెళ్ళిపోతారు. అతి ఆలోచనలు ఆలోచనా తీరులో స్పష్టత హరిస్తుంది.

ప్రతి అంశం ప్రమాదంతో కూడినదిగా కనిపిస్తున్నదంటే మనిషిలో ఏదో ఒక మానసిక లోపం వుందని అర్థం. తీవ్రమైన ప్రమాదంలో చిక్కుకుపోతున్నట్టుగా, జీవితం అంతమవుతున్నట్టుగా భావనలు కలుగుతాయి. తనకు తాను ఎందుకూ పనికిరానివాడినన్న భావన పెంచుకుంటారు.

ఇది తనకు తాను ప్రమాదకర జీవితంలోకి మళ్ళటమే కాక తన చుట్టూ వున్నవారి జీవితాలను ఇబ్బందిలోకి నెట్టే పరిస్థితి. ఒక కుటుంబ పెద్ద అటువంటి అతి ఆలోచన మనిషి అయితే ఆ కుటుంబం ఏ విషయంలోనూ ముందుకు వెళ్ళలేదు. మిగిలినవారి చదువులు దెబ్బతింటాయి. కుటుంబ సంబంధ, బాంధవ్యాలు తెగిపోతాయి.

అతి ఆలోచనలనుండి ఎంత త్వరగా బయటకు రాగలిగితే అంత మంచిది. ఆ ఆలోచనలకు అడ్డుకట్టవేసే మార్గాలు వున్నాయి. అవి అంత సులభమైనవి కాదు. అందుకే చాలామంది వాటిని అనుసరిం

పరిధి పెంచాలి

ఆలోచనలను ఆపలేకపోవచ్చు. కాని ఆలోచనా పరిధిని విస్తృతపరచవచ్చును. మనసులో వేధిస్తున్న సమస్యను చూసే పద్ధతిని మారిస్తే పరిష్కారాలు భిన్నంగా కనిపిస్తాయి.

ఎక్కువగా వేధించేవి, ఆలోచనలను వ్యతిరేక దిశలోకి తీసుకువెళ్ళేవి చాలాచాలా చిన్న అంశాలు. నలుగురిలోకి వెళ్ళినప్పుడు ఎవరో ఏదో తనను అన్నారని లేదా తన గురించి చెప్పుకుంటున్నారని అనుకుని అనవసరపు ఆలోచనల్లోకి పడేవారుంటారు.అది నిజంగా అతని గురించిన నవ్వు అయి వుండదు. అయినా అనుమానం మనసులోపడిన తర్వాత ఇక దానిమీద ఆలోచనలు వదలవు.

అటువంటి ఆలోచనా సమస్యలే అధిక జనాభాలో కనిపించేవి. సమయాన్ని, వృధాచేసుకునేది

చరు. ఎంత కష్టమైన మార్గం అయినా వాటిని ఎదుర్కొంటూ ముందుకు వెళ్ళగలిగినప్పుడే జీవితం మరింత సుఖవంతంగా వుంటుంది.

ఆలోచనలకు సవాల్

వ్యతిరేక ఆలోచనల్లోకి పడకూడదు. ఒకసారి ఆ ఆలోచనలు మొదలయితే ఆ ఆలోచనా ఫలితం వ్యతిరేకంగానే వుంటుంది. మానసిక స్థితి ముఖ్యం అనేది అందుకే. ఆటలో అయినా, పరీక్షలో అయినా, ముందుగానే

"చేతకాదు... నేను సరిగ్గా చెయ్యలేను" అనే ఆలోచనతో మొదలుపెడితే నిజంగానే ఏమీ చెయ్యలేరు.

ఆలోచనలు అనంతం. వ్యతిరేక ఆలోచనలకు లోతు తెలియదు. ఒకదానితర్వాత ఒకటి వస్తూనే వుంటాయి. దానిని పరిష్కరించుకోకపోతే జీవితకాలమంతా అసంతృప్తి సంసారమే అవుతుంది. కాబట్టి వ్యతిరేక ఆలోచనలకు అడ్డుకట్టపడాలి. అడ్డుకట్టకట్టాలంటే నదీప్రవాహం, ఆనకట్టకు ఎంచుకున్న స్థలంమీద సరైన పరిజ్ఞానం వుండాలన్నది ఇంజనీరింగ్ సూత్రం.

అదే విధంగా వ్యతిరేక ఆలోచనలకు మూలం అర్థంచేసుకుని వాటికి సవాలు విసరాలి.

జీవితాన్ని అంతంచేసేంత గొప్ప సమస్యలేవీ వుండవు అందరికీ.

చాలామంది సమస్యలు చాలా చిన్నవే. వాటిని భూతద్దంలో చూడటమనే దానివల్లే ఇబ్బందులు పెరుగుతుంటాయి. ఆ వ్యతిరేక ఆలోచనలను ప్రారంభంలోనే తుంచివేయాలి.

అవి పెరిగి భూతాల మర్రిలా మనసులో పాతుకుపోయే అవకాశం ఇవ్వకూడదు.

ఇది సమస్య. దీనికి పరిష్కారమిది అని ఆ పరిష్కారమార్గం వెంటనే అనుసరించి సమస్యను అధిగమించటం ఉత్తములు చేసే పని. సమస్య అనిపించగానే దానిని ఎదుర్కొనే ధైర్యం వుంటే వ్యతిరేక ఫలాలు వెంటాడవు.

వర్తమానం కీలకం

నిన్న అంటే జరిగిపోయినది... వెనక్కి తీసుకురాలేనిది. రేపు ఎలా వుంటుందో, ఏం జరుగుతుందో తెలియనిది. వర్తమానమే మనది. ఇప్పుడు ఏం చెయ్యగలం! ఎలాచెయ్యగలం! అనేది ఆలోచించాలి.

గతంలోని అంశాలమీద పాఠాలు నేర్చుకుని, ఆపైన గతఅనుభవాలను మరచిపోవాలి.అంతేకాని గతంతలచి వగచటం అర్థంలేదు. అదేవిధంగా భవిష్యత్తు గురించిన పునాది కరువైన కట్టడాలు కట్టటంవల్ల ఉపయోగం లేదు. ఎంతసేపు కట్టినా నిలవదు. భవిష్యత్తు గురించిన ఆలోచనలు కలలు కలలుగా అలా తేలిపోతుంటాయి.

స్పష్టత రాని కలలలో ఎటువంటిలాభం వుండదు. గతంలో బతుకుతూ, భవిష్యత్తుని లీలగా రూపొందిస్తూ వర్తమానం వదిలేసేవారి వర్తమానపు ఆలోచనలు సరిగ్గావుండవు. వర్తమానపు అంశాలమీద అదుపు సాధించటంకోసం సాధన చెయ్యండి. వర్తమానంమీద ఎవరు ఎక్కువ దృష్టి పెడతారో వారిలో వ్యతిరేక ఆలోచనలు మొదలవవు.

ఆలోచనలు అర్థంలేనివిగా అటూ ఇటూ వెళ్ళిపోవటం జరగదు. వర్తమానపు ఆలోచనలకు ప్రాధాన్యత నివ్వటంసాధనచెయ్యాలి. ఆ సాధన అతి ఆలోచనలకు విరుగుడు. జీవితంమీద పూర్తిఅదుపు ఎవరికీ సాధ్యంకాదు. పొరపాట్లు జరుగుతుంటాయి. తప్పటడుగులు వెయ్యటం సహజం.



Courtesy : WOMAN'S ERA

తద్వారా జీవితాన్ని ధ్వంసం చేసుకునేది ఇటువంటి అనుమానపు అతి ఆలోచనలతోనే.

ఇటువంటి పరిస్థితి ఎదురైనప్పుడు ఒక్కసారి ఆలోచనలను ఆపాలి. వ్యతిరేకదిశలో కొట్టుకుపోతున్న ఆలోచనలకు వ్యతిరేకంగా ప్రయాణం కాకపోయినా, వాటిని ఒకచోట ఆపే యత్నం చెయ్యాలి.

అందుకు సరైనది ఆలోచనలను విస్తృత పరిధిలోకి తీసుకువెళ్ళటం. "నిజమే... నా గురించి ఆ నలుగురు ఏదో చెప్పుకున్నారు. వారు నవ్వింది నా గురించే..." అని అనుకుని, అంగీకరించి ఇక అక్కడి నుండి ఆలోచనా పరిధిని పక్కకు తిప్పాలి.

వారు "నలుగురు ఏదో అనుకున్నంతమాత్రాన నాకుపోయేది ఏముంది? నా వ్యక్తిత్వం ఏమైనా దెబ్బతింటుందా! నాకేమైనా ఆర్థికంగా, ఉద్యోగపరంగా నష్టమొస్తుందా! నా భవిష్యత్తును ఏమాత్రం ప్రభావితం చెయ్యని ఆ విషయం గురించి నేనెందుకు అతిగా ఆలోచిస్తున్నాను?"

ఈ ధోరణిలోకి ఆలోచనలను మలచగలిగితే ఆలోచనలు అదుపు తప్పవు.

ఎటువంటి నష్టం కలిగించలేని అంశాలగురించి అనవసరపు ఆదుర్దా ప్రదర్శించే స్థితినుండి బయటపడ్డారని తెలిసినా మరుసటిరోజు నుండి మీగురించి ఏమైనా అనుకునేందుకు జంకుతారు ఇతరులు. బాధపడి, ఆ బాధ గురించి బహిరంగంగా స్పందన చూపించేవారినే బాధపెట్టి ఆనందంపడతారు అవతలివారు.

వారికి ఆ ఆనందం దక్కనివ్వకూడదు. ఆలోచనా సరళిని విస్తృతపరచి, స్పందనలో అతిని తగ్గిస్తే సమస్య అధిగమించినట్టే. అతి ఆలోచనా ప్రవాహం ఎండిపోతుంది. ◆

అటూ ఇటూ అవుతాయి

మీ కళ్ళ ఎదుట కనిపించే విజేతల జీవితంలోనూ వైఫల్యాలు వుంటాయి.

ఆ వైఫల్యాలను వారు అధిగమించిన తీరును అర్థంచేసుకోవాలేకాని వారి ప్రస్తుత విజేతస్థానంచుట్టూ అతిగా ఆలోచనలు చేయుటంవల్ల సాధించ గలిగిందేమీ లేదు. తప్పులు చేయవద్దు. పొరపాటున తప్పులుచేస్తే వీలైనంతత్వరగా ఆతప్పును చక్క దిద్దుకుని సరైన మార్గంలోకి అడుగులువేసేయత్నం చెయ్యాలి.

తప్పులమీద, వైఫల్యాలమీద అతి ఆలోచనలు అనవసరం.వాస్తవాన్ని అంగీకరించగలిగిన మనస్తత్వ ముంటే ఆలోచనలో 'అతి' తగ్గుతుంది. అదే మానసిక ఆరోగ్య రహస్యం.

వి.ప్రభాకర్

సీరియల్

కొలంబియా దేశపు బొగోటా అడవులమీదుగా మేడిలిన్, పనామా, కోస్టారికా దాటి, మూడు రాత్రుళ్ళు మూడు పగళ్ళు అష్టకష్టాలు పడి ప్రయాణించి నికరాగ్వా దేశాన్ని సమీపించింది. మధ్య అమెరికా సమీపంలో తీరప్రాంతంలోని చిన్న దేశం నికరాగ్వా. ఇక్కడా ఎన్నో జాతులు స్థిరపడ్డాయి. వాళ్ళలో భారతీయ సంతతికి చెందినవాళ్ళూ ఉన్నారు.

నికరాగ్వాను సమీపిస్తుండగా వినువీధిలో తనను ఓవర్‌టేక్ చేసి దగ్గరలోంచే దూసుకుపోతూ ఒక పక్షి సముదాయాన్ని గమనించాడు కార్తికేయ.

చిన్నపాటి మబ్బుతెరలా అవి గుంపుగా ఎగిరిపోతున్నాయి.

మనిషిలో మనిషి



E-mail: Suryadevaranovelist@gmail.com

సూర్యదేవర రామ్‌మోహనరావు



చూడ్డానికి నీలిరంగు పరదా ఒకటి అత్యంత వేగంగా ఎగిరిపోతున్నట్టుంది. వాటి వేగాన్ని అందుకోవటం తనకు సాధ్యం కాదనిపించింది.అవిచాలక జాతికి చెందిన లియో పక్షులు. వాటి వేగం కారణంగా స్థానికులు వీటిని 'రాకెట్ బర్డ్స్'గా వ్యవహరిస్తారు.

దక్షిణ అమెరికా తీరంవెంట నికరాగ్వా వెస్ట్ ఇండీస్ అట్లాంటిక్ ఓషన్ తీరప్రాంత దేశాల్లోనూ ఇవి కన్పిస్తాయి. పండ్లు కాయలు వీటి ఆహారం. ఇవి తోటల్లో వాలితే కాపు మొత్తం ధ్వంసమైపోతుంది.

ఇవి సంఘజీవులు. గుంపుగానే సంచరిస్తాయి. ఒంటిగా తిరగవు. అలాంటివి చాలా అరుదుగా కన్పిస్తాయి. ఈ రాకెట్‌బర్డ్స్ నీలివర్ణంలో ఉండి రెక్కల అంచున చారలా ఎర్రటి ఈకలు కలిగివుంటాయి. ముక్కువంపు తిరిగి బలంగా దృఢంగా ఉంటుంది. కాలిగోళ్ళు వాడిగా చాలా దృఢంగా ఉంటాయి.


కనుగుడ్లను చుట్టి వృత్తాకారంలో ఎరుపురంగు చార ఉంటుంది. చాలా అందమైన పక్షి. సునాయాసంగా గంటకు రెండువందల కిలోమీటర్ల వేగంతో దూసుకుపోగలవు. అలాగని నాన్‌స్టాప్‌గా మైళ్ళకొద్ది దూరం ఎగరలేవు. ఇవి వలస పక్షులు కాదు. ప్రతి అర్థగంటకి ఓసారి విశ్రాంతి అవసరం. కాబట్టి ఇవి ఎక్కువ దూరం సముద్రంమీద ఎగరవు.

అధికంగా తీరప్రాంతాల వెంట సంచరిస్తాయి. లోకంలో అత్యంత వేగంగా ఎగరగలిగే పక్షులు ఉన్నప్పటికీ లియో పక్షుల స్పీడే వేరు. ఒక్కో పక్షి కిలో బరువుకు తక్కువ వుండదు. చూస్తుండగానే లియోపక్షులు కనుమరుగయ్యాయి.

రెక్కల చప్పుడుతప్ప గగనవీధి నిశ్శబ్దంగా ఉంది. దిగువన ఏదో రైలు వెళ్తున్న కూత శబ్దం విని పిస్తోంది. సరిహద్దులు దాటి నికరాగ్వా దేశం గగన మార్గంలో ప్రవేశించేసరికి చీకటిపడింది.

ఏక ప్రయాణంతో అలసిన శరీరం విశ్రాంతి కోరుతోంది. రాత్రికి బాటపక్కన ఒక పెద్ద ఓక్‌వృక్షం శాఖలమీద వాలి అక్కడే రాత్రికి ఉండిపోయింది.

అర్ధరాత్రి దాటేసరికి వాతావరణం మారింది. ఆకాశం దట్టంగా మబ్బులు కమ్ముకుంది. ఈదురు



గాలితో కూడిన వాన మొదలైంది. క్రమంగా అది పెరిగిపోయింది. నికరాగ్వాలో వర్షాకాలంలో వర్ష పాతం ఎక్కువే. అలాగే శీతాకాలంలో మంచు కూడా కుప్పలు తెప్పలుగా కురుస్తుంది. దేశం చిన్నదే అయినా సుసంపన్నమైన దేశం నికరాగ్వా.

విశాలమైన బాటలు, పల్లెలు, పట్నాలు ఆఖరికి వ్యవసాయ భూములు కూడా తీర్చిదిద్దినట్టుంటాయి. ఏ ఒడుదుడుకులు లేని ప్రశాంత జీవనం ఇక్కడ కన్పిస్తుంది. తరచుగా వార్తలకెక్కే దేశం కాదిది.

పెద్ద గాలి తెర వీచింది.

ఓక్ వృక్షం కూలిపోతుందా అన్నంత పెనుగాలి. వృక్ష శాఖను ఛెళ్ళున తాకటంతో బ్యాలన్స్‌తప్పి దబ్బున కిందపడిపోయింది కొంగ. బాధను ఓర్చు కుంటూ లేచి రెండు బండరాళ్ళ మధ్య సందులోకి పోయి ఒదిగి కూర్చుంది. అదృష్టం బాగుండి విరిగిన కొమ్మేదీ మీదపడలేదు. ప్రాణాలు పోయుండేవి.

మరో శరీరంలోకి పరకాయప్రవేశం చేసి కాపాడు కుందామన్నా ఇప్పటికిప్పుడు మరో మృతదేహం ఎక్కడ దొరుకుతుంది? వృక్షశాఖలు అనేకం విరిగి పడ్డాయి. దగ్గరలోని కొన్ని చెట్లు కూలిపోయాయి.

బిక్కుబిక్కుమంటూ మిగిలిన రాత్రంతా అక్కడే గడిపింది. తెలతెలవారుతూవుండగా గాలి విసురు తగ్గిందికాని వర్షం జోరుగా కురుస్తూనే ఉంది.

జలమయంగా ఉంది అంతటా.

ఉదయానికి వాన తగ్గుతుందని ఆశించింది. తగ్గలేదు సరికదా మరింత ఎక్కువైంది.

పగలంతా కురుస్తూనే ఉంది. ఆకలి వేరే. అంతా సవ్యంగా ఉంది అనుకుంటున్న సమయంలో ఈ అవాంతరం ఏమిటో తెలియక కొంగ రూపంలోని కార్తికేయ అతలాకుతలమవుతున్నాడు.

త్వరగా మసాయా అగ్నిపర్వతం వద్దకు చేరుకోవా లని ఉంది. కాని అది ఏ దిశలో ఎంతదూరంలో ఉందో తెలీదు. వాన నీళ్ళకు రెక్కలు బరువై ఎగర లేదు. తగ్గేవరకు ఆగాల్సిందే. ఎలాగో మసాయాను చేరుకుంటే మిగిలింది అక్కడ ప్లాన్ చేసుకోవచ్చు.

తన ప్రాణసఖి సంజనా ప్రాణశక్తిని బంధించి ఇంత సుదూరంలో ఉంచిన మంత్రవాది భైరవేశ్వర్ మీద పిచ్చికోపంగా ఉంది.కాని కోపతాపాలతోపనులు కావు. సంయమనం పాటించి కాపాడుకోవాలి.

జరిగిన కథ 30

చింపాంజీలో ఉన్న కార్తికేయ సాదూ భాయ్ శవాన్ని కాళ్ళుపట్టి లాక్కుంటూ గుహ లోకి వెళుతుంది. ఆ గుహలో ఆయుధ సామాగ్రి డంప్ వుంటుంది.

అందులో రాకెట్ లాంచర్లు కూడా ఉండ టంతో ఆశ్చర్యపోతాడు కార్తికేయ. ఆ పెద్ద గుహలో కనీసం ఐదువందలమందికిపైగా పనిచేస్తూవుంటారు. వాళ్ళందర్నీ మెషీన్‌గన్‌తో కవర్ చేస్తూ అక్కడ ఉన్న జీప్‌ని డ్రైవ్‌చేస్తూ చాలామందిని కాల్చేస్తాడు కార్తికేయ.

ఆ తరువాత చింపాంజీ శరీరాన్ని వదిలి ఓ కొంగ శరీరంలోకి పరకాయ ప్రవేశం చేస్తాడు. స్వామి సత్యానంద పంపిన నర హంతకులయిన కపాలి, ఛెళియన్‌లు ఇద్దరూ పర్లాకిమిడి చేరుకుంటారు.

రాజా విష్ణుచంద్ర గజపతి మహదేవ్ గారిని హత్య చేయబోయిన ఆ దుండగుల బారినుండి చివరి క్షణంలో తప్పించుకుంటా డాయన. ఛెళియన్, కపాలీలు మిలటరీకి లొంగిపోతారు. ఇక జరిగేది చదవండి.

చిలిపి



భర్త చనిపోతే భార్య విధవరాలవు తుంది. మరి భార్య చనిపోతే భర్త.
పెళ్ళికొడుకు అవుతాడు.

రైల్వేస్టేషన్‌లలో విశ్రాంతి గదులు ఎందుకు?
'రైళ్ళు టైమ్‌కు రావుగనుక పడుకోవటానికి!'

కాకులు సబ్బుల్ని ఎత్తుకుపోతాయెందుకు?
పిల్లల్నైనా తెల్లగా తయారుచేద్దామని.

ప్రయాణీకుడు కోరుకునేది ఏది?
పక్కవాడి చేతిలోని న్యూస్‌పేపర్.

'ఆడపిల్లలే నయం' అని ఎందుకు అంటారు?
వారు ఎప్పటికైనా ఇంటినుండి వెళ్ళిపోతారుకనుక.

తెలుగు సినిమాలలో ఉన్న ప్రత్యేకత ఏది?
పాట అయిపోయింతర్వాత హీరో, హీరోయిన్ చెట్లవెనక దాక్కోవడం.

పిచ్చుకలు అద్దంలో ముఖం చూసుకుంటాయెందుకు?
యవ్వనమొచ్చినా మీసాలు రాలేదేంటా అని.

'ట్రాజెడీ' సినిమా చూసినప్పుడు మీ అనుభవం ఏమిటి?
సినిమా చూశాక 'ఈదుకుంటూ' బయటకు రావాల్సొచ్చింది.

ఆ వానలోనే అటూ ఇటూ తిరుగుతూ దొరికిన పురుగు పుట్ర మింగి ఆకలి బాపుకుని మూడుదినాలు ఆ ఓక్ వృక్షం చెంతనే ఉండిపోయింది కొంగ.

నాలుగో రోజుగ్గాని వాన తగ్గలేదు.

మబ్బులు చెదరి నీలాకాశం దర్శనం ఇచ్చింది. ఆనందంతో గంతులేస్తూ రెక్కలార్చుకుంది కొంగ. తిరిగి ఆకాశగమనానికి పైకి ఎగిరింది.

నికరాగ్వా భూభాగంమీద అడ్డంగా ఎగురుతూ పైకి చాలా పైకెగిరి అగ్నిపర్వతం జాడకోసం వెదికింది. మబ్బులదారికి చేరగానే తానున్న చోటుకి ఎగువన సుదూరంలో దిక్చక్రరేఖలో గోచరించిందో పర్వతం. చిన్న సైజు కుంపటిలా ఉంది. పొగ మంటలు చిందే కమ్మరి కొలిమిలా పర్వతాగ్రం నుంచి పొగలు లేస్తున్నాయి. అదే తను వెతుకుతున్న 'మసాయా ఓల్కనో' అయి ఉంటుందనిపించింది.



అమెరికాతో రష్యా సంబంధాలు బాగా క్షీణించాయి. ఆ సంబంధాలు మెరుగుపడాల్సి వుంది. -పుతిన్, రష్యా అధ్యక్షుడు

దూరానికే అలా కన్పిస్తోందంటే దగ్గరకెళ్తే చాలా భీకరంగా ఉంటుందనిపించింది. వెంటనే దిశ మార్చుకుని అగ్నిపర్వతంవైపు ప్రయాణం సాగించింది.

మసాయా!

కొంగరూపంలోని కార్తికేయ ఆ అగ్నిపర్వతాన్ని కరక్ట్‌గానే గుర్తించాడు. వినువీధి నుంచి చూస్తే దూరమనిపించిందిగాని మరీ అంతదూరం ఉంటుందనుకోలేదు. పర్వత సమీపానికి చేరుకునేసరికే సాయంకాలమైంది. మొత్తానికి గమ్యాన్ని చేరుకున్నందుకు సంతోషంగా ఉంది. తన ప్రాణంలో ప్రాణం - తన మనోహరి -

తను మరదలు రాకుమారి మేఘనా సౌందర్యానంద సహానాదేవి తన ప్రియసఖి సంజనాను గర్భకుహరంలో దాచుకున్న జ్వాలాముఖి కష్టాలనధిగమించి చివరకు గమ్యం చేరుకున్నాడు.

పడ్డ కష్టాలు ఒక ఎత్తు, ఇక ఆమెను బాధ విముక్తురాలిని చేయటం ఒక ఎత్తు. రహస్య గుహామార్గం ఎక్కడ వుందో వెదికి వెళ్ళి సంజనాను చెరవిడిపించటం మిగిలుంది. ఆమెకోసం అవసరమైతే అగ్నిలో ప్రయాణం చేయటానికైనా తను సిద్ధమే.

అలుపు అనుకోకుండా ఓల్కనోను చుట్టి ఎగురుతూ పరిపరివిధాలా ఆలోచిస్తున్నాడు బకరూపుడు కార్తికేయ.పరిసరాలను జాగ్రత్తగా గమనిస్తున్నాడు.

జ్వాలాముఖి మసాయా పర్వతం ఎత్తుకన్నాచుట్టుకైవారం చాలా ఎక్కువ. కొన్ని మైళ్ళ వైశాల్యంలో విస్తరించి ఒక పుట్టలా ఉంది. గతంలో అనేకసార్లు అది కక్కిన లావా (శిలా ద్రవం) అన్నివైపులా నేలకు ప్రవహించి శిలగా మారిన చారలు కన్పిస్తున్నాయి.

ఉగ్రరూపంతో ప్రేలుళ్ళు సంభవించి జ్వాలలు మిన్నంటే సమయంలో ఎగసిన ధూళి బూడిద చుట్టూ కిలోమీటర్లమేర వర్షంలా పడుతుంది.

ఊళ్ళో గ్రామాలు బూడిదమయంగా మారిపోయాయి. ప్రస్తుతం మసాయా ఉగ్రరూపంలోలేదు. శాంతంగానే ఉంది. అయినా కూడా తెరిచిన నోరులా ఉన్న పర్వతాగ్రం బిలంలోంచి పొగతో కూడినజ్వాలలు ఎగసిపడుతూనే ఉన్నాయి. అవి ఆకాశంలో చాలా ఎత్తుకు వ్యాపిస్తున్నాయి.

సెగలు చిమ్మే అగ్నిబిలంమీదుగా ఎగిరినా బూడిదగా మారాల్సిందే, అంత వేడి. అందుకే ఆ పర్వతాగ్రంమీదుగా ఏ పక్షీ ఎగరదు. భూమిపైన గల ఆరు నరకద్వారాల్లో ఇది ఒకటన్నారు.

అగ్నిబిలంలో లోతుల్లో ఎక్కడో ఒక మినీ నరకం ఉందని అక్కడ పాపులకు శిక్షలు అమలుచేస్తూంటారని జీవాత్మలు ఈ అగ్నిబిలంగుండా భూమిలోని నరకలోకం చేరుకుంటాయని నరకలోక శక్తులు ఈ బిలాన్ని చుట్టిరేయింబవళ్ళు కావలి తిరుగుతూంటాయని ఇలా ఏవేవో విన్నాడు.

అవి ఎంతవరకు నిజమో చూడాలి. పర్వతాగ్రం మీదికి పోకుండా - గ్లైడర్‌లా కొండచుట్టూ ఎగురుతూ పరికిస్తున్న కార్తికేయకు దిగువన వేస్ట్ ల్యాండ్స్ చాలా కనిపిస్తున్నాయి. గొర్రెలు పశువులు చెట్లకింద పచ్చికలో మేస్తూ కనిపిస్తున్నాయి.

కొండకు అటుపక్క ఒకటి ఇటుపక్క ఒకటి రెండు గ్రామాలున్నాయి. వాటినానుకొని వ్యవసాయ భూములున్నాయి. ఎగువన ఒక పట్నం కన్పించింది. కుడిపక్కనమాత్రం చాలా దూరంలో ఒక నగరం ఉంది. అక్కడే విమానాశ్రయం కూడా ఉంది... చూస్తూవుండగానే విమానం ఒకటి ల్యాండైంది. ఇక నగరాలను పల్లెలు పట్నాలను కలుపుతూ గీత గీచినట్టు అనేక రోడ్లు చీమల బారులా సాగిపోతున్న ట్రాఫిక్‌ను చూశాడు.



లాలూ ప్రసాద్‌ని ఎన్నిసార్లు జైలులో పెట్టినా ఆయన ఎన్నికల్లో గెలుస్తూనేవుంటాడు.
-మమతా బెనర్జీ, బెంగాల్ సి.ఎమ్.

పర్వతపాదంలో కొంత ఎత్తువరకు దట్టముగా పెరిగి పొదలు వృక్షాలు ఆ పైకి వెళ్ళేకొద్దీ అక్కడక్కడా రాళ్ళపగుళ్ళలో వేళ్ళూనుకుని లేచిన చెట్లు కనబడుతున్నాయి.

అక్కడ్నుంచి పైకి పర్వతాగ్రంవరకు పచ్చగడ్డి కూడా పెరిగిన జాడలేదు. ఇంతకూ నరక ద్వారం లోకి తీసుకువెళ్ళే గుహామార్గం ఎటునుంచి ఎక్కడ వుందో మాత్రం తెలీలేదు.

తను నికరాగ్వా దేశానికి ఎప్పుడూ రాలేదు గాబట్టి ఇక్కడి ఊళ్ళు నగరాల గురించి అస్సలు తెలీదు. ఆలోచిస్తూ పర్వతాన్ని రెండురౌండ్లు చుట్టి వచ్చే సరికే కనుచీకటి పడింది. రాత్రికి షెల్టర్ కావాలి.

తను విశ్రాంతిగా గడిపేందుకు సురక్షితంగాను అనువుగాను ఉండే ఒక ఎత్తయిన వృక్షాన్ని చూసుకుని దాని చిటారుకొమ్మలమీద వాలింది కొంగ. ఇక అక్కడే ఉండిపోయింది.

అయితే - ఒక రాత్రి వేళ చీకట్లలో జ్వాలాముఖిని చుట్టి ఓసారి ఎగిరి చూడాలనిపించింది. ఎందుకంటే కొండమీద నరకలోక శక్తులు నిజంగా కాపలా తిరుగుతున్నాయా, అగ్నిబిలంగుండా పాపులు నరకలోకానికి పోవటం నిజమేనా, నిజంగా అగ్నిబిలంలోపల మరో లోకం ఉందా అంతా చూసి రావాలనుకుంది కాని అంతలోనే మనసు మార్చుకుంది.

తనకిప్పుడు కావలసింది నరకద్వారం చేర్చే బిల మార్గం. తన సంజనాను కాపాడుకోగలిగితే చాలు. అంతే - తను విన్నది నిజమో కాదో తెలుసుకోడానికి వెళ్ళిచూడాల్సిన అవసరంలేదు.

ఒకవేళ నిజంగానే అక్కడ కావలిశక్తులు వుండి తనను గమనిస్తే ప్రమాదం. కొంగ శరీరంలో ఉన్నది మనిషి ఆత్మగా గుర్తిస్తే వెంటబడతాయి.

ఇప్పుడిదంతా అనవసరం కదూ అనుకుంటూ చిరుగాలికి ఉయ్యాలలూగుతున్న గుబురుకొమ్మమీద మిగిలిన రాత్రంతా ప్రశాంతంగా నిద్రపోయింది.

పాత ఢిల్లీ. ఆదివారం.
సుదీప నిలయం.

ఉదయం పదిగంటలు. సెలవు రోజుగాబట్టి ఆఫీసుకు పోవాల్సిన పని లేదు. ఇంట్లోనే ఉంది సుదీప. ఇంకా నైటీలోనే ఉంది. టీవీముందు కూర్చుని తీరిగ్గా న్యూస్‌ఛానల్‌పెట్టింది.తను నిర్వహించలేని మాఫియా వ్యాపారాలన్నీ మూసేసింది. వాటిని ఆ రంగంలో పనిచేస్తూ వచ్చిన తమ మనుషులకే వదిలేసింది.

కేవలం తమ ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ కంపెనీ వ్యాపారం మాత్రం చూస్తోంది. దాంతో మునుపటిలా ఇప్పుడింటిముందు గూండాల కాపలా లేదు. ఇద్దరు గుర్ఖాలు గేటుముందు ఉంటున్నారు.జీవితం ప్రశాంతంగా వుంది. ఏదో రోజు సాదూభాయ్ తిరిగివస్తాడన్న ఆశ వుందిగాని వార్తలు చూస్తుంటే ఎప్పటికీ తిరిగిరాడని అర్థమైంది.

"ఏంటమ్మా అంతగా చూస్తున్నారు. ఏం వస్తోందేంటి టి.వి.లో?" అటుగా వస్తూ అడిగింది మందాకిని.

"ఏయ్ మందాకిని. రారా. చూస్తుంటే నీ సందేహమే నిజమయ్యేలా ఉందే. వచ్చి చూడు" అని పిలిచింది సుదీప. "ఊరుకోండమ్మా వెధవ సందేహాలు నేను. ఇప్పటికే ఏ చవటని కట్టుకున్నా సందేహ ప్రాణినంటూ చీదరించుకుంటున్నాడు. నాకు పని వుంది మీరు చూడండి" అంది.

"డ్రైవర్ దీనారామ్ కూడా ఇదే మాట అన్నాడా?" ఫక్కున నవ్వింది.

"వాడెందుకు అంటాడు. తెగ పొగిడేస్తున్నాడు. వెధవకి నేను కావాలట. ఇప్పుడు వున్న మొగుడికి ఎప్పుడు డైవోర్స్ ఇస్తానా అని కాచుక్కూర్చున్నాడు. అయినా మీకీ విషయం..."

"నాకంతా తెలుసులేవే. రా. వచ్చి చూడు. విషయం నీకే తెలుస్తుంది"

"అంత గొప్ప విషయమా.... ఏమై ఉంటుంది?" దగ్గరకొచ్చి టి.వి.లోకి చూసింది మందాకిని. అంతే- ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టేసింది.

చింపాంజీ ఒకటి మెషిన్‌గన్ పుచ్చుకుని మనుషుల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపారేస్తూ వీరవిహారం చేస్తోంది. చుట్టూ అడవి, దూరంగా కొండ పేలిపోతూ రాళ్ళకుప్పగా మారుతోంది.

"ఏందమ్మా. ఇంగ్లీష్ సినిమానా?" అడిగింది.

"కాదు. నిజంగా జరిగింది. అది అమెరికాలోని కొలంబియాలోని బొగోటా అడవి. అది కాల్చి చంపుతున్నది డ్రగ్ మాఫియాకింగ్ పాబ్లో మనుషుల్ని, వెనకాల కూలిపోతున్న కొండ వాడి స్థావరం.

విచిత్రం ఏమంటే, అప్పటికి అయిదు గంటల క్రితం చచ్చిన చింపాంజీ అది. తిరిగి ప్రాణంవచ్చి ఇలా ప్రతీకారం తీర్చుకుంది"

"చింపాంజీకి ప్రతీకారం ఏందమ్మా! దాన్ని వాళ్ళే చంపారా? పైగా అయిదు గంటల తర్వాత బ్రతికిందంటున్నారు. నమ్మాలా వద్దా?"

"నమ్మాలి. సాదూభాయ్ తిరిగొస్తే నమ్మలేదా? ఇంకో షాకింగ్ న్యూస్ ఏమిటో తెలుసా? సాదూభాయ్ చనిపోయింది పేలిపోతున్న ఆ కొండకిందే"

సుదీప మాటలకు నిజంగానే షాకయింది మందాకిని. అర్థంగానట్టు పిచ్చిచూపులు చూసింది.

"ఏందమ్మా మీ మాటలు. ఒక్కటీ అర్థంగావటం లేదు. సాదూభాయ్ సాబ్ అక్కడికి వెళ్ళారా? అక్కడ మరణించారా?" అనడిగింది.

"ఔను. అదే విచిత్రం. జరిగింది చెప్తా విను" అంటూ తనకు తెలిసింది న్యూస్ ద్వారా అర్థమైంది అంతా కలబోసి జరిగింది వివరించింది సుదీప. మందాకిని విభ్రాంతి చెందింది.

"అంటే...!"

"అంటే ఏముంది. సాదూభాయ్ ఒంట్లో చేరిన దయ్యం వెళ్ళి చచ్చిన చింపాంజీని పట్టుకుంది. మిగిలిన పని అది పూర్తిచేసి డ్రగ్ మాఫియా సామ్రాజ్యాన్ని కూల్చేసింది"

ఇదంతా అదృష్టం

పరిశ్రమలోకి వచ్చీరాగానే హ్యాట్రిక్ కొట్టేసి, మెరుపులు వెదజల్లిన మెహరీన్ కౌర్ కిట్టీలో ఏకంగా నాలుగు ప్రాజెక్టులు ఉన్నాయి. ఇటువంటి ఎగ్జయిటింగ్ ప్రాజెక్టుల అవకాశం రావడం తన అదృష్టం అంటూ అదేపనిగా ఆనందపడుతున్నది.

"నాపట్ల నమ్మకం ఉంచిన చిత్ర నిర్మాతలకు నేను కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఈ ప్రాజెక్టులు నా బాధ్యతను, నా ఫోకస్‌ను మరింతగా పెంచాయి. చాలా హార్డ్‌వర్క్ చేస్తున్నాను. అనుభవంగల ఫిల్మ్ మేకర్లు, సహనటులతో కలిసి పనిచేస్తూండడం నాకు అనేక విధాలుగా ప్రయోజనకరంగా వుంది. ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నా" అని తెలిపింది.



"కాని...!"

"కాని ఏమిటే మొద్దు. నువ్వు చెప్పిందే నిజం. మర్చిపోయావా? మనింటికి రావటానికి ముందే చిరుతపులి దాడిలో సాదూభాయ్ చనిపోయాడు.

ఆ చిరుత కూడా చచ్చిన నాలుగుగంటల తర్వాత బ్రతికిందని దీనారామ్ చెప్పాడు. అందర్నీ చంపి చిరుత మరణించింది కాని సాదూభాయ్ బ్రతికి ఢిల్లీ వచ్చాడు. మిగిలింది నీకు తెలుసు.

నువ్వు తమాషాకి చెప్పినా అదే నిజమనిపిస్తోంది. ఎవరో సాదూభాయ్ లోపలికి పరకాయ ప్రవేశం చేసి ఇక్కడికొచ్చాడు. ఇక్కడినుంచి అమెరికా వెళ్ళాడు. మాఫియా సామ్రాజ్యాన్ని కూల్చేశాడు. ప్రస్తుతం వాడు చింపాంజీ అవతారంలో ఉన్నాడు. వాడు ఎవడై ఉంటాడు?"

"ఎవడో ఎందుకవుతాడు మేడమ్. ఆలోచించండి. నాకయితే వీళ్ళు మధ్యప్రదేశ్ అడవిలోకెళ్ళింది ఎవరో సైంటిస్ట్‌ను చంపటానికి. దీనారామే ఈ విషయం చెప్పాడు. కాబట్టి ఆ సైంటిస్టే ఇదంతా చేశాడన్పిస్తోంది. ఆ సైంటిస్ట్ పేరేందో గుర్తులేదన్నాడు వాడు"

"ఊహు. అతను సైంటిస్టయితే ఇలాంటి మంత్ర విద్యలు వాళ్ళకి తెలీదు. వాడు కాదనుకుంటాను"

"కావచ్చు. అవునో కాదో చూద్దాం... వస్తానంటూ మీకు మాటిచ్చాడుగా. ఓ రోజున తప్పక వస్తాడు. అప్పుడు చూద్దాం"

"ఎలా వస్తాడు. సాదూభాయ్ అంతరించాడు. ఇక ఏ రూపంలో ఎలా వస్తాడో ఎవరికి తెలుసు. నా వయసును యవ్వనాన్ని పండించి ప్రేమను మనసారా పంచిన ఆ గడసరి మగాడు ఎవడో చూడాలని నాకూ చాలా ఆశగా ఉందే. కాని రాడు.

వస్తాడన్న నమ్మకం పోతోంది. కాని వాడ్నోసారి చూడాలని మనసు ఎదురుతెన్నులు చూస్తోంది..." అంటూ చెమర్చిన కళ్ళు తుడుచుకుంది సుదీప.

"మీరు నమ్మకంతో ఉండండి మేడమ్. గొప్పవాళ్ళెప్పుడూ ఇచ్చిన మాట తప్పరు. ఓరోజు ఖచ్చితంగా వస్తాడు. దిగులక్కర్లేదు. అదలా ఉంచండి. మీరు వేసిన నష్టపరిహారం దావా మాటేమిటి? ఆలోచించారా. అమెరికాలో చనిపోయిన సాదూభాయ్, ఇక్కడ శవంగా అదృశ్యమైన సాదూభాయ్ ఇద్దరూ ఒక్కరే అని పోలీసులాధారాలు సేకరిస్తే అప్పుడు మన కేసు వీగిపోతుంది గదా" అంటూ సందేహపడింది మందాకిని.

"నిజమే. కాని ఆధారాలు దొరకాలిగదా" అని అంది ధీమాగా సుదీప.

"దొరకవా?"

"ఊహు. ఛాన్సే లేదు. ఎందుకంటే అమెరికాలో చింపాంజీ తాలూకు ఫోటోలు వీడియో క్లిప్పింగ్స్ లభించాయిగాని సాదూభాయ్‌కి సంబంధించి ఒక్క ఫోటో కూడా వాళ్ళకి దొరకలేదు. అతడి పాస్‌పోర్టూ దొరకలేదు. సాదూభాయ్ ఇండియా నుంచి వచ్చాడనిమాత్రమే తెలుసు. ఫోటోగాని, పాస్‌పోర్ట్‌గాని లేకుండా ఏ సాదూభాయ్ అని వెదుకుతారు.

పైగా పాస్‌పోర్ట్ సాదూభాయ్ పేరుమీద ఉంది.



కామెడీ పండించా

తెలుగులో రెండో సినిమా 'రాజుగాడు' చేశాక, ఇంత వినోదాత్మక చిత్రంలో నటించగలనా? లేదా? అన్న సంశయాలన్నీ తీరిపోయాయంటున్నది అమీరా దస్తర్. "మాస్ కామెడీ చేయాలన్న నా కోరిక తీరింది. ఇది కొంచెం కష్టమే. ఒకవేళ సరిగ్గా చెయ్యలేకపోతానేమోనని భయపడ్డాను.

కాని, బాగా చెయ్యగలిగాను. సంప్రదాయ వస్త్రధారణ సౌకర్యంగా ఉంది. చీరలోనూ బాగా డ్యాన్స్ చెయ్యవచ్చని అర్థం అయింది. సహజంగా వుండాలన్న దర్శకుడి సూచనమేరకు నా స్వంత స్టయిల్ అనుసరించాను. ఎక్స్‌ప్రెషన్‌ల విషయంలో చాలా మెరుగయ్యా" అంటూ సందడిగా చెప్పింది.

కాబట్టి అమెరికా వార్తల్ని ఇక్కడి పోలీసులు సేకరించినా అవి ఎవిడెన్స్‌గా కోర్టులో చెల్లవు.

మన కేసు వీగిపోయే ఛాన్సే లేదు. కాదంటే ఒక విషయంలో నాకు దిగులుగా ఉంది"

"దిగులా... దేనికి మేడమ్?"

"ఇప్పుడు నేనేం చేయాలి?"

"ఇప్పటికే లేటయింది. వెళ్ళి స్నానం చేయాలి"

"ఒసే మొద్దు. నా దిగులు స్నానంగురించి కాదే. మరణించిన సాదూభాయ్‌కి నేను కర్మకాండలు జరిపించాలా వద్దా అని"

"ఎలా జరిపిస్తారు. నాకు తెలీకడుగుతున్నా"

"అదికాదే..."

"ఏదికాదు? రెండుమాసాలముందే ఆయన మధ్యప్రదేశ్ అడవిలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఆయన శరీరం ఇప్పుడు ఈ మధ్యే అమెరికాలో నాశనమైంది. శవం కూడా చిక్కలేదని మీరే చెప్పారు.

ఇప్పుడు మనం ఆయన ప్రాణం పోయింది లెక్కలోకి తీసుకోవాలా లేక శరీరం నాశనమైన రోజు లెక్కలోకి తీసుకోవాలా? అలా అనుకున్నా రెంటికీ ఖచ్చితమైన డేటు తెలీదు.

ఆపైన సాదూభాయ్ మీకు తాళికట్టిన భర్తకాదు. భార్యాభర్తల్లా సహజీవనంతో చెలామణి అయ్యారంతే. అలాంటప్పుడు ఏం చెప్పి కర్మకాండలు జరిపిస్తారు? ఏదో చెప్పి ఒకవేళ జరిపించారే అనుకోండి.

మనకేదో తెలుసని పోలీసులు మళ్ళీ మన ఇంటి చుట్టూ తిరుగుతారు. ఇదంతా అవసరమా. నాకు తెలిసి మీరిలాంటివేమీ జరిపించక్కర్లేదు.

ఎప్పటిలా మీరు హ్యాపీగా ఉంటే చాలు. కావాలంటే సాదూభాయ్ లైఫ్‌సైజ్ ఫోటో ఒకటి దండవేసి హాల్లో పెట్టించండి. ఎప్పుడూ వెలిగేలా ఓ కరెంట్ బల్బ్ సెట్‌చేయించి రోజూ దండం పెట్టుకోండి. అదిచాలు" అంటూ సలహా ఇచ్చింది మందాకిని.

మరుసటిరోజు ఉదయమే గాల్లోకి లేచింది కార్తికేయ పరకాయ ప్రవేశం చేసిన కొంగ. జ్వాలాముఖిచుట్టూ తక్కువ ఎత్తులో ఎగురుతూ రహస్య బిలమార్గంకోసం అన్వేషణ ఆరంభించింది.

కొండచుట్టూ దిగువ నుంచి కొంత ఎత్తువరకు ప్రదక్షిణలు చేస్తూనే ఉంది. ఎన్నిమార్లు చుట్టివచ్చినా చెట్టు చేమలు తప్ప నరకద్వారంగా పిలిచే బిల మార్గం జాడమాత్రం తెలీలేదు.

అలాగని ఇది మసాయా అగ్నిపర్వతం కాదనుకోడానికి లేదు. ఎందుకంటే కొండను చుట్టి నాలుగు దిక్కులా నికరాగ్వా ప్రభుత్వం టూరిజం డిపార్ట్‌మెంట్ వాళ్ళు టూరిస్ట్‌ల కోసం ఉంచిన తాటికాయంత అక్షరాలతో హోర్డింగ్‌లు తను చూశాడు. 'ది బిగ్గెస్ట్ వరల్డ్ ఫేమస్ ఓల్కనో మసాయా' అంటూ.

అంతేకాదు, అగ్నిపర్వతం దాపులకు ఎవరూ పోవద్దని అది ప్రమాదమని హెచ్చరిక కూడా దిగువన రాశారు. నికరాగ్వా వచ్చే టూరిస్ట్‌లు తప్పకుండా మసాయా ఓల్కనోను సందర్శిస్తారు. ఇవాళ కూడా రెండు టూరిస్ట్ బస్‌లను తను చూశాడు.

ఒక అడ్రస్ కావాలంటే స్థానికంగా ఉండే సాటి మనిషిని అడుగుతాం. ఇక్కడ స్థానికులకు రహస్య బిలమార్గం ఎక్కడుందో తెలిసేవుంటుంది. కాని అడగలేడు. తను ఇప్పుడు బక రూపుడు. కొంగలు మాట్లాడలేవు. సాటి కొంగల భాష తనకు తెలీదు.

విచిత్రమైన పరిస్థితి.

తనే ఎలాగైనా బిలమార్గాన్ని వెదికి పట్టుకోవాలి. ఆ రోజు సాధ్యంకాలేదు.

మరునాడు వృథా అయింది.

ఇంకా ఉంది



పర్సనల్ ఎజెండా

కైరా అద్వాని

భారీ చిత్రంలో, ఏకంగా ప్రిన్స్ మహేష్‌బాబు సరసన అవకాశాన్ని దక్కించుకుని, బావుందన్న ప్రశంసలు అందుకుంటున్నది కైరా అద్వాని. ఆమె వ్యక్తిగతఅభిప్రాయాలు, విశేషాలు:

▸ **హిందీనుంచి తెలుగు సినిమాకు రావడం :** రెండు విభిన్న పరిశ్రమల్లో పనిచేస్తున్నానన్న భావమే రావడంలేదు. తెలుగు సినిమాలో నేను కలసి పని చేసిన వారంతా క్రియేటివ్ టెక్నీషియన్లే. పాన్-ఇండియా వంటి అనుభవం అన్నమాట

▸ **ఇప్పటిదాకా నా ప్రయాణం :** చాలా ఎగ్జయిటింగ్‌గావుంది. స్థిరంగా పైకి సాగుతున్నది. ప్రతి అనుభవాన్ని ఆస్వాదిస్తున్నాను. ముందుముందు మరింత మంచి కోసం ముందుకు సాగుతున్నా


▸ **క్లాసిక్ రీమేక్‌లో నటించాల్సి వస్తే :** 'దేవదాస్'వంటి చిత్రం రీమేక్‌లో సంజయ్ లీలా భన్సాలీతో కలసి పనిచేయాలని కోరుకుంటున్నాను. పారొ లేదా చంద్రముఖి పాత్రలు పోషించాలనుకుంటున్నా. ఆ రెండూ అద్భుతాలే

▸ **నా దృష్టిలో స్టయిల్ అంటే :** నాకు నచ్చేది, నేను మెచ్చేదే స్టయిల్. ఎవరినో ఇంప్రెస్ చేయాలన్న ఉద్దేశ్యంతో డ్రెస్ చేసుకునే తత్వం కాదు నాది. డ్రెస్సింగ్‌ను ఎంజాయ్‌చేస్తాను కాని, అది ఎంత బావుంటుంది, ఎంత మోతాదులో వుంటుంది లాంటి అంచనాలు వెయ్యను. ఫ్యాషన్‌పై ఫోకస్ పెరిగి కొన్ని ప్రత్యేక విషయాలపై దృష్టిసారిస్తున్నారు. అదంతా కాలంతో పాటు సాగే ఒక పోకడ

▸ **నా స్కిన్ కేర్ రొటీన్ :** మంచి ఆహారం తినటం అనేది అత్యంత ముఖ్యం. దాంతో పాటు శారీరక శ్రమ వుండాలి

▸ **నా వెంట వుండే సౌందర్య ఉత్పత్తులు :** సన్ బ్లాక్, మాయిశ్చరైజర్, క్విక్-ఫిక్స్ కన్సీలర్, మస్కారా

▸ **సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ అంబాసిడర్‌గా :** ఇంటినుంచి బయటకు వెళ్ళే ముందు సన్‌బ్లాక్‌తో మాయిశ్చరైజ్ చేసుకుంటా. మేకప్‌ను తొలగించుకోవడం, పడుకునే ముందు ముఖాన్ని వాష్ చేసుకోవడం ఖచ్చితంగా చేస్తుంటా



Courtesy : FEMINA

పెళ్ళయి ఓ కప్పుకిందకు వచ్చేసిన తర్వాత అన్నీ స్వీట్ నథింగ్స్ ఉంటాయనుకోకూడదు. చర్చలు, వాదాలు, తగాదాలు, అలకలు వంటివన్నీ సంసారంలో కలగలసిపోతాయి. సంతోషాల నడుమ ఈ గిల్లికజ్జాల కలుక్కులు తప్పవు.

విభేదాలు రావడం, సర్దుకోవడం ష.రా. మామూలే. అయితే చీటికీమాటికీ ఇద్దరి మధ్య గొడవలు వస్తే మాత్రం ఆలోచించాల్సిందే. ఇద్దరూ సరైన అవగాహనతో సర్దుబాట్లు చేసుకున్నప్పుడు మాత్రమే సంసార నౌక సజావుగా సాగుతుంది.

ఇంటి పనులు, రొమాన్స్, సెక్స్, డబ్బు, ఇరుపక్షాల పెద్దలకుఇచ్చే ప్రాధాన్యంవంటివే సాధారణంగా ఇద్దరి మధ్య వాగ్వాదాలకు కారణం అవుతుంటాయి.

చాలా జంటల నడుమ తలెత్తే విభేదాలకు కారణాలివే. పెళ్ళయ్యాక ఇద్దరూ కూడా 'నా' అన్న దృక్పథంనుంచి 'మా' 'మన' అన్న వైఖరికి మారాల్సి వుంటుంది.అప్పుడే వారి నడుమ మానసిక, భావోద్రేక అనుబంధం దృఢపడుతుంది. ప్రతి జంట సాధారణంగా ఎదుర్కొనే కారణాలను తెలుసుకుని, పరిష్కారాలూ ఆలోచించాల్సివుంటుంది.

సరైన సమయం

ఆఖరి నిమిషంలో అనుకున్న ప్రణాళికలను రద్దుచేసుకోవడం, స్నేహితుల ప్రాధాన్యాన్ని భాగస్వామికంటే వెనుకే ఉంచడం ఏ జంటపై అయినా తప్పనిసరిగా వ్యతిరేక ప్రభావాన్ని చూపుతాయి. ఈ సమస్యను ఎవరైతే ఎదుర్కొంటుంటారో వాళ్ళు రెండోవారికి విషయాన్ని మనస్సు విప్పి చెప్పాలి.

సమస్యను రెండోవారు అర్థంచేసుకున్నప్పుడే పరిష్కారం చిక్కుతుంది.

జీవిత భాగస్వామి ప్రణాళికను ప్రతిసారీ తోసిరాజనడం తప్పు. ఎదుటివారిని పట్టించుకోకుండా స్వంతంగా గడపడం, స్నేహితులకు ఎక్కువ సమయాన్ని కేటాయించడం వంటి అంశాలు సంసారంలో వాగ్వివాదాలకు కారణం అవుతుంటుంది.

ఈ అంశాలను అర్థంచేసుకుని నడుచుకుంటే సమస్య పరిష్కారం అయినట్లే.

తల్లిదండ్రుల విషయాలు

ఒకరు రెండోవారి తల్లిదండ్రులగురించి ఆరోపిస్తున్నట్లుగా మాట్లాడడం గొడవలకు నాంది అవుతుంది. భార్య లేదా భర్త రెండోవారి అమ్మా నాన్నల గురించి వ్యతిరేకంగా మాట్లాడడం చాలాసార్లు దంపతుల నడుమ వివాదాలకు దారితీస్తుంటుంది.

ఇటువంటి వ్యతిరేకతవల్ల ఒకరిపట్ల ఒకరికి సాఫ్ట్ కార్నర్ నశిస్తుంది.

ఒకరి తల్లిదండ్రులను ఇంకొకరు గౌరవిస్తుండడం వల్ల భార్యాభర్తలనడుమ మంచి అవగాహనా పూరితమైన వాతావరణం ఏర్పడుతుంది.

వస్తువుల పొందిక

చాలామంది నడుమ అసంతృప్తి కలగడానికి కారణం వస్తువులను సర్దుకునే తీరు. ఒకరు చక్కగా సర్దుకుంటే, రెండోవారు చిందరవందరగా పడేస్తుంటే చిలికి చిలికి గాలివాన అవుతుంది.

షూస్ అక్కడే వదిలేశావేం, టాయ్‌లెట్ సీట్ కిందకు వేయలేదేం, అలారంలో సౌండ్లేంటి, టూత్ పేస్ట్ మధ్యనుంచి నొక్కావేం,

తడి టవల్ బెడ్‌పైన వేశావేంలాంటి ప్రశ్నల అసంతృప్తుల జాబితాకు అంతుండదు. పెళ్ళయిన కొత్తలో అన్నీ బాగానే వుంటాయి. రానురాను ఇటువంటి చిన్నచిన్న విషయాలే చికాకుపెడుతుంటాయి.

ఒక ఇంట్లో కలసి ఉంటున్నప్పుడు కొన్ని వ్యక్తిగత అంశాల విషయంలో జాగ్రత్త వహిస్తూ, ఎదుటివారిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

రెండోవారి ప్రవర్తన ప్రభావం బాంధవ్యంపై బాగా వుంటుందని గ్రహించాలి.

పని భారం

భార్యాభర్తల నడుమ తరచూ కీచులాటలకు గురయ్యే మరో విషయం పని.

ఇంటిపనిలో ఒకరు అస్సలు జోక్యం చేసుకోకపోతే రెండోవారికి కోపం వచ్చేస్తుంటుంది.

అవసరాన్ని, సమయాన్నిబట్టి ఇద్దరూ తప్పనిసరిగా ఇంటిపనుల బాధ్యత తీసుకోవాలి. ఈ విషయంలో సాధింపులు, ఎత్తిపొడుపులకు ఆస్కారం ఎంతమాత్రం ఇవ్వకూడదు.


ఆఫీసు పని

ఈ రోజుల్లో ఉద్యోగాలు తొమ్మిది టు ఐదు అన్నట్లు పరిమితం కావడంలేదు. ఒక్కోసారి జీవితంలో చాలాభాగం ఆఫీసుపనితోనే గడిచిపోతుంటుంది. ఇక్కడ ఫోకస్ చేయాల్సిన విషయం ఇంట్లో ఎంత క్వాలిటీ సమయాన్ని గడుపుతున్నామన్నది.

ఇంట్లో ఉన్నప్పుడు భార్యాభర్తలు పూర్తిగా తమ

కోసం తాము ఉన్న సమయాన్ని వినియోగించుకోవాలి.

ఇంటికి చేరిన తర్వాత కూడా సహోద్యోగులతో ఫోన్లలో ఆఫీసు విషయాలుసుదీర్ఘంగా మాట్లాడు కోవడం, ల్యాప్‌టాప్‌లలో తల దూర్చి ఎవరిపనులు వారు చేసు కోవడం సామాజిక మాధ్యమాల్లో నిమగ్నంకావడం వంటివి భార్యా భర్తల నడుమ దూరాన్ని పెంచు తాయి. అలాగే గొడవలకూ కారణం అవుతాయి.



సాన్నిహిత్యం

ఇంటిమసీ అంటే ఏంటని అడిగితే చాలా జంటలనుంచి శృంగార సాన్నిహిత్యం అన్న సమాధానం వస్తుంది.

కాని, భావోద్రేకసాన్నిహిత్యం, శారీరక సాన్నిహిత్యం కూడా ముఖ్యమని గ్రహించాలి. ఇంటిమసీ ఐడియా ఇద్దరి లోనూ కలవకపోయినప్పుడు కూడా తగాదాలు తలెత్తుతాయి. శృంగారం విషయానికి వస్తే, యాంత్రి కంగా వ్యవహరించకూడదు.ఇందుకు మరింత ఎమో షనల్, శారీరకఇంధనాన్ని సమకూర్చాలి. వీలైనంత ఎక్కువగా మాట్లాడుకుంటూ కనీసం రోజుకు పది నిమిషాలైనా సన్నిహితంగా గడుపుతుంటే దూరాలు తగ్గుతాయి. వాదాలు పరిమితం అవుతాయి.

డబ్బు

చాలా సమస్యలకు, తగాదా లకు సాధారణంగా ఇదే మూలం అవుతుంటుంది. తమకునచ్చిన, కోరిన వాటిపై డబ్బు ఖర్చు చేయడం లేదన్న అలకలు ఉం టుంటాయి.చాలామంది జం టల తగాదాల్లో మనీ మేనేజ్ మెంట్ ప్రధానంగావుంటుంది.

ఈ సమస్యను ఎదుర్కోవడా నికి, తమవ్యక్తిగత అవసరా లనుతీర్చుకోవడంకోసం వేర్వేరు ఎకౌంట్లు అనుసరిస్తే బావుం టుంది. ఇంటి నిర్వహణకోసం జాయింట్ ఎకౌంట్ వుండాలి.

తగాదాలు, విభేదాలు లేక పోతే రోజులు చప్పగా సాగు తాయి. అయితే వాటిని చక్కగా, సరైన మార్గంలో ఎదుర్కొంటే ఆరోగ్యవంతంగా వుంటుంది. తగాదాలను పరస్పర గౌరవంతో ఎదుర్కొంటే అవ మానాలు, అపోహాలు వుండవు. భార్యాభర్తల నడుమ కమ్యూనికేషన్ బావున్నప్పుడు ఆ బంధం దృఢంగా వుంటుంది.

టి.నీలిమ

అనిల్

Never put of till tomorrow
what may be done today

బడులకు వేళాయే


పిల్లలకు స్కూళ్ళు తెరిచే సమయం దగ్గరపడుతున్నది. మొదటిసారిగా వారిని స్కూలుకు పంపుతున్నట్లైతే ఇంట్లోని పెద్దలకూ, వాళ్ళకూకూడా టెన్షన్‌గా ఉంటుంది.

స్కూల్లో పిల్లలు చదువు ఒక్కటే కాకుండా ఇంకా చాలా నేర్చుకుంటారు. ఇతర పిల్లల నుంచి భాష, కొన్ని అసభ్య పదాలు వంటివి కూడా ఆ నేర్చుకోవడంలో భాగం అయిపోతుంటాయి.

స్కూలుకు వెళ్ళి వచ్చే తొలినెల రోజులూ పిల్లల మాటతీరు, నడవడికలను నిశితంగా పరిశీలిస్తుండాలి. దురుసుగా ప్రవర్తిస్తున్నా, ఇతరుల పట్ల అగౌరవంగా వుంటున్నా దాన్ని సరిచేయకపోవడం చాలా తప్పు.

అలాంటిప్రవర్తనను వెంటనే ఖండించకపోతే, దానికి వాళ్ళు అలవాటుపడిపోతారు. పిల్లలు తమ అనుభవాలను చెప్పే స్వేచ్ఛను పెద్దవాళ్ళు ఇస్తుంటే, చాలా సమస్యలు ఇట్టే పరిష్కారం అవుతాయి.

అప్పుడు పిల్లల్ని సక్రమమార్గంలో పెట్టడానికి వీలవుతుంది. *



తగిన జాగ్రత్తలు

చిన్న వయస్సులోనే పిల్లల చేతిలో స్మార్ట్‌ఫోన్ కనపడడం పరిపాటి అయిపోయింది. అయితే ఈ టెక్నాలజీ వల్ల పిల్లలకు ముఖ్యంగా టీనేజర్లకు ప్రమాదాలు పొంచివుంటున్నాయి.

పిల్లల చేతికి ఫోన్ ఇచ్చి, వారినలా వదిలేయడం ఎంతమాత్రం సరైనచర్య కాదు. వారికి ఆన్‌లైన్ సేఫ్టీ గురించి అవగాహన కల్పించాలి.

స్మార్ట్‌ఫోన్, డెస్క్‌టాప్, ల్యాప్‌ట్యాప్ వంటివి ఏవైనాసరే పెద్దవాళ్ళు తప్పనిసరిగా ఓ కన్నేసి ఉంచాలి.

తెలిసీ తెలియకుండా ఏ వెబ్‌సైట్ పడితే దానిని క్లిక్ చేయనివ్వకూడదు. అపరిచితుల విషయంలో తగినన్నిజాగ్రత్తలు చెప్తుండాలి. ఓ పద్ధతి ప్రకారం నెట్ ఓపెన్ చేయడం, క్లోజ్ చేయడం చేస్తుండాలి. ఈ విషయంలో పర్యవేక్షణ తప్పనిసరిగా వుండాలి. *

విభిన్నత కావాలి

తిండి విషయంలో పిల్లలు పెట్టే పేచీలు అంతా ఇంతా కావు.

ఎప్పటికప్పుడు కొత్త కొత్తరుచులు వారికి అందిస్తుంటే ఆహారం పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఐతే సదరు ఆహారంలో విభిన్న పోషకాలు వుండే విధంగా జాగ్రత్త వహించాలి.

ఎప్పుడూ ఒకేరకం పదార్థాలు తింటుంటేశరీరానిక్కావాల్సినపూర్తి పోషకాలు, ఖనిజాలు అందవు. ఫలితంగా శక్తిస్థాయిలు తగ్గుతాయి. మిల్క్, ఫ్రూట్ షేక్‌లు పిల్లలకు బాగా నచ్చుతాయి. కూరగాయలు వారికి ఏదోక రూపంలో ఇస్తుండాలి. *

ఆటబొమ్మలు

పిల్లలకు సంబంధించి చాలా మంది వారి బొమ్మల విషయాన్ని పెద్దగా పట్టించుకోరు.


బొమ్మలు అనేక సూక్ష్మక్రిములకు నివాసంగా ఉంటాయి. కాబట్టి ఆట బొమ్మలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి. ఎలక్ట్రానిక్ బొమ్మల్ని నీటితో శుభ్రం చెయ్యలేరు కనుక తయారీదారులు ఇచ్చే సూచనలకు అనుగుణంగా క్లీన్ చేయాలి.

బ్యాటరీలు తీసేసి, నీట్‌గా తుడవాలి. ప్లాస్టిక్ బొమ్మలయితే నీళ్ళతో కడిగేయవచ్చు. వస్త్రాలతో చేసిన బొమ్మల్ని ఉతికేయవచ్చు. సబ్బు, నీరు వాడుతూ కడిగాక, స్పాంజితో నీట్‌గా తుడిచేయాలి.

బొమ్మల్ని శుభ్రం చేయకుండా రోజూ ఆడుకోవడానికి ఇస్తుంటే వాటిలోని క్రిములు పిల్లల ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. *

బొమ్మల పజిల్

జంతువుల బొమ్మలకు సరైన నీడలు జతచేయండి. *



శబ్దం ఎందుకు వస్తుంది

విద్యుత్ బల్బు పగిలినప్పుడు టప్‌మని శబ్దం వస్తుంది. ఎందుకు?

మామూలుగా బెలూన్, సైకిల్ ట్యూబ్ వంటివి ఏవైనా పగిలినప్పుడు వాటిలోని గాలి హఠాత్తుగా, ఒత్తిడితో బయటకు రావటంవల్ల టపాకాయ పేలినట్లు శబ్దం వస్తుంది.

అయితే, ఎలక్ట్రిక్ బల్బులో గాలి ఉండదు. అది పగిలినప్పుడు దాని చుట్టూ వుండే గాలి చాలా వేగంగా ఒక్కసారిగా దాని దిశగా కదులుతుంది. దీనివల్ల పెద్దశబ్దం వస్తుంది. ఒకవేళ అది శూన్యంలో పగిలితే, ఎటువంటి శబ్దమూ రాదు. *

డ్రై క్లీనింగ్ ఎలా చేస్తారు?

ఖరీదయిన, రంగుపోయే, ఉతకడానికి వీలుకాని దుస్తులను డ్రైక్లీనింగ్‌కు ఇస్తుంటారు.

నీటిబదులు ద్రావకాలతోదుస్తుల్ని శుభ్రపరచడాన్ని డ్రైక్లీనింగ్ అంటారు. ఇందుకోసం వాడే ద్రావకాలన్నీ క్రూడ్ ఆయిల్ నుంచి ఉత్పత్తి అవుతాయి. వీటిలో పెట్రోలు ముఖ్యమైనది.

'బెంజీన్' కూడా ఉపయోగిస్తారు. ముందుగా దుస్తుల్ని పెట్రోల్‌తో శుభ్రం చేసి, తదుపరి డ్రైక్లీనింగ్ మిషన్‌లో వేస్తారు. దానిలో కార్బన్ టెట్రా క్లోరైడ్, ట్రై క్లోరో ఎథిలిన్ అనే రసాయనాలు కలుపుతారు.

ఓ అరగంట అందులో ఉంచి, తదుపరి శుభ్రమైన ద్రావకంలో ముంచి తీసి, దుస్తుల్ని చుడతారు.

ఇలా చేయడంవల్ల ద్రావకాలన్నీ ఆరిపోతాయి. వేడిగాలిని వదులుతారు. అప్పుడు రసాయనాలన్నీ గాలిలో ఆవిరైపోతాయి. దుస్తులకు రసాయనాల వాసన అంటదు.



సత్యాన్వేషణ

ఎప్పటినుంచో ఉన్నాయి

ఏ వస్తువుని చూసినా దీన్ని ఎవరు తయారుచేశారు? అని ఇలా అడగడం అలవాటైన మనకి మంత్రాలని కూడా ఎవరో కనుక్కున్నారనీ లేదా స్వయంగా సృష్టి చేశారనీ అనుకోవడం సహజంగా అయిపోయింది.

అమెరికాని కొలంబస్ కనుక్కున్నాడంటే అంతకు ముందు అమెరికా లేదని అర్థమా?

ఆ ఉన్నదాన్నే కొలంబస్ స్వయంగా వెళ్ళి చూసి 'ఆ భాగానికి ఆ పేరు పెట్టి వచ్చాడు, ప్రచారంచేశాడు. అలాగే మంత్రాలనేవి ఎప్పటినుండో ఉండనే ఉన్నాయి. ఋషులు తపస్సు చేయగా చేయగా వాళ్ళకి ఇవి విన్పిస్తే, వాటిని మన్+త్ర (మననం చేస్తే రక్షించేవి) అని చెప్పి వాటిని మంత్రాలన్నారు.

కాబట్టి మంత్రాలనేవి ఎవరో చెప్పినవీ సృష్టించ బడినవీ కానే కావు అని గమనించాలి. ❐

ఆయుశ్చ మే!

నిత్యం నమకచమకాలతో శివునికి అభిషేకాన్ని చేస్తే ఆయుష్యం తరగదని అంటారు గదా!

'ఆయుశ్చ మే!' అనే మంత్రంలోని ఈ పదం ఆయుష్యం తరగకుండా ఉండేలా చేస్తుందంటారు కదా! మరి ఈ మంత్రం ఆ రుద్రసూక్తం (నమకచమకాలు) నిజమైయుంటే వ్యక్తులు ఎందుకు చనిపోతున్నారు? అని ప్రశ్నించాడు ఓ భక్తుడు కంచి కామకోటి పరమాచార్యులవారిని వినయపూర్వకంగానే.

'ఆయుశ్చ మే!' అనేదానికి ఆయుష్యం పెరుగుతుందనేది అర్థం కాదు. ఏ వ్యక్తికి ఎంతకాలం జీవించి ఉండే కాలమో, ఆ అంతకాలం పాటు అనాయాసంగా (వ్యాధీ మనోవ్యాధీ)జీవించేతనాన్ని ఆయుష్యం అనే మాట అర్థంగా చెప్తుందన్నారు' స్వాములవారు. మరి జీవించడమంటే రోగం రొష్ఠులతో కాదు గదా! ❐

పురుషసూక్తంలో

చేయబోయే యజ్ఞం ఫలించాలంటే పురుషసూక్తం ఓ రహస్యాన్ని చెప్పింది. యజ్ఞానిక్కావలసిన ఆవు నేతిని వసంత ఋతువులో తేవడం సరిట. **(వసంతో స్యాసీ దాజ్యం)** ఆవులన్నీ సంతానాన్ని కని చక్కని పాలనీ తద్వారా నేతినీ అందించగలవు కాబట్టి.

ఇక సమిథలని గ్రీష్మఋతువులో తెచ్చుకోవాలిట. **(గ్రీష్మ ఇధ్మః)** బాగా ఎండిన కారణంగా వెంటనే తమలోని ఓషధీశక్తిని విడుదల చేయగలవు కాబట్టి. ఇక శరదృతువులో యజ్ఞానిక్కావలసిన మిగిలిన సంబారాలని తెచ్చుకోవాలిట **(శరద్ధవిః)**.

చలీ చిరు వేడిమీ కలిసి ఉండే కారణంగా వస్తువులన్నీ సంపూర్ణతనీ లోటులేనితనాన్నీ కలిగివుంటాయి కాబట్టి. సంప్రదాయం తెలిసినవాళ్ళు ఈ ఋతువుల్లోనే ఆ యా వస్తువులని తెచ్చుకుంటారు.

శ్రీ కామాక్షీదేవి స్తుతి

చింతిత ఫలపరిపోషణ చింతామణిరేవ కాంచి నిలయా మే।
చిరతర సుచరిత సులభాచిత్తం శిశిరయతు చిత్సుధాధారా॥

చింతించినవారి కోరికలను ఫలింపజేసే చింతామణి కాంచీపుర కామాక్షి. సుదీర్ఘసాధనలతో పొందిన సుచరిత్ర గలవారికి సులభప్రసన్న అయిన ఆ తల్లి జ్ఞానానందలహరి నా చిత్తమును చల్లబరుచుగాక! ❐

భగవంతుని పరీక్ష

తాత్యాసతి అనే భక్తురాలు సాయిని ప్రార్థిస్తూ- "ఈ రోజు నీకిష్టమైన భక్ష్యాన్ని చేస్తాను. నువ్వే మా ఇంటికి రావాలి!" అంది.

"తప్పకవస్తాను. 5 గంటలకల్లా సమయానికొస్తాను. అయితే నన్ను కసురుకోకూడ"దన్నాడు సాయి.

"నువ్వు రావడమే మాకు స్వర్గసుఖాన్ని ఇచ్చేదవుతుంటే కసురుకోవడమేమిటి?" అని తాత్యాసతి వెళ్ళిపోయింది.

ఇంటినిండా ఎన్నెన్నో ముగ్గులు, పళ్ళేలనిండా ఎన్నెన్నో పిండివంటలు, ధూపదీప నైవేద్యాలని సిద్ధం చేసి ఆమె ఎదురుచూస్తూఉండిపోయింది.

అయిదు, అయిదున్నర, ఆరు, ఆరున్నర, ఏడు... అయినా రాలేదు సాయి.

ఇంతలో ఓ నల్లకుక్క ఆ పిండివంటల దగ్గరికి రాగానే ఇనుపకమ్మితో విదిలిస్తూ కసురుకుంది తాత్యాసతి. కుక్కని తరిమికొట్టింది.

సాయి రాలేదని బాధపడి మర్నాడు సాయి దగ్గరికి వెళ్ళగానే-"అమ్మా! కసురుకోవద్దని చెప్పానే! ఇనుపకమ్మెని విసరబోయావా?" అని సాయి నవ్వాడు. అదీ భగవంతుని పరీక్షంటే.

భగవంతుడు ఏ రూపంలోనైనా వస్తాడు. ❐

{ భక్తులు తనకిచ్చే కానుకలను చూసి కాదు, వాటి వెనుక ఉన్న భక్తిని భగవంతుడు గ్రహిస్తాడు. }



వాట్సప్ వైద్యం

డ్రాయింగు రూమ్‌లో ఏదో అలికిడి అయితే లోపల నుండి వచ్చాను. ఫ్యాను వేసుకుని సోఫాలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు సన్యాసి రావు. వీడెప్పుడు వచ్చినా ఇదే వరస! ఉరుములేని పిడుగులా ఊడిపడతాడు!

"గుడ్ మార్నింగ్..! ఎంతసేపయింది వచ్చి..?" అంటూ పలకరించాను.

"ఇప్పుడే వచ్చానురా! మాభజగోవిందం మావయ్య, ఈ వీధి చివర్న వుంటున్నాడు కదా! వాళ్ళింటికివెళ్ళి తిరిగివస్తూంటే మీ ఇంటి తలుపులు బార్లా తెరిచి ఉండటం గమనించి లోపలకు వచ్చాను... బై ది బై... నీ ఆరోగ్యం ఎలా ఉంది?" అంటూ చేతిలోని పేపరు మడిచి పక్కన పడేసి నావంక చూశాడు.

"బాగానే ఉంది. మంచి ఎండలో వచ్చావు... కాస్త మజ్జిగ తెస్తా ఉండు!" అంటూ లోనికి వెళ్ళి గ్లాసెడు చల్లని మజ్జిగ తాగేసి, గ్లాసు టీపాయ్ మీద పెడుతూ "మజ్జిగలో ఎన్ని రకాలున్నాయో నీకు తెలుసునా?" అంటూ నా వంక గొర్రెపోతులా ముఖం పెట్టి చూస్తూ అడిగాడు. నా ముఖంలోని అజ్ఞానాన్ని పసిగట్టినట్టు న్నాడు. మళ్ళీ వాడే అన్నాడు-

"పెరుగును చిలికేటప్పుడు కలిపే నీటిశాతాన్ని బట్టి మజ్జిగ అయిదు రకాలు. ముదితము, మిళి తము - ఇవి చిక్కగా ఉంటాయి. అవి వాతరోగా లను తగ్గిస్తాయి. గోళము అనేది వీర్యవృద్ధికి పనికి వస్తుంది. అంటే, మనలాంటివాళ్ళకి..." అంటూ వాడి జోక్‌కి వాడే నవ్వేస్తూ...

"నాలుగో రకం కాలశేయము. ఇది తాగితే అదేదో సబ్బు వాడితే సినీతారల ముఖసౌందర్యం పెరిగి నట్లు చెబుతారు చూడు అలాగే మన చర్మ సౌంద ర్యమూ పెరుగుతుంది.

ఆఖరిదీ, అయిదోదీ షాడభము. దీనిలో ఒక వంతు పెరుగుకి అయిదు వంతుల నీళ్ళు కలు స్తాయి. ఇది తాగితే మూలశంక వ్యాధి తగ్గిపోతుంది. కానీ నువ్వు నాకిచ్చిన మజ్జిగ మాత్రం ఈ అయిదు రకాలకీ చెందదు! ఇది ఆరోరకం!

ఎందుకంటే ఒక వంతు పెరుగులో ఇరవై వంతుల నీళ్ళు పోసేసి చిలికి అందులో అల్లం, పచ్చిమిర్చి, కొత్తిమీర, కరివేపాకు, జీలకర్ర పొడి... ఇంకా నా శార్ధం... నా పిండాకూడు.... అన్నీ తగలేశావు!

దీన్ని 'మజ్జి....గా' అనొచ్చు! దీన్ని తాగితే నీళ్ళ విరేచనాలు, కడుపుమంట పట్టుకుంటాయి. నువ్వు తాగకు! గెస్టులకి ఇవ్వకు! నువ్వు బాధపడతావని ఈవేళ తాగేశాను" అంటూ గ్లాసు పీకాడు. ఇలా ముఖం మీద గుద్దినట్లు చెప్పడం వాడికి అలవాటే! ఇద్దరం ఒకే కంపెనీలో పాతికేళ్ళు కలిసి పనిచేశాం. పదవీ విరమణ తర్వాత నేను గేయాలు, పద్యాలు గీక్కుంటూ ఇంటిపట్టునే కాలం వెళ్ళదీస్తున్నాను. కానీ వాడు మాత్రం వేసవిలో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటుచేయుటం, స్కూలు పిల్లలకి తెల్లకాగితాల పుస్తకాలు పంచటంలాంటి సంఘసేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ తోక పేపర్లలో ఫోటోలు వేయించుకుంటున్నాడు.

"ప్రస్తుతం ఏం చేస్తున్నావ్? కొత్త ప్రాజెక్టు అదే, కొత్త సేవాకార్యక్రమం ఏదయినా మొదలు పెట్టావా?" అంటూ అడిగాను.

"నీకు తెలీదా? గత మూడు నెలలుగా వాట్సప్ వైద్యం చేస్తున్నాను. 'రెస్పాన్సు' బ్రహ్మాండంగా ఉంది!" అన్నాడు సన్యాసిరావు.

"వాట్సప్ వైద్యమా? అదేమిటి? ఏమయినా మూలికా వైద్యమా?" అంటూ అడిగాను. ఫెళ్ళుమంటూ నవ్వాడు వాడు! ఎదుటి వాణ్ణి హీనపరి చేసి, గాలి తీసెయ్యటానికి అలా ఫెళ్ళుమంటూ నవ్వటం వాడికో ఆయుధంలాంటిది.

'నువ్వొట్టి బుర్ర తక్కువ వెధవ్వి' అని ఆ నవ్వుతో చెప్పకనే చెబుతాడు వాడు.

"వాట్సప్ వైద్యం అంటే తెలీదా? సరే, నీది స్మార్ట్ ఫోనేనా?" అంటూ అడిగాడు.

నాకు సెల్‌ఫోన్ పరిజ్ఞానం అంతగాలేదు. అంతకు ముందు ఆధార్ కార్డంత సైజు ఫోను జేబులో పెట్టు కునేవాణ్ణి. ఈ మధ్యనే మా అబ్బాయి అరచేతిసైజులో ఉండే ఓ చెక్కముక్కలాంటి ఫోను పట్టుకొచ్చి నాకిచ్చి

ద్విభాష్యం రాజేశ్వరరావు

అందులో కాల్‌చేయటం, రిసీవ్‌చేసుకోవటంనేర్పాడు. ఇతర విన్యాసాలు ఏవీ నాకు చేతకావు!

"నా ఫోను స్మార్ట్ కంపెనీది కాదనుకుంటాను. ఏదో దక్షిణ కొరియా కంపెనీది" అని కాస్త సిగ్గు పడుతూ చెప్పాను.

మళ్ళీ ఫెళ్ళుమని నవ్వాడు సన్యాసిరావు.

"స్మార్ట్ అంటూ కంపెనీ ఏదీ లేదు. ఫోన్ కుండే ఫీచర్స్‌ని బట్టి దాన్ని స్మార్ట్ ఫోన్ అంటారు. ఏదీ, నీ ఫోను ఇటివ్వు!" అంటూ అడిగాడు. అల్మారాలోని ఫోను తీసి వాడికి అందించాను.వాడు దాన్ని అందు కుంటూనే, "ఇది ఏండ్రోయిడ్ ఫోనే!" అంటూ వేలితో స్క్రీను మీద గబగబా పులిమాడు!

"ఏండ్రోయిడ్ ఫోన్‌అంటేతెలుసా? అదీ తెలీదా?" అంటూఅడిగి మళ్ళీ ఫెళ్ళుమనినవ్వుతాడేమోననిభయ మేసింది నాకు, కానీ అదృష్టంకొద్దీ అడగలేదు.

"...ఈ ఫోనులో వాట్సప్ పెట్టుకోవచ్చు! నెట్ కనెక్షన్ తీసుకుంటే చాలు! వాట్సప్ మన ఫోనులో ఉండే ప్రపంచం మన అరచేతిలో ఉన్నట్టే!

ఓ రకంగా అది నల్లమందులాంటిదే గానీ రుచి మరిగితే మరి వదలవు! నీకు వాట్సప్ ఉండి, నాలాంటి స్నేహితుడు ఉంటే, ఓ స్పెషలిస్టు డాక్టరు నీ ఇంట్లో ఉన్నట్టే!" అన్నాడు హుషారుగా.

"మరి సెల్‌ఫోన్ వాడకంవల్ల 'రేడియేషన్ సోకటం' లాంటి సైడ్ ఎఫెక్టులు చాలా ఉంటాయని పేపర్లలో రాస్తున్నారు కదా!" అన్నాను ధైర్యం కూడదీసుకుంటూ. వాడిమాటల్ని ఖండించడానికి నాకు భయమే! ఎందుకంటే, వాడు మెడకేస్తే కాలికి, కాలికేస్తేమెడకి మార్చిబిగించేరకమనినాకుతెలుసు.

"సైడు ఎఫెక్టు! హు! ఈ మాట ప్రతివాడికీ బాగా అలవాటయిపోయింది. నేను వాట్సప్ వైద్యం ప్రారంభించాక ఈ సైడు ఎఫెక్టుల గురించి వివరణ ఇచ్చుకోలేక చచ్చిపోతున్నాను.

దగ్గు విపరీతంగా వస్తోందని ఎవడో అడిగితే 'ఓ కరక్కాయ పేడు బుగ్గన పెట్టుకో' అంటూ వాట్సప్‌లో సలహా ఇస్తాను. 'దాని వల్ల సైడ్ ఎఫెక్ట్‌లు ఉంటాయా?'అంటూ వెంటనే మెసేజ్ వచ్చేస్తుంది.

ఒక్క విషయం చెబుతాను విను! విశ్వవ్యాప్తంగా మానవుల్ని ఏకం చేయగల సాధనం కేవలం స్మార్ట్ ఫోన్ మాత్రమే! దాని సైడు ఎఫెక్టుల గురించి ఎందుకు పీక్కుంటావు? 'ప్రపంచ కార్మికులారా ఏకంకండు!' అనే నినాదం పాతదయిపోయింది.

'ప్రపంచ స్మార్ట్ ఫోన్ వినియోగదారులారా ఏకం కండు' అనేదే నేటి తాజానినాదం!" అంటూ ఆవేశంగా మాట్లాడుతూ ఉంటే 'ఫోను ఎత్తకురోయ్! నీ బుర్ర తినేస్తుంది!' అంటూ అదేపనిగా వినిపించడం మొదలయింది.





ఎందరి ప్రేమనో పొందే అవకాశం వదులుకుని, ఒక్కమగాడి ప్రేమకు పరిమితమయ్యే పెళ్ళి అంటే నాకిష్టంలేదు. -మల్లికా షెరావత్, నటి

గాభరాగా అటూ ఇటూ చూశాను! "గాభరాపడకు! నా ఫోనే! మా ఆవిడ కాల్‌చేస్తే తెలియటానికి ఆ రింగ్ టోన్ పెట్టుకున్నాను..." అంటూ ఫోను పీకనొక్కేసి, జేబులో పెట్టుకుంటూ మళ్ళీ ప్రారంభించాడు.

"వాట్సప్ వైద్యం కేవలం ఉచిత సేవ! రోగులు వాళ్ళ బాధల్ని నాకు వాట్సప్ ద్వారా తెలియజేస్తే, అవి తగ్గటానికి సూచనలు, అవసరాన్నిబట్టి వాడవలసిన మందులు నేను తిరిగి వాట్సప్‌లో పెడతాను. ఈ గ్రూపు పేరు 'వాట్సప్ వైద్యం!'

దీనికి తోడు నాకు ఫేస్‌బుక్ కూడా ఉంది! రెండింటిలో కలిపి నా పేషెంట్లు అయిదువందల యాభై మంది ఉన్నారు" అన్నాడు ఒకింత గర్వంగా.

"రోగిని చూడకుండా ఎక్కడో ఉన్నవాడికి వైద్య సలహా ఎలా చెబుతావు?" అడిగాను.

"నువ్వింకా బిసిలో ఉన్నావురా! అమెరికా కంపెనీ వాళ్ళ ఎకౌంట్లలోనిఅవకతవకలన్నీ, ఇక్కడ మనదేశంలోని ఆడిటరమ్మలు, వంటింట్లో కంప్యూటరు పెట్టుకుని వండి వార్చి వాళ్ళకి పంపటం లేదా?" అంటూ నా వంక చూస్తూ పెదవి విరిచాడు.

వంట భలేగా వచ్చు

వంట చేయడం అంటే, అందునా కొత్త కొత్త పదార్థాల ప్రయోగాలంటే 'అందాల రాక్షసి' లావణ్య త్రిపాఠికి అమిత ఇష్టం అట.

'నేను బాగా తిండిపోతును. ఎక్కడైనా నచ్చిన భోజనం తింటే దాని పేరేంటి, ఎలా తయారుచేస్తారు వంటి వివరాలన్నీ తెలుసుకుంటుంటా. షూటింగ్ లేనప్పుడు ప్రయోగాలు చేస్తాను. వంట చేయడం నాకు బాగా వచ్చు. ఏది తినాలనిపిస్తే దాన్ని తయారుచేసుకుని తినేస్తుంటా. స్వీట్స్ బాగా తయారుచేస్తాను" అంటూ వివరించింది.

తరువాత దీర్ఘంగా ఊపిరి తీసుకుని "... ఈవేళ ఓ స్పెషలిస్టు డాక్టరు దగ్గరకు వెళ్ళాలంటే కనీసం నాలుగైదువందలు వాళ్ళ టేబిలుమీద పెట్టాలి! ఒక సారి కాదు, వెళ్ళిన ప్రతిసారీ!

'ముద్ద ముద్దనీ బిస్మిల్లా' అన్నట్లు ఆ ఫీజు ఇవ్వాల్సిందే! సామాన్యుడికి అదెంత ఖరీదయిన వ్యవహారమో ఆలోచించావా? ప్రతిసారీ, బిళ్ళ కుడుముల్లా ఆ వందల్ని తీసేసుకుని వాళ్ళు రాసేదేమిటి?

అష్టాక్షరీ మంత్రం! అంటే, ఆంగ్లంలో ఎనిమిది అక్షరాలు CONTINUE అని!! అవే మందులు వాడి మళ్ళా నెల్లాళ్ళ తర్వాత రమ్మని!

అందుకనే సామాన్యునికి డబ్బు మిగిల్చి, మేలు చేసే ఈ వాట్సప్‌వైద్యం ఆరంభించాను" అని మాట్లాడటం ఆపాడు.

"నువ్వు డాక్టర్‌వి కావు! ఇంజనీరింగ్ డిప్లొమాతో ఉద్యోగం చేసి రిటైరయ్యావు!

ఇలా వైద్య సలహాలు మందులు చెప్పటం మంచిది కాదేమో చూసుకో!" అన్నాను.

వాడు మళ్ళీ ఫెళ్ళుమని నవ్వాడు! "నేను డాక్టర్ని కాకపోవచ్చు కానీ నా వెనకాల పెద్ద 'టీమ్ ఆఫ్ డాక్టర్స్' వున్నారు.

కుంఫిణీవాడు ఏమన్నాడు? 'క్రానిక్ పేషెంట్ ఈజ్ ఎ బెటర్ డాక్టర్!' అన్నాడు.

అంటే 'దీర్ఘరోగి వైద్యునికంటే మెరుగ్గా చికిత్స అందించగలడు' అని కదా దానిఅర్థం! అదే సూత్రం ఆధారంగా నా వాట్సప్ వైద్యం నడుపుతున్నాను.

మా పెద్దన్న బి.పి పేషెంటు. 'అగ్నిహోత్రావధాన్లు ఇన్‌ఫేంట్స్' వాడు! బి.పి తగ్గాలంటే ఉప్పు తగ్గించాలని వాడి సలహా చెబుతాడు! మా రెండో అన్నయ్య సుగర్ ఫ్యాక్టరీ! స్వీట్లు మానడు!

'ఇన్సులిన్' ఎడాపెడా పొడిచేసుకుంటూ స్వీట్లు తినేస్తాడు. డయాబెటిస్ రోగులకి చికిత్స అందించడానికి వాడి సలహా తీసుకుంటాను.

మా పెద్ద వదిన సయాటికా పేషెంటు! అంటే కాలు పీకుడు రోగం! ఇక మా రెండో వదిన సంగతి చెప్పనక్కర్లేదు! పుట్టటమే నడుంనొప్పితో పుట్టినట్లుగా ఉంటుంది ఆవిడ. అలాంటి వాళ్ళందరినీ కేరళా వైద్యానికి రిఫర్ చేస్తాను.



నిజాయితీ కావాలి

తనకు నచ్చే మగవాడు కేవలం నవ్వించడమే కాకుండా నిజాయితీగలవాడై వుండాలంటు న్నది నిధి అగర్వాల్.

"సాధారణంగా నవ్వించే అబ్బాయిలకు అమ్మా యిలు సులువుగా ఆకర్షితులవుతుంటారు. కాని, అబ్బాయిలు నవ్వించినంతమాత్రాన సరిపోదు. నిజాయితీగా వుండాలి. స్థిరంగా వుంటూ ప్రేమించ గలగాలి" అంటున్న ఈ కన్నడ బ్యూటీ తెలుగు 'సవ్యసాచి'కి సిద్ధం అవుతున్నది.

ఇంక మా రెండో మేనల్లుడు, కంప్యూటర్స్‌కోర్సుతో ఎమ్.టెక్ చేసి, సరైన ఉద్యోగం దొరకలేదని మెంటల్ అయిపోయాడు!

వాళ్ళ పక్కింటి పెంపుడు పిల్లిని గొయ్యి తీసి పెరట్లో పాతిపెట్టాడు! పాపపరిహారార్థం అక్కడ ఓ తులసి మొక్క వేసి పెంచుతున్నాడు!

వాడిని సైకియాట్రిస్ట్ దగ్గరకు నెలనెలా నేనే తీసుకువెళ్ళాలి. దాంతో ఆ 'లైన్ ఆఫ్ ట్రీట్‌మెంట్' అంతా నాకు కరతలామలకమయిపోయింది.

మా పెద్ద చెల్లి 'సోమ్నాంబులిస్ట్' అంటే రాత్రి నిద్రలో లేచి తనకు తెలియకుండానే ఎక్కడికో నడిచి వెళ్ళిపోతుంది. మా బావ దాన్ని వెదుకుతూ రాత్రంతా తిరిగేవాడు. అందుకని దానికి నులకతాడు వైద్యం చెయ్యమని సలహా ఇచ్చాను.

నిద్రపట్టగానే దాన్ని తాడుతో మంచానికికట్టేస్తాం, మళ్ళీ పొద్దుటే విప్పటం!

ఇది చాలా చవక వైద్యం! పది రూపాయల చేంతాడు చాలు!!

మా ఆవిడ 'అల్సరు పేషెంటు' అయినా కొరివికారంలో నాలుగు అన్నం మెతుకులు కలుపుకుని, అందులో ఆవకాయ నంచుకుని తింటుంది!

దానికి వాడుతున్న అరకు మాత్రలూ అల్సర్ రోగులకి సజెక్టు చేస్తున్నాను. ఇలా రకరకాల క్రానిక్ పేషెంట్ల సహాయంతో ఈ గ్రూపు విజయవంతంగా నడుపుతున్నాను" అంటూ ఆయాసం తీర్చుకోటానికి మాటలు ఆపాడు సన్యాసిరావు.

ఇదంతా ఏదో ప్రమాదకరమయిన వ్యవహారంలా నాకు అనిపించింది. నా ముఖకవళికలు గమనించినట్లున్నాడు.

"ఇప్పటికి నేను ఈ మూడు నెలల్లో వాట్సప్ వైద్యం అందించిన అయిదు వందల యాభై మందిలో సుమారు నూట యాభైమంది నాకు కృతజ్ఞతలో, లేకపోతే లైక్‌లో తెలియచేశారు" అన్నాడు సన్యాసిరావు గర్వంగా ముఖంపెట్టి.

"మరి మిగతావాళ్ళు?" అంటూ అడిగాను అనుమానంగా ముఖంపెట్టి.

"వాళ్ళకి కృతజ్ఞత తెలియజేయాలనే జ్ఞానం లేకపోయుండాలి, లేదా టపాకట్టేసి ఉండాలి. వైద్యం అందజేయాలంటే వాళ్ళకి ఆయుర్దాయం అంటూ ఉండాలి కదా!

ఆ బ్రహ్మదేవుడు మన నుదుటున అది రాయకపోతే ఎవరుమాత్రం ఏం చేయగలరు? అందుకే ఈ వైద్యం ఆరంభించేముందే భగవద్గీతలోని కర్మ యోగానికి సంబంధించిన ఓ అయిదు శ్లోకాలు అర్థాలతో సహా వాళ్ళకి పంపించి వల్లె వేయిస్తాను.

నా సలహాలతో, చెప్పిన మందులతో వాళ్ళ రోగం తగ్గలేదనుకో, అప్పుడు 'ముడి నువ్వులు' దానమివ్వమని చెబుతాను. శనికి తైలాభిషేకం చేయించమని కూడా సలహా ఇస్తాను. అప్పటికీ రోగం తగ్గకపోతే, అది వాళ్ళ ఖర్మ!

ఎందుకంటే ఆ శని దేవుడికంటే మనంగొప్పవాళ్ళం కాదుకదా!" అంటూ కొంతసేపు మౌనంగా ఉండిపోయి -

"సరే! నేను వెళ్ళొస్తాను" అంటూ లేచి నిలబడి కుడికాలు ఈడుస్తూ అడుగులు ముందుకు వేస్తున్నాడు. అప్పుడు చూశాను.

వాడి కుడికాలు పాదానికి బ్యాండేజీ ఉంది!

"ఏమిట్రా ఆ బ్యాండేజీ? ఏమయింది?" అంటూ అడిగాను.

"మొన్న రాత్రి ఎలక కరిచింది" అన్నాడు.

"మరి డాక్టర్ దగ్గరకు వెళ్ళి చూపించుకోలేకపోయావా?" అన్నాను.

"నిన్న రాత్రి ఎలకల బోను పెట్టాను మా గదిలో! అందులో ఎలక పడింది! దాన్ని జాగ్రత్తగా ఓ బుల్లి సంచీలో పెట్టి తీసుకువచ్చి మా భజగోవిందం మామయ్య ఇంట్లో, పడకగదిలో ఎవరూ చూడకుండా వదిలివస్తున్నాను..." అన్నాడు.

సంభ్రమంతో వాడివంక చూశాను!

"మీ మావయ్య ఇంట్లో... అదికూడా... పడకగదిలో వదిలిపెట్టి వచ్చావా? ఎందుకు?"

"ఓసారి మనిషిని కరిచి ఆ రక్తం రుచి చూసిన ఎలక మళ్ళీ మనిషి రక్తం కోసమే వెంపర్లాడుతూ వెదుకుతుందని ఈ మధ్యనే కెనడాలో ఓ 'మూషిక శాస్త్రవేత్త' కనిపెట్టాడట!

ఆ విషయం పదిరోజుల కిందట ఎవరో నాకు వాట్సప్‌లో పంపించారు. అందుకని, ఆ ఎలకని పట్టుకొచ్చి భజగోవిందం మావయ్య ఇంట్లో వదిలిపెట్టాను. అది ఈవేళో రేపో మా మావయ్యనో, అత్తయ్యనో కరవటం ఖాయం!

అప్పుడు వాళ్ళని డాక్టర్ దగ్గరకి ఎలాగూ నేనే తీసుకువెళ్ళాలి. వాళ్ళు డాక్టర్‌కి ఫీజు ఎలాగూ ఇస్తారు. వాళ్ళకి రాసిన మందులే నేనూ వాడతాను. ఆ రకంగా నాకు ఫీజు ఇవ్వటం తప్పుతుంది.

పైగా ఇకమీదట ఎవరిని ఎలక కరిచినా వాట్సప్ ద్వారా వైద్యం అందించటం నాకు సులువవుతుంది" అంటూ కాలు ఈడ్చుకుంటూ మెట్లు దిగాడు.

వాడి తలతిక్కసమాధానానికి నాకు ఒళ్ళుమండిపోయింది-

"మొన్న నిన్ను కరిచిన ఎలకే, నిన్న నీ బోనులో పడిందని ఎలా చెప్పగలవు?" అంటూ నిలదీసినట్లు అడిగాను. వాడు ఆఖరిమెట్టుదిగాక అక్కడ నిలబడి నవ్వుతూ అన్నాడు-

"క్రితం సారి బోనులో ఓ ఎలక పడితే దాని తోకకి ఎర్రరంగు పులిమాను. తర్వాత దాన్ని తీసుకువెళ్ళి మా ఇంటికి దూరంగా కాలవలో వదిలిపెట్టేశాను.

అది మళ్ళీ మా ఇంటికేవచ్చేసింది కాబోలు, మొన్న రాత్రి అది నన్ను కరిచిపారిపోతూ వుంటే దాని తోక కనిపించింది. తోక ఎర్రగా వుంది. నేను వదిలి పెట్టిన ఎలకే అది. మళ్ళీ నిన్నరాత్రి బోనులో పడిందీ ఆ ఎర్రతోక ఎలకనే.

అందుకే అంత ఖచ్చితంగా చెప్పగలిగాను. బై" అంటూ వెళ్ళిపోయాడు సన్యాసిరావు. విస్తుపోయి వాడు వెళ్ళిపోతున్న వంకే చూస్తూ నిలబడిపోయాను.



ప్రతిపక్షాలన్నీ విడివిడిగా పోటీ చెయ్యటంవల్లనే బి.జె.పి. గెలుస్తోందన్నది నగ్నసత్యం.
-అభిషేక్ మను సింఘ్వీ, కాంగ్రెస్ నేత

చందమామ రావే



ఒకఊళ్ళో సుమంతుడు అనే మహానుభావుడు ఉండేవాడు. ఆయన అపకారికి కూడా ఉపకారంచేసే స్వభావం గలవాడు. ఊరి చివర ఒక కుటీరం వేసుకుని, అందులో ఆయన ఒంటరిగా ఉంటూండేవాడు. ఏ వేళగానివేళ అతిథి వచ్చినా ఆయన ఆతిథ్యం ఇచ్చేవాడు.

ఒకరోజు దొంగ ఒకడు వడదెబ్బ తగిలి ఆయన కుటీరం ముందు పడిపోయాడు. సుమంతుడు ఎన్నో శైత్యోపచారాలు చేసినమీదట వాడికి స్పృహ వచ్చింది. ఆకలిగా ఉందని వాడు సంజ్ఞ చేశాడు. అయిదు నిమిషాలలో సుమంతుడు వాడికి చక్కని భోజనం పెట్టాడు. దొంగ ఆవురావురని భోజనం చేసినాక వాడికొక అనుమానం వచ్చింది.

వాడు సుమంతుణ్ణి -

"అయ్యా, ఈ మిట్టమధ్యాహ్నం వేళ మీరు ఈ విందుభోజనం ఇంత త్వరగా నాకోసం ఎలా తయారుచేయగలిగారు?" అని అడిగాడు.

"నా దగ్గర మహిమగల గిన్నె ఉన్నది. దాని సహాయంతో కావలసిన భోజనపదార్థాలు క్షణంలో సంపాదించవచ్చు" అన్నాడు సుమంతుడు.

దొంగ ఆశ్చర్యపడి "ఒక్కసారి, ఆ గిన్నె చూపిస్తారా? దానిమహిమ చూడాలని ఉన్నది" అన్నాడు.

సుమంతుడు లోపలికి వెళ్ళి ఒక గిన్నె తెచ్చి, దొంగ చూస్తూండగా దాన్ని నేలమీద బోర్లించి "అరటిపళ్ళు కావాలి" అన్నాడు.


గిన్నె పైకెత్తేసరికి దానికింద అరటిపళ్ళున్నాయి.

ఆ గిన్నెను చూడగానే దొంగకు కన్నుకుట్టింది. వాడు ఆ రాత్రి సుమంతుడి గిన్నెను కాజేశాడు. ఆ గిన్నె సహాయంతో తాను కోటీశ్వరుడైపోవాలని వాడి ఆశ. కాని ఆ గిన్నె వాడి వద్ద ఏ మహిమా చూపలేదు. వాడు కోరిన ఆహారంకూడా అది వాడికివ్వలేదు.

మర్నాడు దొంగ ఆ గిన్నెను సుమంతుడికి తెచ్చి ఇస్తూ, "అయ్యా, పొరపాటున మీ గిన్నె తీసుకుపోయాను. నన్ను మన్నించి మీ గిన్నె మీరు తీసుకోండి" అన్నాడు.

సుమంతుడు ఏమాత్రమూ ఆగ్రహించక, వాడి వద్ద నుంచి గిన్నె తీసుకుని, అప్పటికప్పుడు దాని నుంచి పాయసం మొదలైనవి సృష్టించి, దొంగవాడికి విందు చేశాడు.

దొంగ కుతూహలం పట్టలేక, "అయ్యా ఈ గిన్నె మీరు కోరిందల్లా ఇస్తున్నది. నా దగ్గర మామూలు గిన్నెలాగే ఉన్నది" అన్నాడు.



సుమంతుడు నవ్వి, "నేను జీవించిఉండగా ఈ గిన్నె మరొకరికి ఉపయోగపడదు" అన్నాడు.

దొంగకు ఇప్పుడు గిన్నె రహస్యం తెలిసిపోయింది. సుమంతుణ్ణి చంపి గిన్నె మహిమ తనకోసం ఉపయోగించుకోదలచి వాడు విషం కలిపిన ఆహారం తీసుకుని, సుమంతుడి వద్దకు వచ్చి-

"అయ్యా, మీరు నాకు రెండుసార్లు విందుభోజనం పెట్టారు. దానికి ప్రతిఫలంగా మీకు ఈ ఆహారం తెచ్చాను. దీన్ని ఆరగించి నన్ను ధన్యుణ్ణి చెయ్యండి" అన్నాడు వంగి నమస్కరించి.

సుమంతుడు సంకోచించకుండా దొంగ తెచ్చిన ఆహారాన్ని వాడిముందే తినేశాడు.

తరువాత దొంగ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి పొద్దుపోయినాక దొంగ సుమంతుడి కుటీరం ప్రవేశించాడు.

సుమంతుడు మంచంమీద పడి ఉన్నాడు.

దొంగ గిన్నె ఉన్నచోటికి పోతూండగా కాలికి ఏదో తగిలి, పడిపోయాడు. ఆ అలికిడికి సుమంతుడు కళ్ళుతెరిచి, లేచి కూర్చుని, "ఎవరది?" అని అడిగాడు. దొంగ ఆశ్చర్యపడి, "తమరు జీవించే ఉన్నారా, స్వామీ?" అని అడిగాడు.

"అదేం? నేను జీవించిఉండనని ఎందుకనుకున్నావు?" అన్నాడు సుమంతుడు.

"ఈరోజు నేను మీకు ఇచ్చిన ఆహారంలో భయంకరమైన విషం కలిపాను. అది ఈపాటికి తప్పక మీ ప్రాణాలు తీసి ఉంటుందనుకున్నాను" అన్నాడు దొంగ.

"నేను యోగాభ్యాసం చేస్తాను. ఎలాంటి విషాన్నయినా జీర్ణించుకోగలను" అన్నాడు సుమంతుడు నిశ్చలంగా.

"మీకు విషంపెట్టి చంపేసి, మీ గిన్నె తీసుకుపోయి సుఖంగా బతుకుదామనుకున్నాను. కాని ఫలితం దక్కలేదు" అన్నాడు దొంగ నిరుత్సాహపడిపోయి.

సుమంతుడు "సరే, నీ అదృష్టం బాగా లేదు. అయితే, భోజనంచేసి వెళతావా?" అని దొంగను అడిగాడు.

ఆ మాట వినీ దొంగకు చాలా సిగ్గువేసింది. దానితోపాటు వాడికొక అనుమానం కూడా కలిగింది. "స్వామీ, నేను మీకు ద్రోహం తలపెట్టినా, మీరు నన్ను అసహ్యించుకోవటంలేదు. పైగా నన్ను ఎంతో మంచిగా చూస్తున్నారు. ఈ అనుభవం నాకు చాలా విచిత్రంగా ఉన్నది" అన్నాడు వాడు.

"ఇందులో విచిత్రమేమున్నది? మంచి చేయడం నా అలవాటు, చెడు చేయడం నీ అలవాటు.

నీ అలవాటును నువ్వు వదులుకోలేనప్పుడు నా అలవాటును నేను ఎలా వదులుకోగలననుకున్నావు?" అన్నాడు సుమంతుడు.


వసుంధర



సెక్స్ AND సైకాలజీ



డా॥జి. సమరం



Sex is not only pursuit of young but also, a key part of adults

డి.ఎమ్.ఆర్. నిజామాబాద్

ఒకరిదగ్గర సెక్స్ సక్సెస్, మరొకరి దగ్గర ఫెయిల్యూర్ ఎందుకని?

సెక్స్‌లో ఒకరి దగ్గర సక్సెస్,మరొకరి దగ్గర ఫెయిల్యూర్‌కి వాళ్ళ మానసిక స్థితే కారణం. మనస్సులో తెలియని భయం, కంగారు, గాభరా ఉన్నట్లయితే ఫెయిల్యూర్ కలుగుతుంది. ఎటువంటి భయం లేని వాతావరణంలో ఉన్నట్లయితే సక్సెస్ అవుతుంది.

అందుకనే సెక్స్‌లో సక్సెస్‌కి మనస్సు ఉత్సాహంగా, ఉల్లాసంగా, భయం లేకుండా ఉండాలి.

ఉరకలేసే సెక్స్ మనస్సులో చిందులేస్తూ ఉంటే సెక్స్‌లో సక్సెస్ కూడా మనస్సుని మెప్పిస్తుంది.

సి.ఎన్. ఖమ్మం

ఈ మధ్య ఒక న్యూస్‌పేపర్‌లో ఒక వైద్యవిధానానికి సంబంధించిన వార్త వచ్చింది. ఆ వైద్య విధానానికి సంబంధించినమందు కొంతమంది హెచ్.ఐ.వి. పేషెంట్లపై వాడితే వాళ్ళల్లో హెచ్.ఐ.వి పూర్తిగా క్యూర్ అయిపోయిందని రాశారు.

ఇది మన తెలుగు ప్రాంతంలో జరిగిన విశేషమే. నిజంగానే అటువంటి మందు ఏదైనా కనుగొనబడిందా? నేను హెచ్.ఐ.వి. రోగిని.

ఇంతవరకు హెచ్.ఐ.వి. క్యూర్‌కి ప్రత్యేక మందు అంటూ ఏమీ లేదు. ఏ వైద్యవిధానంలో కూడా మందు కనిపెట్టలేదు. కాని కొంతమంది హెచ్.ఐ.వి. క్యూర్ అవడానికి మందు ఉందని చెప్పి డబ్బు సంపాదించుకుంటున్నారు. ఇలా క్యూర్‌కి మందు ఉందని చెప్పడం మోసం, దగా.

క్యూర్ అయిన కేసులు ఇదిగో చూడండి అని ఎవరైనా చెబితే అవన్నీ కూడా బిల్డప్ స్టోరీలే. ఆ కథల వెనకాతల ఎంతో మోసం, దగా ఉంటుంది. ఎవరూ అటువంటి మాటలు నమ్మకూడదు.

ప్రస్తుతం హెచ్.ఐ.వి.ని చక్కగా కంట్రోల్ చేయడానికి మందులు కేవలం ఆధునిక వైద్యవిధానంలోనే ఉన్నాయి. ఇతరత్రా ఏ వైద్యవిధానంలోనూ ఇటువంటి మందులు ఉన్నాయని నిర్ధారణ కాలేదు.

మీరు ఆధునిక వైద్య విధానానికి సంబంధించిన డాక్టర్‌ని కలిసి పరీక్షలు చేయించుకుని మందులు వాడండి. తప్పకుండా మీ ఆరోగ్యం కుదుటపడుతుంది. ఒక బి.పి. ఉన్నవాడు, షుగర్ ఉన్నవాడు ఏవిధంగా ఆరోగ్యంగా ఉంటాడో మీరు కూడా ఎటువంటి బాధలు లేకుండా హాయిగా ఉంటారు.


సి.ఎల్. కాకినాడ

నేను ఒక వేశ్యతో కలిశాను. కండోమ్ మధ్యలోనే చిరిగిపోయింది. వెంటనే అంగాన్ని బయటకు తీసేశాను. స్ఖలనం కూడా జరగలేదు. వీర్యస్ఖలనం జరగలేదు కనుక నాకు హెచ్.ఐ.వి. వ్యాధి వచ్చే అవకాశం లేదనుకుంటున్నాను. నాకు హెచ్.ఐ.వి. వస్తుందంటారా, రాదంటారా?

హెచ్.ఐ.వి. రావడానికి వీర్యస్ఖలనం అవడం,అవకపోవడంతో సంబంధం లేదు. చాలామంది వీర్యస్ఖలనం అయితేనే హెచ్.ఐ.వి. వస్తుందనుకుంటారు. అది అపోహ మాత్రమే. కాని ఒక్కసారికే హెచ్.ఐ.వి వచ్చే అవకాశం చాలా తక్కువ. ఏది ఏమైనా ఒకసారి డాక్టర్ దగ్గరకెళ్ళి పరీక్షలు చేయించుకోండి.

హెచ్.పి. కర్నూలు

మాకు ఒక పాప పుట్టింది. వెంటనే మరొక బిడ్డ వద్దనుకుంటున్నాను. కొంతకాలమైనా గ్యాప్ ఉండా



ప్రేమలు కరువవుతున్నాయి

ప్రేమ అనేది ఒక మధురానుభూతి. ప్రేమలో పడినవారికి మాత్రమే అర్థమయ్యే అనుభవం. ఆకాశంలో తేలిపోతారు ప్రేమికులు.

ఆకలి, దాహం అనేవి తెలియనివ్వని శక్తి ప్రేమకు వుంది. ఇవన్నీ నేటివరకు ప్రేమికులు, ప్రేమని ఇష్టపడేవారు చెపుతున్న విషయం.

ప్రేమతో మానసికంగా ఎంత ప్రశాంతత వస్తుందో, అంతకన్నా పలురెట్లు అధికస్థాయిలో మానసిక అశాంతిని తెస్తుంది ప్రేమవైఫల్యం.

ప్రపంచం ఇప్పుడు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య, ప్రేమ తగినంత పొందలేకపోవటం.

ప్రపంచ ప్రజలందరి కష్టాలు ఆర్థికపరమైనవి కావు. పేదరికాన్ని నిర్మూలించినంతమాత్రాన ప్రజలందరు హాయిగా వుంటారనుకోవటం పొరపాటు అంటున్నారు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ పరిశోధకులు. ప్రపంచ సమస్యలకు, ప్రపంచ ప్రజలలోని బాధ, ఇతర ఇబ్బందులన్నింటికీ పరిష్కారం వారి ఆర్థిక సమస్యలు కావని, వారి మనసుల్లోని సమస్యలని తేల్చారు.

మనిషికి తిండీ, గుడ్డ, గూడు వుంటే చాలు అనే మార్క్సిజమ్ ఆలోచనలో అర్థంలేదన్నారు.

మనిషి అసలు అవసరాలు ఏమిటో తెలుసుకోకుండా, మనిషికి మనసు అనేది వుంటుందనేవిషయం మరచిపోయి, భౌతికపరమైన సుఖాలు అందిస్తే అది ఇక మిగిలిన సమస్యలన్నింటినీ తొలగిస్తుందనే వెర్రి ఆలోచనను వదలండి అని ఆ పరిశోధకులు ఆర్థిక శాస్త్రవేత్తలకు చెపుతున్నారు.

మనిషి జీవితంలో కష్టాలన్నీ కూడా మనసు నుండి మొదలవుతాయి. సామాజిక సంబంధాలు సక్రమంగా వున్నప్పుడు ఆర్థికపరమైన సమస్యలు, భౌతికపరమైన అసౌకర్యాలు ఎవరికీ పట్టవు.

ఒక పెళ్ళి, ఒక కుటుంబంలో జరిగే కార్యక్రమం ఏర్పాట్లలో ఇష్టంగా పాల్గొనేవారు పనిలో అలసిపోయి ఏదోక మూల ఎటువంటి అసౌకర్యాలున్నా హాయిగా నిద్రపోగలుగుతారు. ఆ కుటుంబ కార్యక్రమంలో పాల్గొనటం ఇష్టంలేనివారు తమకు లభించని సౌకర్యాల గురించి ఫిర్యాదు చేస్తూ, తమ హోదా గురించి పదేపదే గుర్తుచేస్తుంటారు.

ఆర్థికపరమైన ఎదుగుదలవల్ల గత నాలుగుసంవత్సరాలలో అనేక దేశాలలో అసంతృప్తి పెరిగింది. లైంగిక సుఖం తగ్గింది. ప్రేమలు కరువయ్యాయి. జీవితం యాంత్రికం అయింది.ఒకదశలో యాంత్రిక సెక్స్‌కి, విచ్చలవిడి సెక్స్‌కు ఇష్టపడి వడిచారు.

ఎలా పొందితే ఏమిటి లైంగిక సుఖం అనుకున్న తరం నుండి ఇప్పుడు ప్రేమలేని జీవితం, మనసు లేని లైంగిక జీవనం వద్దనుకుంటున్నారు.

జీవితంలో ఎంతో సుఖం అందించే ప్రేమ కరువైనపుడు, మానసిక సమస్యలెన్నింటినో తొలగించగలిగిన లైంగిక ఆనందం కరువయినపుడు జీవించటంలో ఎటువంటి అర్థం ఆ యా దేశాల వారికి కనిపించటంలేదు. ప్రేమ లేక, సెక్స్ సుఖం లేక నిస్సత్తువ జీవితం గడుపుతున్నారు.

ఈ విషయంమీద దృష్టిపెట్టి ప్రపంచప్రజలను ఆదుకుంటే వారి జీవితాలు ఇరవై శాతం మెరుగవుతాయి. అలాకాక పాతపద్ధతిలోనే పేదరికపు నిర్మూలన మీదే పెట్టుబడులు పెడితే జీవితాలు ఐదు శాతం మాత్రమే మెరుగవుతాయి.

జీవితంలో తగిన తోడు లభించటం ఒక గొప్ప అదృష్టం. అర్థం చేసుకుని జీవితాన్ని ముందుకు తీసుకువెళ్ళగలిగిన తోడు ఎవరికి లభిస్తుందో వారి జీవితాలు ఆర్థిక అంశాలకు అతీతంగా, ఆనందంగా సాగుతాయి.జీవితంలో దొరికిన తోడునుండి పొందే ప్రేమ అనురాగాలే అసలైన టానిక్‌లు.

అవి ఎంత బాగా అందుకుంటారో వారిదే అసలైన ఆనందజీవితం. ప్రేమ, లైంగిక సుఖం సరిగా లభించక ఎక్కువమంది ఒంటరితనం అనుభవిస్తూ, ఆరోగ్యం చెడగొట్టుకుని అర్థాంతరంగా మరణిస్తున్నారు. ప్రేమే ఎక్కువమందిని బలిగొంటున్నది.◆

లని కోరుకుంటున్నాము. ఈ గ్యాప్‌కోసం నేను పిల్స్ వాడవచ్చా? పిల్స్ వాడితే ప్రమాదమా? క్యాన్సర్ వస్తుందా? పిల్స్‌కాకుండా వేరే మార్గముందా?

ఒక బిడ్డ పుట్టిన తర్వాత మరొక బిడ్డకి గ్యాప్ ఇవ్వాలనుకున్నప్పుడు లూప్ వాడటం సరైన పద్ధతి. కాన్పు అయిన ఆరువారాలకి లూప్ వేయించేసుకుని మామూలుగానే శృంగారంలో పాల్గొనవచ్చు. లూప్ వేయించుకుంటే ఇక వేరే గర్భనిరోధక మాత్రలు గాని, మరొకటిగాని అవసరం లేదు. లూప్ 3 నుంచి 5 సంవత్సరాలు వరకు చక్కగా పనిచేస్తుంది.

ఎ.పి. విజయవాడ

నా వయస్సు **24** సంవత్సరాలు.నాలో సెక్స్ కోరికలు ఎక్కువ. ఆ మధ్య ఒక అందమైన అబ్బాయితో కాస్త పరిచయమైంది. చాలా చలాకీగా ఉంటాడు. హ్యాండ్‌సమ్‌గా ఉన్న అతన్ని చూసి నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోతున్నాను.

ఒకరోజు అతన్ని నేనే మాటలతో రెచ్చగొట్టి సెక్స్‌లో పాల్గొనేటట్లు చేశాను. కాని మళ్ళీ అలాంటి సాహసం చేయలేకపోయాను.

కాని ఇప్పుడు నాకు ఒక భయం పట్టుకుంది. నాకు ఎయిడ్స్ వచ్చే ప్రమాదం ఉందా?ఎందుకంటే అతనితో పాల్గొన్నప్పుడు కండోమ్ వాడలేదు. ఇప్పుడు నేనేం చేయాలి? నన్ను రక్షించండి.

తొందరపాటు పనులు ఒక్కోసారి చాలా ప్రమాదానికి దారితీస్తాయి. మీకు ఎయిడ్స్ భయం పట్టుకుంది కనుక ఆ అబ్బాయి ఇంకా మీ పరిచయంలోనే ఉంటే అతన్ని హెచ్.ఐ.వి. టెస్ట్ చేయించుకోమనండి. అతనికి హెచ్.ఐ.వి. ఉన్నట్లయితే మీకు ఆ వ్యాధి వచ్చిందీలేనిదీ తెలుసుకోవడానికి టెస్టులు చేయించుకోండి. సాధారణంగా ఒక్కసారికే ఎయిడ్స్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుంది.

డా॥ జి.సమరం వాసవ్య నర్సింగ్‌హోమ్ బెంజిసర్కిల్ విజయవాడ 520 010 ఫోన్ 0866-2472370 E-mail drsamaram@hotmail.com www.gsamaram.com



ఏషియాటిక్ సింహాల ఏకైక నివాసం గిర్

పరిరక్షణలో 'సింహ' భాగం

ప్రపంచంలో క్షీణించిపోతున్న అడవులు, అంతరించిపోతున్న జాతుల నడుమ గుజరాత్ గిర్ ఫారెస్ట్ ఆశకు ఒయాసిస్‌మాదిరి నిలిచింది. 'గిర్' అటవీప్రదేశం ప్రపంచం అంతటా తగ్గిపోతున్నప్పటికీ గుజరాత్ గిర్‌అడవి అందుకు మినహాయింపుగా ఉన్నది.

1412 చదరపు కిలోమీటర్లమేర విస్తరించివున్న సువిశాల ఆకులు రాల్చే ఈ అటవీ ప్రాంతం సింహాలకు సహజ నివాసాన్ని అందిస్తున్నది.

మరియు, ప్రభుత్వ చర్యలు, స్థానికుల ఇష్టపూర్వక సహకార చర్యలవల్ల సింహాల సంఖ్య ఇరవయ్యవ శతాబ్దం ఆరంభంలో 15 కాగా అది ఇప్పుడు 400కు పెరిగింది.

దీనివల్ల ఏషియాటిక్ సింహాలకు మన దేశం ప్రపంచంలోనే ఏకైక ఆవాసమన్న ఇమేజ్‌ను పెంచుకోగలిగింది.

ఈ అడవి రాజులు గిర్ ఫారెస్ట్‌లో స్వేచ్ఛగా తిరుగుతుంటాయి. అక్కడ సరైన ప్రదేశంలో, సరైన సమయంలో అంటే సంధ్యా సమయంలో లేదా ఉషోదయంవేళ అక్కడ ఉన్నట్లయితే, పచ్చికబయళ్ళతో మిళితం అయి వున్న ఈ అడవిలో, తమ సహజ ఆవాసంలో తిరుగాడే సింహరాజాలను చూడవచ్చు.

ఔదార్య జంతువులు మరియు పక్షి జీవితం

సింహాలు గిర్ స్టార్స్ అయినప్పటికీ ఈ అడవిలో అనేక ఇతర జంతువులు కూడా వుంటాయి. దాదాపు 38 ప్రత్యేక జాతుల క్షీరదాలు, 300 రకాల పక్షులు మరియు 37 రకాల పాముజాతులు గిర్ ఆవాసంగా వున్నాయి.

అధీకృత ఫారెస్ట్ గైడ్‌ను ఏర్పరచుకుని, అటవీ రహస్యాలను అతనిద్వారా తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

ఏషియాటిక్ లయన్స్, చిరుతలు, బెంగాల్ టైగర్లు, స్లాట్ ఎలుగుబంట్లు, కింగ్ కోబ్రాలు, అడవి పిల్లులు, చారల హైనాలు, గోల్డెన్‌నక్కలు, ముంగిసలు అడవిలో నివసిస్తుంటాయి. జింకలు, అడవిపందులు, కృష్ణజింకలు కూడా కనపడతాయి.

గిర్‌ప్రాంతంలో ఏడు నిత్యనదులు ప్రవహిస్తుంటాయి. ఈ ప్రాంతంలో పెద్ద రిజర్వాయర్‌ను కమలేశ్వర్ డ్యామ్‌గా పిలుస్తారు. దీన్ని 'లైఫ్ లైన్ ఆఫ్ గిర్'గా వ్యవహరిస్తారు. జంతుజాలంకంటే వృక్షజాలాన్ని ఇష్టపడేవారూ నిరాశచెందనక్కర్లేదు.

గిర్‌లో 400 రకాలకు పైబడి వృక్షజాతులు ఉన్నాయి. అత్యధిక సంఖ్యలో మార్ష్ మొసళ్ళతోపాటు, ఇండియన్ రాక్ పైథాన్లు, మానిటర్ బల్లులుకూడా అడవిలో తిరుగుతుంటాయి.

గిర్ గురించి తెలియని మరో అబ్బుర విషయం ఏమిటంటే ఇది పక్షుల శాస్త్రవేత్తలకు కూడా మంచి పర్యాటక ప్రదేశం.

300 ఏవియన్ జాతులు, పాముజాతులు, రాబందులు, ప్యారడైజ్ ఫ్లైక్యాచర్స్, గూడబాతులు కూడా కనిపిస్తాయి.

మనుషులు, మృగాల నివాసం

జంతువులు తమప్రదేశాన్ని మల్ధారి గిరిజనులతో పంచుకుంటుంటాయి. వీళ్ళు పశుగ్రాస సంచార మతసంఘానికి చెందుతారు.

తమ ఆవులు, గేదెలతో అడవిలో జంతుసంపదను వృద్ధిచేస్తుంటారు. ఇవి సింహాల ఆహారంలో భాగం అవుతుంటాయికూడా.


తమ పశువులు ఇలా ఆహారం కావడాన్ని, ఈ భూభాగాన్ని తాము పంచుకుంటున్నందుకు ఇచ్చే చెల్లింపుగా భావిస్తుంటారు.

గిర్ నేషనల్ పార్కు అంచులలో నివసించే మరో గిరిజన తెగ సిద్దిస్. వీరి మూలం ఆఫ్రికా.


అక్కడి నుంచి బానిసలుగా, కిరాయి సైనికులుగా వచ్చారని భావిస్తారు. వీరు కలర్‌ఫుల్‌గా వుండే నృత్యాలకు పెట్టింది పేరు.



Group of Pelicans in GIR



A Pathway in GIR National Park



Cheetal (deer) in GIR


ట్రిప్ టైమ్

అత్యంత సన్నిహితంగా అడవిని, వన్యప్రాణులను వాస్తవిక సంగ్రహావలోకనం చేసుకోగల భారతదేశంలోని అతికొద్ది ప్రదేశాల్లో గిర్ ఒకటి. అయితే ఇందుకోసం తగినసమయాన్ని, ఆసక్తిని వెచ్చించాల్సివుంటుంది. మూడు, నాలుగురోజులు ఉండేందుకు ప్లాన్ చేసుకున్నప్పుడే గిర్‌లోని విభిన్న వన్యప్రాణిని చూడవచ్చు. ఆ ఏషియాటిక్ సింహాలూ కనపడగలవని ఆశించవచ్చు.


చక్కని నెట్‌వర్క్, సమగ్రంగా అనుసంధానం అయిన రహదారులు గిర్ నేషనల్ పార్కును ప్రసిద్ధ వారాంతపు పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాయి. వారాంతపు విజిట్స్‌కంటే మిగతారోజుల్లో ట్రిప్స్ తక్కువ అస్తవ్యస్తత కలిగివుంటాయి.

సమయం వుంటే దేవాలియ సఫారి పార్క్ లేదా గిర్ ఇంటర్‌ప్రిటేషన్ జోన్‌ను సందర్శించాలి. 412 హెక్టార్లలోని ఫెన్స్‌డ్-ఆఫ్ ప్రాంతం. దీనిని 'గిర్ ఇన్ ఎ నట్ షెల్'గా పేర్కొంటారు.

సింహాలతో సహా అనేక అడవి జంతువులు తమ తమ పరిధుల్లో నివసిస్తుంటాయి. ససాన్ గిర్ గ్రామం చేరువలోని గిర్ నేషనల్ పార్కు సోమనాథ్ దేవాలయానికి, డియు బీచ్‌లకు పెద్దగా దూరంగా వుండదు.



Madhavpur Beach



విజిట్‌కు ఉత్తమ సమయం

డిశంబర్ నుంచి ఏప్రిల్‌దాకా, జూన్ మధ్యనుంచి అక్టోబర్ మధ్యవరకు శాంక్చువరీని మూసేస్తారు.

www.girlion.in పైన జంగిల్ ట్రైల్‌ను బుక్ చేసుకోవచ్చు. జంగిల్ రాయల్ ఫ్యామిలీతో మీ అద్భుత అనుభూతులను షెడ్యూల్ చేసుకోవాలి. ఈ సైట్‌లో అన్ని అత్యవసర వివరాలను సమగ్రంగా తెలుసుకుని, ట్రిప్‌ను చక్కగా ప్లాన్ చేసుకోవాలి.

అక్కడికి ఎలా వెళ్ళాలి

సమీప నగరాలు : అహ్మదాబాద్ (340 కి.మీ.), రాజ్ కోట్ (165 కి.మీ.), పోర్‌బందర్ (165 కి.మీ.), జూనా గడ్ (80 కి.మీ.).

సమీప ఎయిర్‌పోర్టులు: అహ్మదాబాద్ (340 కి.మీ.), రాజ్‌కోట్ (165 కి.మీ.), పోర్‌బందర్ (165 కి.మీ.), డయ్యు (80 కి.మీ.).

సమీప రైలుమార్గం : జూనాగడ్ రైల్వేస్టేషన్ (80 కి.మీ.)

గిర్ ప్రాంత అసాధారణ ఆకర్షణలు

సింహాలు, చిరుతలు, మొసళ్ళు

ఇతర జంతువుల సంఖ్య 300కి పైగా పక్షిజాతులు

సోమనాథ్ దేవాలయం

చొర్వాడ్, మాంగ్రోల్ బీచ్‌లు

జూనాగడ్ మ్యూజియం, బౌద్ధ గుహలు

గిమార్ హిల్ వద్ద జైన దేవాలయాలు









టూరిజం కార్పొరేషన్ ఆఫ్ గుజరాత్ లిమిటెడ్

బాల్‌యోగి పర్యాటక భవన్, గ్రీన్‌ల్యాండ్స్, బేగంపేట, హైదరాబాద్ 500 016,
తెలంగాణా, ఇండియా, టెలిఫోన్ : 9140-23400516, 9493350099.
ఇ-మెయిల్ : tibhyderabad@gujarattourism.com/www.gujarattourism.com.

ఫర్ U

Life would be infinitely happier if we could only be born at the age of eighty and gradually approach eighteen



అల్లం, శొంఠి

అల్లాన్ని వేడినీళ్ళలో ముంచి ఎండబెడితే శొంఠి అవుతుంది. అల్లం, శొంఠి రెండింటిలోనూ ప్రయోజనాలు లభిస్తాయి.

రెండు టీస్పూన్ల అల్లంరసంలో ఒక టీ స్పూన్ తేనెకలిపి కొద్దిరోజులపాటు తాగితే శరీరంపై వచ్చే దద్దుర్లు తగ్గిపోతాయి. బాగా తుమ్ములు రావడం, జలుబు కూడా తగ్గుతాయి.

భోజనం చేసేముందు మూడు, నాలుగు చిన్న చిన్న అల్లం ముక్కలు ఉప్పుతో కలిపి నమిలి మింగితే ఆహారం త్వరగా జీర్ణం అవుతుంది.

శొంఠిపొడిని టీలో వేసుకుని కాచి తాగితే, టీకి రుచి, ఆరోగ్యం రెండూ లభిస్తాయి. ఒక టీస్పూన్ శొంఠిపొడి, ఒక టీస్పూన్ నల్లనువ్వుల పొడి, తేనె కలుపుకుని ఉదయం, సాయంత్రం తీసుకుంటుంటే తొడలు, మోకాళ్ళు, పిక్కలు, నడుముల్లోని నొప్పులు తగ్గుతాయి. ◆

ఉప్పు తగ్గించాలి

రోజువారీ ఆహారంలో చిన్నతనంనుంచే కొద్ది కొద్దిగా ఉప్పుతగ్గించి తినాలని నిపుణులుసిఫార్సు చేస్తున్నారు. ఉప్పు ఎక్కువగా వాడుతున్నట్లయితే రక్తపోటు పెరగడమే కాకుండా కిడ్నీలకు కూడా హాని జరిగే అవకాశం వుంటుంది.

రక్తపోటు తక్కువగా వుంటే మూత్రపిండాల సమస్యలూ తగ్గుతాయి. ఉప్పు వాడకాన్ని చిన్న వయస్సునుంచే కొద్దికొద్దిగా తగ్గించుకుంటూవుంటే చాలా ఆరోగ్య సమస్యలు అదుపులో వుంటాయని ముంబయి వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

ఉప్పుతోపాటు నూనె, పంచదారల వాడకం కూడా తగ్గించాలన్నది వారి సూచన. ◆

జీవనశైలితోనే

ఎక్కువసేపు కుర్చీలకు అతుక్కుపోయి ఉద్యోగాలు చేసేవారిలో ఎక్కువమందికి నడుము కింది భాగంలో నొప్పి వస్తుంటుంది.

నొప్పి తగ్గడంకోసం మాత్రలు వేసుకోవడం, వెన్నుకు శస్త్రచికిత్సలు, ఇంజెక్షన్లు చేయించుకోవడం వంటి చర్యలు చేపడుతుంటారు.

ఇవన్నీ అవసరమే అయినా, కొన్నిసార్లు హానిఎక్కువగా జరుగుతుందని ఆస్ట్రేలియా పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఇలా మందులు, చికిత్సలకంటే జీవనశైలిని మార్చుకోవడం ద్వారా ఫలితాలు సాధించవచ్చుననేది వారి అభిప్రాయం.

చిన్న చిన్న వ్యాయామాలు చేయడం మంచిది. మానసిక ఒత్తిడికి గురయ్యేవారిలోనూ, స్థూలకాయుల్లోను ఇటువంటి నొప్పులకు ఆస్కారం వుంటుంది. కాబట్టి, ముందుగా కారణాన్ని తెలుసుకుంటే నివారణ సులువవుతుందనేది వారి అభిప్రాయం. ◆

మానసిక ఆరోగ్యం

తరచూ కోపం, చికాకు కలుగుతూ, మానసిక స్థితిగతులు గందరగోళంగా వున్నట్లయితే తగిన ఆహారంతో చెక్ చెప్పవచ్చు. పచ్చికూరగాయలు, పండ్లు తినడంవల్ల మానసిక శక్తి సమకూరుతుంది. క్యారెట్ మానసిక ఒత్తిడిని బాగా తగ్గిస్తుంది.

దీనిలో లభించే బీటాకెరొటిన్ మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. మానసిక ఆరోగ్యాన్ని అందించడంలో అరటిపండు తిరుగులేనిది. ఇది విడుదలచేసే రసాయనాలు మానసికశక్తిని ఇస్తాయి.

వీటిలోని పొటాషియం మెదడు పనితీరుపై మంచి ప్రభావాన్ని చూపుతుంది. మూడ్‌ను క్రమబద్ధీకరించడంలో ముందుంటుంది.

యాపిల్‌ను పైచర్మంతో సహా తింటుంటే ప్రయోజనం ఎక్కువ. మెదడు కణాలలోని హానికరమైన ఆక్సిజన్‌తో కూడిన రసాయన కారకాలను యాపిల్ జ్యూస్ తగ్గిస్తుంది.

పాలకూర మానసిక స్థితిగతుల్ని మెరుగుపరుస్తుంది. అలసట, డిప్రెషన్, నిద్రలేమిలవల్ల కలిగే ప్రభావాలనుంచి కాపాడుతుంది.

ద్రాక్షలో మెదడు పనితీరులో కీలకంగా వుండే విటమిన్ బి9 లభిస్తుంది. ◆

క్యారెట్ జ్యూస్

ప్రతిరోజూ క్రమంతప్పకుండా క్యారెట్ జ్యూస్ తాగుతుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఆందోళన, ఒత్తిడులను తగ్గించడంలో, నోటిలోని క్రిములను తొలగించడంలో, పంటి చిగుళ్ళను గట్టి పర్చడంలో, చెడుకొవ్వును తగ్గించి, మంచికొవ్వును పెంచడంలో క్యారెట్ జ్యూస్ ఉపకరిస్తుంది.

శరీరంలో నీటిస్థాయిల్ని సమతౌల్యంగా ఉంచడంలో క్యారెట్ సాయపడుతుంది. జ్ఞాపకశక్తిని పెంచి, మెదడును చురుకుగా ఉంచుతుంది. రక్తహీనత నుంచి పరిరక్షిస్తుంది.

శరీరంలోని విషతుల్యాలను వెలికి నెట్టడంలో సహకరిస్తుంది. హార్మోన్‌ల పనితీరును, కాలేయాన్ని శుభ్రపరిచి, ఉదరంలో వాయువును నియంత్రించే గుణం క్యారెట్‌లో వుంది.

రోజుకో గ్లాసు క్యారెట్ జ్యూస్‌ను తాగుతుంటే ఫలితాలు ఇట్టే కనపడతాయి. ◆

అసలైన ప్రయోజనం

బరువు తగ్గాలనుకునేవారు వ్యాయామాలు చేయడంతోపాటు తప్పనిసరిగా ఆహార నియమాలు పాటించాల్సిందే. నిజానికి బరువు తగ్గడంలో వ్యాయామాలకంటే ఆహారానిదే అధిక పాత్ర.

వ్యాయామాలవల్ల ఇరవై శాతం బరువు తగ్గితే ఆహారంవలన ఎనభైశాతం తగ్గుతారనేది నిపుణుల అభిప్రాయం. అయితే, వ్యాయామాలవలన మరో గొప్ప ప్రయోజనం దక్కుతుంది.

ప్రతిరోజూ వ్యాయామాలు చేయడంవల్ల బరువు ఐదుశాతమే తగ్గనీయండి కాని, మధుమేహం వచ్చే అవకాశాలు మాత్రం ఏభైశాతం తగ్గుతాయని నిపుణులు చెపుతున్నారు.

సీరియల్

హృదయం ఎక్కడున్నదీ...?

డాక్టర్ బొమ్మదేవర నాగకుమారి

కంటికి కన్పించని గాలిలో తేమ శాతం ఎంతుందో కొలిచి మరీ చెప్పగలం! కానీ నిలువెత్తు మనిషిలో ఎవరి మీద ప్రేమ శాతం ఎంతుందో ఎలా చెప్ప గలం? తను నిజంగా గంధర్వ్‌ని ప్రేమిస్తోంది. స్వయంగా విష్ణు అడిగినా వదులుకోలేనం తగా గంధర్వ్ ప్రేమలో పడిపోయింది.

అక్కడ శృతి చేసి ఉన్న వయొలిన్ తీగల్ని వ్రేళ్ళతో ఇలా తాకింది. ఓ సుమధుర రాగం ఝుమ్మంటూ...అలా కంపిస్తూనే ఉంది.

'ద మ్యూజిక్ ఈజ్ నాట్ ఇన్ ద నోట్స్ బట్ ద సైలెన్స్ ఇన్ బిట్వీన్!'


తరచుగా గంధర్వ్ చెప్పే వాక్యం తనకు గుర్తొచ్చింది. తయారై ఎప్పటిలానే మ్యూజిక్ ఎకాడమీకి వెళ్ళింది. గంధర్వ్ ఆమెని చూడగానే,

"రా! రా! అస్సలు నువ్వు నా అదృష్టదేవతవి! నువ్వు వచ్చిన తర్వాత నాకన్నిరకాలుగా కలిసివచ్చింది. యు నో? మనం మ్యూజిక్ కంపోజ్ చేసిన సినిమా సూపర్ హిట్టయ్యింది.లవ్ యు నా సంగీతలహరీ!" ఆరాధనాపూర్వకంగా చెప్పాడు.

ఇంత ఆరాధనని ఎలా కాదనుకోవటం? ఎంతో మంది అమ్మాయిలు, సింగర్స్ ఈ గానగంధర్వుని కోసం తలక్రిందులుగా తపస్సు చేస్తుంటారు?

కానీ అతను తనని ఇష్టపడుతున్నాడు. అతనే అనాయాసంగా తన మనస్సులోకి, తన జీవితంలోకి వచ్చేశాడు. ఓపక్కన అతని మనసు గెలుచుకున్నానన్న సంతోషం తనని నిలవనీయట్లేదు.

"శివరంజనీ! స్వర సుర ఝరీ తరంగానివి రాగాల సిగలోన సిరిమల్లివి! సంగీత గగనాన జాబిల్లివి..." ఆశువుగా ఒక చెవిమీద చేతినుంచుకుని ఇంకోచేతిని చాచి ఆమెని చూస్తూ మధురంగా పాడాడతను.



తన అందమ్మీద, తన శరీరమ్మీద, తన వ్యక్తిత్వం మీద, తన ప్రతిభ మీద గొప్ప ఆత్మవిశ్వాసం కలిగి నట్లనిపించేది. అతడినీ, అతని ప్రేమనీ గెలుచుకో గలిగాను కదా? అన్న గర్వం!

తనమీద తనకే ఒక అతిశయంలాంటి భావం కలుగుతోంది. ఇంత ప్రేమని, ఇంత అదృష్టాన్నీ వద్దని వెళ్ళిపోవాలా? ఎలా? ఎలా??

అలా చూస్తూ నిలబడిపోయిన ఆమె దగ్గరకు వచ్చి గంధర్వ్ ఒక్కసారిగా ఆమెను దగ్గరకు లాక్కుని ఆమె పెదవులమీద తన పెదవుల్ని గాఢంగా అదిమి ముద్దుపెట్టేసుకున్నాడు. అంతటితో కూడా ఆగలేదు. ఆమె క్రిందిపెదవిని తన పెదవులతో నొక్కిపట్టి లోపలికి లాక్కున్నాడు గంధర్వ్.

ఉక్కిరిబిక్కిరయ్యింది. ఒక్కక్షణం ఏం జరిగిందో అర్థంకాలేదు.ఆ ముద్దుతాలూకు అనుభూతితో మనసు వివస్త్ర అయిపోయింది.

తన ముఖంలోకి వెచ్చటి ఆవిర్లు ఎగజిమ్మాయ్. శరీరంలోని అణువణువులోనూ ఒక ప్రకంపనం!

ఆమె అలా నిశ్శబ్దంగా నిలబడిపోవటంతో ఆమె తన చనువుని ఎలా తీసుకుందో అతనికి అర్థం కాలేదు. అందుకే వెంటనే "బంగారూ! అయామ్ సారీ! నీ అనుమతి లేకుండా నిన్ను ముద్దుపెట్టుకో వటం నా తప్పే!" సంజాయిషీ చెప్పాడు.

ఆమెకేం సమాధానం చెప్పాలో అర్థంకాలేదు. నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"అయినా నువ్వే చెప్పు! ముద్దొస్తే ముద్దు పెట్టేసు కుంటారు కానీ నిన్ను ముద్దుపెట్టుకోవచ్చా? అని అనుమతి అడిగి, ఎవరైనా ఎవర్నయినా ముద్దు పెట్టు కుంటారా?" ఆమెని మెస్మరైజ్ చేస్తున్నట్టే అడిగా డతను. అతనలా చిన్నపిల్లాడిలా అడుగుతుంటే ఆమెకు నవ్వొచ్చింది.

"అది కాదు. నేను నీకో విషయం చెప్పాలి"

"మాటిట్ ఐ సే!" ఆమె కళ్ళల్లోకి చూస్తూ నవ్వుతూ అన్నాడు గంధర్వ్. "నేను విష్ణుని ప్రేమిస్తున్నాను. సేమ్ టైమ్ నిన్ను కూడా ప్రేమిస్తు న్నాను. అయ్ లవ్ యు టూ" నిజాయితీగా మనస్సులో మాట చెప్పింది.

● జరిగిన కథ ● 18

యశస్వికి ప్రమాదం జరిగిందన్న సంగతి గంధర్వ్‌కి ఆమే స్వయంగా ఫోన్‌చేసి చెప్పింది అని నమ్మిన విష్ణు ఈ విషయమై బాధపడుతూ ఉంటాడు. 'అసలు యశస్వి ఆ స్థితికి రావటానికి కారణం నీవే' అని అంటుంది నీతూ.

నీతూ చెప్పిన సంగతులు, విశ్లేషణలు సబబేమో అనిపిస్తాయి విష్ణుకి.

ఇంటికొచ్చిన విష్ణు, యశస్విని వయొలిన్‌ని ప్లేచేయమని అడుగుతాడు. ఆశ్చర్యపోయిన యశస్వి వయొలిన్‌ని విష్ణు ముందు ప్లేచేస్తుంది. అద్భుతంగా వయొలిన్‌ని ప్లే చేస్తున్నావని యశస్విని పొగుడుతాడు విష్ణు. ఈలోగా అనేక అంశాలపైవున్న పాటల్ని ప్లే చేస్తుంది యశస్వి.

ఆనందించిన విష్ణు తనని వివాహం చేసుకోమని యశస్విని అడుగుతాడు.

ఆశ్చర్యపోయిన యశస్వితో 'నీకు గంధర్వ్ అంటేనే ఇష్టంలే' అని దెప్పిపొడుస్తాడు.

విష్ణు అలాగనేసరికి ఏం జవాబు చెప్పాలా అని తటపటాయిస్తుంటుంది యశస్వి.

ఆ తర్వాత జరగబోయేది చదవండి.

"థ్యాంక్యూ! థ్యాంక్యూ వెరీ మచ్!" ఆనందంగా చెప్పాడు గంధర్వ్.

"నో ప్రాబ్లమ్? ఈజిట్ ఓకే విత్ యు?" ఆశ్చర్యపోతూ అడిగింది యశస్వి.

"ఎబ్‌సల్యూట్‌లీ నో ప్రాబ్లమ్!" ఆ కళ్ళల్లో అదే ఆనందం! ఒక్కసారిగా ఆమె మనస్సులో కొండంత రిలీఫ్! అయినా ఇంకా ఏదో అపనమ్మకం!

"రియల్లీ? కానీ విష్ణు ఎంత గొడవ చేశాడో..." అంటూ ఆగిపోయింది.

"దేనికి?" అతనింకా ఆశ్చర్యంగా అడిగాడు. "ఒకే టైమ్‌లో ఇద్దర్ని ఎలా ప్రేమిస్తున్నావ్? అంటాడు"

అతను తల పైకెత్తి పెద్దగా నవ్వేశాడు. "అది గ్రేట్ కాన్సెప్ట్! అది అర్థం కావాలంటే మన లాంటి క్రియేటివ్ పీపుల్‌కున్నట్టు చాలా బ్రాడ్ మైండ్ ఉండాలి!" అన్నాడు గంధర్వ్.

ఆమె అలాగే నిశ్శబ్దంగా నిలబడిపోయింది.

"ఇప్పుడు నేను ఉన్నాననుకో! నాకు తెల్సి నన్ను ఓ హీరోయిన్, ఇద్దరు టీవీ యాంకర్స్, ముగ్గురు సింగర్స్ మన గిటారిస్ట్, ఓ అయిదుగురు కాలేజ్ స్టూడెంట్స్, నీతో కలిపి ఆరుగురు సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ గాఢంగా ప్రేమిస్తున్నారు. సారీ! ఓ ఇద్దరు మెడికోస్ కూడా!" గుర్తుచేసుకుంటూ చెప్పాడు.

ఆమె మరింత ఉక్కిరిబిక్కిరయ్యింది. సరిగ్గా చెప్పాలంటే బిత్తరపోయింది. క్యాజువల్‌గా నవ్వటానికి ప్రయత్నించింది కానీ నవ్వు రాలేదు.

ఇది తప్పా? ఒప్పా? తన మనస్సు అతడ్ని కోరుకోవటం తప్పుకానప్పుడు ఇది మాత్రం తప్పెందుకవుతుంది? తన మనస్సుకి తానే సర్దిచెప్పుకుంది. రానురాను ఆమెని పొగడాలనుకున్నప్పుడల్లా అతను ముద్దులు పెట్టుకోసాగాడు.

తమ రిలేషన్‌షిప్‌లో ఉన్న ఒక 'రొమాంటిక్ ఎలిమెంట్' నెమ్మదిగా ఆమెకు అర్థమవ్వసాగింది.

అతను ముద్దుపెట్టుకున్నప్పుడల్లా ఆమెకు విష్ణు ముద్దుపెట్టుకునే విధానం గుర్తొచ్చేది. తనెక్కడ కందిపోతుందో అన్నట్టుగా విష్ణు సుకుమారంగా ముద్దులు పెట్టుకుంటాడు. గంధర్వ్ అలా కాదు.

గాఢంగా కౌగిలించుకుని, పెదవుల్ని కొరికేస్తూ ముద్దులు పెడ్తాడు. అతని నాలుకని తన నోట్లోకి జొనిపి, నాలుక కొసతో పైపళ్ళ వెనకభాగాన్ని తాకుతూ... గాఢంగా కౌగిలించుకుని, కంఠమ్మీద ముద్దుపెట్టుకోవటం చాలా ఇష్టం!

ముద్దుపెట్టుకున్న చోటల్లా మచ్చలు పడాలి! పెదవిమీద గంట్లు పడాలి! 'లవ్ స్టాంప్స్' 'ప్రేమ ముద్రలు' అంటాడు. తర్వాత బయటకు వెళ్ళటం, అందరిముందూ తిరగటం చాలా ఇబ్బందిగా ఉండేది.

ఆ తారతమ్యం గుర్తొచ్చినా ఇబ్బందిగా ఉంటుంది. గంధర్వ్ చేత ప్రేమించబడటం అంటే, అతను తనని కోరుకుంటున్నాడూ అంటే తాను 'పర్‌ఫెక్ట్' అన్న నమ్మకం కలగసాగింది. అతని మీద ఇష్టం రోజురోజుకీ పెరిగిపోతోంది. అంతర్లీనంగా ఉన్న ఒక ఇష్టం! జీవితాన్ని సరికొత్త కాంతితో వెలిగించే అతని ప్రేమ! అపురూపమైన ఆ ప్రేమ! ఎలా కాదనుకోవటం? మన మనస్సుకి నచ్చినట్టుగా ఉండటం ఎదుటివారిని నిరాశా నిట్టూర్పుల్లోకి నెడుతుంది.

ఇటు చూస్తే విష్ణుకి తనంటే ఎంత ప్రేమ? సముద్రాలు ఈదనా? నిప్పులమీద నడవనా? పర్వతాలు అధిరోహించనా? చుక్కలు కోసుకురానా? చెప్పు, నీకోసం నన్నేం చేయమంటావ్? అన్నట్టుగా ఉంటుంది అతని ప్రవర్తన!

తనకోసం ఏం చేయటానికైనా సిద్ధంగావుంటాడు. అనుకోగానే ఒక ఆప్యాయత కల్గింది. ఇంతగా ఎవరైనా ప్రేమించగలుగుతారా? అనిపిస్తుంది.

వెళ్ళి అతని ప్రక్కన ఉంటే ఎంత నిశ్చింత? ఎంత భద్రత? అంతా మామూలుగా, నార్మల్‌గా, రొటీన్‌గా ఉంటుంది. కానీ? టు బి నాట్ టు బి?

తల విదిలించిందామె.

'కంపార్ట్‌మెంటలైజేషన్ చేస్కో! ఎక్కడ ఉన్నప్పుడు అక్కడే జీవించటం నేర్చుకో!' వ్యక్తిత్వ వికాస నిపుణులు తరచుగా చెప్పేమాట గుర్తొస్తుంది.

వయొలిన్ ప్లే చేస్తున్న ఆమె ముఖంలో గంధర్వ్‌కి ఒక తన్మయత్వం కనిపిస్తుంది. ఆ క్షణంలో ఆమె



ఒకరోజున గంధర్వ్ చెప్పాడు. "నువ్వు సముద్రతీరంలో దొరికిన ఆణిముత్యానివి!వజ్రకరూర్‌లో దొరికిన వైడూర్యానివి! కళలు దైవదత్తం! భగవంతుడు నీకు శక్తిని ఇచ్చాడు.

ఇంటికో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుంటున్నాడు. ఆ ఉద్యోగానికి రిజైన్ చేసెయ్! ఫుల్‌టైమ్ వయొలినిస్ట్‌గా ఉండిపో! అనవసర విషయాలతో నీ టైమ్ వృథా చేసుకోవద్దు!"

ఆమె గుండె ఝల్లుమంది.

"గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమానికి వెళదామని..." అంది ఆమె.


ఆవిడ రెండు చేతులూ పట్టుకుని గిరగిరా తిప్పి, అడిగింది. "అత్తయ్యా! ఇప్పుడు నిజం చెప్పు!"

ఆవిడ నవ్వేసి "నిజమేనే బాబూ!" అంది.

"నువ్వు స్వామీజీల ఆశ్రమానికి వెళ్ళటమంటే మన ఫేస్‌బుక్ ప్రొఫైల్‌కి ఎవరిదో డిస్‌ప్లే పిక్ పెట్టినట్టుంది అత్తయ్యా! నీకు సూట్ అవ్వట్లేదు"

"అంతే అంటావా?" అంటూ నవ్వి, "వయసుకి తగ్గకబుర్లుచెబుదామనుకుంటాను.ఎవరూనమ్మరు! ఏం చేయను? సరేలే అసలు సంగతి ఏమిటంటే నేనూ మామయ్యా కూర్గ్ వెళుతున్నాము.





ఏదో ఆఫీస్ పని ఉందని మామయ్య ఈ బెంగళూరులో ఆగితే నేను నీతో కబుర్లు చెప్పుకోవచ్చని..." చెప్పింది.

"థ్యాంక్స్ అత్తయ్యా!" కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు.

అప్పటిదాకా ఉన్న ఒత్తిడిని అంతా యశస్వి మర్చిపోయింది. ఆవిడ మాటల మధ్యలో అడిగినట్టుగా అడిగింది కవిత, "యశూ! అసలేమయ్యిందిరా? నీకూ, విష్ణుకి ఏమైనా గొడవలొచ్చాయా?"

యశస్వికి లోలోపల ఎక్కడో అనుమానంగానే ఉంది, ఆమె ఇలాంటి టాపిక్ ఏదో తీసుకువస్తుందని. తనూ సిద్ధంగానే ఉంది. "అత్తయ్యా! మా ఇద్దరి మధ్యా గొడవలేమీ లేవు! మేము ప్రేమికులం!"

శరీరమే అతనికొక పాటలా కన్పించింది. ఆ పాటకి స్వరకల్పన చేయాలన్న ఉద్వేగం!

ఆమె పరువం పాడుతున్న జావళీలోని గమకాల్ని ఆస్వాదిస్తూ, ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లోని థిల్లానాని వీక్షిస్తూ తనని తాను మర్చిపోతూ.... చాలావరకు ఆమె అకాడమీలోనే ఉండిపోతోంది.

గంధర్వ్ మెచ్చుకున్న ప్రతిసారీ ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరంమీదకి ఎక్కి, ఒక్క గెంతు గెంతి చందమామని అందుకున్నట్టుంటుంది. అంతలోనే మనస్సులో రకరకాల భావాల కలనేత!

విష్ణు గుర్తొస్తాడు. అతని ప్రేమ గుర్తొస్తుంది. నువ్వు నాకు దేవుడిచ్చిన వరంరా! అంటాడు. విష్ణుకి తనమీద అనుమానమా?నమ్మకమా? నమ్మకమంత బలమైన అనుమానం! నమ్మకమా? నమ్మకమంత బలమైన అనుమానమా!

కానీ తను లేకపోతే విష్ణు బ్రతకలేడు. కానీ గంధర్వ్ లేకపోతే తను బ్రతకలేదు. ఎలా? ఎలా? ఇంకో ప్రక్కనుంచి గాలిలో గిరికీలు కొడుతున్న ఓ రాగం!

గతజన్మల్లో మర్చిపోయిన గంధర్వాంశ తాలూకు సుమధుర గానం!

"ఏమ్మాయ చేస్తున్నావ్ గంధర్వ్?" అడిగింది యశస్వి.

"నేను మ్యూజీషియన్‌ని, మెజీషియన్‌ని కాను" అన్నాడు గంధర్వ్.

గది తలుపుల మీద ఎవరో కొడుతున్న శబ్దమైతే ఆలోచనల్లో ఉన్న ఆమె ఉలిక్కిపడింది.


'ఈ టైమ్‌లో ఎవరబ్బా?' అనుకుంటూ వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా నీతూ! "హే యశూ! నీకోసం ఎవరొచ్చారో చూడు!" చెప్పింది.

బయటకొచ్చి చూస్తే మేనత్త కవిత! ఆవిడని చూడగానే యశస్వికి ప్రాణం లేచొచ్చింది.

ఈ మేనత్త అంటే ఆమెకీ ఆమె కజిన్స్ అందరికీ చాలా ఇష్టం! ఈ అత్త వచ్చిందంటే పండగ వచ్చినట్టే మరి! అందుక్కారణం ఆవిడ వాళ్ళందరితో తను సులువుగా కనెక్టవుతోంది.

ఆవిడ చాలా సరదాగా ఉంటుంది. ఆవిడతో ఏదైనా నిస్సంకోచంగా మాట్లాడొచ్చు.

ఆవిడను చూడగానే గబగబా ఎదురెళ్ళి "అత్తయ్యా" అంటూ కౌగిలించుకుని "ఏమిటీ విశేషం? ఇలా ఎలా వచ్చావ్?"అనడిగింది యశస్వి.



ఇప్పటికైనా కాంగ్రెస్, ఇతర ప్రత్యర్థులకు ప్రజాస్వామ్యం, ఎన్నికల సంఘం, సుప్రీమ్‌కోర్టులపై విశ్వాసం పెరగటం శుభపరిణామం.

-అమిత్‌షా, బి.జె.పి. అధ్యక్షుడు

"మరి ఆ అబ్బాయ్ పేరేమిటి?గంధర్వ్ కదూ? ఆ గంధర్వ్ సంగతేమిటి?"

"నేను అతడిని కూడా ప్రేమిస్తున్నా!" మెరుస్తున్న కళ్ళతో చెప్పింది యశస్వి.

"నీ మొహం! ఇద్దర్నీ ప్రేమిస్తున్నావా? ఒకరుండగా ఇంకొకర్ని ప్రేమించటమేమిటే?" అడిగిందామె.

"ప్రామిస్! నేను నిజమే చెప్తున్నా అత్తయ్యా! నా ఇష్టాన్ని మీకందరికీ అర్థమయ్యేలా ఎలా చెప్పాలో నాకు తెలియటంలేదత్తయ్యా!" బేలగా అంది.

ఆ నిముషం ఆ అమ్మాయ్ ముఖంలోకి చూస్తేచాలు గంధర్వ్ పట్ల ఆ అమ్మాయి ఫీలింగ్స్ ఎంత బలంగా, ఎంత సిన్సియర్‌గా ఉన్నాయో అర్థమవుతుంది.

"అమ్మడూ!ఒకఒరలో రెండు కత్తులు ఇమడవమ్మా!" చెప్పిందావిడ.

'కానీ నేను ఆ ఇద్దర్నీ నా మనసులో నిలుపుకోగలను' మనసులో అనుకుందామె. "అత్తయ్యా నువ్వు నాకంటే పెద్దదానివి. నువ్వంటే నాకు ఎంతో గౌరవం

ఉంది. నువ్వు జీవితాన్ని కాచి వడబోసి ఉంటావు కదా! ఇప్పుడు నేనున్న వయసులో ఒకప్పుడు నువ్వుండి ఉంటావు కదా!

ఒక ప్రశ్న అడుగుతాను నిజంచెప్తావా అత్తయ్యా?" అంది యశస్వి.

"తప్పకుండా!"

"నువ్వు మామయ్యని కాకుండా జీవితంలో ఇంకే మగాణ్ణీ ప్రేమించలేదా?"

ఆమె పెద్దగా నవ్వింది.

"ఎందుకు ప్రేమించలేదు? క్రికెటర్ రవి శాస్త్రిని, హీరో కమల్‌హాసన్‌ని, పైలెట్ రాజీవ్ గాంధీని ప్రేమించాను"

"అత్తయ్యా! నువ్విలా స్మార్ట్‌గా దాటేయొద్దు! నేను సీరియస్‌గా అడుగుతున్నాను. నిజం చెప్పు! నువ్వు అలా చెప్పగలిగితేనే నేను నీతో మాట్లాడ గలను" సీరియస్‌గా చెప్పింది.

అప్పటిదాకా మనసారా నవ్వటంవల్ల కాబోలు ఆవిడ కళ్ళల్లో నీళ్ళు ఊరాయి. వాటిని తుడుచు కుంటూ చెప్పింది-

"ఎందుకు ప్రేమించలేదు? ఒక వ్యక్తిని గాఢంగా ప్రేమించాను. కానీ నా కట్టుబాట్లేమిటో నాకు తెలుసు.ఆ రెండవ ప్రేమ కోసం నా సంసా రాన్నీ, నా భర్తనీ, నా పిల్లల్నీ, సమాజంలో నా స్థానాన్నీ ఫణంగా పెట్టలేకపోయాను. అందుకే నా మనసును చంపుకున్నాను" అంది కవిత.

"దేర్ యు ఆర్ అత్తయ్యా! నువ్వంటే ఓకే! మరి అప్పట్లో నీ స్నేహితురాళ్ళల్లో ఇంకెవ్వరికీ ఇలాంటి పరిస్థితి ఎదురవ్వలేదా?" అడిగింది.

"లేదు అని నేను చెప్పలేను" అందామె.

"మరి వాళ్ళేం చేశారత్తయ్యా?" అంటూ సూటిగా ప్రశ్నించింది యశస్వి.

"పెళ్ళయిన తర్వాత ఒక వ్యక్తికి కమిట్ అయిన తరువాత ఇంకొక వ్యక్తిమీద ప్రేమ ఏర్పడితే వాళ్ళేం చేశారత్తయ్యా?" ఇంకా వివరంగా అడిగింది.

కవిత కళ్ళముందు ఎన్నెన్నో దృశ్యాలు కదలాడాయి. రహస్యంగా, దొంగచాటుగా, భయం భయంగా బయట ఎక్కడో తన 'రహస్య ప్రేమికుని'తో ఎవరికీ తెలీకుండా కొద్దిసేపు గడిపి,

మళ్ళీ ఏం ఎరగనట్టు ఇంటికొచ్చి భర్తముందు నటిస్తూ, సామాజిక భద్రతని ఇచ్చే కాపురాన్ని కొన సాగించిన స్నేహితురాళ్ళు ఎంతోమంది ఆమె కళ్ళ ముందు మెదిలారు.

వాళ్ళు ఒక మొండిధైర్యమైతే చేశారు కానీ ఆ రెండు రకాల జీవితాల్లో వాళ్ళెంత ఘర్షణ, బాధ, దుఃఖం అనుభవించారో ఆ పైవాడికే తెలియాలి!

"నిజం చెప్పత్తయ్యా! ఇలాంటి పరి స్థితి ప్రపంచంలో నీకు తెల్సినవాళ్ళల్లో ఇప్పటివరకూ ఎవరూ ఎదుర్కోలేదా?" ప్రశ్నించింది యశస్వి.

ఎవరూ ఎదుర్కోలేదని ఎలా అబద్ధం చెబుతుంది? అలాగని నిజమూ చెప్పలేని



పరిస్థితి! ఇప్పుడేం చెప్పాలి? కవితకి అర్థం కాలేదు. అక్కడ తన రాకకై ఆతృతగా ఎదురుచూస్తున్న తల్లికీ, వదినకీ తను వెళ్ళి ఏం చెప్పాలి?

ఇటువైపు చూస్తే లోకవిరుద్ధమైనా తన మేన కోడలి వాదన కరెక్ట్‌గానే తోస్తుంది.


"గంధర్వ్‌ని మర్చిపొమ్మని నీకు నేను చెప్పటం లేదు, నేను చెప్పినా నువ్వు మర్చిపోలేవు. నాకా సంగతి తెలుసు" చెప్పిందావిడ.

"అత్తయ్యా! ప్రేమ ఎంతబలీయమైనదో తెలుసా? ఆ మ్యాజిక్ ముందు మన మనశ్శరీరాలు, నైతికనియమాలు, కట్టుబాట్లు ఏవీ నిలబడవ్! ఆ ప్రేమ ముందు మనమలా మోకరిల్లిపోతాం! అంతే!" చెప్పింది.

"అస్సలు నీకు గంధర్వ్ పట్ల ఉన్నది ప్రేమో, ఆకర్షణో నువ్వు అర్థం చేసుకోవాలి" చెప్పిందావిడ.

"ఏది ప్రేమో, ఏది ఆకర్షణో తెలుసుకోవటానికి 'లిట్మస్ టెస్ట్'లా ఏదన్నా ఒక టెస్ట్ ఉంటే బావుండు కదా అత్తయ్యా!" అమాయకంగా అడిగింది యశస్వి.

అంటరానితనం భారత సంస్కృతీ, సాంప్రదాయాలకు పూర్తి వ్యతిరేకం.
-వెంకయ్యనాయుడు, ఉపరాష్ట్రపతి



ఊహించని ఆఫర్

తెలుగులో కొన్ని ప్రాజెక్టులు చేజిక్కించుకున్న ఆకాంక్షసింగ్ శాండల్‌వుడ్‌కు సన్నద్ధం అయింది. "నాకు కన్నడ అవకాశం త్వరితంగా వచ్చింది.

అవకాశం వచ్చినప్పుడు చెయ్యాలా? వద్దా? అన్న మీమాంసలో ఉండిపోయాను. కాని, ప్రాజెక్టుకు సంతకాలు చేయాల్సిందిగా నా స్నేహితులు ప్రోత్స హించారు. నేనస్సలు ఊహించనే లేదు.

సందీప్ వంటి నటుడితో కలసి పనిచేయడానికి ఎగ్జయిట్ అవుతున్నా. కన్నడ డిక్షన్ క్లాసులు తీసు కుంటున్నా. దక్షిణాదిలో మంచి పేరు, గుర్తింపు రాగలవని ఆశిస్తున్నాను" అని చెప్పింది.

ఆవిడకి జాలేసింది. యశస్వి చేతిని తన చేతుల్లోకి తీసుకుని కవిత అంది. "నువ్వు రెండు పడవల మీద కాళ్ళు పెట్టి ప్రయాణం చేస్తున్నావ్. అది నీకే ఒత్తిడినీ, అసౌకర్యాన్నీ కలగజేస్తుంది"

"అలా ఏం లేదత్తయ్యా! నేను ఆనందంగానే ఉన్నాను" వెంటనే చెప్పింది.

"ఇక్కడ నీకు అర్థంకాని విషయం ఒకటుంది. నువ్వున్న ఈ చిత్రమైన రిలేషన్‌షిప్‌లో పురుషుడికి ఎలాంటి సామాజిక బాధ్యతా లేదు. అలా లేనిచోట స్త్రీకి భద్రత ఉండదు" చెప్పిందావిడ.

"అత్తయ్యా! జీవితంలో భద్రత ఒక్కటే సరిపోతుందా? మనసుకి సంతృప్తి అవసరంలేదా?"

"సంతృప్తి అనేది కేవలం ఒక మానసిక భావన మాత్రమేనమ్మా! మనసుని సంతృప్తిపెడదామని నువ్వనుకుంటే కోరికష్టాలు తెచ్చుకున్నట్టే!

మనసు కోతిలాంటిది. ఒకచోట నిలకడగా ఉండ కుండా కుప్పిగంతులు వేస్తూనే ఉంటుంది. అది అడిగిందల్లా ఇస్తూపోయావనుకో! ఒకరోజున నువ్వు ఇవ్వలేనివీ, ఇవ్వకూడనివీ అడుగుతుంది.

ఆ రోజైనా దుఃఖమే మిగులుతుంది.అందుకే మన మనస్సు ఒక కోరిక కోరగానే మన వివేకం, విచక్షణ పని చేయటం మొదలుపెట్టాలి!" చెప్పిందావిడ.

"ఏమో అత్తయ్యా! నేనిప్పుడు ఆ ఇద్దరి ప్రేమలో ఆనందంగా తడిసి ముద్దవుతున్నాను" చెప్పింది.

"ఐ అండర్‌స్టాండ్! ఇలా ప్రేమలంటూ ఆగిపోతే కుదరదమ్మా? ముందుకెళ్ళాలి! పెళ్ళి చేసుకోవాలి! మనిషన్నాక తోడు అవసరంకదా?"

"ఏమోలే అత్తయ్యా! నేను మనిషిని కానేమో! నాకు పెళ్ళిచేసుకునే అర్హత లేదేమో? అస్సలు నేను ప్రేమకే తప్ప కట్టుబాట్లతో కూడిన ఆ వివాహ జీవితానికి పనికిరానేమో?"

"అలా ఎలా అనుకుంటున్నావ్?" ఆవిడ ఆశ్చర్యంగా అడిగింది.

"అవునత్తయ్యా! ఇప్పుడు మా జనరేషన్‌లో ప్రేమఅనేది ఒకప్పటి ఫార్మాట్‌లో లేదు. నా ఫ్రెండ్స్‌లోనే ఇద్దరమ్మాయిలు



నో స్మోకింగ్

‘వీరె ది వెడ్డింగ్’లో చైన్ స్మోకర్‌గా నటించిన బాలీవుడ్ భామ స్వరభాస్కర్ ఇకమీదట తెరపై ‘నో స్మోకింగ్’ అంటూ ఖచ్చితంగా చెప్తున్నది.

“నేనికమీదట సినిమాల్లో నా పాత్రకోసం అస్సలు సిగరెట్ కాల్చను. అటువంటి పాత్రను ఎవరైనా ఆఫర్ చేస్తే ‘నో’ చెప్పేస్తా.

‘వీరె ది వెడ్డింగ్’ కోసం దర్శకుడు నన్ను స్మోక్ చెయ్యమన్నారు. నా పూర్తి జీవితంలో మోస్ట్ వరస్ట్ టేస్ట్. సరిగ్గా స్మోక్ చేయడంలేదని దర్శకుడు అన్నారు. మొత్తానికి కన్విన్స్ చేశాననుకోండి.

ఇక మీదట మాత్రం నేను స్మోక్ చేసే పాత్ర చెయ్యను” అంటూ తేల్చేసింది.

ప్రేమించుకుని పెళ్ళిచేసుకుని కలిసి జీవిస్తున్నారు. అమ్మాయిల్లో ఈ లెస్బియన్స్‌లాగే అబ్బాయిల్లో గేలు కూడా ఉన్నారు.

కొంతమంది ఆడా మగా పెళ్ళిలేకుండా ‘లివింగ్ టు గెదర్’లో ఇష్టమైనన్నాళ్ళూ కలిసి ఉంటున్నారు. తర్వాత విడిపోతున్నారు. ఈ సువిశాల ప్రపంచంలో ఎంతోమంది పెళ్ళిచేసుకోకుండా అవివాహితులుగా మిగిలిపోయారు. నేను కూడా అలాగే ఉండిపోతానేమో” యశస్వి నవ్వింది.

“భాభా అవేం మాటలు? పెళ్ళి చేసుకోకుండా ఉండిపోతే ఎలా? ఇప్పుడు వయస్సులో ఉన్నావ్! అంతా బానే ఉంటుంది. కానీ తర్వాత జీవితం ఇప్పుడున్నంత బావుండదు.

అయినా నా మాట విను! ఎంచక్కా పెళ్ళిచేసుకుంటే నీకంటూ ఓ జీవితం...ఓ భర్తా... పిల్లలూ” అంది కవిత.

“పిల్లలకోసం పెళ్ళి చేసుకోవాలంటావ్?” యశస్వి అంది.

“అఫ్‌కోర్స్! ఏ వయసుకి ఆ ముచ్చట! ఈ వయసు దాటి పోయిన తరువాత పిల్లలు పుట్టాలన్నా ఎన్ని ఇబ్బందులు? ఒక వయస్సు దాటిన తర్వాత పిల్లల్ని కనటం అంటే ఒకరకంగా రిస్క్ తీసుకోవటమే అని, అప్పుడైనా ఆరోగ్యవంతమయిన పిల్లలు పుడతారన్న గ్యారంటీ ఉండదనీ డాక్టర్లే చెబుతున్నారు కదా?” అంది కవిత.

“పెళ్ళి చేసుకోగానే పిల్లలు పుట్టేట్టయితే ఇన్ని సంతాన సాఫల్య కేంద్రాలు ఎందుకుంటాయ్ అత్తయ్యా?” తిరుగులేని ప్రశ్న వేసింది యశస్వి.

“ఊర్కోవే! వాళ్ళకేవో సంతానలేమి సమస్యలు ఉండి ఉండొచ్చు...”

“అలా అంటే ఓకే! పిల్లలే కావాలనుకుంటే దేశం నిండా ఎన్నో అనాథ శరణాలయాలు ఉన్నాయ్! ఇంకా ఆ మాటకొస్తే ఈ తరంలో చాలామంది అమ్మాయిలు పిల్లల్ని కనొద్దు అనుకుంటున్నారు. నీ లెక్క ప్రకారం వాళ్ళంతా పెళ్ళిచేసుకోనవసరంలేదంటావా?”

“అమ్మాయ్! వాళ్ళందరి సంగతి వదిలెయ్! నీ సంగతి చెప్పు! వయస్సంతా అయ్యాక అప్పుడెప్పుడో నీకంటూ పిల్లలు కావాలన్పిస్తే అప్పుడేం చేస్తావ్? జరిగిపోయిన కాలాన్ని వెనక్కి తీసుకురాలేవ్ కదా?”

“నేను ఒక గైనకాలజిస్ట్ ఫ్రెండ్ సలహా తీసుకున్నాను. నీకు చెబుతాకానీ నువ్వు కోప్పడకూడదు”

“ఏమిటది?” అనుమానంగా చూస్తూ అడిగింది.

“వయస్సులో ఉన్నప్పుడు మన శరీరంలో ప్రతి నెలా విడుదలయ్యే అండాల్ని తీసి ‘ఓవమ్ బ్యాంకు’లో పదిలపరుచుకోవచ్చు!

చాలామంది బిజీ బిజీ హీరోయిన్లు, టాప్ మోడల్స్ అలానే ప్రిజర్వ్ చేసుకుంటారంట. వాళ్ళు ఆ ఫీల్డ్ నుంచి రిటైర్ అయిన తర్వాత పెళ్ళిచేసుకున్న వ్యక్తి వీర్యకణాలు తీసి ఈ అండాల్ని టెస్ట్ ట్యూబ్‌లో డాక్టర్లు ఫలదీకరణ చెందిస్తారు. తర్వాత ఆ పిండాన్ని వారి గర్భ సంచిలో డాక్టర్లు ప్రవేశపెడతారు.

అప్పుడు వీళ్ళు ఆ పిండాన్ని తొమ్మిది నెలలు మోసి ఒక శిశువుకి జన్మనిస్తారు” చెప్పిందామె. ‘అదీ కుదరకపోతే ‘సర్రోగేట్ మదర్స్’ కోసం, ఆ తర్వాత ‘వెట్ మదర్స్’ కోసం పరిగెత్తుతారు”

“అవన్నీ మీకెందుకే? ఎటుపోతున్నారే మీరంతా? అది వాళ్ళ దౌర్భాగ్యం! డబ్బుకోసం నానా గడ్డీ కరవటం అలవాటైన వాళ్ళు. వాళ్ళ తిప్పలేవో వాళ్ళు పడతారు. మీరు వాళ్ళనిచూసి హెయిర్‌స్టయిల్‌మార్చుకోండి. కావాలంటే డ్రెస్సింగ్ స్టయిల్ మార్చుకోండి. అంతేగానీ లైఫ్ స్టయిల్ మార్చుకుని భ్రష్టుపట్టిపోకండి. ప్లీజ్!” తీవ్రంగా, కోపంగా చెప్పింది.

“అత్తయ్యా! సెంటీ అయిపోకు! నాకు తెల్సు! పిల్లల్ని కనటమంటే గాఢంగా ప్రేమించే మగాడితో శరీరాన్ని పంచుకుని తల్లినై, ఆడదానిగా నేనుమాత్రమే ఇవ్వగల కానుకగా తన ప్రతిబింబాన్ని తనకివ్వటమే!” అంది యశస్వి. “హమ్మయ్య! ఇప్పుడొచ్చావ్ దారికి నా బంగారు కోడలా!” మెటికలు విరిచింది.

“అవునత్తయ్యా! నేనిప్పుడు విష్ణుకి ఒక కూతుర్నీ, గంధర్వ్‌కి ఒక కొడుకునీ కని నా ప్రేమకానుకలుగా ఇవ్వాలనుకుంటున్నా” అంటూ నవ్వింది.

ఆవిడ తల బాదుకుంది. “ఒక్క సంగతి గుర్తుంచుకో యశూ! జీవితం నువ్వు అనుకున్నంత ఎడ్వెంచరస్‌గా ఉండదు. నువ్వే పనిచేసినా సమాజపు ఆమోదం ఉండాలి! లేదంటే సమాజం నిన్ను గౌరవించదు. నీకు రకరకాల లేబుల్స్ అతికిస్తుంది. కోడై కూస్తుంది. కుక్కయి మొరుగుతుంది”

‘నాకు ఎవరి జడ్జిమెంట్లూ అవసరం లేదత్తయ్యా!’ మనస్సులోనే అనుకుంది యశస్వి.

‘నీవు నేనైతే నిన్ను నాలోనే కందు
నేను నీవుగా ఉంటే నీలోనే ఉందు.

యశూ! నీ ‘నన్ను’ నీకే ఇవ్వనా?

విష్ణు ఆ ఫోటో వంకే చూస్తున్నాడు. ఆ ఫొటోలో యశస్వి కళ్ళు నవ్వుతూ మెరుస్తున్నాయ్! మెరుస్తూ కవ్విస్తున్నాయ్! ఆ ఎర్రని పెదవుల్లో కెంపులు ఎర్రని కాంతులీనుతున్నాయ్! అదేం చిత్రమో! ఆ పెదవులు ఎప్పుడూ నవ్వుతూనే ఉండేవి! ఆమె నవ్వు అతని చెవులకి గుసగుసగా ఇంకా వినిపిస్తూనే ఉంది.

ఫోటోలోనో ఆమె నుదుటి మీద పెదవుల్ని ఆనించి ఆనించకుండా ముద్దుపెట్టాడు.

ఆమె ఉప్పొంగుతున్న సముద్రంలా ఉత్సాహంగా ఉండేది. సముద్రాన్ని ఓ కూజాలో బంధించలేం కదా? అలానే ఆమె ఉత్సాహాన్ని కూడా... అనుకుంటూ ఉండేవాడు. ఆ ఫోటోలో యశస్వి పెట్టుకున్న మల్లెల సువాసన ఇంకా తన గుండెలో తాజాగానే ఉంది.

తన ప్రాబ్లమ్ తెలిసినట్టుంది. సడెన్‌గా ఒకరోజు రేష్మ కాల్ చేసింది. “అస్సలు ఆ యశు తన గురించి తానేమనుకుంటోంది?


తాను స్వర్గాన్నుంచి దిగివచ్చాననుకుంటుందా? తానేమన్నా ప్రపంచానికి ఒక అద్భుతమైన కానుక అనుకుంటోందా?” కోపంగా అడిగింది. **ఇంకా ఉంది**



మహిళా అక్షరాస్యత, సాధికారతలో ఉత్తరభారత రాష్ట్రాలు బాగా వెనకబడున్నాయి.

-శశిథరూర్, కాంగ్రెస్ ఎమ్.పి.

ఒత్తిడికి చెక్


Courtesy GRUHASOBHA

దైనందిన జీవితంలో ప్రతిఒక్కరికి ఏవో ఒక అంశంలో ఒత్తిడి అనేది అత్యంత సహజం. దీన్ని ఎదుర్కోవడం అనేది మన చేతుల్లోనే ఉంటుం దన్న సంగతిని మరువకూడదు. దాన్ని ఎదుర్కోవడానికి తగిన కిటుకులు తెలిస్తే చాలు.

వ్యక్తిగత విశ్వాసం :

చాలాసార్లు చాలామంది చేసేటువంటి తప్పిదం ఏమిటంటే తమలోని బలాలను విస్మరించి, తమపై తాము సందేహపడడం.

ప్రతి ఒక్కరూ తరచుగా తమలో గల శక్తిస్థాయి లను గుర్తుచేసుకుంటూ, వాటిపై ఫోకస్ చేస్తుండాలి. ఇందుకు సన్నిహితులు, కుటుంబసభ్యుల మద్దతు కూడా చాలా అవసరం.

మరీ ఎక్కువ ఒత్తిడిగా ఉన్నప్పుడు తనలోని బలాలగురించిన జాబితా రాసుకోవాలి. మద్దతు వ్యవస్థను అంచనా వేసుకోవాలి. ఒత్తిడిని ఏ విధంగా, ఎందుకు ఎదుర్కోవాలో అవగాహన చేసుకోవాలి.

పరిస్థితి అంతా రాత్రికిరాత్రి మారిపోదు. అయితే, ఆత్మవిశ్వాసం ఒత్తిడితో పోరాడి, పరిష్కరించుకోవ డానికి అవసరమైన శక్తిని ఇస్తుంది.

ఆరోగ్యమే మహాభాగ్యం :

ఇది ఎప్పటినుంచో వినేమాటే. పూర్తి వాస్తవంగల సూత్రం. ఒత్తిడిని తగ్గించుకోవడానికి అవసరమైన కార్టిసోల్‌హార్మోన్ విడుదలకు ఆరోగ్యం అవసరం.

దైనందిన కార్యక్రమాల్లో వ్యాయామాలను తప్పని సరిగా జోడించాలి. ఇవి యాంగ్జయిటీని తగ్గించగల ఎండార్ఫిన్లను విడుదలచేస్తాయి.

మంచి ఆహారం తింటుండాలి. ఆకుకూరలు, లో-ఫ్యాట్ కాటేజ్ ఛీజ్, బాదంపప్పులను ఆహారంలో భాగం చేసుకోవాలి. విటమిన్లు శరీరాన్ని శక్తివంతంచేసి, ఒత్తిడిని ఎదుర్కోగల శక్తిని అందిస్తాయి.

పాదాన్ని రోలింగ్ పిన్‌పై రోల్ చేయడంవల్ల టెన్షన్ విడుదలవుతుంది. ప్రాణాయామాలు ప్రాక్టీస్ చెయ్యడంవల్ల ఆక్సిజన్ సరఫరా సక్రమంగా జరిగి, హార్ట్‌రేట్ నెమ్మదిస్తుంది. ఒత్తిడిని తగ్గించుకోవడంలో ఇది చక్కని ప్రత్యామ్నాయం.

కుటుంబసభ్యుల మద్దతు :

ఎక్కువగా ఒత్తిడిని ఎదుర్కోవడానికి కారణం పని ఒత్తిడి అవుతుంటుంది. ఉద్యోగం, వృత్తి నిర్వహ ణల్లో ఒత్తిడి ఎదురైనప్పుడు, దాని ప్రభావం జీవితం లోని ఇతర భాగాలపై పడుతుంటుంది. ఎమోషన్లు తారు మారవడమే ఇందుకు కారణం. ఒత్తిడిని ఎదు ర్కోవడంలో ప్రధా నంగా చేయాల్సిన పని ఎమోషన్ల క్రమబద్ధీ కరణ. వ్యతిరేక దిశగా సాగాలి. అంటే- ఉదా హరణకుకోపంగా ఉన్న ప్పుడు నెమ్మదిగా,మన్న నగా మాట్లాడేందుకు ప్రయత్నించాలి.

సామాజిక సపోర్ట్:

ఒత్తిడిని ఎదుర్కోవ డంలో మరో మంచి మార్గం సామాజిక మద్దతు. చక్కని మార్గం.తమకు నచ్చిన, తాము మెచ్చినవారితో మాట్లాడడంవల్ల యాభై ఏడుశాతం మంది ప్రజలు తక్కువగా ఒత్తి డికి లోనవుతుంటారని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.

విశ్వసనీయ వ్యక్తులు ఒత్తిడిని నివారించడంలో సపోర్టివ్‌గా వుంటారు. కాబట్టి ఆందోళనలన్నిం టినీ బుర్రలోనే ఉంచుకోకుండా, వాటి భారాన్ని ఇత రుల మద్దతుతో దించేసుకోవాలి.

అతి కూడదు :

చాలామంది చిన్నచిన్న సవాళ్ళనుసైతం భూత ద్దంలో చూసుకుని అనవసరంగా ఆందోళనపడుతుం టారు. ఉన్న వాస్తవంకంటే ఎక్కువగా ఆలోచించు కుని ఆందోళన పడుతుంటారు. పదింతలు ఎక్కువ చేసుకుని ఒత్తిడి పడుతుంటారు.

దీనివల్ల పరిస్థితి క్లిష్టంగా అయిపోతుంటుంది. ఇలా అన్పించినప్పుడల్లా, అటువంటి అతిభావాలకు అడ్డుకట్ట వేస్తుండాలి. చిన్న విషయాన్ని పెద్దది చేసు కునే ఆలోచనలకు స్వస్తి చెప్పాలి.

చిన్నచిన్న లక్ష్యాలు :

ఒత్తిడిని ఎదుర్కోవడంలో ముఖ్యమైన విషయం స్మార్ట్‌గా లక్ష్యాలు ఏర్పరచుకోవడం. అవి సింపుల్‌గా, స్పష్టంగా, ప్రయోజనకరంగా ఉండాలి.

అర్థవంతంగా, స్ఫూర్తిదాయకంగా వుండాలి. సాధించగలిగేవిగా, వాస్తవికంగా సాగాలి. హేతు బద్ధంగా, ఫలితాల దిశగా ఉండాలి. సమయపాలన, పరిమితి ఉండాలి. ఖచ్చితమైన లక్ష్యం ఉండడం ముఖ్యం. ఒకేసారి అనేక అంశాలపై దృష్టి కేంద్రీకరిం చడం సాధ్యపడదు. ఒక్కవిషయాన్ని లక్ష్యం చేసు కుంటే ఒత్తిడిపడాల్సిన అవసరం రాదు.



తాతయ్యా

"నాన్న ఆఫీసుకు డుమ్మా కొట్టాడు తాతయ్యా" అంటూ అక్కా నేనూ ఇద్దరం జమిలిగా తాతయ్యకు రిపోర్టు చేశాం.

"ఎందుకుటా" అడిగాడు తాతయ్య.

"ఏమో మాకుమాత్రం ఏం తెల్సు.... వచ్చినాక క్లాసు పీకు తాతయ్యా... మేం ఎప్పుడన్నా స్కూలు ఎగ్గొడితే ఎంత తిట్టేవాళ్ళో తెల్సా..." చెప్పాను.

"ఏదో పనుండబట్టే సెలవు పెట్టుంటాడు లేరా..." తాతయ్య సమర్థించబోయాడు.

"అదేం కాదు... పెద్ద టీనేజీ లవర్స్‌లా అమ్మానాన్నా సోకు చేసుకుని మరీ వెళ్ళారు. నాన్నవాళ్ళ ఆఫీస్‌లో కొలీగ్ ఇంట్లో ఫంక్షన్ అట" అక్క చెప్పింది.

"మరికనేం... కారణం తెలిసిందికదా..." బోసి నోటితో నవ్వాడు తాతయ్య."అదేం మాకు తెలీదు. వాళ్ళు వచ్చినాక నువ్వు నాన్నను తిట్టాల్సిందే" గట్టిగా చెప్పాం ఇద్దరం తాతయ్యతో.

"ఎందుకనర్రా... మిమ్మల్ని తీసుకెళ్ళలేదనా..." అంటూ నా తలను పట్టుకుని ఊపుతూ చిన్నగా నవ్వాడు తాతయ్య.

"మరే..." చెప్పాం.

నిజం చెప్పొద్దూ... అమ్మానాన్నా ఫంక్షన్‌కు వెళ్తూ వివరం చెప్పే వెళ్ళారు.

"అందరం ఫంక్షన్‌కువెళ్తే ఇంట్లో తాతయ్య ఒక్కడే ఉంటాడు కదా, మీకు తెల్సుకదా... తాతయ్యతో కబుర్లు చెబుతూ కాలక్షేపం చెయ్యండి... వచ్చేటప్పుడు మీకిష్టమైన స్పెషల్ బర్గర్ తెస్తాంలే..."

నాన్న తాయిలం తెస్తానంటే నవ్వేసి సరే అనేంత చిన్నపిల్లలం కాదు. అక్కయ్య ఇంజనీరింగ్ పూర్తి చేసింది. క్యాంపస్ సెలక్షన్‌లో ఓ ఎమ్.ఎన్.సి కంపెనీలో సెలక్ట్ అయ్యింది. ఆర్డరుకోసం ఎదురు చూస్తోంది. నేను డిగ్రీ పూర్తిచేసి సివిల్స్‌కు ప్రిపేరవుతున్నాను. ఒక విధంగా మేం చాలా అదృష్టవంతుల మనే చెప్పాలి. మా అమ్మానాన్నా మమ్మల్ని కొట్టీ,తిట్టీ షరతులు పెట్టీ పెంచలేదు. స్నేహితుల్లా మసలలేదు... మా మధ్య ఉన్నది బంధుత్వం కాదు... అంతకు మించిన గొప్ప స్నేహం!

"తాతయ్యా... నాన్న స్పెషల్ బర్గర్ తెచ్చాడు... రండి భోంచేద్దాం..."తాతయ్యని పిలిచాను.

"ఏమిటర్రా అది..." అడుగుతూనే వచ్చాడు తాతయ్య. పెద్దసైజు బర్గర్ నీట్‌గా ప్యాక్‌చేసివుంది.

అతికించిన టేపును విప్ప దీస్తూ అట్టపెట్టెను తెరిచాను. బర్గర్‌ని పైకి తీశాను. రెండు చక్కగా కాల్చిన రొట్టెల మధ్య టమోటా, ఉల్లి, పుదీనా, క్రీము వగైరా సంరంభాలతో కమ్మటి వాసన వస్తోంది.

అక్కని చాకు తెమ్మని చెప్పాను.

"ఏమర్రా రొట్టేనా అది.మేం జ్వరం వచ్చినప్పుడు తింటూంటాములే... ఆ ఉల్లిపాయ, పచ్చిమిర్చి చద్దిలో కలుపుకుని తింటుంటే ఆ రుచే వేరు. ఏమిటర్రా ఇది పచ్చికూరగాయలూ... పచ్చి పాలక్రీమున్నూ..." పెదవి విరిచాడు తాతయ్య!

అక్కయ్యకూ నాకూ ఉడుకుమోత్తనం వచ్చేసింది.

టి.ఎస్.ఆర్.కె.గాంధీ
సెల్ : 98482 86410

₹10,000 బహుమతి కథ

"ఆ... నువ్వలా అంటావులే తాతయ్యా... ఇంతలా నోరె తెరిచి మొత్తంగా ఒక ముక్కను కొరికి తింటుంటే.... ఆహా ఏమి రుచి అనాల్సిందే... అయినా నీకు తినేందుకు పళ్ళెక్కడున్నాయిలే..." అంటూ తాతయ్యను వెక్కిరించాము.

అక్క తెచ్చిన చాకుతో బర్గర్‌ని ముక్కలుగా కోశాం. తాతయ్యకో ముక్క జరిపి... వాటి పని పట్టడంలో మునిగిపోయాము.తాతయ్యను ఆట పట్టించడమూ మానలేదు. "హబ్బో...అంత గొప్ప రసాస్వాదన గామోసు తమరికి... ఏదీ తమరి భోజన చాతుర్యం చెప్పండోసారి...విని తరిస్తాం"వెక్కిరిస్తూ అడిగింది అక్క!

కచేరీకి ముందు 'స-ప-స' పాడే గాయకుళ్ళా గొంతు సవరించుకున్నాడు తాతయ్య.

"ఔనర్రా" ద్విగుణీకృతోత్సాహంతో మొదలు పెట్టాడు తాతయ్య.

"బయట సన్నగా చిరుజల్లు పడుతుండాలి. చల్ల గాలి మంద్రంగా వీస్తుండాలి.కడుపులో ఆకలి కరకర మంటుండాలి. బాసింపట్టు వేసుక్కూర్చుని... ఇంత అరిటాకు ముందేసుకుని ఆకులో ముద్దపప్పూ,కొత్తావకాయ పచ్చడీ జమిలిగా కలిపి ఇంత పెద్ద గుంట చేసి ఆ గుంట నిండుగా కమ్మని ఘృతమూ -

పొగలు గ్రక్కుతున్న సన్నజాజిపూవుల్లా తెల్లగా మెరుస్తున్న అన్నంపై నాలుగు గుండ్రాలుగా కాచిన నెయ్యీ, ప్రక్కనే కాసిన్ని గుమ్మడి వడియాలు పెట్టుకుని పరిషేచనంగావించి గాయత్రిని తల్చుకునీ, అమృతోపస్తరణమసి అంటూ అన్నాన్ని ఆదేశిస్తూ... పంచప్రాణాలనూ జలంతో స్వాహాచెప్పి... గుండ్రాయంత ముద్దలు చేసి మింగుతుంటే...

మా పిచ్చిగాని, దీని రుచి ముందు మీ బోడిబర్గర్లూ, పిజ్జాలూ పనికొస్తాయట్రా..." తాతయ్య కళ్ళు మెరుస్తున్నాయి చెప్పుకుపోసాగాడు.

"ఆనక... ఆనకేమిటో..." అంటూ అక్క మరింత ప్రోత్సహించింది.

"ఏముందీ... పప్పూ, పచ్చడితో ఒకటి రెండు వాయిలూ, ఆనక దప్పళం... ఆనపకాయ, దోస, టమాటా,ఏమిటీ మీ బస్తీలో దొరికే రసాయనిక కూరగాయలుగాదు... స్వచ్ఛంగా పండే సేంద్రియ కూరగాయలు, సాంబారు పొడి,

ఇదీ బజార్లో దొరికేది కాదొరే... మీ నానమ్మ స్వయంగా రోట్లో దంచిన సాంబారు పొడి... ఆ ఘుమఘుమలకే సగం కడుపు నిండిపోతుందనుకో ఆకలి ద్విగుణం - త్రిగుణం అవుతుంది"

"అదేమిటి పరస్పరవిరుద్ధంగా" అంటూ అరిచింది అక్క. "ఇలాగైతే నేను చెప్పనుస్మీ" పొట్ట బుగ్గల్ని మరింత బిగించాడు.

"లేదులే... చెప్పు మా తాతవిగా" బ్రతిమలాడింది అక్క. "మరి... కానూ..." అనేసి చెప్పసాగాడు.

"దప్పళంతో మరోవాయీ... అప్పడాలు ఉండాల్సిందే... ఆఖరికి గడ్డపెరుగు..మీగడ దట్టంగా ఇంత మందాన ఉండేది సుమా...

నలుసంత లవణం వేసుకుని ఆ పళానలాగించేసి చేతులువ్రేళ్ళూ నాక్కుంటూ తింటే మీ నానమ్మ నాకేసి ఎంత తృప్తిగా చూసేదనీను... ఇద్దరికోసం వండిన వంట నేనొక్కడ్నీ లాగించేసేవాడ్ని... తిరిగి తను ఎసరు పొయ్యి మీద పెట్టాల్సిందే..."

"అంతేనా..." తేలికగా అనేసి ఎగదోశాను.

"అంతేనా... ఏమిట్రా చెవటాయ్... ఇంత వక్క పొడి..." అన్నాడు తాతయ్య.

"పోదురూ బడాయి... నోట్లో ఒక్క పన్నూ లేదుగాని..." అక్కయ్య వెక్కిరించింది.


నానమ్మకు క్యాన్సర్... నానమ్మను టౌన్‌లోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో చేర్పించాడు నాన్న. దాదాపు రెండు లక్షలుపైన ఖర్చు చేయించి ఆనక తీరికగా చెప్పారు డాక్టర్లు...

"క్యాన్సర్ బాగా ముదిరిపోయిందనీ, నాలుగో స్టేజి కూడా దాటిపోతోందనీ రెండుకిడ్నీలు పాడై పోయాయనీ... రోజుల మనిషేననీ" నాన్న ఈ విషయం తాతయ్యకు తెలియకుండా దాచాడు.

"ఏమీ లేదు నాన్నా... జబ్బు చాలావరకు తగ్గిందట.మరో ఆరునెలలు ఈ మందులు వాడితే పూర్తిగా కోలుకుంటుందని చెప్పారు. డిశ్చార్జి చేశారు" నాన్న చెప్పాడు తాతయ్యతో. నాన్న చెప్పిన మాటలను తాతయ్య నమ్మాడో లేదోగానీ, నాన్న కళ్ళల్లోకి నిజంకోసం వెతకడం నేను చూశాను. నాన్న కళ్ళు తిప్పుకోవడమూ నేను గమనించకపోలేదు. కొంతసేపు మౌనంగా ఉన్న తాతయ్య చెప్పాడు.

"నువ్వూ ఉద్యోగానికి సెలవుపెట్టి వుండడం... ఇవన్నీ ఎందుకు... ఊరుకెళ్తాం... మీ అమ్మకు బాగానే ఉంది కదా..."

నాన్న చెప్పినా తాతయ్య వినడు. తాతయ్యనూ, నానమ్మనూ బస్సెక్కించాడు నాన్న. అమ్మతో నాన్న కళ్ళు తుడుచుకుంటూచెప్పడం మేము విన్నాము "త్వరలోనే కబురు రావచ్చు!" అనుకున్న రోజు త్వరలోనే వచ్చింది. మాకు ఆశ్చర్యం కలిగించిన విషయమే





ప్రత్యేకతలు, ప్రయోగాలు

ఏది చేసినా ఓ లెక్క ప్రకారం చేయాలన్నది తమన్నా సిద్ధాంతం అట. ప్రతి సినిమాకు ఏదో ఒక కొత్త ప్రయత్నం చేయాలన్నది తన తపన అంటున్నది. "నాజూకుదనంకోసం నేనెప్పుడూ నోరు కట్టుకోలేదు.ఏదో ఒక ప్రత్యేకత లేకుండా ఏ పనిఅయినా ఎందుకు చేయాలనుకుంటాను.

ఈ విషయాన్ని నామనస్సు పదేపదే ప్రశ్నిస్తున్నది. అందుకుతగినట్లే కథలు ఎంచుకుంటున్నా.ఫ్యాషన్ విషయంలోనూ ప్రయోగాలు చేస్తున్నాను. ఏది చేసినా సౌకర్యం తర్వాతే. సౌకర్యాన్ని విడిచి ట్రెండ్స్ వెనుక పరుగెత్తలేను"అని చెప్పింది తమన్నా.

మిటంటే తనుపోయేవరకూ తన పనులు తను చూసుకోవడమే కాదు, తాతయ్యకు కూడా పనులు చేసిపెట్టడం.ఆ రోజు తాతయ్య ఏడవలేదు. మరుసటి రోజూ ఏడవలేదు. చాలా మౌనంగా... స్తబ్ధుగా!

ఆ పల్లెటూర్లో డాక్టరు చెప్పాడు.

"ముందస్తుగా ఆయన్ను పలకరించండి.ఆయన మాట్లాడాలి"కార్యక్రమం జరిగిన పదిరోజులూ మేమూ అక్కడే ఉన్నాము. తాతయ్య చాలా యాంత్రికంగా తను చేయాల్సిన కర్మకాండలు చేశాడు. తాతయ్య పరిస్థితి నాన్నకూ ఆందోళన కలిగించినట్లుంది. తాతయ్యని తనతో రమ్మని పిలిచాడు.

"ఒక్కడివీ ఇక్కడెందుకు నాన్నా..." అడిగాడు నాన్న. తాతయ్య సున్నితంగా తిరస్కరించాడు."తర్వాత వస్తానులే" చెప్పాడు తాతయ్య. ఇదంతా రెండు నెలలక్రితం సంఘటనలు...

రెండు నెలల్లోనూ తాతయ్య పరిస్థితిలో పెద్దగా మార్పేమీ లేదనీ, వాతావరణం మారి... తనవారితో ఉంటేపరిస్థితి కొంచెంమెరుగుపడవచ్చనీ ఇరుగుపొరుగు మాటలతో తాతయ్యను నాన్న ఇక్కడికి తీసుకువచ్చాడు.

తాతయ్యతోనూ సాన్నిహిత్యం నాన్నకు బాగా తెలుసు. అక్కా, నేనూ ప్రతి సంవత్సరం దసరా సెలవలకూ, సంక్రాంతి సెలవలకు కూడా తప్పని సరిగా తాతయ్య వాళ్ళూరు వెళ్ళేవాళ్ళం... సెలవలొచ్చి రెండురోజులైందా...

మీరింకా ఊరుకు రాలేదేం... మీ నాన్నగానీ వద్దన్నాడా?" గదమాయించేవాడు.

"నాన్నా. నువ్వు మరీ వాళ్ళను గారాం చేస్తున్నావు" నాన్న నవ్వుతూ విసుగు నటించేవాడు.

"పదండ్రా పదండి" అని మమ్మల్నీ "అమ్మాయ్ పిల్లల బట్టలు సర్దు" అని మా అమ్మనీ పురమాయించేవాడు. కాళ్ళకు చక్రాలు కట్టుకుని వచ్చినవాళ్ళా పరుగు తీయించేవాడు. "నువ్వు రెండురోజులుండి పోవచ్చు కద నాన్నా" అడిగేవాడు నాన్న.

"అక్కడ మీ అమ్మ ఒకత్తే... పిల్లలింకా రాలేదేమని వందసార్లయినా అడుగుంటుంది. వాడికిష్టమని కజ్జికాయలూ...దీనికోసం సున్నుండలూ మేము బస్సెక్కే వరకూ చెప్తూనే ఉండేవాడు తాతయ్య!

తాతయ్య వాళ్ళూళ్ళో వున్నన్ని రోజులూ మాకు కాలమే తెలిసేది కాదు.

మాకు ఊహ తెల్సిన తర్వాత ఓరోజు నానమ్మ పూజగదిలో లక్ష్మి, వేంకటేశ్వరస్వామి, గణేశుడితో పాటు, గుర్రంముందు నిల్చున్న ఓ దేవతామూర్తినీ చూశాం... "ఎవరది తాతయ్యా" అడిగాం.

తాతయ్య నవ్వాడు. "ఒక్కో మనిషికి ఒక్కో దేవుడిపై నమ్మకం.. మనిషి పుట్టిన నాటి నుంచి అనేక సిద్ధాంతాలు... వైరుధ్యాలు... విధానాలు...

ఒకడు ద్వైతమంటాడు. మరోకళ్ళు అద్వైతమంటారు. విశిష్టాద్వైతమనేదొకరు... ఆస్తికులూ... నాస్తికులూ... ఎవరి నమ్మకాలు వారివి. తన జన్మరాశికి తగినట్లుగా ఒక్కోగ్రహం అనుకూలమంట.

మీ నాయనమ్మ రాశికి శుక్రగ్రహం అనుకూలమట. ఆయన శుక్రాచార్యులవారు... రాక్షసగురువు. పేరుకు రాక్షసగురువు కానీ బ్రహ్మవంశసంజాతుడు... బ్రహ్మ హృదయం నుంచి జనించినవాడూ, బ్రహ్మ మానస పుత్రుడు, నవబ్రహ్మలలో ఒకరైన భృగుమహర్షికి 'ఉశన' అనే భార్య ద్వారా పుట్టినవాడు 'ఉశనుడు' తదనంతరం ఈయనే శివుని అనుగ్రహంతో 'శుక్రు'డయ్యాడు.

రాక్షసులకు గురువై శుక్రాచార్యుడయ్యాడు. మృతసంజీవనీ విద్య తెలిసిన గొప్పమహిమాన్వితుడు.. దంపతుల బంధాలను మరింత బలపరిచేవాడూ... ఇదంతా ఆధ్యాత్మికం...

ఇతనినే స్త్రీ రూపంలో వీనస్ అనే పేరుతో గ్రీకులు సౌందర్యాధిదేవతగా ఆరాధించే వారు.ఇకసైన్య పరంగా చెప్పాల్సివస్తే తాతయ్య ఆగి చెప్పాడు" మరోసారి చెప్పుకుందాం!

"మీ నాయనమ్మ చేసిన పిండివంటలు నోరూరిస్తున్నాయి. పదండి ఓ పట్టుపడదాం" చెప్పేవాడు తాతయ్య. నానమ్మ వద్దనేకొద్దీ కొసరి కొసరి తినిపించేది. మేము కూడా తాతయ్యతో పాటే పొలానికి వెళ్ళేవాళ్ళం.

పొలంగట్లమీది తాడిచెట్లు క్రమశిక్షణగల సైనికుల్లా బారుగా కాయలతో నిండిన తాడిచెట్లు నిండు గర్భిణీల్లా తాతయ్య పొలంలో ఓ పక్కన పూల మొక్కలు కూడా వేశాడు.

హేమంతఋతువులో చేమంతిపూలు మంచు పూలనుఅలంకరించుకుని వింత సోయగాలు పోతుండేవి. స్వచ్ఛమైన గాలీ, పరుగులెత్తే లేగదూడల మెడలోని మువ్వల చప్పుడూ, దూడశరీరాన్ని నాకుతున్న తల్లి ఆవు ప్రేమా... చాలా స్వచ్ఛంగానూ... ఆహ్లాదకరంగానూ కన్పించేవి.

"మనిషికి తన కొడుకుల మీదకన్నా మనుమళ్ళ, మనుమరాళ్ళమీదే ప్రేమ ఎక్కువంటారు. మీ అంత స్వతంత్రంగా నాన్నదగ్గర నేను ఉండలేను.తాతయ్యను మాట్లాడిస్తారో,పోట్లాటే వేసుకుంటారో, నవ్విస్తారో అది మీ ఇష్టం. ఆయన తిరిగి పూర్వపు మనిషవ్వాలి" నాన్న చెప్పిన మాటలివి.

అందుకే ఈ ప్రయత్నమంతానూ... ఆయన్ని ఉబ్బించడం... ఉడికించడం... అక్కయ్యా, నేనూ ఒకటి గమనించాము.

నానమ్మతో తన జ్ఞాపకాలు చెబుతున్నప్పుడు తాతయ్య కళ్ళు విప్పారేవి. మొహం విశాలంగానూ, బోసినోటితో చిరునవ్వూ తొంగిచూసేది.

"తాతయ్యా... నానమ్మా నువ్వూ ప్రేమించి పెళ్ళి చేసుకున్నారంట కదా" అక్కయ్య అడిగింది.

"ఎవర్రా చెప్పింది...." కోపం నటించాడు గానీ... ఆ కళ్ళల్లో సిగ్గుదొంతరలు కన్పించాయి.

"తాతయ్యా... ప్లీజ్ చెప్పవా..." ఈసారి ఇద్దరం అడిగాము.

"ఛీ... పోండర్రా" కసురుకున్నట్టుగా నటించాడు. తాతయ్య వెనుకగా వెళ్ళి ఆయన భుజం చుట్టూ చేతులేశాను. తాతయ్యను పడేసేందుకు అదోకిటుకు. నాకు ఇరవై ఏళ్ళు పైబడ్డా, తనకు మనవడ్నేగా...



ఇంతవరకు ఏ ప్రభుత్వంకూడా సాహసించని మార్పులను తెచ్చేందుకు నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రయత్నించింది.

-చేతన్ భగత్, రచయిత

"తాతయ్యా... ప్లీజ్ చెప్పవూ... నువ్వే ముందు చెప్పావా.నానమ్మ చెప్పిందా" అడిగింది అక్కయ్య.

"అదేం లేదర్రా..."తాతయ్య మెత్తపడ్డాడు.

"అంటే ఐ లవ్ యూ...చెప్పలేదా" అడిగాను.

"చెప్పలేదా అంటే... రెండేళ్ళపాటు ఒకళ్ళనొకళ్ళం చూసుకోవడం తప్ప మరేం లేదు. కాకపోతే తనే ముందు నన్ను పెళ్ళిచేసుకుంటావా" అని అడిగింది. పెళ్ళికి ముందు తనూ, నేనూ మాట్లాడుకున్న ఒకే మాట అదే... అదే తొలిమాట చివరి మాట కూడాను" తాతయ్య చెప్పాడు.

"అంటే పొలాలగట్ల వెంబడి తిరగడం... గడ్డి వాములూ... చెరువులో స్నానాలు... ఇవేవీ లేవా" నిరాశగా అడిగాను.

"ఒరే సినిమాలు చూసి బాగా చెడిపోతున్నార్రా" నవ్వాడు తాతయ్య. తిరిగి చెప్పసాగాడు-

"పెళ్ళికి ముందు కాదుకానీ... పెళ్ళి అయిన కొత్తలో ఓసారి చెరువుకు ఈతకనివెళ్ళాం. తనకి ఈతరాదు. తనని ఆటపట్టిద్దామని కొంచెం లోతులోకి లాక్కువెళ్ళాను.

నాకు ఈత బాగా వచ్చు. కానీ నే దిగిన ప్రదేశంలో పెద్ద గొయ్యి ఉంది. కాళ్ళు నేలకు ఆనడంలేదు. బురద నన్ను లోపలకు లాగుతోంది. కొంచెం కొంచెం మునగసాగాను. ఊపిరి అందడంలేదు.

కాళ్ళూ, చేతులూ ఎంత ఆడిస్తున్నా పైకి రాలేక పోతున్నాను. ఒక విధంగా స్పృహ తప్పాను కూడా! నాకు స్పృహ వచ్చాక తెలిసింది. తనకు ఈత బాగా వచ్చని. తను నామీద బోర్లా పడుకుని నా శరీరానికి వెచ్చదనాన్నీ, నా నోటిలో నోరుపెట్టి నాకు కృత్రిమ శ్వాస కల్పించేందుకు ప్రయత్నిస్తోంది.

తడిసిన ఆ బట్టల్లో ఆ ఎద పొంగూ... సన్నని



ఆ నడుమూ... జఘన సౌందర్యం..." అక్కయ్య చిన్నగా నవ్వుకుంటూ పక్కకు నడిచింది. ఉలిక్కిపడ్డ వాళ్ళా తాతయ్య ఒక్కసారిగా ఆగిపోయాడు. ఆయన కన్నుల్లో భయమూ, బెరుకూ...

"ఏమర్రా... నేనేం చెప్పాను" కంగారుగా అడిగాడు తాతయ్య. తాతయ్యకు అర్థమైంది. ఆ ట్రాన్స్‌లో పిల్లలతో చెప్పకూడనివి...

"ఏం చెప్పలేదు తాతయ్యా... స్పృహ తప్పిందన్నావు. ఆ తర్వాత ఏదో ఆలోచిస్తూ ఉండిపోయావు" చెప్పాను."కాదు... ఏదో చెప్పాను.. అక్కయ్యఎందుకు పక్కకు వెళ్ళింది"

అక్క వింటూనే అంది. "నువ్వు స్పృహ తప్పానని చెప్పావు తాతయ్యా... ఆపైన ఏమీ మాట్లాడకపోతే నిజంగా స్పృహ తప్పావేమో ఓ పుల్లతో నీ చెవుల్లో పొడుద్దామనీ" నవ్వింది... వచ్చి చెప్పింది. అయినా తాతయ్యకు నమ్మకం కుదరలేదు.

"కాదర్రా..." ఏదో చెప్పబోయాడు.

"తాతయ్యా... నువ్వు ముసలివాడివైపోయావు. ముసలివాళ్ళకు 'అల్జీరియా' వస్తుందిట. చెప్పనిది చెప్పినట్లుగానూ, విననిది విన్నట్లుగానూ అంతెందుకూ రోజూ చూసే మనిషినిసైతం నిన్నెక్కడో చూసినట్లుందే అనడం. ఇవన్నీ అల్జీరియా లక్షణాలు" అక్కయ్య,నేనూ బుకాయించాము.తాతయ్య బుంగమూతి పెట్టాడు.

మరుసటిరోజే తాతయ్య తన ఊరికి ప్రయాణమయ్యాడు. నాన్న ఎంత వారించినా వినలేదు... మేమూ బ్రతిమిలాడాము."ఎందుకో ఊరు మీద మనసు పోయిందిరా, నాలుగు రోజుల్లో తిరిగి వస్తానుగా" అంటూ మా నుదుటిమీద చుంబించాడు! తాతయ్య ఊరెళ్ళి నలభైఎనిమిది గంటలు కూడా కాలేదు.దిగ్భ్రాంతికరమైన వార్త...

తాతయ్య చనిపోయాడు. నానమ్మను కలుసుకునేందుకు వెళ్ళిపోయాడు. మేమందరం పల్లెటూరుకు బయల్దేరాం.తాతయ్య కుర్చీలో కూర్చునిటేబుల్‌పై తలవాల్చి నిద్రపోతున్నట్లే ఉన్నాడు.

తాతయ్య తలక్రింద నానమ్మ ఫొటో... తాతయ్య బుగ్గలపై ఎండిన కన్నీటి చారికలు! ఆ ఊరి డాక్టరు తాతయ్యనుచూశాడు."తీవ్రమైన భావోద్వేగంతో గుండె ఆగిపోయి ఉంటుంది.ఇద్దరూ ఎంతో ప్రేమగా, అన్యోన్యంగా ఉండటం మీకు తెలుసు" చెప్పాడు.

అక్కయ్య కళ్ళవెంట ధారాపాతంగా కన్నీరు. "ఒరే..మనం పొరపాటు చేశామేమోరా...

నానమ్మ జ్ఞాపకాలతో తాతయ్య సంతోషంగా ఉంటాడనీ... మళ్ళా పూర్వంలా మారిపోతాడనీ అనుకున్నాంగానీ, తాతయ్య మనసు గాయాన్ని మనం రేపుతున్నామనీ... అనుకోలేదురా.

నానమ్మ జ్ఞాపకాల నుంచి తాతయ్యను దూరంగా తీసుకువెళ్ళాల్సిందిపోయి, ఆయన్ని మరింతగా నానమ్మ జ్ఞాపకాలలో ముంచి మనమే తాతయ్యను చంపేశామేమోరా..." తను ఏడుస్తూనే ఉంది.

నాకూ గుండె చిక్కపట్టినట్లయింది.కన్నీటిసంద్రం సుళ్ళు తిరుగుతోంది.



ఆ కోరిక తీరింది

'కథలో రాజకుమారి', 'చుట్టాలబ్బాయ్' ఫేమ్ నమితా ప్రమోద్ ఎందరికి గుర్తుందో కాని, ఈ అమ్మాయికి తెలుగులో ఇంకా విజయం వరించక పోయినా మలయాళంలో కెరీర్ పరుగు మొదలు పెట్టేసింది. సినీపరిశ్రమలోకి వచ్చాక సాధించిన విజయమేమిటని అడిగితే అల్లరిగా నవ్వేసింది.

"నాకు చిన్నతనంనుంచి 'ఆడి'కారు కొనుక్కోవాలన్న ఆశ ఉండేది.పరిశ్రమలోకి వచ్చాక ఆ కోరిక తీరింది. స్వంతంగా ఆడి కారు కొనుక్కోగలగడం నా అచ్చీవ్‌మెంట్. చిన్నవయస్సులోనే ఆర్థికంగా మంచిస్థానంలో ఉండగలిగాను" అని చెప్పింది.

వారఫలం

జూన్ 7 నుండి జూన్ 13, 2018 వరకు

పిడపర్తి వీరేశ్వరశాస్త్రి, పిడపర్తి భాస్కర సుబ్రహ్మణ్యశాస్త్రి
సెల్ : 94921 56064



మేషం: అశ్విని, భరణి, కృత్తిక 1వ పా. ఈ వారంలో మీ ప్రయత్నములను ముమ్మరం చేస్తారు.స్థిరాస్తులకు సంబంధించిన కొనుగోళ్ళు, అమ్మకాలు వంటివి సిద్ధిస్తాయి.కుటుంబవ్యక్తులచే సహకారాలు పెరుగుతాయి.ఆదాయ, వ్యయములందు అవగాహన లతో సాగగలరు. సందేహాలు ఏర్పడినపుడు పట్టుదలలు పాటించు కోవాలి.సమిష్టికృషి అన్నిటా మేలుచేయగలదు.ఇచ్చి, పుచ్చుకోవడాలు ఉపకరి స్తాయి. వీరికి గురు, ఆది, సోమ వారాలు అనుకూలమైనవి.



వృషభం: కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2పా. అవసరములు తీరునట్లుగా మీ పనులకు రూపకల్పనలు చేయ గల్గుతారు. కుటుంబమున వృత్తి క్షేత్రమునందు మీదైన తర హాలో సాగగలరు.ఆదాయవ్యయాలందు స్వాలంబనదిశగా సాగ గలరు. షార్ట్ జర్నీలను తలపెట్టు సూచనలుగలవు. అనవసర భయాందోళనలు కొన్ని వెంటాడగలవు. వ్యాపార, వ్యవహారాలలో భాగస్వామ్య యుతంగా సాగండి. గురు, శుక్ర, శని, బుధ వారములు అనువైనవి.



మిథునం: మృగశిర 3, 4పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా. నిత్యకృత్యములను, బాధ్యతలను పట్టుదలలతో సాధించు కోవాలి. ఖర్చులను నియంత్రించుకోవాలి. భ్రాతృవర్గముతో వివాదములు కొన్ని చికాకుపరచగలవు. ముఖ్యకార్యక్రమాలలో జాప్యములేర్పడకుండా సాగాలి. ఆత్మీయులతోనైనా సలహా లను, సూచనలను కోరకండి. ఆరోగ్యం బావుంటుంది.ఆసక్తికరంగా సాగేటట్లు భిన్నంగా ఆలోచించండి. శుక్ర, శని, ఆది, సోమ వారములు మేలైనవి.



కర్కాటకం: పునర్వసు 4వ పా, పుష్యమి, ఆశ్లేష. ఈ వారంలో మీ ప్రయత్నములకు పట్టుదలలు అవసరం. ఆదాయములు పరవాలేనివిగా ఉంటాయి. ఖర్చులకు తగిన ప్రయోజనములను పొందుతారు. అవకాశములను చేజారనీయకుండా ఒకింత పట్టు దలతో సాగాలి. భాగస్వామి ఆలోచన అములుకు ప్రాధాన్యతనీయండి. ప్రయాణములందు అసౌకర్యాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు అవసరం. ఈ రాశివారికి ఆది, సోమ, బుధ వారములు అనువైనవి.



సింహం: మఖ, పూర్వఫల్గుని,ఉత్తరఫల్గుని 1వ పా. విమర్శలకు ప్రతివిమర్శలకు దూరంగా ఉంటూ కర్తవ్యములను పాటించుకోవాలి. పనులను సకాలంలో నిర్వహింపచేసుకొనునట్లు ప్రయత్నము లను పట్టుదలతో సాగించుకోవాలి. అనుమానంగా తోచిన పను లను కొంతకాలం ప్రక్కనపెట్టండి. కుటుంబమున కొందరి ప్రవ ర్తనచే మనస్తాపమునకు గురికాగల సూచనలున్నాయి. ఆర్థికపరమైన అనుకూల తలు కొనసాగుతాయి. గురు, సోమ, బుధ వారములు అనువైనవి.



కన్య: ఉత్తరఫల్గుని 2, 3, 4పా, హస్త, చిత్త 1, 2పా. అన్నిటా ఉత్సాహకరంగా వ్యవహరించుకోగలరు. ఆర్థిక లావాదేవీలు ప్రోత్సా హకంగా సాగుతాయి. బంధు మిత్రుల విందులలో పాల్గొనగలరు. ఒప్పంద విషయాలలో కంగారుపడకండి. కుటుంబసభ్యులతో కలసి ఆనందించే అంశాలుంటాయి. ఆరోగ్యం విషయంలో మంచి మార్పులు ఏర్పడతాయి. గురు, శుక్ర, శని, వారములు అనువైనవి.



తుల: చిత్త 3, 4పా, స్వాతి, విశాఖ 1, 2, 3పా. ఈ వారంలో ముఖ్య మనుకొన్న పనులను చేపట్టి పూర్తిచేసుకోవాలి. ఆత్మీయుల కలయి కలు సిద్ధిస్తాయి. ఖర్చులకు తగినట్లుగా ఆదాయములు ఉంటాయి. గత ప్రతికూలాంశములను కొన్నిటిని తగ్గించుకోగలరు. కాలనియమా లకు తగిన ప్రాధాన్యతనీయండి. పరిచయములచే ఒత్తిడులను ఎదు ర్కోవలసిరావచ్చును. ప్రభుత్వతరహా పనులను పూర్తిచేసుకోగలరు. ఈ రాశి వారికి శుక్ర, శని, ఆది, సోమ వారములు అనువైనవి.



వృశ్చికం: విశాఖ 4వ పా, అనూరాధ, జ్యేష్ఠ. ఈ వారంలో ఉత్సా హంగా వ్యవహరించుకోగలరు.ఆర్థికస్థితి ఆశాజనకంగా ఉంటుంది. కుటుంబమున సమిష్టి నిర్ణయాలుంటాయి. చేపట్టుకొన్న పను లను పూర్తిచేసుకోగల్గుతారు. అధికారిక కార్యక్రమంలో పాలు పంచుకోగలరు. ఆరోగ్యం బావుంటుంది. బంధుమిత్రులచే ఇచ్చి పుచ్చుకోవడాలేర్పడతాయి. తొందరపాటుతోకూడిన క్రయవిక్రయాలు ఉండ కుండా జాగ్రత్తలు వహించండి. ఆది, సోమ, బుధ వారాలు అనుకూలం.



ధనుస్సు: మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పా. శుభాశుభ మిశ్రమముగా ఈ వారము సాగుతుంది. పట్టుదలలు చూపు తారు.అనుకొన్నవి ఆలస్యంగానైనా పూర్తిచేసుకోగలరు. ఖర్చులు, ఆదాయములు పరవాలేనివిగా ఉంటాయి.వృత్తి, ఉద్యోగ, వ్యాపా రములందు సాధారణస్థితులు కొనసాగుతాయి. కుటుంబవ్యక్తు లకు మీ సహాయాలు అవసరమవ్వగలవు. వాహన, యంత్ర రిపేర్లు చికాకుపరు స్తాయి. గురు, బుధ వారాలలో ముఖ్యమైన పనులను చేపట్టుకోండి.



మకరం: ఉత్తరాషాఢ 2, 3, 4పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2పా. అనాలోచితంగా స్వార్థపూరితంగా ఆలోచనలను ఎక్కువచేసే సూచనలున్నాయి. తరచుగా తెలియని ఒత్తిడులను ఏర్పరచుకొని మనోవేదనలను ఏర్పరచుకొను సూచనలు ఉన్నాయి. కుటుంబ మున ఉత్సాహములుంటాయి. ఆర్థిక అనుకూలతలు కొన సాగుతాయి. కొన్నిట మొండిధైర్యములను ప్రదర్శించి పనులను చక్కబెట్టుకో గలరు. ఈ రాశివారికి శుక్ర, శని, ఆది వారములు అనువైనవి.



కుంభం: ధనిష్ఠ 3, 4పా, శతతార, పూర్వాభాద్ర 1, 2, 3పా. ఈ వారంలో పనులు మందగతిన సాగినా ఉత్సాహకరముగా ప్రయత్నములను కొనసాగిస్తారు. ఆదాయములు తగినట్లుగా ఉంటాయి. ఇంటా-బయటా మన్ననలు పొందుతారు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారములందు అభివృద్ధికరమైన స్థితులేర్పడతాయి. కొన్ని ప్రయాణాలను వాయిదావేయవలసిరావచ్చును. కొన్ని కీలకమైన నిర్ణయా లను తీసుకోవలసిరావచ్చును. కుటుంబవ్యక్తులను భాగస్తులను చేయండి. ఈ రాశివారికి గురు, ఆది, సోమ వారములు అనువైనవి.



మీనం: పూర్వాభాద్ర 4వ పా, ఉత్తరాభాద్ర, రేవతి. ఈ వారంలో మంచి పరిచయములు ఏర్పడతాయి. అవకాశములను అంది పుచ్చుకోగలరు. ఆత్మీయులచే సహకారములు పొందుతారు. బంధుమిత్రులతో ముక్తసరిగా సాగండి. అవసరములకు తగి నట్లుగా ఆదాయములు ఉంటాయి. సంతానముతో కొన్ని చికాకు లను ఎదుర్కోవలసిరావచ్చును. వృత్తి, ఉపాధులకై చేసే యత్నములు అను కూలించగలవు. వీరికి శుక్ర, శని, బుధ వారములు అనువైనవి.

మనిషి జీవితంలో ఎదగాలంటే అదృష్టంతో పాటు మానవప్రయత్నం కూడా తోడవ్వాలి.

నేనెవరో తెలుసా!

మనసులోని భావం బయటకు చెప్పేందుకు సాధనం భాష. అయినా ఆ భాష చెప్పే వారిది, వినేవారిది ఒకటే అయినపుడే చెప్పాలనుకున్న విషయం వినేవారికి సరిగా చేరుతుంది. కాలం ఏదైనా ఇదీ నిజం. చెప్పే సందేశం ఎంత గొప్పది అయినా అది వినేవారి భాష కానప్పుడు అంత గొప్ప సందేశం కూడా ఎందుకూ పనికిరాకుండాపోతుంది.

ఈ విషయం నేటిపాలకులు అర్థం చేసుకోలేదు. అందుకే ప్రజలకు సంబంధించిన పాలన, ప్రజలకు చేరాల్సిన ఉత్తర్వులు(జి.ఓ.లు) ఇంకా ఇంగ్లీషులోనే తయారుచేస్తారు. కోర్టుకు వెళ్ళినా తెలియని భాషలోనే న్యాయవాదులు వాదిస్తారు, అలాగే న్యాయమూర్తులూ తీర్పులిస్తారు.

కాని ఒకనాటి నాయకులు ప్రజలభాషకే ప్రాధాన్యతనిచ్చారు. తనకు ఏ భాషలు వచ్చున్నది కాదు ముఖ్యం. ఏ భాషలో చెపితే ప్రజలలో ఎక్కువమందికి అర్థమవుతుందో, ఆ భాషనే తమ ఉద్యమాలకు ఊతంగా ఎన్నుకున్నారు.

వారి మాతృభాష మీద ప్రేమ, అభిమానం వున్నా వాటిని పక్కనపెట్టి విస్తృతంగా చేరగలిగిన భాషకు ప్రాధాన్యతనిచ్చారు. అటువంటి యత్నమే నిజాం నిరంకుశత్వ సమయంలో ఒక నేత చేశాడు.

నిజాం అనేవాడు ఒక గుడ్డి, చెవిటివాడు. వాడు చెప్పేది ప్రజలు వినాల్సిందే కాని,ప్రజల గొంతును వినే ఓపికలేని మూర్ఖుడు. నిరంకుశపాలనలో తన అధికారభాషను ఇతరుల మీద బలవంతంగా రుద్దినవాడు.అందుకే ఆ కాలంలో ప్రజలభాషలు తెలుగు, కన్నడ, మరాఠీలు అయినప్పటికీ అధికారభాషగా ఉర్దూ పెత్తనం సాగింది.

అందుబాటులో వున్నది ఉర్దూ మాధ్యమం మాత్రమే. అది దాటి చదువుకోవాలంటే ఆంధ్రప్రాంతానికి వెళ్ళేవారు లేదా నాగపూర్ వైపు వెళ్ళాల్సివచ్చేది. ఆ సమయంలో నిజాంకి వ్యతిరేకంగా ప్రజాఉద్యమం జరుగుతోంది. ఆ సమయంలో నిజాం వ్యతిరేకతను ప్రజలందరికీ పంచటానికి ఒక పత్రిక అవసరమైంది. ఆ పత్రికను ఉర్దూభాషలో ప్రారంభించాడు.

దాని స్థాపకుడేమో హిందువు. 'నువ్వు ఉర్దూలో పత్రిక నడపటం ఏమిటి?' అంటూ ఆ రోజు కొందరు ప్రశ్నించారు. అందుకు ఆయన చెప్పిన సమాధానం 'నేడు అధికారభాష అది. ఆ భాషలోనే విద్యాబోధన జరుగుతోంది.

చదువు కోనివారికి ఆ భాష తెలుసు. కాబట్టి నా పోరాట సందేశం ఇటు ప్రజలకు, అటు పాలకుడికి కూడా చేరాలంటే ఎక్కువమందికి చేరే భాషలోనే వుండాలని ' వివరణ ఇచ్చిన ఆయన ముందుచూపును అభినందించకుండా వుండలేరు ఎవరైనా.

కేవలం ఆ భాషలో చెపితే పత్రిక అమ్మకాలు పెరుగుతాయని వ్యాపారపరంగా ఆలోచించిన వ్యక్తి కాదు ఆయన. ఆయనకు ఆ భాషమీద పట్టు వుంది. ఉర్దూభాషలో పాండిత్యం వుంది.

ఆ భాషలోని పుస్తకాలను చదివాడు. ఆ భాషను ఆస్వాదించాడు. తాను రాసే ప్రతి వాక్యం మనసులో నుండి నేరుగా బయటకువచ్చి ప్రజలను తాకేలా రాయగల నేర్పు ఆ భాషలో వుంది.

అలాగని మాతృభాష తెలుగుమీద మమకారం లేదని కాదు.తెలుగుగ్రంథాలు చదువుకోలేదనికాదు. తెలుగు మీద ఆయనకు సాధికారత వుంది.

అయితే సమయానికి తగినట్టుగా సందేశమార్గం ఎంచుకోవాలన్నది ఆయన మాట. కాలానికి అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఆయన పదిమందికి అనుసరించి చూపించారు. నిజాంపాలన కింద నలిగిపోతున్న తెలుగుకు అండగా నిలిచిన వ్యక్తి ఆయన.

నిజాం ప్రాంతంలో ఆంధ్రభాషకు ఆదరణ కరువైనపుడు,ఆంధ్రులంతా ఒక్కటిగా నిలవాలని ఆంధ్ర జనసంఘం ఏర్పడింది.ఆ ఆంధ్ర జన సంఘువ్యవస్థాపక ప్రముఖులైన 12 మందిలో ఆయన ఒకరు.

ఆంధ్ర మహాసభగా వారంతా కలిసి ఆంధ్ర భాషాజాతిని మేల్కొలిపే యత్నం చేశారు.

వీరి ఆంధ్రభాష అభిమానమే ఆ తర్వాతి కాలంలో కాంగ్రెస్‌పార్టీ ఆ ప్రాంతంలో రూపుదిద్దుకునేందుకు దోహదపడింది. అంతేకాదు నైజాం ప్రాంతం భారతదేశంలో విలీనం అవటంలో ఆయన పాత్రవుంది. ప్రజలకోసం పోరాడేవారంటే పాలకులకు గిట్టదు. అది నేటి పాలకులకువారు అభిమానించే నిజాంనుండి వారసత్వంగా వచ్చిన లక్షణం.

నేటి పాలకులు నిజాంని, అతడి పాలనను పొగుడుతుంటే పైలోకాన వున్న నాటి నేతల ఆత్మలు ఎంతగానో ఘోషిస్తుంటాయి.

ఆ నాయకులమీద నిజాం ప్రయోగించిన క్రూరత్వం తెలిస్తే ఇటువంటి అభిమానపు మాటలు నేటి పాలకుల నోటినుండి రావని నాడు ఆ నాయకుడిని చూసిన, విన్నవారు అంటారు.

ఒక పత్రిక పెడితే దానిని మూయించేవరకు నిజాం నిద్రపోలేదు. నాడైనా నేడైనా రైతుల సమస్యలు ఒక్కటే. అటువంటి రైతాంగపక్షాన నిలిచే పత్రిక,'రైతాంగం' అనే అర్థం వచ్చే పత్రిక పనిచేస్తుంటే ఎలా ఊరుకుంటాడు నిజాం. ఆయన ప్రారంభించిన వారపత్రికకు అడ్డంకులు కల్పించారు.

వాటిని తట్టుకుని దినపత్రికగా మార్చాడు. నిజాం నిర్ణయాలను ప్రశ్నించటమే ధ్యేయంగా పత్రికను నడిపాడు. భారతదేశాన్ని బ్రిటీష్‌వారు వదిలిపెట్టి వెళ్ళినతర్వాత ఇక తన పాలన ఎంతోకాలం నిలవదని నిజాంకు బాగా తెలుసు.

తన ఏలుబడికి అడ్డుగా నిలబడినపత్రికలను, నాయకులను అణచివేశాడు. అందుకే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రెండు నెలలకల్లా ఆయన పత్రికను నిజాం నిలిపివేశాడు. ఆ తర్వాత సంవత్సరంలోపే నిజాం పాలన కూలిపోయింది.

తాను పెట్టుకున్నలక్ష్యం నెరవేరింది. నిజాం పాలన అంతమైంది. ఆంధ్రమహాసభ ఆశించినట్టుగా నిజాం ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో కలిసిపోయింది. కాబట్టి ఇక ఆ పత్రిక అవసరం లేదు.

ఇక ఆంధ్రభాషలో మనల్ని మనం పాలించుకుందాం అన్నాడు ఆయన. తొలి సారస్వత ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయ్యాడు. భూసంస్కరణల కమిటీకి అధ్యక్షుడిగా పనిచేశాడు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికై మంత్రిగా పనిచేశాడు. జర్నలిస్టుల సంఘానికి అధ్యక్షుడిగా ఒక దశలో సేవలు అందించారు. తన పోరాట అనుభవాలను, నిజాంకాలపునాటి సామాజిక స్థితిగతులను వివరిస్తూ ఆయన రాసిన పుస్తకం నేటికీ అధ్యయనకారులు సంప్రదించాల్సిన గ్రంథం.

నిజాం వేసిన మంత్రిపదవికి లొంగని నేత ఆయన.ఆ ప్రాంతంలో హిందూ-ముస్లిమ్‌మైత్రికి కృషిచేసిన విశిష్టవ్యక్తి ఆయన.అటువంటి ఆ నేత సరిగా నలభై రెండేళ్ళ క్రితం మేనెలలో తుదిశ్వాస విడిచారు. నాటి ఆ గొప్ప నాయకుడిని తలచుకునే తీరులో నేటి సామాజిక వాతావరణం వుందా! అనేది సందేహం. ఇంతకీ...

1.నిజాంపై పత్రికను ఆయుధంగా వాడిన ఆ నేత పేరేమిటి?

2. ఆయన నడిపిన పత్రిక పేరేమిటి?

ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు ఇన్‌లాండ్ కవర్‌పై రాసి స్వాతి చిరునామాకు <u>16 జూన్ 2018 తేదీలోగా పంపించండి.</u> కరెక్టు సమాధానాలు రాసిన వారిలో లాటరీ పద్ధతిద్వారా ఒకరిని విజేతగా ఎంపికచేసి ₹ 500/- నగదు బహుమతిని అందజేస్తాం.

1.6.2018 సంచికలో ప్రచురించబడిన 'నేనెవరో తెలుసా!' శీర్షిక సమాధానాలు :
1. వంగరి మాత మథాయ్,
2. గ్రీన్‌బెల్ట్ మూవ్‌మెంట్.
₹ 500/- **బహుమతి పొందిన విజేత :**
సయ్యద్ జహంగీర్, 18-8-442/10/14ఎ, న్యూ మహమ్మద్‌నగర్, హైదరాబాద్-500 023

వేట

పుట్టగంటి గోపీకృష్ణ



ఇరవై లక్షల జనాభా కూడా లేని నాగాలాండ్‌లో గుర్తింపు పొందిన భాషలే ఎనభై తొమ్మిది ఉన్నాయి. ప్రతి తెగకీ తమదయిన ప్రత్యేకమయిన భాష, ఆచార వ్యవహారాలు ఉన్నాయి.అయినా అందరినీ ఏకం చెయ్యటానికి రాష్ట్ర ప్రభుత్వం అధికార భాషగా ఎవరిదీ కాని ఇంగ్లీషును ప్రకటించి, విద్యా విధానాన్ని ఇంగ్లీషు మీడియంలో కొనసాగిస్తోంది.

సహజంగా కొండవాలులో ఏటవాలుగా వీళ్ళు తమ గూడేలను ఏర్పరచుకుంటారు. ఇప్పుడు లిమ్బెన్ ఉన్న గూడెంలా కొన్ని గూడేలు పర్వతపాదం దగ్గర్లోకూడా ఉంటాయి. కానీ తక్కువ.

మగవాళ్ళు చేతిలో బారాటి శూలం లేకుండా బయటకు వెళ్ళరు. మగవారు, ఆడవాళ్ళు కూడా అలంకరణప్రియులే. ఆడవాళ్ళు రకరకాల పూసల దండలు ధరిస్తారు. ధరించే దుస్తులకు కూడా ప్రాధాన్యత ఇస్తారు. ప్రతి ఇంట్లో కోళ్ళు, పందులు పెంచుతారు. చెవులకు విచిత్రమైన పోగులు ధరిస్తారు.

నాగాలు వీరులు. శత్రువుకు, మరణానికి భయపడరు. అందుకే వీరికి ఆర్మీలో తగిన స్థానం కల్పించింది బ్రిటీష్ ప్రభుత్వం.

మొదటి ప్రపంచయుద్ధంలో, రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్ వారి తరుపున నాగాలు పోరాడారు. ఒకప్పుడు తెగల మధ్య తగాదాలు తీవ్రంగా ఉండేవి. ఒకరిని ఒకరు చంపుకోవటం, చంపిన వ్యక్తి తలలు నరికి తీసుకువెళ్ళి ఇంటిముందు అలంకరణగా వాడటం అధికంగా ఉండేది.

1964లో ఈ గొడవలు చల్లారేలా అన్ని తెగల మధ్య ఒక శాంతి ఒడంబడిక జరిగింది. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో కుదిర్చిన సంధి చాలావరకు గొడవలు తగ్గించింది.

మరోవైపు మొదటి నుండి నాగాలాండ్‌లో తీవ్రవాదుల ప్రభావం ఎక్కువ.

ప్రభుత్వం తీసుకున్న శాంతిచర్యలు కానీ, అణచివేత చర్యలు కానీ... రెండూ పూర్తిగా పనిచేయలేదు. నిషేధించబడిన అనేక గ్రూపులు తీవ్రవాదాన్ని

జరిగిన కథ (12)

హోటల్ రూమ్‌లో నుండి బయటకొస్తుండగా కింద రిసెప్షన్‌దగ్గర లక్ష్మి కనబడుతుంది అవినాష్‌కి. ఈలోగా 'RAW' అసిస్టెంట్ కుమార్ ఫోన్‌చేసి మీరు అడిగిన ఫోన్ నెంబర్లు 'దీమాపూర్'ని సూచిస్తున్నాయని అవినాష్‌కిచెప్తాడు.


లక్ష్మిని 'కిఫిరే'అనే ఊరికి తనతో పాటు బలవంతంగా ఓ ట్యాక్సీలో తీసుకువెళ్తాడు అవినాష్. నేను నువ్వనుకుంటున్నట్లు హంతకుడ్ని కానని చెబుతాడు.

కిఫిరే ఊరు బయట పర్వతాగ్రం మీదకు చేరుకుని అక్కడినుండి ఓ గ్లైడర్‌ద్వారా ఓ లోయప్రాంతానికి చేరతారు అవినాష్, లక్ష్మి.

లిమ్బెన్ నివసించే గూడెం అది. అతనితో పాటు సుమిత్‌బోస్ అక్కడే వుంటాడు.లిమ్బెన్‌కు తెలియకుండా ఆ గూడెంలోని యువతుల ఫోటోలు తీస్తాడు సుమిత్‌బోస్.

ఆ యువతులు పారిపోతారు. ఫోటోలు తీసిన విషయం తెలిసి లిమ్బెన్ మందలిస్తాడు సుమిత్‌బోస్‌ని. ఫోటోలు తీయడమంటే వారి ఆత్మలు బంధించడమేనన్న అభిప్రాయం వారిదని చెబుతాడు.

ఆ తర్వాత జరగబోయేది చదవండి.



ఇప్పటికీ రెచ్చగొడుతూనే ఉన్నాయి.

వీరి గ్రామాలను 'ఖేల్' అంటారు. ఊరి చుట్టూ సరిహద్దు ఉంటుంది. వేరే ఊరి వారు, అనుమతి లేకుండా సరిహద్దు దాటి రారు. అలా అని ప్రతి ఊరు, ప్రతి తెగ వేరే వారితో సంబంధాలు లేకుండా ఉండరు. ఒక తెగలో ఆడవారిని అదే తెగలో మగ వారు వివాహం చేసుకోరు.

కాబట్టి తెగలమధ్య వివాహాలు మామూలుగా జరుగుతుంటాయి. అలానే కొన్ని తెగల మధ్య శత్రుత్వాలూ మామూలే.

తల్లిదండ్రుల మాటకు ఎదురుచెప్పటం అంటే ఒక పెద్ద పాపంగా భావిస్తారు. తల్లిదండ్రులు తమ ఆస్తిని మగపిల్లలకు మాత్రమే ఇస్తారు. అది కూడా ఎక్కువభాగం పెద్దకొడుకుకే దక్కుతుంది.

ప్రతి ఊరి మధ్య 'మోరుంగ్' అనే రెండు భవనాలు ఉంటాయి. ఒకటి మగవారికి, రెండవది ఆడవారికి. ఇవి ఇప్పటి నాగరిక సమాజంలోని కమ్యూనిటీ హాళ్ళలా ఉపయోగపడతాయి.

ఒక వయసుకు వచ్చాక ఆడపిల్లలను, మగపిల్లలను విడివిడిగా ఆ మోరుంగ్‌లకు పంపుతారు. అక్కడ తెగకు చెందిన పెద్దలు తమ సంస్కృతి గురించీ, ఆచారాల గురించీ చెప్తారు. తమదయిన సంగీతాన్నీ, నాట్యాన్నీ నేర్పుతారు. చెక్కబొమ్మలు చేయటం, అలంకరణ సామాగ్రి తయారుచేయటం, ఊలుతో బట్టలు నేయటం నేర్పిస్తారు.

ఊరికి సంబంధించి చేసే ఏ ప్రకటన అయినా ఆ మోరుంగ్ నుండే చేస్తారు. అక్కడ వుండే బారాటి భేరీలను మోగించటం ద్వారా అందరినీ ఒక చోటుకు సమీకరించిన తరువాత తాము చెప్పదలచుకున్నది చెప్తారు. అలానే ఊరిలో ఒక ఇంటిని ప్రత్యేకంగా తాము సంహరించిన శత్రువుల కంకాళాలు దాచిపెట్టటానికి వాడతారు.

మగవారు కానీ, ఆడవారు కానీ ధరించిన అలంకరణలను బట్టి ఏ తెగవారో చెప్పవచ్చు. బ్రైట్ కలర్స్‌కు ప్రాధాన్యమిస్తూ వారిబట్టలు ఉంటాయి.

ఇక ఆడవారయితే నగలు చేయటంలో స్పెషలిస్టులు. గాజుముక్కలు, ఆల్చిప్పలు, రాళ్ళు, జంతువుల దంతాలు,కోరలు, కొమ్ములు, ఎముకలు, కలప, గింజలు,జుట్టు...ఏదీ నగలతయారీకిఅనర్హంకాదు.

1944లో నేతాజీ నేతృత్వం లోని హింద్ ఫౌజ్ బ్రిటీష్ ప్రభుత్వ సేనతో పోరాడింది నాగాలాండ్ రాజధాని కొహిమాలోనే.

రెండవ ప్రపంచయుద్ధంలో భాగంగా జపాన్, బ్రిటీష్ సేనల మధ్య బ్యాటిల్ ఆఫ్ కొహిమాగా పేరుగాంచిన భీకర యుద్ధం జరిగింది కూడా కొహిమాలోనే. ఈ విధంగా నాగాలాండ్ ఎంతో విలువయిన చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం ఉన్న ప్రాంతం.

అడవిలో నుండి వడివడిగా గ్రామంవైపు నడుస్తున్నారు సుమిత్ బోస్, లిమ్చెన్. పర్వతం మీద నుండి చూస్తున్న అవినాష్ "వాళ్ళే నాకు కావలసిన ఇద్దరూ" అన్నాడు లక్ష్మికి వారిని చూపిస్తూ.



డే అండ్ నైట్

రెండేళ్ళనాడు 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' సినిమాతో తెలుగు తెరపై తళుక్కుమన్న నందితా శ్వేత ప్రస్తుతం ఎడతెరపిలేని షూటింగ్‌లతో పరుగులు పెడుతున్నది.

మరి ఒకటి కాదు,రెండు కాదు ఏకంగా ఏడు సినిమాల షూటింగ్‌తో వెరీ బిజీగా వుంది.

అందుకే అవసరం అయితే పగలూ, రాత్రి అన్న లెక్కలేకుండా సినిమాలు చేసేస్తున్నదట.

"ఈ సంవత్సరం నా జీవితం రంగులరాట్నం మాదిరి తిరుగుతున్నది. ఒకేసారి ఏడు సినిమాల షూటింగ్‌లలో పాల్గొంటున్నాను. పనంటే నాకు ప్రాణం" అంటున్నది నందితాశ్వేత.

"నిజంగా వాళ్ళు ఇక్కడే ఉన్నారన్న మాట..."

"అయితే ఇప్పటిదాకా నా మాట నువ్వు నమ్మలేదా?" అన్నాడు అవినాష్.

"నమ్మకపోవటం కాదు..." అంటూ సర్దుకుని, "అదలా ఉంచు. ఇప్పుడయినా వాళ్ళు ఏం చేశారో చెప్తావా?" అంది లక్ష్మి.

"అది చెప్పకూడని రహస్యం అంటుంటే వినిపించుకోవే?నువ్వడిగినట్లు నేను నా అధికారులను ఇన్నిసార్లు అడిగితే ఈపాటికి కోర్ట్ మార్షల్‌చేసి జైలుకు పంపేవారు" అన్నాడు అవినాష్.

"పోనీ నీ ప్లానేంటో చెప్పు" "వాళ్ళు ఇప్పుడే ఊర్లోకి వస్తున్నారు. ఈ రాత్రికి నేను కిందకు వెళ్తాను. చీకట్లో పని ముగించుకుంటాను. తరువాత ఇద్దరం మనదారిన మనం వెళ్ళిపోదాం"

"ఇక్కడివే వాళ్ళని కంట్రోల్‌చేయగలవా?" "అలాంటి వారిని పదిమందినయినా కంట్రోల్ చేయుటానికి ట్రైన్‌అయినవాడిని నేను. డోంట్‌వర్రీ" కాన్ఫిడెంట్‌గా అన్నాడు అవినాష్.

అయితే అతననుకున్నట్లు పరిస్థితులు సవ్యంగా సాగలేదు. మరో రెండు గంటల తరువాత, దాదాపు సాయంత్రం అవబోతుండగా ఊరిబయట కలకలం రేగింది. వేరే తెగకు చెందిన కొంతమంది మనుషులు గుంపుగా వచ్చారు.

వారిని చూసి ఈ గ్రామంలోవారు కూడా ఏంజరిగిందో అర్థంకాక ఆందోళనపడ్డారు.

అయితే ఊరి పెద్ద సుజో అందరినీ శాంతపరచి వచ్చిన వేరేతెగవారిని గ్రామంలోకి ఆహ్వానించి మోరుంగ్‌దగ్గర అందరితో సమావేశం ఏర్పరిచాడు.

కాగడాల వెలుగులో కింద ఏం జరుగుతుందో స్పష్టంగా కనపడటం లేదు. వారి మాటలు వినిపించే అవకాశం అసలే లేదు. "ఏం జరుగుతోంది?" అంది అయోమయంగా లక్ష్మి.

ఆమె చేతిలో ఒక వాకీ టాకీ పెట్టాడు అవినాష్. "ఇది బ్యాటరీతో పని చేస్తుంది. 400 మీటర్ల దూరం వరకు పనిచేస్తుంది. మనిద్దరం మాట్లాడుకోవటానికి ఉపయోగపడుతుంది..." అన్నాడు.

"నువ్వెక్కడికి వెళ్తున్నావ్?"

"కిందకి"

"అక్కడ అంతమంది ఉండగానా?"

"అక్కడ అంతమంది ఉన్నారు కాబట్టే నన్నెవరూ పట్టించుకోరు" నాగా తెగవారి ట్రెడిషనల్ డ్రస్ బ్యాగులో నుండి బయటకు తీస్తూ అన్నాడు అవినాష్. "పైగా అంతమంది మధ్య ఈ డ్రస్‌లో ఉన్నదెవరో తేలిగ్గా గుర్తించలేరనే అనుకుంటున్నాను" మొహం మీద నల్లటి తెల్లటి చారలు రాసుకుంటూ అన్నాడు.

"ఈ డ్రస్ కూడా తెచ్చుకున్నావా?" ఆశ్చర్యంగా అంది ఆమె. నవ్వేసి, తనతో తెచ్చుకున్న తాడును పర్వతం మీద ఒక చెట్టుకుకట్టి మరోకొననుకిందకు జారేసి దాని ద్వారా కిందకు దిగాడు అవినాష్.

చుట్టూ చీకటిగా ఉండటంవలన అతను ఎవరికీ కనిపించే అవకాశంలేదు. గుండెలు చిక్కబరుచుకుని అతని ప్రయాణాన్ని చూస్తోంది లక్ష్మి.

ఏ ఆటంకం లేకుండా కిందకు దిగిన అతను పైన ఉన్న లక్ష్మికి సైగ చేయుటంతో అతను కిందకు రావటానికి సహాయపడిన తాడును ఆమె పైకి లాక్కుంది. ఆ తరువాత పిల్లిలా మెల్లిగా నడుస్తూ మోరుంగ్ దగ్గర సమావేశమయిన జనం మధ్యకి చేరాడు అవినాష్.

అయిదారు నిమిషాలుఅక్కడ జరుగుతున్నసంభాషణ విన్న తరువాత అతనికి అసలు విషయం అర్థమయింది. వచ్చినవాళ్ళు 'హు' తెగకి చెందినవాళ్ళు. అడవిలో సుమిత్‌బోస్ ఫోటోతీసిన అమ్మాయి వెనక్కి వెళ్ళి ఆ విషయం తమ గూడెంవాళ్ళకి చెప్పింది. ఇప్పుడు వాళ్ళు తగాదాకు వచ్చారు.

ఫోటో తీయటం నాగరిక ప్రపంచంలో సామాన్యమయిన విషయమనీ దానివలన ఏ హానీ జరగదనీ నచ్చచెప్పబోతున్నాడు లిమ్చెన్.

కానీ, ఎదుటివాళ్ళు ఒప్పుకోవటంలేదు.అమ్మాయి అన్న 'కెమో' తొడకొట్టి ఛాలెంజ్ చేస్తున్నట్లు ఏదో అంటున్నాడు. లిమ్చెన్ తండ్రి సుజో, లిమ్చెన్ కుదరదన్నట్లు తల అడ్డంగా ఊపుతున్నాడు.

"ఏమంటున్నాడు?" లిమ్చెన్‌ని ఇంగ్లీషులో అడిగాడు సుమిత్ బోస్.

"నిన్ను తనతో హంటింగ్‌కి రమ్మంటున్నాడు"

"అంటే ఏం చేయాలి?"

"మీ ఇద్దరూ ఒక రాత్రి అడవిలో ఉండాలి. ఉండటంఅంటే ఊరికే కాలుమీదకాలేసుకుని కూర్చోవటంకాదు. తెల్లారేటప్పటికి ఎవడు బలవంతుడయితే వాడు మరొకడి తల తీసుకుపోతాడు"

నవ్వాడు సుమిత్ బోస్. "ఒకవేళ ఒకడికి ఒకడు ఎదురు కాకపోతే?"

"అప్పుడు డ్రా అయినట్లవుతుంది"

"నాకు అభ్యంతరం లేదని చెప్పు" అన్నాడు.

"మతి పోయిందా? ఇది అడవి. ఇక్కడి విషయాలు నీకు తెలియదు" అన్నాడు అవినాష్.

"అడవి సంగతి నాకు తెలియకపోవచ్చు. కానీ నా దగ్గర ఇది ఉన్న సంగతి వాడికి తెలియక పోవచ్చు" తన జేబు తడుముతూ అన్నాడు సుమిత్ బోస్.

అతని జేబును పరీక్షగా చూసిన లిమ్చెన్, "ఏమిటది? పిస్టలా?" అన్నాడు.

అవునన్నట్లు తల ఊపాడు సుమిత్ బోస్.

"అయినా... ఈ అడవి లోతుపాతులు నీకు తెలియదు. ఇబ్బందులు పడతావ్"

"ఒక్కమాట చెప్పు. అతని దగ్గర తుపాకీ ఉంటుందా?" "ఉండదు"

"అయితే నేను రెడీ అని చెప్పు"

ఓవర్‌కాన్ఫిడెంట్‌గా మాట్లాడుతున్న అతనికి నచ్చచెప్పలేక, అతను ఒప్పుకున్న విషయం ఎదుటివారికి చెప్పాడులిమ్చెన్. అప్పటిదాకా ఆవేశంగా మాట్లాడుతున్న 'కెమో' ఆనందంగా కేకపెట్టాడు.

ఆ తరువాత అతను, అతనితో వచ్చిన మనుషులు ఊరి బయటకు

క్రికెట్ గత గొప్పతనం తలచుకుని తేలిపోవటం కాక వర్తమానపు ఆటను చూసి ఆనందించాలి. -వివియన్ రిచర్డ్స్,
వెస్ట్ ఇండీస్ మాజీ క్రికెటర్



వెళ్ళిపోయారు. అక్కడ ఒక వరుసలో నిలబడి యుద్ధానికి వెళ్ళేముందు చేసే నాట్యం చేస్తూ, అరుపులు అరుస్తున్నారు.

అడవిలోకి ఒంటరిగా వెళ్ళబోతున్న కెమోని ముందు నిలబెట్టి వాళ్ళు విన్యాసాలు చేస్తున్నట్లే గూడెంలో సుమిత్‌ని ముందు నిలబెట్టి సుజో బృందం కూడా నాట్యం చేస్తోంది.

లిమ్బెన్ ఇంత హడావుడిలోనూ సుమిత్ బోస్‌ని పక్కకి తీసుకువెళ్ళి అతని చెవిలో ఏదో చెప్పాడు. అతను ఏం చెప్పాడో అవినాష్‌కి వినపడలేదు.

ఇక హడావుడి పూర్తయి సుమిత్ బోస్ అడవిలోకి వెళ్ళే సమయం దగ్గరకు రావటంతో తను నెమ్మదిగా వెనక్కి తప్పుకున్నాడు అవినాష్.

పర్వతం మీద నుండి కింద జరుగుతున్న సంఘటనలన్నీ గమనిస్తున్న లక్ష్మి కూడా ఆ తరువాత జరుగుతున్నదానిని ఫాలో కాలేకపోయింది.

గూడెంలో అంటే చూపును అడ్డుకోవటానికి చెట్లు లేవు. వెలుతురు ఉంది కాబట్టి ఏం జరుగుతోందో కనిపిస్తోంది. అదే అడవి మొత్తం చెట్లతో కవర్ అయి ఉంది కాబట్టి అక్కడ ఏంజరుగుతోందో అర్థం కావటంలేదు. ఇక తను చేయగలిగింది ఏమీ కనపడక, ఒక పెద్దరాయికి ఆనుకుని కూర్చుంది లక్ష్మి.

సుమిత్ బోస్, హు తెగకి చెందిన కెమో విడివిడిగా అడవిలోకి వెళ్ళారు. వారిని అనుసరించటం తెగ నియమాలకి విరుద్ధం కాబట్టి మిగిలినవారు ఎవరూవారిని వెంబడించలేదు. అవినాష్ మాత్రం ఎవరిదృష్టిలో పడ కుండా అడవిలోకి నడిచాడు.

తనతో ఒంటరి పోరుకు సుమిత్ అంత తేలిగ్గా ఒప్పుకుంటాడని కెమో అనుకోలేదు. కానీ సుమిత్ ఒప్పుకోవటంతోఅతనికిమొదట ఆనందం కలిగింది. ఆ తరువాత అనుమానం వచ్చింది.

తన జాగ్రత్తలో తను ఉండాలనుకున్నాడు. అడవిలో సుమిత్ బోస్‌ని వెతుకుతూ ముందుకు నడుస్తున్నాడు కెమో. అయితే ఆశ్చర్యకరంగా ఎంత ప్రయత్నించినా అతనికి సుమిత్ బోస్ ఆచూకీ దొరకటం లేదు.

ఒక నాగరిక ప్రపంచానికి చెందిన వ్యక్తి ఇలాంటి అడవిలో తనకు కనపడకుండా దాక్కోగలగటం సాధ్యం అని అతను అనుకోవటంలేదు. అయితే సుమిత్ బోస్ అడవిలోకి ప్రవేశించే ముందు అతనికి లిమ్బెన్‌చెవిలోచెప్పినమాట బాగాఉపయోగపడింది.

క్రితం రోజు ఇద్దరూ అడవిలోకి వెళ్ళినపుడు ఒక భారీ వృక్షాన్ని చూపించాడు లిమ్బెన్. దాని మొదలు చుట్టుకొలత కొన్ని మీటర్లు ఉంటుంది. ఆ చెట్టుకు ఒక పెద్ద తొర్ర ఉంది. అందులో ఒక మనిషి తేలిగ్గా దాక్కునే వీలుకల్పిస్తూ ఆ తొర్రని పెద్దది చేశారు.

ఆ తొర్ర కనిపించకుండా ఒక కృత్రిమ తలుపు చెట్టు బెరడు ఆకారంలో చేయించి అక్కడ అమర్చారు. ఆ చెట్టు జలపాతం దగ్గర్లో ఉంది.

అక్కడ ఉన్న మడుగు దగ్గరకు అనేక జంతువులు దాహం తీర్చుకోవటానికి వస్తుంటాయి. ఈ చెట్టు తొర్రలో దాక్కున్న మనిషి జంతువులకు కనపడడు కాబట్టి, అవి స్వేచ్ఛగా నీరు తాగటానికి అక్కడకు వస్తాయి. అప్పుడు వాటిని వేటాడటం తేలిక. అందుకే అలా రహస్య ప్రదేశం తయారుచేసి ఉంచుకున్నారు. ఆ సంగతులన్నీ వివరిస్తూ ఆ రహస్య తొర్రను సుమిత్ బోస్‌కి చూపించాడు లిమ్బెన్.

ఎలాగోలా ఆ తొర్రలో దాక్కుని తెల్లారేవరకు కాలం గడిపితే తెల్లారాక ఇక 'హు' తెగవాళ్ళు వెళ్ళిపోతారు. సమస్య సమసిపోతుందని ఇప్పుడు అడవిలోకి వెళ్ళబోయేముందు ఆ విషయాన్నే గుర్తుచేస్తూ అక్కడ దాక్కుంటే అతన్ని ఎవరూ పట్టుకోలేరని చెప్పాడు లిమ్బెన్.

అతను సూచించినట్లే చేయటంతో సుమిత్ బోస్ ఉనికి కెమోకి తెలియటంలేదు. ఆ చెట్టు పక్కగా రెండుసార్లు నడిచినా ఆ చెట్టు తొర్రలో మనిషి ఉండవచ్చనే ఆలోచన కెమోకి రాలేదు.

చెట్టుతొర్రలో ఉన్న సుమిత్ బోస్‌కి మాత్రం ఇది ఒకఆటలాఉంది.అడ్వెంచర్‌లాఉంది. నిజ జీవితంలో ఇలాంటి అడ్వెంచర్ చేసే అవకాశం ఎవరికో కానీ రాదు. అందుకే అతను ఈ ప్రక్రియకు ఒప్పుకున్నాడు. అయితే, ప్రస్తుతం అతని మనసు అతన్ని ఒకడుగు ముందుకు వేయమని ప్రోత్సహిస్తోంది.

చేతిలో తుపాకీ ఉంది. ఎదురుగా తనను వెతుకుతున్న కెమో ఉన్నాడు. అతనికి తను దొరికితే తనను చంపకుండా వదలనపుడు తను మాత్రం అతన్ని ఎందుకు వదలాలనుకున్నాడు.

ఆ ఆలోచన వచ్చిందే తడవుగా తన జేబులోని పిస్టల్ తీసి చేతిలో పట్టుకున్నాడు.

అతన్ని వెతుకుతున్న కెమో కాసేపటి తరువాత మరోసారి ఆ పరిసరాల్లోకి వచ్చాడు. చాటునుండి కెమోని గురి చూసి కాల్చాడు సుమిత్ బోస్.

గుండు సూటిగా దూసుకువెళ్ళి కెమో ఛాతీలో దిగింది. చేత్తో ఛాతీని పట్టుకుని కిందకు జారిపోయాడతను. తొర్రలో నుండి బయటకు వచ్చాడు సుమిత్ బోస్. గుండు సూటిగా గుండెల్లో దిగి కెమో అప్పటికే మరణించాడు. సుమిత్‌కి నాగావాళ్ళ హెడ్ హంటింగ్ ఆచారం గుర్తుకువచ్చింది. కెమో తలను అతని శరీరంనుండి వేరుచేసి తీసుకువెళ్తే లిమ్బెన్ తెగవాళ్ళు తనను ఎంత గౌరవిస్తారో... అనుకున్నాడతను.

అతను ఆ ప్రయత్నం చేసేలోపే అక్కడకు వచ్చాడు అవినాష్. సుమిత్ బోస్ పేల్చిన పిస్టల్‌శబ్దం అతనికి తను ఎటు వెళ్ళాలో దారి చూపించింది.

"నీకు మనుషుల్ని చంపటం ఎంటర్‌టైన్‌మెంటన్న మాట..." అన్న అవినాష్ మాటలకు ఉలిక్కిపడి తల ఎత్తి ఆటవికుల దుస్తుల్లో ఉన్న కొత్త వ్యక్తిని చూసి తన పిస్టల్ అతనికి గురిపెట్టబోయాడు సుమిత్ బోస్. అయితే అతని ప్రయత్నం నెరవేరలేదు.

అవినాష్ విసిరిన ఒక కిక్ అతని చేతిలోని పిస్టల్‌ను గాల్లోకి ఎగిరేలా చేసింది. దానిని కిందపడకుండా పట్టుకున్నాడు అవినాష్.

కోరికలు సముద్రంలాంటివి. ఒడ్డుకుచేరిన అలకు ఆనందం. మధ్యలోవున్న అలకు ఆరాటం. చేరనిఅలకు విషాదం.అన్నీతెలిసి ఇంకా ఏదో కావాలనుకుంటామే... అదే జీవితం.



అందుకు విరుద్ధం

చేసింది రెండే రెండు సినిమాలు అయినా షాలినీ పాండే చాలినంత గుర్తింపు గడించింది. 'అర్జున్ రెడ్డి'లో నూనెపెట్టి నున్నగా దువ్విన జుట్టుతో, సాదాసీదా దుస్తుల్లో కనపడిన షాలిని తత్వం ఇందుకు పూర్తిగా విరుద్ధం.

స్లీవ్‌లెస్ టాప్‌లు, షార్ట్‌లతో టిప్‌టాప్‌గా వుంటుంది. మాంచి మాటకారి కూడా. 'మహానటి'లో కనిపించింది తక్కువ సమయమే అయినా ఆ పాత్ర తనకెంతో నచ్చిందంటున్నది.

"నాదృష్టిలో సినిమాలో ఎంతసమయం నటించామన్నది ముఖ్యంకాదు. పాత్ర ప్రభావం ఎంత ఉంటుందనేది ముఖ్యం. సుశీల పాత్ర నాకు ఎంతగానో నచ్చింది" అంటున్న షాలినీ గాయని కూడా. పుస్తకాలు చదవడం అంటే భలే ఇష్టం అట.

అవినాష్‌భాషవింటే అతను అటవికుడు అనిపించలేదు సుమిత్‌బోస్‌కి. అందుకే, "ఎవరునువ్వు?" అన్నాడు.

"నీ కోసం వెతుక్కుంటూవచ్చిన ఒక శ్రేయోభిలాషిని"

"నాతో నీకేం పని?"

"నీకు ఒక చిన్న శిక్ష విధించాలని వెతుక్కుంటూ వచ్చాను"

"శిక్షేమిటి?"

"చేసిననేరానికి శిక్ష అనుభవించాలిగా?" అన్నాడు అవినాష్.

"నువ్వు మాట్లాడుతున్నదేమిటో నాకు అర్థం కావటం లేదు"

"ఢిల్లీ పెంట్‌హౌస్‌లో ఏం చేశావో అప్పుడే మరచిపోయావా?"

"అయినా అది అంత సులువుగా మరచిపోయే నేరమా? లక్షలమంది అమాయకులను ఒక్కబాంబుతో చంపుదామనుకున్నావే... ఎంత ఘోరమయిన చర్య అది?"

అప్పుడు అర్థమయింది సుమిత్ బోస్‌కి వచ్చిందెవరో, "నేను ఇక్కడ ఉన్నానని ఎలా తెలి సింది?" భయంగా అడిగాడతను.

"అది ఇప్పుడు అవసరమా మిస్టర్ బోస్. నీ ఆఖరి కోరిక ఏదైనా ఉంటే చెప్పు" చనిపోయిన కెమో దుస్తుల్లో ఉన్న మెలికలు తిరిగిన ఒక కత్తిని బయటకు తీస్తూ అన్నాడు అవినాష్.

"నువ్వు ప్రభుత్వానికి చెందిన వాడివి. నన్ను చంపకూడదు. చంపలేవు..." అన్నాడు సుమిత్ బోస్ అడుగులు వెనక్కివేస్తూ.

అతను ఊహించనంత వేగంతో కదిలింది అవినాష్ చేతిలోని కత్తి.

సర్రున సుమిత్ బోస్ కంఠం కింద మెడనుచీలుస్తూ ఇవతలకువచ్చింది.

జరుగుతున్న దానిని నమ్మలేనట్లు, నోటివెంట మాట రాకుండా కూలబడిపోయాడు అతను.

కాసేపు కొట్టుకున్న అతని శరీరం చలనంలేకుండా ఆగిపోయింది.

వందలాది చిన్నపిల్లల మరణాలకు కారణమయి, వేలాదిమంది పిల్లలను తల్లిదండ్రులకు దూరంచేసిన అతన్ని ఏహ్యంగా చూశాడు అవినాష్.

అతని తలను మిగిలిన శరీరం నుండి వేరుచేసి అతను చేయాలనుకున్న పనిని అతనిమీదే ప్రయోగిద్దామా అనుకున్నాడు కానీ, అలాంటి జుగుప్సాకర పని చేయలేక ఆగిపోయాడు.

అతను వెనుతిరిగి గూడెందగ్గరకు వచ్చేటప్పటికి అందరూ నిద్రలో ఉన్నారు. అతను సరాసరి గూడెం మధ్యలోఉన్న పెద్ద ఇంటివైపునడిచాడు. తలుపు తెరుచుకుని లోపలకు నడిచిన అతనికి ఒక గదిలో ఒంటరిగా పడుకుని ఉన్న లిమ్చెన్ కనిపించాడు.

అతని పక్కన ఉన్న మరో మంచం ఖాళీగా ఉంది. కెమో దగ్గరనుండి తీసుకున్న మెలికలు తిరిగిన కత్తి ఇంకా తన దగ్గరే ఉంది. దానికోసం జేబులో చెయ్యిపెట్టి తడుముతుంటే చేతికి కత్తి బదులు వాకీ టాకీ తగిలింది.

ఈ లిమ్చెన్ అనే చీడ పురుగును కూడా తొలగిస్తే తనకు అప్పచెప్పిన పని పూర్తవుతుంది... అనుకుంటుంటే వెనుక సన్నటి శబ్దం వినిపించింది.

వెనుతిరిగి చూసేలోపే అతని తల మీద బలమైన దెబ్బపడింది.

పర్వతంమీదపడుకునిఉన్న లక్ష్మికి ఎవరో తట్టిలేపినట్లు ఒక్కసారిగా మెలకువ వచ్చింది. తనకు అంత హఠాత్తుగా ఎందుకు మెలకువ వచ్చిందో ఆమెకు అర్థంకాలేదు.

ఇంతలో గురగురమన్న శబ్దం వాకీ టాకీ నుండి వచ్చింది. దాన్ని చేతిలోకి తీసుకుని ఆన్‌చేసింది లక్ష్మి.

అటునుండి ఏవో మాటలు వినపడుతున్నాయి. ఆ భాష ఏమిటో వాళ్ళు ఏమి మాట్లాడుకుంటున్నారో ఆమెకు అర్థంకాలేదు. వాకీటాకీ ఆన్ అయిందంటే,దానిని అవినాష్‌ఆన్‌చేసిఉండాలి. మరి ఆన్‌చేసిన వాడు తనతో ఎందుకు మాట్లాడటంలేదు? బహుశా అతను ఏదైనా ప్రమాదంలో పడ్డాడా?

బైనాక్యులర్స్ సాయంతో కింద గూడెం వైపు చూసింది. ఆ అర్ధరాత్రి సమయంలో కూడా అక్కడ హడావుడిగా ఉంది. కొంతమంది గూడెం మధ్యలోఉన్న సుజో ఇంట్లోకివెళ్తున్నారు. హడావుడిగా బయటకు వస్తున్నారు.

ఆమెను ఎంతోసేపు ఆ సస్పెన్స్‌లో ఉంచకుండా చేతులు వెనక్కి విరిచి కట్టేసిన అవినాష్‌ను గూడెం మధ్యలో ఉన్న ఖాళీ ప్రదేశంలోకి తీసుకువచ్చారు. ఆమె లేచి నిలబడింది.

తను ఏదో ఒకటి చేయకపోతే అవినాష్ బ్రతకడని ఆమెకు అర్థమవుతోంది. కానీ ఏం చేయాలో మాత్రం అర్థం కావటంలేదు.

ఇంకా ఉంది

సమ్మర్ కూలర్స్

వేసవి ఉష్ణోగ్రతల తాపాన్ని తట్టుకోవాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బలు, డీహైడ్రేషన్ ఈ సీజన్‌లో ఎక్కువగా, సాధారణంగా వచ్చే సమస్యలు. ఎండల నడుమ రోడ్డుపక్క కనిపించే చల్లని పానీయాలు లేదా పండ్లరసాలు ఊరిస్తుంటాయి. అయితే ఇవి ఉదరానికి హాని చేస్తాయి. డయేరియావంటి సమస్యలకు కారణమవుతాయి.

ఏడాది పొడవునా సాగే ఋతుమార్పిడుల్లో వేసవి చెడ్డది అని చెప్పలేం. నిజానికి, ఈ సీజన్‌కు ఉండే లాభాలు ఈ సీజన్‌కు వున్నాయి కూడా.

స్విమ్మింగ్ పూల్‌లో సరదాగా ఈతకొట్టడాలు, వేసవి మధ్యాహ్నాలు సీజన్ రుచులను ఆస్వాదించడాలు, మల్లెల సౌరభాలు వేసవి ప్రత్యేకతలు. మామిడి రుచులు గురించి చెప్పనే అక్కర్లేదు.

వేసవిలో ఆరోగ్యాన్ని అందించే పదార్థాలతో వంటగదిని నింపేయాలి.ఆరోగ్యపూరిత పచారీలనుఎంపిక చేసుకోవాలి. వేసవిలో చల్లదనాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చే కొన్ని సమ్మర్ కూలర్ల వివరాలు తెలుసుకుందాం. ఇవి జీర్ణవ్యవస్థకు చక్కగా సహకరిస్తాయి.

వెలగకాయ: చాలామందికి వెలగకాయ ఊసే వుండదు. పులుపు, తీపి, వగరుల కలయికతో వుండే వెలగ చాలా రుచిగా వుండడమే కాదు, పోషకాలతో కూడింది కూడా.పీచు,క్యాల్షియం,విటమిన్ ఎ,బి పుష్కలంగాలభిస్తాయి.దీన్నిఎండలో డ్రైచేసుకుని తినచ్చు.

వెలక్కాయ గుజ్జుతో షర్బత్ తయారుచేసుకుంటే అద్భుతమైన జీర్ణకారిగా పనిచేస్తుంది. పండిన వెలక్కాయగుజ్జు గుండెకు, మెదడుకు మేలుచేస్తుంది. లాక్సాటివ్‌గా కూడా ఉపయోగపడుతుంది. పేగుల్లోని క్రిములకు సత్వర చికిత్స వంటిది.

పిల్లలకు సైతం రెండు స్పూన్లు వెలగపండు గుజ్జు తినిపించడం మంచి ఆలోచన. పచ్చికాయను ఇన్‌ఫెక్షన్‌వల్ల కలిగిన డయేరియాకు చికిత్సగా ఇవ్వవచ్చు. దీనిలోని యాంటీ- వైరల్ గుణం విరుగుడుగా పనిచేస్తుంది. వెలగకాయలోని టానిన్ గ్యాస్ట్రిక్, ఇంటెస్టినల్ అల్సర్లను నయంచేసే గుణం కలిగివుంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. నీటిలో కలుపుకోవడం వల్ల సత్వర ఫలితాలు కనపడతాయి.

పుదీనా : ఫైటోన్యూట్రియెంట్లకు పవర్ హౌస్ వంటిది. యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఎక్కువగా వుంటాయి. పుదీనా ఆకులను పచ్చిగా చప్పరించినా, టీలో వేసుకుని తాగినా అద్భుతఫలితాలు కనపడతాయి.

తలనొప్పులు, వికార సంబంధిత సమస్యలనుంచి ఉపశమనం కలిగిస్తాయి. పుదీనా ఆకులు వేసుకుని ఆవిరిపెట్టుకుంటే ముక్కుదిబ్బెడలు, సైనస్, శ్వాస సంబంధిత సమస్యలు తగ్గుతాయి.

ఎండు పుదీనా ఆకుల్ని కాల్చి పొగ పీలిస్తే, ప్రయోజనకరంగా వుంటుంది. పుదీనాను పెయిన్‌బామ్‌లలో కూడా ఉపయోగిస్తారు. దానిలోని మెంథాల్ నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మెంథాల్ ఉదర సంబంధిత క్రాంప్స్‌ను సైతం తగ్గించే గుణం కలిగివుంటుంది. జీర్ణశక్తికి, ఎసిడిటీ నివారణకు ప్రయోజనకరంగావుంటుంది.



Courtesy : READER's DIGEST

పుదీనాలోని యాంటీఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు నోటి దుర్వాసనను అరికడతాయి. కొద్దిగా పుదీనా ఆకుల్ని నోట్లో వేసుకుని చప్పరిస్తే చాలు. ఇలా రోజుకు ఒకటి, రెండుసార్లు చేస్తే సరిపోతుంది. పుదీనా ఆకుల్ని మెత్తగా నూరి అప్లయ్ చేయడంవల్ల మొటిమలు తగ్గుతాయి. దురదగా, పొడిగాగల చర్మానికి మందులాంటిది. అనేక వేసవి సమస్యలనుంచి పరిరక్షించే సమ్మర్ కూలర్.

త్రిఫల : ఇది సంస్కృతపేరు. ఉసిరి, హరిటాకి, బిభిటాకి- ఆయుర్వేద హెర్బ్స్‌ను సమపాళ్ళలో కలపినదే త్రిఫల. పొడి,మాత్రలు, జ్యూస్‌రూపంలో లభించే త్రిఫల శారీరకవ్యవస్థను పరిశుభ్రపరిచి, సరైన బోవెల్ కదలికలకు ఉపకరిస్తుంది.

మలబద్ధకాన్ని బాగా ట్రీట్‌చేస్తుంది. లివర్, చర్మ సంబంధిత వ్యాధులు, డిప్రెషన్‌వంటి సమస్యల పరిష్కారంలో ఉపకరిస్తుంది. శక్తిని పెంచుతుంది. ఉసిరిలోని విటమిన్ సి లివర్ సహజ ప్రక్రియకు మద్దతు ఇస్తే, బిభిటాకి శ్వాసవ్యవస్థకు ఉపకారి.

ఆస్తమానుంచి ఉపశమనం కలిగిస్తుంది. ముందస్తుగా జుట్టు మెరవడాన్ని అడ్డుకోగలదు. హరిటాకిలో క్లెన్సింగ్ గుణాలు ఎక్కువ.

విషతుల్యాలను తొలగించి, ఆరోగ్యపూరిత బరువును మెయిన్‌టెయిన్‌చేయడంలో సాయపడుతుంది. ఈ మూడూ కలిస్తే, జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయడంలో సాయపడతాయి. రోగనిరోధకశక్తిని పెంచడం ద్వారా జలుబు,దగ్గులనుంచి ఉపశమనాన్నిస్తాయి.


అల్లం : ప్రపంచంలో అధికంగా వాడే సహజ హెర్బ్. దీనిలో కనీసం 14 బయోయాక్టివ్ పదార్థాలుంటాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా వుంటాయి. టీలో, తాజా పండ్ల రసాల్లో కలుపుకోవచ్చు.

కడుపుబ్బరాన్ని తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఎండు అల్లం అంటే శొంఠి దీర్ఘకాలిక బ్రాంకైటీస్‌కు మంచి మందు వంటిది.

ఆయుర్వేదంలో జీర్ణకారిక సమస్యల పరిష్కారంలో, ఉదయంవేళ వికారంలో, జాండీస్, పైల్స్, జలుబు, దగ్గు, ఆస్తమా, బ్రోంకైటిస్, కోరింత దగ్గు సమస్యల పరిష్కారంలో విస్తృతంగా వాడతారు.

యాంటీ క్యాన్సరస్ గుణాలు అల్లంలో ఎక్కువగా వుంటాయి. యాంటీ ఆక్సిడెంట్స్‌కు మంచి ఆధారం. ఇన్‌ఫ్లేమ్ అయిన జాయింట్లు, కండరాలపై చక్కని ఉపశమన ప్రభావం చూపుతుంది.అల్లంలో బి6,రిబోఫ్లేవిన్ వంటి బి విటమిన్లుంటాయి. మెగ్నీషియం, జింక్, ఫాస్పరస్ అధికంగా లభిస్తాయి. ఇన్ని గుణాలుగల ఈ పదార్థాలన్నీ వేసవిలో అత్యధికంగా తలెత్తే జీర్ణ సంబంధిత సమస్యల నివారణలో ప్రభావవంతంగా పనిచేస్తూ, వేసవిని సజావుగా సాగిస్తాయి.

Whats App



కృష్ణా మేరేజ్ లింక్స్‌వారు ఓ కాబోయే పెళ్ళి కూతురికి మగపిల్లల ప్రొఫైల్స్ చూపిస్తూ- "అమ్మా, ఈ అబ్బాయి ఎత్తు, లావు అన్నీ చక్కగా ఉన్నాడు. కనుముక్కు తీరు బాగుంది. బ్రహ్మాండమయిన ఉద్యోగం, మంచి సంపాదన, కుటుంబం మంచిది. మంచి ఆస్తి వుంది. ఖాయం చేయమంటారా?

అమ్మాయి : కొంచెం రంగు తక్కువ కదా?

కృష్ణా : అవునమ్మా! కాని, అబ్బాయి చాలా లక్షణంగా ఉన్నాడు.

అమ్మాయి : ఇప్పుడు మీరు చెప్పిన ఇదే క్వాలిటీతో వేరే కలర్ చూపించండి.

మన భారతదేశంలో 10 శాతం అమ్మాయిలు మాత్రమే క్రీడల్లో / ఆటల్లో రాణిస్తున్నారట. మిగిలిన 90 శాతంమంది పెళ్ళిచేసుకుని, వాళ్ళ మొగుళ్ళను ఆడిస్తున్నారట.

స్టూడెంట్ : బట్టతల ఉంటే గొప్పవారు అవుతారటగా, నిజమేనా టీచర్?

టీచర్ : ఒరేయ్, సౌండ్ ఇంజనీర్, బట్టతల కాదురా, పట్టుదల.

భార్య : మన అమ్మాయి ఎప్పుడుచూసినా అద్దం ముందే ఉంటోందండి. అరిచినా వినట్లేదు.

భర్త : అద్దం దాచేయపోయావా?

భార్య : తీసి దాచాను. కాని, ఎక్కడ దాచినా కని పెట్టేస్తోంది.

భర్త : దాని క్లాసు పుస్తకాలలో దాయి. చచ్చినా ముట్టుకోదు.

నందుగాడికి అతికష్టంమీద రంజీల్లో ఆడే అవకాశం దొరికింది.

తమ జట్టువాడు ఒకడు అవుటైతే రంజీ మైదానంలో మొదటిసారి బ్యాటింగ్‌కు దిగాడు.

మొదట ఓవర్ డిఫెన్స్ ఆడాడు.

రెండవ ఓవర్‌లో విజృంభించాడు. మొదటి బాల్ ఒకటి, రెండుకు రెండు, నాలుగుకు నాలుగు, ఆరవ బాల్‌కు సిక్సర్ కొట్టాడు.

అలా కొడుతుంటే అతని స్కోర్ ముప్పైఐదు రన్స్‌కు చేరింది.

అంతే, నందు ఆనందం పట్టలేక బ్యాట్ గాల్లో ఊపాడు. ఆకాశంవంక చూశాడు. ఏదో గొణిగాడు. అటువైపు వున్న బ్యాట్‌మ్యాన్‌కు ఏం అర్థంకాలేదు.

నెమ్మదిగా వచ్చి నందు చెవిలో అడిగాడు "నువ్వేం రికార్డు సాధించలేదు. కనీసం హాఫ్ సెంచరీ కాదు. ఎందుకిలా పొంగిపోతున్నావు?" అని.

నందుగాడు అతని చెవిలో చెప్పాడు-

"చదువుకునేటప్పుడు ఆ 35 కోసం నానా పాట్లు పడి, నానా ఇబ్బందులు పడి, అల్లాడిపోయినాళ్ళకి తెలుస్తుంది. ఆ 35 విలువేంటో"

ఓ విదేశీయుడు భారతదేశాన్ని కాశ్మీర్ నుండి కన్యాకుమారివరకు సందర్శించాడు. ఆయన తన డైరీలో ఇలా రాసుకున్నాడు.

1. ఇద్దరు వ్యక్తులు కొట్టుకుంటున్నారు. మూడవవాడు వచ్చి చూసి వెళ్ళిపోతే అది 'ముంబయి'
2. ఇద్దరు కొట్టుకుంటుంటే, మూడోవాడు వచ్చి ఆపబోతే, ఇద్దరూ వాడిని తంతే అది 'చెన్నై'
3. ఇద్దరు కొట్టుకుంటున్నారు. మూడోవాడు ఒక కేసు బీరు పట్టుకొచ్చాడు. ముగ్గురూ తాగి తిరిగి ఫ్రెండ్స్ అయిపోయి ఇంటికెళితే అది 'గోవా'
4. ఇద్దరు కొట్టుకుంటున్నారు. ఒకడు వచ్చి, మా ఇంటిముందు కొట్టుకోవద్దు అని చెపితే అది 'బెంగళూరు'
5. ఇద్దరు కొట్టుకుంటున్నారు. ఇద్దరూ ఫోన్ తీసి కాల్ చేస్తే అప్పుడు వాళ్ళతోపాటు మరో యాభైమంది పోగై కొట్టుకోవటం మొదలుపెడితే అది 'పంజాబ్'
6. ఇద్దరు కొట్టుకుంటూంటే, మూడోవాడు వాళ్ళిద్దరినీ కాల్చేస్తే అది 'బీహార్'
7. ఇద్దరు కొట్టుకుంటున్నారు. మూడోవాడొచ్చి వీడియో తీస్తుంటే అది 'ఆంధ్రప్రదేశ్'
8. ఇద్దరు కొట్టుకుంటున్నారు. జనాలు గుమిగూడారు. ఒకడు సైలెంట్‌గా టీకొట్టు పెడితే అది 'కేరళ'
9. ఇద్దరు కొట్టుకుంటున్నారు. మూడోవాడు వచ్చి సర్దిచెప్పాడు. సాయంత్రం దావత్ అడిగాడు అంటే అది 'తెలంగాణ' ◆

పళ్ళ డాక్టర్ : జనవరిలో నాదగ్గరకొచ్చినప్పుడు నీ నోట్లో బంగారుపన్ను ఒకటి ఉందికదా? ఇప్పుడు లేదే?

పేషెంట్ : మీ ఫీజుకోసం అమ్మేశాను.

భార్య : కనీసం మీ ఫోటో కూడా చూడకుండా మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నానంటే నమ్ముతారా మీరు?

భర్త : నేను నిన్ను బాగా చూసికూడా పెళ్ళి చేసుకున్నానంటే నమ్మగలరా ఎవరయినా?

పీనాసి పాపారావు : ఈ ప్యాంట్‌గుడ్డ ఖరీదెంత?

బట్టలషాపు కుర్రాడు : మీటర్ 200 రూ.

పీనాసి పాపారావు : పదిమీటర్లు తీసుకుంటే ఎంతకి ఇస్తావు.

షాపు కుర్రాడు : 190 చేసుకోండి.

పీనాసి పాపారావు : కాస్త తగ్గించు.

షాపు కుర్రాడు : ఎన్ని మీటరులు తగ్గించాలి?

అబ్బాయి, అమ్మాయి వాట్సాప్ చాట్‌లో

అబ్బాయి : 'ఐ లవ్ యు'

అమ్మాయి : నోర్ముయ్

అబ్బాయి : నువ్వంటే నాకు చాలా ఇష్టం.

అమ్మాయి : నోర్ముయ్

అబ్బాయి : నువ్వు చాలా అందంగా ఉంటావు.

అమ్మాయి : నిజంగానా?

అబ్బాయి : నోర్ముయ్!!

వాట్సాప్ చాట్‌లో...


లత : నేను నీకు సరిపోను రమేష్

రమేష్ : అలా అనకు బేబీ, నువ్వు చాలా మంచిదానివి.

లత : అంత లేదు రమేష్ నీకంటే మంచోడికి సరిపోతా.

హెల్త్ బిట్స్

గుండెకు ద్రాక్షరసం




నల్లద్రాక్ష రసం ప్రతిరోజూ తాగటం మంచిది. అన్ని పండ్ల రసాలలోకన్నా నల్లద్రాక్ష రసం ఎంతో మేలైనది.

ఇది గుండెజబ్బులు రాకుండా నిరోధించగలదు. క్యాన్సర్‌కి విరుగుడుగా పనిచేస్తుంది. అత్యధికంగా యాంటీ ఆక్సిడెంట్స్ కలిగినది ద్రాక్షరసం.

శరీరంలో తయారయ్యే ఫ్రీరాడికల్స్ ప్రభావం నుండి రక్షిస్తాయి యాంటీ ఆక్సిడెంట్స్. పండ్లలో ఈ యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. అందుకే తప్పకుండా పండ్లు తినమని చెప్పేది.

అన్ని పండ్లలో ఒకే స్థాయిలో ఒకే రకమైన యాంటీ ఆక్సిడెంట్స్ ఉండవు. దానిమ్మ, యాపిల్, అనాస, టమోటో, ద్రాక్షవంటి 13 రకాల పండ్లరసాలను యాంటీ ఆక్సిడెంట్స్‌కోసం పరిశీలించారు. చివరిగా నల్లద్రాక్ష రసంలో అధికంగా యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్నందున చేసే మేలు ఎక్కువని తేల్చారు. ◆



Courtesy : HEALTH

బిగ్గరగా చదివితే మేలు

పిల్లలు చదవటం ప్రారంభించినపుడు ఆ చదివేది బిగ్గరగా చదవండి అని పెద్దలు చెప్పేవారు.

పాత రోజులలో పిల్లలచేత వల్లె వేయించేవారు.అదంతా గొడవగా ఉంటుందని క్రమంగా మాన్పించారు. కాని అదే సరైన చదువు పద్ధతి అంటున్నారు నేడు.

బిగ్గరగా చదివితేనే ఆ విషయం మెదడుకు చేరి బాగా గుర్తుంటుందంటున్నారు. బిగ్గరగా చదవటమంటే చదువుతున్నది మరోసారి చెవికి చేరటం. అలా చదవటం, వినటం రెండూ ఏకకాలంలో జరిగినందున ఆ విషయం బాగా గుర్తుండిపోతుంది. ప్రయోగాత్మకముగా కొందరిని మౌనంగా చదవమని, కొందరిని ఇతరులు చదివింది వినమని, రికార్డ్ చేయించి వినమని, బిగ్గరగా తమకు తామే చదువుకోమని చెప్పారు.

ప్రయోగము చివర పరిశీలించినపుడు తమకు తాము బిగ్గరగా చదువుకున్నవారిలోనే విషయంబాగా జ్ఞాపకం ఉందని తేల్చారు.

అదేవిధంగా చదివింది రాయటం ద్వారా జ్ఞాపకం స్థిరపడుతుంది. అందుకే హాయిగా బిగ్గరగా చదివించండి మీ పిల్లలను. ◆

అతిగా పని

ఆఫీసు పనిగంటలు అయిపోయినా కుర్చీని అంటిపెట్టుకుని పనిచేయటం అనే అలవాటు ఆరోగ్యరీత్యా అంత మంచిది కాదు.

కొన్ని సందర్భాలలో మాత్రమే ఆఫీసులో అధికంగా పని వుంటుంది. ప్రతి రోజూ అంత పని వుండదు.

ఆఫీసు టైమ్‌లోగా పని పూర్తిచెయ్యలేకపోవటం అంటే అది అసమర్థతకు నిదర్శనము. ఎవరి మెప్పుకోసమో ఎక్కువ సమయం ఆఫీసులో గడిపితే ఆరోగ్యం చెడుతుంది. అతిగా పని చేయటం అంత మంచిది కాదు.

అలా పని చేయుటంవల్ల వెనువెంటనే కాకున్నా దీర్ఘకాలంలో పని సమర్థత తగ్గుతుంది. పనిమీద దృష్టిని కేంద్రీకరించటంలో ఇబ్బందులు పడతారు.

ఇతర చిన్న చిన్న అనారోగ్యాలు వస్తాయి.ఆఫీస్‌లో అతిగా పనిచేయడం వల్ల కష్టాలేకాని సుఖాలుండవు. ◆



హిస్టరెక్టమీ చిక్కులు

ఇటీవలి కాలంలో వైద్యులు మహిళలమీద విరివిగా చేస్తున్న ఆపరేషన్లు సిజేరియన్, ఆ తర్వాత హిస్టరెక్టమీ. సాధారణ ప్రసవం అవనీయక, గబగబా సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీస్తున్నారు.

చిన్న చిన్న సమస్యలకే గర్భసంచీ, అండాశయాలను తొలగిస్తున్నారు. అండాశయాల్ని తొలగించకపోయినా కేవలం గర్భసంచీ తొలగింపు ఆపరేషన్ చేయించుకున్నా దీర్ఘకాల అనారోగ్యాల్ని కొనితెచ్చుకోవటమే.


హిస్టరెక్టమీ ఆపరేషన్ తర్వాత 13 శాతం మందిలో రక్తపోటు పెరగటం, పధ్నాలుగుశాతంమందిలో లిపిడ్స్‌లో మార్పులు రావటం గమనించారు.

ఆపరేషన్ తరువాత ప్రతి ముగ్గురిలో ఒకరు బరువు పెరుగుతున్నారు. పైగా ఆపరేషన్‌తర్వాత గుండె సంబంధిత సమస్యలు వస్తున్నాయి.

ముఖ్యంగా మధ్యవయసు (35-40 సంవత్సరములు)లో గర్భసంచీ తొలగింపు ఆరోగ్య సమస్యలను ఎక్కువగా తెస్తోంది.

గర్భసంచీ తొలగిస్తే బాధ తగ్గటం తాత్కాలికమేగాని దీర్ఘకాలంలో కొత్త బాధలు భరించాల్సివస్తున్నది.

అందుకే మహిళల్లో ఫైబ్రాయిడ్స్, ఎండోమెట్రోసిస్‌వంటివాటికి ఆపరేషన్ చేయడంకన్నా ప్రత్యామ్నాయ అంశాలను చూడాలి అంటున్నారు నవీన పరిశోధకులు.



హిందీలో ఓ సినిమా చేసి మళ్ళీ దక్షిణాదికి వచ్చేసిన పూజా హెగ్డెకు తెలుగు ప్రేక్షకులు సాదరంగా స్వాగతం పలికారు. ఇక్కడ వరుస ఆఫర్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ఆమెతో ఇంటర్వ్యూ :

తెలుగు, తమిళ సినిమాలతో కెరీర్ ఆరంభించిన మీకు హిందీ పరిశ్రమ భిన్నంగా అనిపించిందా?

సినిమాలు సినిమాలే అన్న అభిప్రాయంతోనే నేను ఎల్లవేళలా వుంటాను. భాష వేరు కావచ్చు. షూట్ విధానం అంతా ఒక్కటే. చిన్నచిన్న విషయాల్లో వ్యత్యాసాలు వుండవచ్చు.

ఉదాహరణకు తెలుగు సినిమా హీరోయిన్ హిందీతారలతో పోల్చితే విభిన్నంగా ఎమోట్ అవుతుంది.

చిత్ర నిర్మాణంలో కొద్దికొద్దిగా వ్యత్యాసాలు ఉంటాయి తప్ప మిగతా అంతా ఒక్కటే.

చిత్రసీమనుంచి ఎక్కువగా ఏం నేర్చుకున్నానని భావిస్తున్నారు?

ఎంతోనేర్చుకున్నాను-ఏంచేయాలి, ఏం చేయకూడదు అన్నవాటితోసహా. 'మొహంజదారో' నుంచి అనుకున్న ఫలితాలు రాలేదు.

ఏం చేసినా ప్రతిదానికీ ఉత్తమంగా చేయాలని, ఎంతోకొంత అభ్యసించాలని అర్థమయింది.

సినిమా డెస్టినీ ఎలా వున్నా పూర్తి న్యాయం చేయాలని అర్థమయింది. కొన్నిసార్లు బాగా ఆడతాయన్న నమ్మకంతో ఎంపిక చేసుకుంటాం.

అయితే, ఫలితం మన నియంత్రణలో వుండదు. నేనయితే ఇప్పుడు షూటింగ్‌లో ఎంజాయ్ చేయగలనన్న అంశాలపై దృష్టి సారిస్తున్నాను.

మీ కుటుంబంగురించి చెప్తారా?

మాది అకడమిక్‌గా మంచి నేపథ్యంగల కుటుంబం. నాన్న లాయర్. అమ్మ జెనిటిక్స్, ఇమ్యునాలజీ. మా అన్నయ్య డాక్టర్.

నటికావాలని చిన్నతనం నుంచి అనుకునేవారా?

లేదు. మా కుటుంబంలో ఎవరికీ చిత్రపరిశ్రమతో సంబంధం లేదు. స్టార్ కిడ్స్ ఆ వాతావరణంలో పెరుగుతారు కాబట్టి వారు పరిశ్రమతో కనెక్ట్ అవుతారు. కాని, నేను అలా కాదు. మామూలుగా సైచైల్డ్‌ని. సినిమాల ఆలోచన కూడా లేదు.

ఒకసారి మా కాలేజీ ఈవెంట్స్‌లో మిస్ ఇండియాకు చెందిన ఒకరు నన్ను చూసి ప్రదర్శనలో పాల్గొనాల్సిందిగా సిఫార్సు చేశారు.

అలా నా బుర్రలో గ్లామర్ విత్తనం పడింది. చివరకు మొదటిసారిగా ఫిల్మ్ సెట్‌లో కాలుపెట్టాను.



ఎదుగుతున్న కొద్దీ మీకు స్ఫూర్తిగా ఎవరున్నారు?

ఎవరో ఒకరు కాదు. గాయత్రీ దేవి, ప్రిన్సెస్ డయానాలను చూసినప్పుడు వాళ్ళెంతో క్లాసీగా, మనోహరంగా ఉన్నారనిపించేది.

నాకెంతో స్ఫూర్తిగా అనిపించే వాళ్ళు. ఓప్రా, ఎలెన్ డీజనర్స్‌షో చూసేదాన్ని. అవికూడా స్ఫూర్తిదాయకంగానే వుండేవి. అందరికంటే ముఖ్యంగా మా అమ్మ మంచి స్ఫూర్తి.

భవిష్యత్‌లో ఎటువంటి పాత్రలు చేయాలనుకుంటున్నారు?

బాలీవుడ్‌లో చేసింది ఒక్క సినిమానే. ఇంకా ఎన్నోపాత్రలు పోషించాలని వుంది. యంగ్, ఫన్ సినిమా చేయాలన్నది నా కోరిక. 'ఏ జవానీ హై దివానీ'

విత్తనం అలా పడింది





నా ఆల్‌టైమ్ ఫేవరేట్. కరణ్ జోహార్ సినిమాలు నాకు బాగా ఇష్టం. అవి సరదాగా, నవ్వులు, ఎమోషన్లతో వుంటాయి.

వైఫల్యాలను మీరు ఎలా ఎదుర్కొంటారు?

(నవ్వేస్తూ) ఓ పావుగంట ఏడ్చేసి. నేను ఓ సినిమాకు రెండేళ్ళు కేటాయించాను.

అది బాగా ఆడలేదు. చాలా బాధనిపించింది. ముఖ్యంగా నేను చిత్రపరిశ్రమకు చెందిన దాన్ని కాదు.బాధను వదిలేసి ముందుకు సాగాలి. మళ్ళీ హార్డ్‌వర్క్ చేయాలి. అదే చేశాను.

అందాన్నికాపాడుకోవడానికి మీరు ఏం చేస్తారు?

దురదృష్టవశాత్తూ అటువంటి రొటీన్ ఏదీలేదు. నాపట్ల నేను శ్రద్ధ చూపడంలో చాలా లేజీ. పడుకునే ముందు మేకప్‌నుమాత్రం క్రమంతప్పకుండా తొలగించుకుంటుంటా. కొబ్బరి నూనె అభిమానిని. పొడి చర్మానికి ఇది బాగా పనిచేస్తుంది.

మీ ఫేవరెట్స్?

సన్‌గ్లాసెస్. చాలా ఇష్టం. ఆహారం, ప్రయాణాలు కూడా.

మీరు ఇష్టపడే షాపింగ్ ప్రదేశం?

లండన్, అమెరికా.

ప్రయాణాల్లోఏంతెచ్చుకుంటారు?

అది నేనువెళ్ళే ప్రదేశాన్నిబట్టి ఉంటుంది. ఉదాహరణకు స్కాట్‌లాండ్ వెళ్తే స్కాచ్ తెస్తాను.

లండన్‌వెళ్తే అక్కడ దొరికే వస్తువులు, ట్రెడిషనల్ సావనీర్లు. అలాగే సన్‌గ్లాసులు తెచ్చుకుంటుంటా.

మీ భవిష్యత్ ప్రాజెక్టులు ఏంటి?

మూడు తెలుగు సినిమాలున్నాయి. వాటిలో ఒకటి హిందీ, తెలుగుద్విభాషా చిత్రం ప్రభాస్‌తో చేస్తున్నా. మిగతావి ఎన్.టి.రామారావు, మహేష్‌బాబులతో కలసి అంటూ ముగించింది.

అయినపూరి సుజాత



కాపాలికుడు దరహాసం చేసి "ఆ సముద్రుడే అసహాయశూరుడయి, మహారథుడై అనేకమందికి సమాధానం చెప్పగల మహావీరుడు కాగలడని భద్ర కాళి చెప్పివున్నది" అన్నాడు.

"అతడి దండయాత్రలతో ఈ భరతభూమి కూడా దద్దరిల్లిపోతుందని చివరకు అశ్వమేథ యాగం చేస్తాడని ఆ మాత నాతో చెప్పివుంది"

ఆ మాటలకు అందరూ కూడా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు "అలా ఎలా సంభవమవుతుంది

"ఆ సంగతి అలా ఉంచండి మహామంత్రీ! అసలు సముద్రగుప్తుడు ఈ యుద్ధంలో ఎలా పాల్గొన గల్గుతాడు. అతడికున్న యుద్ధపాటవమేమిటి?

అనుభవం ఏపాటిది? యుద్ధతంత్రం, వ్యూహారచనల సంగతి అలా ఉంచి ఖడ్గాన్ని సరిగ్గా పట్టుకోవటం కూడా చేతకాని యువరాజు రేపు ఈ యుద్ధాన్ని ఎలా నడిపిస్తాడో మాకు అగమ్యగోచరంగా ఉంది.

ఇవి మా అభిప్రాయాలేకాదు, మా అందరి సేనానాయకులు, సమస్త సైనికుల అభిప్రాయాలు"

సి.శివరామమూర్తి

కాపాలికా...!" అంటూ నుదురు కొట్టుకున్నాడు కశ్యపుడు.

"యుద్ధాన్ని జ్యోతిష్య విశ్వాసముతో ఎవరూ చేయరు. కండబలంతో, వీర శౌర్య ప్రతాపాలతో చేస్తారు"

కాపాలికుడు "కశ్యప! సేనానాయకులారా! నా మాటలను విశ్వసించండి. సముద్రగుప్తుడు వీరావతారంగా ఉద్భవించే సమయం ఆసన్నమయింది.

అతడి జైత్రయాత్రలతో ఈ భూమి దద్దరిల్లిపోగలదు. మీరే మీ కన్నులతో ప్రత్యక్షంగా తిలకించనున్నారు"


అందరూ కూడా మరోసారి మొహ మొహాలు చూసుకున్నారు.

కశ్యపుడు సేనానాయకులతో "నేను కాపాలికుడి మాటల్ని విశ్వసిస్తున్నాను. ఈశ్వరుడు మహిమ కలవాడు.

ఆ మహిమలో అంతర్భాగంగా ఏ అద్భుతాలయినా జరగవచ్చు. అయినా ఇపుడు మనకు అన్ని మార్గాలు కూడా మూసుకుపోయాయి.

ఎవరో ఒకర్ని విశ్వసించక తప్పదు. అలాంటప్పుడు ఈ కాపాలికుడి మాటలను మనం కూడా విశ్వసిద్దాం"

అనేక తర్జనభర్జనలయ్యాక సేనానాయకులు తలలూపారు.



"ఇపుడు కర్తవ్యం?"

కశ్యపుడు "మీరు కచగుప్తుడు నియమించిన సేనా నాయకుల బారినుండి సముద్రుడిని కాపాడండి కనురెప్పలాగా!"

ఒక సేనానాయకుడు "అపుడు వారికి మామీద అనుమానం వస్తే..."

కశ్యపుడు "ఆ విషయాన్ని వారు వచ్చి ఇక్కడ చెప్పేదాకా బ్రతికివుంటే గదా...?" అక్కడ వారి కళ్ళు ఆశ్చర్యంతో విస్ఫారితమయ్యాయి.

"ఆ రాజద్రోహుల కుత్తుకలు పాటలీపుత్ర నగరానికి వచ్చేలోగా రాలిపోవాలి!" అన్నాడు.

గుండెలమీద చేతులు వేసుకున్నారు నాయకులు.

"పర్యవసానం, కచగుప్తుడి చేతిలో పర్యవసానం ఏమిటో తెలుసా?"

"ఇందుకుగాను కచుడి అనుమతి ఉంది నాయకులారా!"

మళ్ళీ నాయకులు అంతా ఒకరి మొహాలు ఒకరు మార్చి చూసుకున్నారు. కశ్యపుడు చెపుతున్నది ఏమిటో వారికి అర్థంకాలేదు.

"అవును నాయకులారా! కచుడు, సముద్రగుప్తుడు యుద్ధములో మరణించకపోతే హత్య చేయమని నీరందరినీ నిర్దేశించాడు.

ఆ తర్వాత వాళ్ళ కుత్తుకలు కొయ్యమని సంకల్పించి ఉన్నాడు"

"కానీ సముద్రుడు రక్షింపబడాలని మీరే అంటున్నారు. సముద్రగుప్త యువరాజును నీడలాగా వెంబడించి కాపాడమని మీరే చెపుతున్నారు కదా! సముద్రుడు జీవించి వీరి కుత్తుకలు కోస్తే మమ్మల్ని కచుడు అనుమానించడా! మా ప్రాణాల్ని తీయడా!"

కశ్యపుడు "ఆ విషయాన్ని నాకు వదిలివేయండి. మీరు తిరిగివచ్చేలోగా కచుడు రాజ్యంనుండి వెళ్ళిపోతాడు. సముద్రగుప్తుడితో తిరిగివచ్చిన మీరు, సముద్రగుప్తుడిని సామ్రాట్‌గా అభిషిక్తుడవటం చూస్తారు"

జరిగిన కథ 21

కాపాలికుడు, కశ్యపుడు కూడా సముద్రగుప్తుడిని, అతని తండ్రిని బంధించిన సంగతి తెలిసి కూడా ఏమీ ఎరగనట్టే వుండి 'ఈ మహా సామ్రాజ్యానికి సామ్రాట్' మీరేనని ఆ జగన్మాతకూడా నిర్ణయించిందని పలుకుతారు.

అది నమ్మేసిన కచగుప్తుడెంతో ఆనందించి మహారాణి ఆశీర్వాదం కోసం ఆమె అంతఃపురం వెళ్ళేసరికి మహారాణితో లావినియా సంభాషిస్తూంటుంది.

లావినియా అందాన్ని చూసి ఖిన్నుడైన కచగుప్తుడు 'నాకాబోయే పట్టపు మహారాణివి నీవే' అని లావినియాతో అనేసరికి మహారాణి ఆందోళనపడుతుంది.

లావినియా సముద్రగుప్తుడు ప్రేమలో పడేసరికి సౌగంధిని అసూయతో రగిలిపోయి ఆ విషయం కచగుప్తుడికి చేరవేస్తుంది.

నీవు లావినియాను కలవకూడదని ఆంక్షపెట్టి ఆమెకు కాపలా పెడతాడు కచుడు. అతడ్ని పట్టాభిషిక్తుడ్ని చేస్తాడు చంద్రగుప్తుడు.

ఇంద్రప్రస్థాధీశుడు నాగాయకుడిని బంధించి తెచ్చినవారిని లావినియా వివాహమాడుతుందని తెలిసి అందుకు బయల్దేరతాడు సముద్రగుప్తుడు... సోదరుడిని సంహరించే కుటిలనీతికి ఉద్యుక్తుడౌతాడు కచుడు. ఇక చదవండి.

అందరి మొహాల్లో విస్మయం.

"కచుడు ఎలా వెళ్ళిపోతాడు? ఎక్కడికి వెళ్ళిపోతాడు?"

కశ్యపుడు నవ్వాడు-

"ఇది మంత్రాంగ రహస్యం! నేను చెప్పేవన్నీ జరగబోతున్నాయి. అయితే ఒక్క విషయాన్నిమాత్రం చెప్పలేను"

"ఏమిటది..." అని కాపాలికుడు అడిగాడు.

"అవును కాపాలికా...!" కశ్యపుడు అన్నాడు- "సముద్రగుప్తుడి విజయం! ఈ పథకాలు, ప్రణాళికలన్నీ సముద్రగుప్తుడు స్వయంగా సాధించబోయే విజయంపై ఆధారపడివున్నాయి.

కత్తి చేతపట్టలేని సుకుమార రాకుమారుడు ఏదో అఖండ విజయాన్ని సంపాదించిపెడతాడని మీ మాటలు నమ్ముతున్నాము. నాకయితే ఏదో ఏదో భయంగా, ఏవో గాలిమేడలు కడుతున్నట్టుగా లోలోపల వణికిపోతున్నాను కాపాలికా!"

కాపాలికుడు ఒక్కసారి కళ్ళుమూసుకొని కొన్ని లిప్తలతర్వాత కన్నులు తెరిచాడు. ఈసారి కాపాలికుడు కళ్ళు తేజోమండలాలుగా వెల్గుతున్నాయి.

"మీ అందరికీ మరోసారి భరోసా



కూల్‌కూల్‌గా

చల్లచల్లని ఐస్‌క్రీమ్స్ అంటే చంద మామ అందాల కాజల్ అగర్వాల్‌కు అమిత ఇష్టం అట.

"నిజానికి మా ఇంట్లో అందరం ఐస్‌క్రీమ్ అమిత ఇష్టంగా తింటాం. నాకు అదే వారసత్వం వచ్చిందను కుంటా. షూటింగ్‌లకోసం ఎక్కడకు తిరుగుతున్నా నా వెంట ఐస్‌క్రీమ్ ఎప్పుడూ వుంటుంది.

నా గదిలో ఫ్రిజ్ తెరిస్తే ముందుగా కనపడేవి అవే.

ఫిట్‌నెస్ కోరుకునేవారు ఐస్‌క్రీమ్ తినకూడదంటారు కదా.

నేనుమాత్రం ఐస్‌క్రీమ్‌లు తినేసి, జిమ్‌లో వాటికోసం ఎక్కువసేపు గడుపు తుంటా" అని చెప్పింది కాజల్.

ఇస్తున్నాను, ఆ భద్రకాళీ, ఆ తల్లి సర్వాన్నీ సమాయత్తము చేసింది... అందుకు రంగం సిద్ధమైంది. సముద్ర గుప్తుడు వీరకిశోరంగా ఆవిర్భవించే భూమిక అతిచేరువలో ఉన్నది"

"అదెలాగో చెపితే మా అందరికీ ఆత్మవిశ్వాసం కల్గుతుంది కదా కాపా లికా!" ప్రాధేయపడ్డాడు కశ్యపుడు.

"నేను నిస్సహాయుడను... భద్ర కాళి ఆన లేదు"

ఈసారి అందరూ కలిసి మూకు మ్మడిగా పట్టుబట్టారు. "కాపాలికా! నీవు అద్భుత మహిమాన్వితుడవని మా అందరి నమ్మకం. మాకు ఏదైనా అద్భుతాన్ని చూపించి మా అందరికీ విశ్వాసం కలిగించు. ఎంత ప్రయత్నిం చినా మా అందరిలో ఏదో శంక!"

కాపాలికుడు ఈసారి దీర్ఘంగా ఆలోచించి నిర్ణయానికొచ్చాడు "మీరు రేపు ఉదయాన్నే లేచి పాటలీపుత్ర నగ రానికి చేరువలో ఉన్న దక్షిణ వనానికి వెళ్ళండి. అక్కడ మీరొక విచిత్ర సంఘ టనను చూస్తారు. అంతేకాదు... పరశువుతో ఒక వ్యక్తి తారస పడతాడు. ఆ వ్యక్తినుండి ఆ పరశువును దానంగా అడిగి తీసుకురండి"

కశ్యపుడు ఆశ్చర్యంగా "పరశువా... ఇంతకీ గండ్రగొడ్డలితో మనకి పని ఏముంది" అడిగాడు.

ఈసారి కాపాలికుడు వికటాట్ట హాసం చేశాడు. "ఎందుకా... ఎందు కేమిటి, నేనేమి నా నోటితో చెప్పకుండా మీకే సర్వమూ అర్థమవుతాయి"

అందరూ సందేహంగా చూశారు. కాపాలికుడు "ఆ భద్రకాళి మహిమ ఏమిటో కొన్ని ఘడియలలో మీకే అవ గతమవుతుంది. అపుడు ఈ కాపాలికు డికి మీరందరూ దాసోహమవుతారు. మీలో నేను అన్న మాటలకు కోటాను కోట్లు రెట్లుగా ఆత్మవిశ్వాసం వస్తుంది. అపుడౌదురుగానీ కర్తవ్యోన్ముఖులు"

అందరూ తలలు ఊపారు.

కాపాలికుడి మాటలు వారికి సమ్మత మయ్యాయి. కశ్యపుడు అన్నాడు- "ఏ మిషతో అక్కడకు వెళతారు"

సేనానాయకుడు అన్నాడు "యుద్ధా నికి ముందు కవాతులు చేయాలి గదా! మాలో కొందరం గుర్రపుస్వారీలు,గుర్రా లపై కవాతులు చేసుకుంటూ దక్షిణ వనానికి చేరుకుంటాము"

కశ్యపుడు ప్రశాంతంగా చూశాడు. "మరి ఒక మాట!"

"... ... ..."

"ఇపుడు మీరు నా దగ్గరకు వచ్చిన వైనము ఎంత రహస్యమయినా, కచ గుప్తుడి చెవులకు చేరకుండా ఉండదు. అందుకని కచుడికి మీతో సంప్రదించి నట్టే చెపుతాను"

"ఏమని?"

"కచుడు తన సేనానాయకులను కొందర్ని యుద్ధమైనతరువాత సంహ రించాలనుకున్నాడు గదా! అందు కోసమని మిమ్ములను నియమించట మైనదని చెపుతాను"

"... ... ..."

"నాయకులారా! భయం వద్దు... కచుడికి నా యందు సంపూర్ణ విశ్వాసం వున్నది. ఈ విశ్వాసమే ఈ అంధ కారంలో మనకు వెలుగుదివ్వె. గోరంత దీపం!"

అందరూ తలలూపారు.

"పై వివరణనుమాత్రమే కచుడికి చెప్తాను. కచుడు నన్ను నా వివరణను విశ్వసించటమే కాకుండా ఎంతగానో మెచ్చుకుంటాడు కూడాను"

"ఇంతవరకు బాగానే ఉంది. మిగి లిన అతి కీలక విషయం. రేపుదయాన జరగబోయే ఆ విచిత్ర ఉదంతం?"

అందరూ ఆ తర్వాత సెలవు పుచ్చు కొని విడిపోయారు. కశ్యపుడు కాపాలి కుడూ ఇరువురూ మిగిలిపోయారు.

కాపాలికుడు "కశ్యపా! ఇక నీవు కర్తవ్యోనుఖుడవుకా!"

కశ్యపుడు కాపాలికుడికి వినయంగా నమస్కరిస్తూ- "రేపు సూర్యోదయం. రేపే ఈ దేశ భవిష్యత్తు ఏమిటో అర్థ మవుతుంది కాపాలికా!"

"అవశ్యం కశ్యపా! నిశ్చింతగా వెళ్ళ వచ్చు. ఈ రోజు రాత్రి ప్రశాంతంగా నిదురపో! ఇంతకీ కచుడ్ని ఎలా పంపి స్తున్నావ్... ఎక్కడకు పంపుతున్నావ్! ఏ కార్యంమీద పంపుతున్నావ్! గుప్పెట మూసి ఉంచుకో సుమా!"

"నీ తల్లినే అడుగు. ఆ తల్లి చెప్పక బోతే రేపు ఉదయాన నా గుప్పెటను విప్పుతాను. అదీ నీవు చెప్పిన విచిత్ర ఉదంతం జరిగి మాకు విశ్వాసం కలి గినతర్వాత మాత్రమే కాపాలికా!"

కాపాలికుడు నిండుగా నవ్వి "మొత్తా నికి మహామంత్రివి అన్పించావ్ కశ్యపా! నిన్ను ప్రశంసించకుండా ఉండలేను. నీకు వున్న మేధాబలం ఏపాటిదో నేను కూడా చూస్తాను" అన్నాడు.

కశ్యపుడు కాపాలికుడికి నమస్క రించి వెళ్ళిపోయాడు.

కచగుప్తుడు కశ్యపుడు చెప్పిన దంతా శ్రద్ధగా ఆలకించాడు.

వచ్చే 20 ఏళ్ళవరకు పార్టీని నడిపించేది నేనే... పార్టీ అధ్యక్షపదవికోసం ఎవరూ కలలు కనవద్దు.

-మాయావతి, బి.ఎస్.పి. నేత



కశ్యపుడు ఊహించినట్లుగానే కచుడు తనను అభినందించాడు. తమ గుట్టు తెలిసిన సేనా నాయకుల పీకలు ఇలా సులువుగా తెగకోసేందుకు జరిగిన ఏర్పాటుకు కశ్యపుడిని మెచ్చుకున్నాడు.

కచుడు ఈసారి గుర్తుకువచ్చినవాడిలా "మీతో మరియొక రహస్యం చెప్పాలి కశ్యపా!" అన్నాడు.

కశ్యపుడు చెవులు రిక్కించాడు.

"సముద్రుడి దగ్గరకు ఇటీవల ఒక వృద్ధుడు వచ్చి ఆ ప్రాసాదంలో మరణించివున్నాడు.... గుర్తు వచ్చిందా!" అనడిగాడు.

కశ్యపుడు తల ఊపాడు.

"ఆ వృద్ధుడు సముద్రుడి భవిష్యత్‌ను రాసిపెట్టివున్న అమూల్య తాళపత్రాల్ని సముద్రుడికి ఇచ్చాడు. అవి దొంగిలించబడ్డాయ్! అవేగనుక ఈ రోజు మన చేతిలో ఉంటే మన సమస్యలన్నీ తీరివుండేవి" అన్నాడు.

"అవును సామ్రాట్"

"ఆ తాళపత్రాల్ని దొంగిలించిన వారెవరో ఎవ్వరికీ తెలియదు. తాళపత్రాలను సముద్రుడికి ఇస్తున్నపుడు సౌగంధిని అతిరహస్యంగా విన్నదట. ఆ తాళపత్రాలను ఆమె చేజిక్కించుకోవాలని ఎంతో ప్రయత్నం చేసింది కాని, ఈలోగానే అవి దొంగిలించబడ్డాయ్!" అని చెప్పాడు.

"ఇది వాస్తవమేనా!" అని కశ్యపుడు తెలియనట్టుగా అడిగాడు.

నిజానికి ఈ విషయం రహస్యంగా పొంచివున్న సుకన్యద్వారా తాను లోగడ వినివున్నాడు. సుకన్య రాజప్రాసాదంలో తన గూఢచారి.

ఆమెకు ఎన్నో విలువైన కానుకలు ఇచ్చి ఆమెను లోబరుచుకొని, కీలక సమాచారాలన్నింటినీ సేకరించాడు. ఈ విషయం అత్యంత గోప్యం. ఎవ్వరికీ తెలియని పరమరహస్యం.

కొద్దిరోజుల క్రితమే సుకన్యకు హెచ్చరిక చేశాడు- "సుకన్యా! ఇప్పుడు రాజధానిలో, రాజప్రాసాదంలో పరిస్థితులు విషమిస్తున్నాయ్...! ఎప్పుడు ఏమి ఉపద్రవం జరుగుతుందో తెలియదు. లావినియాను కనురెప్పలా కాపాడాలి"

సుకన్య తల ఊపింది. "సౌగంధిని పై నిఘా ఉంచు. సౌగంధిని కచుడికి ఆంతరంగికురాలయింది, ఇటీవలి కాలంలో..." అన్నాడు.



ప్రాంతీయ పార్టీల నాయకుల ఆలోచనలు తరచుగా మారుతుంటాయి. అందుకే తృతీయ ఫ్రంట్ విఫలమవుతుంటుంది.

-అరుణ్‌జైట్లీ, కేంద్రమంత్రి

సుకన్య తల ఊపింది.

మరోసారి బంగారు నాణాలు, అనేక అమూల్యాభరణాలు కానుకగా ఇచ్చాడు కశ్యపుడు. సుకన్య మొహంలో కోటి దీపాలు వెలిగాయ్.

కశ్యపుడు మరోసారి హెచ్చరించాడు. "అత్యంత రహస్యం సుమా! బయట పడితే కచగుప్తుడి నుంచి పర్యవసానాలు నేను నీకు వేరే చెప్పనక్కరలేదనుకుంటాను" అన్నాడు.

సుకన్యకు ఒళ్ళు జలదరించింది భయంతో.

సుకన్యకు ఈ మధ్యకాలంలో లావినియా అంటే ఆరాధన ఏర్పడింది... మొదట సౌగంధినితో చేతులు కలిపినా, సౌగంధిని ఎడల అంతర్లీనంగా ఆమెకున్న ఈర్ష్య, అసూయలు మళ్ళీ లావినియావైపు ఆలోచింపజేసింది.

సౌగంధిని లావినియా రాకముందు సౌందర్య అహంకారంతో ఎందరినో గాయపరచిన సందర్భాలు లేకపోలేదు. అపుడప్పుడూ సుకన్య కూడా ఆ గాయాన్ని స్వీకరించవలసివచ్చింది.

పైగా ఆలోచిస్తున్నకొద్దీ లావినియా ఎడల, ఆమె కష్టాలయందు సానుభూతి కలిగింది.

అన్నిటికీ మించి లావినియాలోని నిష్కాపట్యం సుకన్యను క్రమముగా జయించింది. ఆ తర్వాత లావినియాలోని అసమాన నిరుపమాన సౌందర్యం. "సౌగంధినికి ఈ అద్వితీయ అపురూప సుందరితో పోటీ ఏమిటి? సౌగంధిని కేవలం లావినియాముందు ఒక దిష్టి బొమ్మ మాత్రమే!"

చిత్రవిచిత్రంగా ఉంటాయ్ ఆడవారి మనసులు. ఎపుడు ఎలా వారి చిత్రప్రవృత్తులు మారుతాయో ఆ బ్రహ్మకైనా అవగతం కావు.

ఇక్కడ కశ్యపుడు కచుడితో ఏమీ తెలియనట్టుగా నటిస్తున్నాడు.

కచుడు సమాధానం చెప్పాడు.

"లేదు కశ్యపా! ఆ తాళపత్రాలు నిజంగానే దొంగిలించబడ్డాయ్...! సముద్రుడికి ఆ తరువాత ఎంత గాలించినా దొరకలేదు"

"... ... ..."

"సముద్రుడికి నిజంగానే ఆ తాళపత్రాలు దొరికితే, తనకు భవిష్యత్తు తెలిసివుంటే కథ ఇంతవరకూ వచ్చేదా కశ్యపా!" అని అడిగాడు.

కశ్యపుడు తల ఊపాడు. "అవును ఇందులో సందేహం లేదు... అందరి సమస్యలు ఏనాడో తీరివుండాలి"

ఉన్నట్టుండి కశ్యపుడికి కాపాలికుడి మీద అనుమానం వచ్చింది. అయితే మళ్ళీ సమాధానపడ్డాడు.

'అలా తాళపత్రాలు తెలిసినవాడిలా ప్రవర్తించటం లేదు. కొన్ని విషయాలను అపుడపుడు కాపాలికుడు కూడా చెప్పలేకపోయాడు. అడిగితే భద్రకాళి గుప్పెట మూసివుంచిందని చెప్పేవాడు. మరి అయితే ఆ తాళపత్రాలను ఎవరు దొంగిలించినట్టు?'

వీడని చిక్కుముడి అయింది.

కచుడు మళ్ళీ అన్నాడు "కశ్యపా! మరో రహస్యం!" కశ్యపుడికి మనసులో మరోప్రక్క అంతులేని ఆనందం, కచగుప్తుడికి తనయందు ఆవరించిన సంపూర్ణ విశ్వాసానికి.

"చెప్పండి సామ్రాట్!" వినయంగా తలవంచాడు కశ్యపుడు.

"లావినియా ఎవరో అగంతకుడి

హ్యాపీ... హ్యాపీ...

నటనలో తిరుగులేని తారగా గుర్తింపుపొందిన నివేదా థామస్ 'జై లవకుశ' సినిమా తరువాత ఎందుకనో ఏ సినిమాలకు సంతకాలు చెయ్యలేదు.

ఆమె బ్రేక్‌గురించి చాలా కబుర్లు వినపడినా, ఆమె అచ్చంగా చదువు పూర్తిచేయడానికే విరామం తీసుకున్నది. ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ పూర్తిచేసి తిరిగి కెమెరా ముందుకు వచ్చేసింది. కల్యాణ్‌రామ్ సరసన ఓ సినిమా చేస్తూ, హైదరాబాద్‌కు షూటింగ్‌కోసం తిరిగి చేరింది.

"మళ్ళీ సినిమాలు చేయడం చాలా చాలా సంతోషంగా ఉంది అంటూ నవ్వుల వెన్నెలలు ఆరబోస్తున్నది.



సహాయంతో రాజప్రాసాదాన్ని చేరిందట. అది అతిరహస్యమట!" అని చెప్పాడు.

"ఎవరు చెప్పారు?"

"సౌగంధిని. లోగడ సౌగంధినికి లావినియా చెప్పబోతున్న తరుణంలో అంతరాయం వచ్చి చివరి క్షణంలో చెప్పలేదట. కానీ ఇపుడెంతమాత్రమూ నోరువిప్పటం లేదుట లావినియా!"

దీనికి కారణం తనే....! సుకన్య ద్వారా లావినియాకు హెచ్చరిక చేసివున్నాడు, సౌగంధిని కచగుప్తుడు ఆంతరంగికురాలని.

సౌగంధినికి తన మనసు విప్ప వద్దని. అయితే లావినియా ఎవరో అగంతకుడి సహాయంతో రాజప్రాసాదాన్ని చేరటంమాత్రం కశ్యపుడికీ క్షణం వరకు తెలియదు.

"అగంతకుడా! చాలా ఆశ్చర్యంగా ఉందే!" అన్నాడు.

"ఈ విషయాన్ని ఎలాగయినా లావినియా నోటినుంచి కక్కించాలి. అసలు



కాంగ్రెస్-జెడి(ఎస్)ల మధ్య సమస్యలు ఉన్నాయి. అయితే అవి ప్రభుత్వం పడిపోయేంత పెద్ద సమస్యలు కాదు.

-కుమారస్వామి, కర్ణాటక సి.ఎమ్.

లావినియా మనకు శ్రేయోభిలాషో లేక ప్రచ్ఛన్నంగా చేరిన శత్రుగూఢచారో నని నా సందేహం"

కశ్యపుడికి ఈసారి భయం వేసింది. 'కచుడు ఆ సుకుమారి ఎడల మొరటుగా ప్రవర్తించడుకదా!'

"తొందరపడవద్దు అని సామ్రాట్‌కు మనవి"

"సందేహనివృత్తి అయ్యేంతవరకు నా మనస్సులో అవిశ్రాంతమే కశ్యపా! వెంటనే ఈ విషయం తేల్చుకోవాలని నా నిర్ణయం"

కశ్యపుడు ఆ పరమేష్టిని ప్రార్థించాడు. 'కచుడు నిర్ణయానికి తిరుగు ఉండదు. ఇక ఆ లావినియాను ఆ పరమేష్టియే కాపాడాలి' ఆగ మేఘాలమీద కాపాలికుడిని కలిసేందుకు సెలవు తీసుకున్నాడు కశ్యపుడు ఏదో మిషపెట్టి. ఇటు కచగుప్తుడు లావినియా ప్రాసాదానికి చేరాడు.

కచగుప్తుడిని చూసి పులిని చూసిన లేడిలా వణికిపోయింది లావినియా!

జాక్-డాస్ పక్షులు కచుడ్ని చూసి నిర్విరామంగా అరవటం మొదలు పెట్టాయ్!

కచుడికి జాక్-డాస్‌లంటే అసహనం వచ్చింది. ఒక్కసారిగా వెళ్ళి వాటిని ఒడిసిపట్టుకోవాలని ప్రయత్నించాడు. అవి రెండూ తప్పించుకుని గవాక్షం నుంచి బయటకు పారిపోయాయ్! ప్రశాంతత నెలకొంది!!

కచుడు, లావినియాను నిలదీశాడు. "లావినియా! నిన్ను ఇక్కడకు చేర్చినవారెవ్వరో చెప్పాలి"

"ఎవరు చెప్పారు"

"సౌగంధిని"

లావినియాకు క్రుంగిపోయినట్లైంది "ఎంతటి ద్రోహం!"

"లావినియా...! నిన్నే అడుగుతున్నాను. నువ్వు ఎవరి సహాయంవలన ఇక్కడకు వచ్చావ్. ఎవరు నిన్ను ఇక్కడకు నిర్దేశించారు" చెప్పు అన్నాడు.

"చెప్పను యువరాజా!"

"యువరాజు కాదు... ఇపుడు నేను సామ్రాట్‌ను!" కచుడు హుంకరిస్తూ సవరించాడు.

"నీవు చెప్పకపోతే నిన్ను ఇక్కడే ఈ క్షణంలో బలాత్కారం చేయగలను..." అని ముందుకు అడుగులు వేశాడు కచుడు.

లావినియా ఒక్కసారిగా వెనక్కి అడుగులు వేసి- "ఆగు, నువ్వు ఒక్కడుగు ముందుకు వేశావంటే నా వేలిలోని వజ్రపు ఉంగరం నా ఉదరాన్ని చేరుతుంది. ఉత్తర క్షణంలో నీ కళ్ళ ముందే నెత్తురు కక్కుకుంటూ చనిపోతాను" అన్నది.

ఈ బెదిరింపుకు కచుడు ఒక్కసారిగా ఆగిపోయాడు.

"లావినియా! నిన్ను ఎలా లొంగదీసుకోవాలో నాకు తెలుసును... నీ ప్రియుడు సముద్రగుప్తుడికి త్వరలో పరలోక యాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయ్! ఆలోచించుకో!"

కచుడు అతి వేగంగా నిష్క్రమించాడు. లావినియా కుప్పకూలిపోయి కన్నీరుమున్నీరుగా విలపించటం ప్రారంభించింది.

ఆమె తన భవిష్యత్తును ఒక మృత్యుద్వారంలోకి ఊహించుకుంటోంది.అపుడు వచ్చింది సుకన్య. ఆమె చేతిలో ఆ ఉత్తరం ఉంది.

సముద్రగుప్తుడి జైత్రయాత్రకు, దండయాత్రకు ముహూర్తం ఆసన్నమయింది. ప్రజలు గుంపులు గుంపులుగా చేరి సముద్రుడు యుద్ధానికి బయలుదేరుతున్న వైనాన్ని విచిత్రంగా చెప్పుకుంటున్నారు.

ఇక్కడ సముద్రుడికయితే దిక్కు తోచకుండా ఉంది. కశ్యపుడుమాత్రం సముద్రుడికి భరోసా ఇచ్చాడు.

"యువరాజా! యుద్ధంలో మీ చుట్టూ విశ్వాసపాత్రులూ, అరివీర భయంకరులు, సామ్రాట్ చంద్రగుప్తులకు రాజభక్తులూ అయిన సేనానాయకులు చేరి మిమ్మల్ని అనుక్షణం తమను కనురెప్పలా కాపాడుతారు. ఆ తరువాత దైవేచ్ఛ!"

సముద్రుడికి ఎందుకనో అంతటి తన నిస్సహాయస్థితిలో నవ్వు వచ్చింది. 'అవును దైవేచ్ఛ కాక ఏమిటి?


ఎందుకనో తెలియదుకానీ తనలో అగ్ని ప్రజ్వరిల్లుతోంది. తనలో ఏదో తపన మొదలయింది. కానీ... కానీ... ఆ యుద్ధాన్ని చేయకుండా... అసలు తనేమిటి... యుద్ధంలో పాల్గొనటం ఏమిటి, యుద్ధం చేయటమేమిటి?'

'ఏదో ఏదో శక్తి తనను ముందుకు అడుగులు వేయిస్తోంది.తానేదో అదృశ్య శక్తికి బందీ అయివున్నాడు.

తను ఎక్కడకు, ఏ దిశకు, ఏ గమ్యానికి పయనం చేస్తున్నాడు... ఏం జరగబోతోంది? అనుకున్నాడు.

జటాధారి ఆనాడు అన్న మాటలు పదే పదే గుర్తుకువస్తున్నాయి సముద్రగుప్తుడికి.

ఇంకా ఉంది



ఫీల్‌గుడ్ కావాలి

భారీగా బరువు తగ్గించేసి నాజూకు తేలిన పరిణీతిచోప్రా తీరును ప్రశంసించినవారూ ఉన్నారు. విమర్శించినవారూ ఉన్నారు. అయితే తన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారన్న విషయంపై తాను అదేపనిగా దృష్టి సారించనంటున్నది పరిణీతి.

"ఇలా మనగురించి ఎవరు ఏమనుకుంటున్నారో అని ఆలోచిస్తూపోతే అదో విషవలయమయిపోతుంటుంది. ఫిట్‌నెస్ అనేది ఎవరి ఇష్టంపై వారికి ఆధారపడివుంటుంది.

మనకు ఏవి అవసరం, ఏవి నూటవుతాయి, మనకు ఏం కావాలనేవి ముఖ్యం. నా గురించి నాకు 'ఫీల్‌గుడ్' కలగాలి. ఫిట్‌గా వుండి, ఆరోగ్యంగా జీవించడం నాకు ముఖ్యం" అంటూ నిక్కచ్చిగా చెప్పింది పరిణీతిచోప్రా.



ప్రతీ వారం శ్రీ బాపు బొమ్మ



కదిలే బొమ్మల కబుర్లు

Review

ఫ్యాన్‌కి ఎక్కువ.... గుమస్తాకు తక్కువ

ఒకసారి పల్లంలోకి దొర్లడం ప్రారంభించాలే కానీ, మళ్ళీ పైకి ఎగబాకడం అన్నది అంత సులువు కాదు. దానికి ఎంతో కృషి, పట్టుదల ఉండాలి. ఇది ఏ రంగానికైనా వర్తించే విషయం.

కాంబినేషన్లు, టైటిళ్ళు ఇలా అక్కర్లేనివాటికి ఎక్కువ ప్రయారిటీ ఇచ్చి, ఆ తరువాత కథ, కథనాలు చూసుకునే బాపతు జనాలు ఎక్కువ టాలీవుడ్‌లో. అంటే జనాలను విందుకు పిలిచేశాక, ఏం వండాలని కర్ర కుంపటి పట్టుకుని కుస్తీపట్టే రకాలన్నమాట. అలాంటపుడు ఏమవుతుంది?



తమకు వచ్చిన ఆవువ్యాసాన్నే తిరగరాసే ప్రయత్నం లాంటిది తప్పదు. ఈ వారం విడుదలైన రామ్‌గోపాల్‌వర్మ 'ఆఫీసర్' సినిమాచూస్తే ఇలాగే అనిపిస్తుంది. ఆర్జీవీకి మాఫియా ఇష్టం. యాక్షన్ సీన్లు ఇష్టం.

వాటికి కెమెరా యాంగిల్స్ అమర్చడం ఇష్టం. ఆపైన మాంచి మ్యూజిక్ అందించడం. అంతే తప్ప,వీటన్నింటికోసం ఓ మాంచి కథ, దానికి సరిపడా సన్నివేశాలు అమర్చుకోవడం మాత్రంకాదు.దాంతో ఏమవుతుంది? ఆకు,ఆహార్యం బాగానే ఉంటుంది. ఆహారంమాత్రం కనిపించదు.

దాదాపు రెండు దశాబ్దాలతరువాత నాగార్జున-ఆర్జీవీ కలిసి పనిచేసిన సినిమా 'ఆఫీసర్'. అయితే ఆర్జీవీ ట్రాక్ రికార్డు ప్రకారం జనాలు పెద్దగా ఆశలేమీ పెట్టుకోకుండానే థియేటర్‌కు వెళ్ళారు.

యథాప్రకారం ఆర్జీవీ నిరాశపరిస్తే నిట్టూరుస్తూ వెనక్కు వచ్చారు. అసలు ఈ 'ఆఫీసర్' కథేమిటి? నిరాశ ఏల కలిగెను? అన్నది చూద్దాం.

ముంబాయిలో ఓ బడా పోలీస్‌ఆఫీసర్. మాఫియాను ఏరిపారేస్తాడు. కానీ అలా ఏరిపారేయడంలో కొన్ని ఫేక్ ఎన్‌కౌంటర్లు చేస్తాడు. దాంతో కోర్టు విచారణకు ఆదేశిస్తుంది. అప్పుడు హీరో విచారణ అధికారిగా రంగంలోకి దిగుతాడు.

ఫేక్ ఎన్‌కౌంటర్లు నిజమే అని తేల్చి, ఆ బడా పోలీస్ అధికారిని అరెస్ట్ చేస్తాడు. కానీ కోర్టులో నిర్ధారణ కాదు. దాంతో బయటకు వచ్చిన ఆ పోలీస్ అధికారి పగతో రగిలి, తానే ఓ మాఫియాలా తయారవ్వాలనుకుంటాడు. అంతేకాదు, తనను అరెస్టు చేయించిన హీరోపై కసి తీర్చుకోవాలనుకుంటాడు. అప్పుడు ఏం జరిగింది. ఇదీ కథ.

సరే, వినడానికి కొంతలో కొంతవరకు బాగానే వుంది. నిజానికి ఏ సినిమా కథ అయినా, లైన్‌గా చెప్పుకోవడానికి బాగానే వుంటుంది. కానీ అసలు సమస్య ఎక్కడ మొదలు అవుతుందీ అంటే, ఆ


ఎన్నెన్ని అందాలో...

ఎప్పటికప్పుడు తన కొత్త రూపాన్ని ఆన్‌లైన్‌లో ఆవిష్కరించుకోవడం టెక్నాలజీ పుణ్యమాని సాధ్యపడుతున్నది. ఇందుకోసంతారలు అదేపనిగా ఫోటోలు దిగేసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు.

ఫోటో షూట్‌ల విషయంలో నాజూకు తార సీరత్‌కపూర్ ముందుంటున్నది. ఎప్పటికప్పుడు ఈమె హాటెస్ట్, లేటెస్ట్ ఫోటోలు చూసినవారు నీళ్ళు నములాల్సి వస్తున్నది.

"ఎటువంటి గ్లామరస్ రోల్‌కైనా సిద్ధం అన్న సందేశమా?" అని ఆమెను అడిగితే, "అవకాశాలకోసం అయితే ఇలా ఫోటో షూట్‌లు చేయను. ప్రతి ఫోటో షూట్‌కూ ఓ కాన్సెప్ట్ వుంటుంది" అంటూ తేల్చేసింది. ఏమిటో ఆ కాన్సెప్టులు... ◆





లైన్‌కు జవసత్వాలు అందించే కథనం దగ్గరే.

అలా సమకూర్చే కథనం కొత్తగా వుండాలి. ఆస క్తిగా వుండాలి.చకచకా నడవాలి.ఇలా చాలా వున్నాయి సినిమా రాజ్యాంగ సూత్రాలు.

వీటిని పాటించకపోతేనే వస్తుంది సమస్య.

అయితే లైన్ అల్లేసుకోవడం, సినిమాటోగ్రాఫర్, సంగీతం,నటీనటులు అంటూ బాజా భజంత్రీలను రెడీ చేసుకోవడంలో కనబర్చే ఉత్సాహాన్ని కథ, కథ నాల విషయంలో కనబర్చేవారు తక్కువ.

ఆ కసరత్తు చేసేంత ఓపిక, ఆసక్తి దర్శకుడు ఆర్జీవీలో ఏనాడో తగ్గిపోయాయి. అందుకే ఆయన నుంచి వస్తున్న పునాసకాపుకాయలు అంత రుచిగా వుండడంలేదు. ఈ 'ఆఫీసర్' సినిమా కూడా అందుకు అతీతం ఏమీ కాదు.

ఆర్జీవీ సినిమాల్లో కావచ్చు,ఆయన ఏకలవ్య శిష్య బృందం అందించిన సినిమాల్లో కావచ్చు, ఇప్పటికి సవాలక్షసార్లు చూసేసిన అదే తరహా చిత్రీకరణ, అదే మాఫియా వ్యవహారాలు, అదే సౌండ్ ఎఫెక్ట్‌లు, అవే కెమెరా యాంగిల్స్. ఇంక ఆసక్తి ఏముంటుంది 'ఆఫీసర్' సినిమాలో?

పైగా 'ఆఫీసర్'సినిమాలో మాఫియా వెర్సస్ పోలీస్ యాక్షన్ డ్రామాలో సీరియస్‌నెస్, నిజాయితీ, లాజిక్‌లు ఇలా అన్నీ కరువయ్యాయి. ఆర్జీవీ తాను ఏది అనుకుంటే, ఎలా అనుకుంటే అలా తీసేశాడు.

మాఫియా లీడర్లు కర్రల అడితీల్లో, గల్లీల్లో ఎక్కడపడితే అక్కడ దొరికేస్తుంటారు.

ఎవరుపడితే వారు కలిసేస్తుంటారు. టప్పు...టప్పు కాల్పులు జరిపేసుకుంటూవుంటారు. ఇదంతా చూస్తుంటే ఆర్జీవీ దృష్టిలో మాఫియా అంటే గల్లీ గూండాలా? అన్న అనుమానం కలుగుతుంది.

యాక్షన్ సీన్ల మధ్యన ఇరికించడానికి ప్రయత్నిం చిన హీరో ఫ్యామిలీ సీన్లు పెద్దగా పండలేదు. దీనికి తోడు వున్న రెండు పాటలు కానీ,సంభాషణలు కానీ ఏమాత్రం ఆకట్టుకునే స్థాయికి చేరుకోలేదు.

ఒకప్పుడు ఆర్జీవీ సినిమాలు సీరియస్‌గా నడు స్తూనే, చటుక్కున మాంచి ఫన్ పుట్టించేవి. ఆర్జీవీ ఆరంభంలో చేసిన సినిమాలన్నిటిలో ఫన్ బ్రహ్మాం డంగా వుంటుంది. ఈ సినిమాలో వెదుకుదామన్నా కనిపించదు.సినిమాలో అసలుప్లాట్‌కు లాజిక్కే వుం డదు. సిన్సియర్ ఆఫీసర్ అలా విలన్‌లా ప్రవర్తిం చడం ఏమిటో? విలన్‌గా మారిపోవడం ఏమిటో?

సరే, కథకోసం అనుకుంటే ఆ విలన్ దగ్గర టీమ్ లోనే మరో ఆఫీసర్ అయిన హీరో మెంబర్‌గా పని చేయాల్సిరావడంలాంటి మెలోడ్రామా ఏమిటో? ఇలా చాలా చిత్రాలు వుంటాయి.

ఒక పక్క మాఫియా పన్నాగాలు. మరోపక్క కాల్పులు, ఫైట్లు, మధ్యలో అమ్మ, నాన్న, కూతురు, సెంటిమెంట్ గ్లిజరిన్ సీన్లు, ఇలా అతుకులు వేసిన సీన్లకు ఎక్కడా కుట్లు సరిగ్గా పడలేదు.

ఇదే సినిమాలో కనుక నాగార్జున అనే నటుడు లేకపోయివుంటే, జనం నాలుగు రీళ్ళు చూసి బయ టకు నడిచివుండేవారు. కానీ నాగ్ వున్నాడు కాబట్టి సినిమామొత్తం చూసి నిట్టూర్చి బయటకువస్తారు. నాగార్జునతో సహా మిగిలిన నటులంతా రామ్‌గోపాల్ వర్మ చెప్పినట్లు నటించేసి, చెప్పమన్నట్లు డైలాగులు చెప్పేసి,హమ్మయ్య అనుకునివుంటారు.కానీ చూసిన ప్రేక్షకులకు ఏ విధమైన రసస్పందనా కలుగదు.

ఈ సినిమాలో రామ్‌గోపాల్ వర్మ ఘనంగా చెప్పుకుంటున్న విషయం ఒకటి వుంది-

బాలయ్య కంటిచూపుతో చంపేస్తా అన్నట్లుగా, శబ్దాలు బలంగా వినిపించి చంపేయడం అనుకో వాలి దాన్ని. సీన్‌లో సత్తా వుండదు కానీ శబ్దాలు బలంగా వినిపిస్తుంటాయి.

ఇది చూస్తే థ్రిల్లర్‌లో హార్రర్ మిక్స్‌చేసే ప్రయత్నం అనిపిస్తుంది. ఆ విధంగా అదీ వికటించింది.

ఇలా చెప్పుకుంటూపోతే 'ఆఫీసర్' సర్వీస్ రిజిస్టర్ అంతా నెగటివ్ రిమార్కులతో నిండిపోతుంది.

ప్లస్‌పాయింట్స్...
నాగార్జున నటించిన చిత్రం

మైనస్‌పాయింట్స్...
ఆర్జీవీ తీసిన మరో చిత్రం

పంచ్‌లైన్
ఈడేం ఆఫీసర్రా బాబూ ◆

భళారే దక్షిణాది

బాలీవుడ్ భామ ఇషితాశర్మ తనకు దక్షిణాదిలో నటించాలని ఉందంటూ ఆశగా చెప్పింది.

'సోను కె టిటుకి స్వీటీ' విజయాన్ని ఇంకా చవి చూస్తూనే వున్న ఇషితా దక్షిణాది చిత్రపరిశ్రమపై ప్రశంసల వర్షం కురిపించింది.

"నేను తెలుగు లేదా ఇతర దక్షిణాదిభాషల సినిమాలను అంతగా చూడను కాని, దక్షిణాదిలో పనిచేయాలన్న కోరిక ఉంది. అనేక బాలీవుడ్ సినిమాలను దక్షిణభారత చిత్రాలనుంచి తీస్తు న్నారు. స్క్రిప్టులు వాస్తవికంగా వుంటాయి. ప్రేక్ష కులు స్వాగతిస్తున్నారు.అందుకే నాకు ఇక్కడ పని చేయాలని వుంది" అని తెలిపింది. ◆



జీవితానికి సరిపడా సంతోషం

సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో 'కాల కరికాలన్' సినిమాలో నటించిన బాలీవుడ్ సుందరి హ్యూమా ఖురేషి తన జీవితానికి సరిపడా సంతోషాన్ని ఇచ్చిం దంటూ ఉబ్బితబ్బిబ్బవుతున్నది.

"రజనీకాంత్‌గారితో తెర పంచుకోవడం అనేది గొప్ప అవకాశం. ఈ సినిమాలో నటన అద్భుతమైన అనుభవం.రజనీకాంత్‌గారు ఎంతో స్ఫూర్తి ఇస్తారు. ఎంతోకొంత నేర్చుకుంటూనే వున్నా.

ఆయనో అరుదైన వ్యక్తి" అంటూ మురిసి ముద్దయిపోతున్నది హ్యూమా ఖురేషి. ◆

Review

స్మార్ట్ అభిమన్యుడు



అరచేతిలో వైకుంఠంఅని జనం అనుకుంటున్నారు. కాదు అరచేతిలో నరకంకూడా అని చెప్పే ప్రయత్నం చేశాడు దర్శకుడు మిత్రన్. అదే 'అభిమన్యుడు' సినిమా. అక్షరం ముక్క రానివారు, అరకొర చదువులవారు కూడా స్మార్ట్ ఫోన్‌లు వాడుతున్న కాలం ఇది.

కానీ అరచేతిలో వున్న మొబైల్ వెనుక దాగివున్న ముప్పు మాత్రం తెలియడంలేదు. మన బతుకులు, మన జాతకాలు, మన మాటలు, మన చేతలు అన్నీ చేతిలో వున్న మొబైల్ కనిపెట్టేస్తోందని అస్సలు తెలియడంలేదు.

అడ్డమైన పర్మిషన్లు అడుగుతాయి ఒక్క అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుంటే. పర్మిషన్లు ఇవ్వకుంటే పనిచేయవు. పని చేయడం కోసం పర్మిషన్లు ఇవ్వక తప్పదు. దాంతో మన ఆను, పాను, గుట్టు, మట్టు, అన్నీ వాటి స్వంతం అవుతాయి.

ఆధునిక ప్రపంచంలో సమాచారమే సాయుధం అని పసిగట్టిన ఓ మేధావి పన్నిన కుట్రలో దేశంలోని అమాయక జనం బలైపోతుంటే, అడ్డుకున్న సైనికుడి కథే 'అభిమన్యుడు'.

సైన్యంలో పనిచేస్తుంటాడు కరుణాకర్ (విశాల్). అతగాడి అతి కోపానికి విరుగుడు, వదులుకున్న తండ్రికి, సోదరికి దగ్గర కావడమే అని చెబుతుంది అతన్ని ట్రీట్‌చేసే సైకాలజిస్ట్ లతాదేవి (సమంత).

అలా దగ్గరైన తరువాత చెల్లికి పెళ్ళిచేయాలని కిందా మీదా అవుతాడు.

అందుకోసం అబద్ధాలు చెప్పి, బ్యాంక్‌లోన్ ఆరు లక్షలు తీసుకుంటాడు. కానీ ఇలా అక్కౌంట్‌లో పడిన డబ్బు అలా మాయం అవుతుంది.

అప్పుడు తీగలాగడం ప్రారంభిస్తాడు. దాని వెనుక వందల కోట్ల పద్మవ్యూహం వుందని తెలుస్తుంది. దాంతో ఛేదించడం ప్రారంభిస్తాడు. అప్పుడేమయిం దన్నది మిగిలిన సినిమా.

పామరజనంకూడా ఎదుర్కొంటున్న కొత్త సమస్యను కథగా తీసుకుని, అందరికీ అర్థం అయ్యేలా సినిమాగా మార్చడంలో దర్శకుడు మిత్రన్ చాలా వరకు విజయం సాధించాడు.

అయితే తమిళ దర్శకుల కథనం కాస్త వేరుగా వుంటుంది. సినిమాను ఎక్కడో ప్రారంభించి, ఎక్కడికో తీసుకెళ్ళి, అప్పుడు అసలు కథలోకి మలుపు తిప్పుతారు. మన ప్రేక్షకులకు ఇది కాస్త దూర ప్రయాణంలా వుంటుంది. సినిమా చకచకా పరుగెత్తడం మన ప్రేక్షకులకు ఇష్టం.

'అభిమన్యుడు' తొలిసగం అంతా సమస్యవరకు సినిమాను తీసుకురావడానికే సరిపోతుంది. అప్పటి దాకా హీరో క్యారెక్టరైజేషన్, ఎందుకు తండ్రికి దూరంగా వున్నాడు. మళ్ళీ ఎందుకు దగ్గర కావాల్సి వచ్చింది. అలా దగ్గరయ్యాక ఏం జరిగింది.

దాంతో కథ ఏం మలుపు తిరిగింది. వీటితోనే తొలిసగం సరిపోతుంది. ఇంటర్వెల్ లాక్‌తో అసలు కథ ప్రారంభం అవుతుంది.

అసలు సినిమా, దర్శకుడు టచ్‌చేయాలనుకున్న సమస్య, దాన్ని డీల్‌చేసిన విధానం అన్నీ మలిసగంలోనే వున్నాయి. అందువల్ల తొలిసగంకన్నా మలిసగమే ఎక్కువ ఆకట్టుకుంటుంది.

ఈ మలిసగం కూడా మరికాస్త వేగంగా నడిస్తే బాగుండును అని అక్కడక్కడ అనిపిస్తుంది.

అయితే అదేమంత సమస్యగా మాత్రం వుండదు.

ఎలా ఆడుతున్నాయి?

- సినిమాలకు సమ్మర్ సందడి ముగిసినట్లే.
- బాక్సాఫీస్ దగ్గర 'మహానటి' సినిమా మినహా మరేదీ కాసులు సంపాదించడంలేదు.
- 'భరత్ అనే నేను','రంగస్థలం' ఇంకా థియేటర్లలోనే వున్నాయి. ఖర్చులు గిట్టుబాటు చేస్తున్నాయి.
- 'నేలటిక్కెట్టు' సినిమా భయంకరమైన డిజాస్టర్‌గా మిగిలింది. 'అమ్మమ్మగారిల్లు' సినిమా గురించి చెప్పుకోవడానికి ఏమీలేదు.
- ఈవారం నుంచి చిన్న సినిమాల వ్యవహారం స్టార్ట్ అయింది. వారానికి రెండుమూడు చిన్న సినిమాలు వచ్చే అవకాశం వుంది. కానీ మార్కెట్‌లో నిలబడే సినిమాలు వస్తాయా? అన్నది అనుమానంగా వుంది. ◆

దర్శకుడు మిత్రన్‌ను ఎక్కడ మెచ్చుకోవాలి అంటే, చాలా హైటెక్ వ్యవహారం లాంటి సమాచార చోరీ, వినియోగం వంటి విషయాలను నేలబారుగా దిగి సామాన్య ప్రేక్షకులకుకూడా అర్థంఅయ్యేలా చెప్పడం అన్నదాంట్లో దర్శకుడు చూపించిన నేర్పు బాగుంది.

అందువల్లే సినిమా బాగుంది, కొత్తగా వుంది, అన్న ప్రశంసలు ప్రేక్షకుల నుంచి వస్తాయి.

దీనికి కారణం మరేమీ కాదు, దర్శకుడు టచ్‌చేసిన పాయింట్‌తో ప్రేక్షకులు కనెక్ట్‌కావడం, దర్శకుడు ఆ పాయింట్‌ను డీల్ చేసిన విధానం ప్రేక్షకుల జీవితాలకు దగ్గరగా వుండడం.

అయితే సమస్యను కాస్త గట్టిగా, ప్రేక్షకుల్లో నాటుకునేలా చెప్పడంకోసం దర్శకుడు కొంచెం సినిమాటిక్ లిబర్టీని తీసుకున్నాడు. అయితే అదేమంత క్షమించరాని తప్పిదం అయితే కాదు.

ఒకటి మాత్రం వాస్తవం-సినిమాచూసిన తరువాత కొంతమంది అయినా స్మార్ట్ ఫోన్‌ను ఎడాపెడా వాడేయడానికి, బ్యాంక్ కార్డులను చిత్తానికి వాడేయడానికి-

ఫోన్ నెంబర్‌ను ఎవరికిపడితే వారికి ఇచ్చేయడానికి కాస్త ఆలోచిస్తారు. ఇంకా క్లియర్‌గా చెప్పాలంటే కాస్త జంకుతారు.

హీరోగా విశాల్ అస్సలు హీరోయిజంలాంటి వ్యవహారాలజోలికి పోకుండా బాగాచేశాడు. సినిమాలో కీలకపాత్రధారి సీనియర్ అర్జున్‌ను కూడా దర్శకుడు బాగా వాడుకున్నాడు. హీరోయిజాన్ని దృష్టిలో పెట్టుకుని విలన్ క్యారెక్టర్‌ను డమ్మీ చేయలేదు.

ఆ మాటకు వస్తే హీరోనే కాస్త తగ్గించాడు. అందువల్ల అర్జున్ నటన అందరినీ ఆకట్టుకుంటుంది. సైకాలజిస్ట్ పాత్రలో సమంత తన పాత్రమేరకు బాగానే చేసింది. మిగిలినవారు ఓకె.

సినిమా సాంకేతికంగా బలంగా వుంది. యువన్ శంకర్ రాజా నేపథ్య సంగీతం బాగుంది.

సినిమాటోగ్రఫీ కూడా బాగుంది. ఎడిటింగ్, స్క్రిప్ట్ రెండూ కాస్త సరిచూసుకుంటే సినిమా నిడివి తగ్గే అవకాశం వుండేది, ముఖ్యంగా తొలిసగంలో.

మొత్తంగా చూసుకుంటే ఓ మంచి, వైవిధ్యమైన, అవసరమైన ప్రయత్నం 'అభిమన్యుడు'.

ప్లస్‌పాయింట్స్...
కథలో కొత్త పాయింట్
ద్వితీయార్థం

మైనస్‌పాయింట్స్...
కథనంలో సాగదీత

పంచ్‌లైన్
సైబర్ వ్యూహం ఛేదించాడు



బ్రిగేడియర్ మహమ్మద్ ఉస్మాన్ (1912-1948)

చివరి రోజుల్లో...

భారతదేశపు విభజన ప్రపంచ చరిత్రలో ఒక చీకటి ఘటన. నాటి విభజన సమయంలో అటునుండి గాని, ఇటునుండి అటుగాని వెళ్ళిపోయిన వారిలో కొందరు ప్రముఖులుగా ఎదిగారు.

వారి కుటుంబాల గురించి, వారి విజయాలగురించి మాత్రమే ప్రచారం జరుగుతుంటుంది. కాని ఆనాడు ఈ దేశంకోసం తమ జీవితాలను పణంగా పెట్టిన వారి గురించి, తమ మాతృభూమికన్నా గొప్పది మరొకటి లేదని ఇక్కడే వుండిపోవటానికి నిర్ణయించుకున్న ముస్లిమ్ కుటుంబాలు, ముస్లిమ్ వీరులగురించి ఏ చరిత్ర పుస్తకాలలో ఎవరూ రాయలేదు.

వారి త్యాగాలకు సరయిన గుర్తింపు ఇవ్వక, అవార్డులు ఇవ్వటంతో తమ బాధ్యత అయిపోయిందనుకున్నాయి ప్రభుత్వాలు. దేశంకోసం తన ప్రాణాలను అర్పించిన విభజన సమయ వీరుడు బ్రిగేడియర్ మహమ్మద్ ఉస్మాన్.

నేటి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మావు జిల్లాలోని బిబిపూర్‌కి చెందిన ముస్లిమ్ కుటుంబంలో 1912లో పుట్టాడు మహమ్మద్ ఉస్మాన్. వారణాసిలోని హరిష్ చంద్రబాయ్ స్కూల్‌లో చదువుకున్నాడు.

ఆ సమయంలో అతనిలోని సాహసి వెలుగులోకి వచ్చాడు. బావిలో పడిన పిల్లాడిని రక్షించేందుకు బావిలోకి దూకిన 12 ఏళ్ళ ఉస్మాన్‌ని చూసి ఔరా అనుకున్నారు. చిన్నతనం నుండి సైనికుడవ్వాలన్నది ఉస్మాన్ కల. ఆ కల నెరవేరింది,ప్రతిష్ఠాత్మక రాయల్ మిలిటరీ అకాడమీకి ఎన్నికవటంతో.

1932లో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమితుడయ్యాడు. ఆ తర్వాత బలూచ్ రెజిమెంట్‌కి పంపారు. ఆఫ్ఘన్ సరిహద్దు ప్రాంతంలో, బర్మాలోనూ పని చేశాడు. పనిచేసిన ప్రతిచోటా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఉస్మాన్ క్రమంగా కెప్టెన్ అయ్యాడు. తాత్కాలిక మేజర్‌గా నియమించబడ్డాడు.

బ్రిగేడియర్ హోదాలో బలూచ్ రెజిమెంట్‌లో పనిచేస్తూ ఆ రెజిమెంట్‌ని నడిపించే అధికారి అయ్యాడు. ఆ సమయంలో భారతదేశ విభజనకు రంగం సిద్ధమైంది. వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న అధికారులకు తమకు ఇష్టమైన దేశానికి వెళ్ళేందుకు అవకాశం ఇచ్చారు బ్రిటీష్‌వారు.

బ్రిగేడియర్ మహమ్మద్ ఉస్మాన్ సైనిక నైపుణ్యం గురించి తెలిసిన ఇతర అధికారులు అతని అభిప్రాయం అడిగారు. తాను పుట్టింది భారత్‌లో. అదే నా మాతృదేశం. నేను అక్కడికే వెళతాను అన్నాడు. ఆ విషయం మహమ్మదాలీ జిన్నాకు తెలిసింది.

"ఉస్మాన్‌లాంటివాడు భారత్‌కి వెళ్ళిపోతాననటం ఏమిటి! అది తన ముస్లిమ్‌లు వేరే జాతి అన్నసిద్ధాంతానికి విఘాతంకదా! ఎలాగయినా అతన్ని పాకిస్తాన్ లోనే ఉండేలా చూడండి. అతడు పాకిస్తాన్ ఆర్మీలో చేరితే సైనికదళాల ప్రధానాధికారిని చేస్తానని, తొలి పాక్ ఆర్మీ చీఫ్‌గా చరిత్రలో నిల్చిపోతాడని చెప్పండి" అంటూ రాయబారం పంపాడు. 'భారత్ హిందువుల దేశం. నువ్వు అక్కడికి వెళ్ళి నష్టపోతావు'అంటూ హెచ్చరికలు చేశాడు జిన్నా.

అయినా ఉస్మాన్ మనసు మారలేదు. "పాకిస్తాన్‌తో చేతులు కలిపే పనే లేదు'' అంటూ జిన్నా మాటను సున్నితంగా తిరస్కరించి, 'జై భారత్' అంటూ భారత దేశానికి వచ్చేశాడు. బ్రిగేడియర్ ఉస్మాన్‌కి డోగ్రా రెజిమెంట్‌ని కేటాయించారు. అప్పటికి అతని వయసు 35 ఏళ్ళు. వివాహం చేసుకోలేదు.

> భారత్ హిందువుల దేశం... నువ్వు అక్కడికి వెళ్ళి నష్టపోతావు అంటూ హెచ్చరికలు చేశాడు జిన్నా. అయినా ఉస్మాన్ మనసు మారలేదు. 'పాకిస్తాన్‌తో చేతులు కలిపే పనే లేదు' అంటూ జిన్నా మాటను సున్నితంగా తిరస్కరించి, 'జై భారత్' అంటూ భారతదేశానికి వచ్చేశాడు.

దేశం, సమాజం గురించిన ఆలోచన తప్పించి మరో ఆలోచన వుండేదికాదు ఉస్మాన్‌కి. తనజీతంలో అధికభాగం పేదవిద్యార్థులను చదివించేందుకు కేటాయించాడు. దేశ విభజన జరిగింది.

పాకిస్తాన్ తనకు దక్కిన భూభాగంతో సంతృప్తి పడలేదు. కాశ్మీర్‌ని కబళించాలని కిరాయిమూకలతో దాడులకు తెగపడింది. కాశ్మీర్ మహారాజు సైన్యంలోని ముస్లిమ్‌లు పాక్ మూకలతో చేతులు కలిపాయి. అలా జమ్మూ ప్రాంతంలోకి చొచ్చుకువస్తున్న పాకిస్తానీ మూకలను నిలువరించి నౌషారా, ఝూంగర్ ప్రాంతాలను రక్షించే బాధ్యత బ్రిగేడియర్ ఉస్మాన్‌కి అప్పగించారు.ఆయన అప్పుడు ప్యారాచూట్ బ్రిగేడ్‌కి నాయకుడు. నాటి లెఫ్టినెంట్ కల్నల్ కరియప్పకి ఉస్మాన్ సామర్థ్యంమీద విశేషమైన నమ్మకం.

పై అధికారులు అప్పగించిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించాడు.

1948 ప్రారంభంలో నౌషారాదగ్గర జరిగిన పోరాటంలో వెయ్యిమంది పాకిస్తానీయులను మట్టుపెట్టి నౌషేరా, ఝూంగర్‌లనుతిరిగి స్వాధీనం చేసుకున్నాడు బ్రిగేడియర్ ఉస్మాన్. పాకిస్తాన్ కిరాయిమూకలు పలాయనం చిత్తగించాయి.

ఆ ఓటమిని పాకిస్తాన్ చిత్తగించలేకపోయింది. ఈసారి సైనికదళాలనే రంగంలోకి దించింది. ఎలాగయినా తిరిగి ఝూంగర్, నౌషారాలను చేజిక్కించుకోవాలన్నదే పాక్ యత్నం.

1948 మే నెలలో వారి దాడులు మొదలయ్యాయి. మూడు నెలలు యత్నం చేసినా బ్రిగేడియర్ ఉస్మాన్ వ్యూహరచనను ఛేదించలేకపోయారు పాకిస్తానీయులు. ఆయన యుద్ధకౌశలం చూసి ఇతను మన దేశంలో ఉండిపోయివుంటే ఎంత బాగుండేది అనుకున్నారు.ఎలాగైనా జమ్మూను కబళించాలి.అందుకు నౌషారా పట్టుకోవాలి. యుద్ధం కొనసాగుతోంది.

ఆ దశలో జూలై 3న పాకిస్తానీ ఫిరంగి గుండు నేరుగా బ్రిగేడియర్ ఉస్మాన్‌ని తాకింది. గాయాలయ్యాయి. పడిపోయాడు. అయినా ఆయనలోని సైనికుడు నోరుతెరిచాడు.

"నేను చనిపోతున్నాను. కాని ఒక్క అంగుళం నేల కూడా శత్రువుకు దక్కకూడదు. మీ పోరాట పటిమ చూపండి. భారత దేశాన్ని రక్షించుకోండి. కాశ్మీర్ కోసం మన ప్రాణాలు తెగించాలి...'' అంటూ చివరి క్షణంవరకు తన సైనిక బృందాలను యుద్ధంలో ప్రోత్సహిస్తూ చివరికి ప్రాణాలు కోల్పోయాడు. దేశం కోసం బలి అయిన వీరాధివీరుడు ఉస్మాన్.యుద్ధంలో సైనికులు చాలామంది మరణిస్తారు. కాని బ్రిగేడియర్ స్థాయి అధికారి ఒకరు మరణించటం ఉస్మాన్‌తోనేమొదలు. ఆయన మరణంకళ్ళారా చూసిన సైనికులు విరుచుకుపడి పాకిస్తానీయులను తరిమికొట్టారు.

కానీ మరో 12 రోజుల్లో 36వ పుట్టినరోజు జరుపుకోవాల్సిన ఉస్మాన్ జీవితం అంతమైంది.

బ్రిగేడియర్ ఉస్మాన్ అంత్యక్రియలకు ప్రధాని నెహ్రూతోపాటు మొత్తం మంత్రివర్గం హాజరైంది.

మరణానంతరం 'మహావీరచక్ర'ని ప్రకటించింది. 2012లో బ్రిగేడియర్ శతజయంతిని హర్యానాలోని ఝజ్జర్‌లో నిర్వహించారు.

మీదే ఈ శీర్షిక

ఉత్తమ ప్రశ్న-సమాధానం

➤ వై.శ్రీలక్ష్మి సరోజ, రాయకుదురు

బయటకి వెళుతూ ఫ్యాన్-ఎ.సి. ఆపకపోతే?

అది మన ఇల్లుకాదని అర్థం.

➤ ఎ.అశోక్‌కుమార్, హైదరాబాద్

ప్రతి భర్త విజయం వెనుక భార్య ఖచ్చితంగా ఉంది. ఎలాగ?

అతనికి సహకరించినందుకు లేక అతన్ని డిస్టర్బ్ చేయనందుకు.

➤ ఆర్.ప్రశాంతి, విజయనగరం

నేటి పెళ్ళిళ్ళ తంతు రెండు, మూడుగంటల్లోనే ముగిసిపోతున్నాయెందుకు?

పెళ్ళిళ్ళు జరిగే కళ్యాణమంటపాలు ఒకప్పటి సినిమాహాళ్ళు కాబట్టి.

ఉత్తమ ప్రశ్నకు ₹ 500
ప్రతి ప్రశ్నకు ₹ 300 బహుమతి

➤ పి.యోబు, ముదునూరు

జామకాయలు 'దోరగా' ఉంటే ఇష్టపడతాము, ఇంకా ఎలా ఉంటే ఇష్టపడతాము?

'తేరగా' దొరికితే.

➤ డి.వి.చంద్రశేఖర్, కర్నూలు

'నీగ్రో' వ్యక్తిని చీకట్లో ఎలా గుర్తుపట్టాలి?

'స్మైల్ ప్లీజ్' అంటే సరి.

➤ ఎల్.లక్ష్మీనాయుడు, సింహాచలం

తెలుగు ఎందుకు వెనుకబడిపోతోంది?

అందరూ 'ఆంగ్లం' వెనుక పడడంవలన.

➤ సిహెచ్.వి.వి.ఎస్.మూర్తి, పాల్వంచ

హెల్మెట్‌కి, భార్యకు ఉన్న పోలిక?


రెండింటిని నెత్తిన పెట్టుకుంటే ప్రాణహాని ఉండదు.

➤ పి.వి.రమణకుమార్, చిలకలూరిపేట

మన దేశంలో నదుల 'అనుసంధానం' కంటే ఎక్కువగా జరగవలసింది?

మనసుల 'అనుసంధానం'.

ఈ కార్టూన్ మీదే



B హ్యాపీ

ఒక ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్ళాడు లక్ష్మణ్. "మాకు ధైర్యముగా అవతలివారిని దబాయించగలిగిన పాయింట్ లేకున్నా వాదించే లక్షణాలు ఉన్నవారు కావాలి. అవన్నీ నీకు వున్నాయా!" అని అడిగాడు బాస్.

"నాకు లేవు సార్... కాని మా ఆవిడ సరిగా సరిపోతుంది సార్ ఈ ఉద్యోగానికి. పంపనా..." అని ఇంటర్వ్యూ అధికారిని అడిగాడు.

"మళ్ళీ పోటీలో కప్పు గెలిచా" అంటూ ఆనందంగా ఇంటికి వచ్చాడు రాము.

"ప్రతిసారీ కప్పేనా... ఒక్కసారన్నా సాసర్ గెలవరా మనవడా" అంది పక్కనే వున్న బామ్మ.

"నాకెందుకో మా ఆయనమీద అనుమానంగా ఉందే... ఆఫీసులో కొలీగ్‌తో ఏమన్నా ఎఫైర్ ఉందేమోనని" అన్నది ఆండాళ్ పనిమనిషితో.

"భలేవారు అమ్మగారు... మరొకరితో సంబంధమంటే మీరు ఊరుకున్నా నేనూరుకోనమ్మగారూ" గబుక్కున అనేసింది పనిమనిషి రంగి.

"మనకు నచ్చకపోయినా అతిథులదగ్గర చాలా మర్యాదగా, నవ్వుతూ మాట్లాడాలి తెలుసా..." అని అంటూ తండ్రి తన ఆరేళ్ళ కొడుక్కి చెప్పాడు పార్టీకి తీసుకువెళుతూ.

"అంటే నువ్వు అమ్మదగ్గర చేసినట్టా..." అన్నది కుర్రాడి మాట.

వెంగళ్రావు బట్టలషాపుకు వెళ్ళాడు.

కొత్త బట్టలు వేసుకుని బయటకు వచ్చి నిలువెత్తు అద్దంలో చూసుకుని తనవితానే గుర్తుపట్టలేక 'ఎవడబ్బా వీడు అద్దంలో' అన్నాడు ఫ్రెండ్‌తో.

ఆ ఫ్రెండ్ వెంగళ్రావును పక్కకునెట్టి అద్దం ముందు నిలబడి "నీ ముఖం... అద్దంలో ఉన్నది నేనేరా... కావాలంటే చూడు" అనేసరికి షాపువాళ్ళకు ఏం చెయ్యాలో అర్థంకాలేదు.

షాపింగ్ నుండి ఇంటికి వచ్చిన భార్య "ఏమండీ మళ్ళీ ఆ షాపుకు ఇప్పుడే వెళదామండీ ఒక్కసారి ప్లీజ్..." అంది.

"ఏం ఎందుకు... ఇంకో చీర కొనటం మరచిపోయావా..." కోపంగా అడిగాడు భర్త.

"చీరల విషయంలో నాకు అంత మతిమరపు లేదు మరి" అంది భార్య.

"మన పాపను మరచిపోయానండీ షాపులో"

"మీరు రాత్రిపూట బెడ్‌రూమ్ కిటికీ కర్టెన్స్ వేసుకోవాలి. నిన్న రాత్రి మీ శృంగారం అపార్ట్‌మెంట్‌వాళ్ళందరూ చూశారు" సలహా ఇచ్చాడు సుందర్రావు.

"ఏడిసినట్టుంది. నేను అసలు రాత్రి ఊళ్ళోనే లేనుకదా..." అన్నది అమాయకరావు సమాధానం.

"ఈ ఒక్క కథ రాసేసరికి నా ప్రాణం సగం పోయింది. దయచేసి ఈ కథను ప్రచురించరూ" అడిగింది రచయిత్రి.

"మీరు ఆ ఊపులోనే మరో కథ రాయాల్సింది. నాకు, పాఠకులకు కూడా బాధలు తప్పేవి" అంటూ తన పనిలో పడ్డాడు ఎడిటర్.

గెలవకపోవడమంటే ఓడిపోవడం కాదు. మళ్ళీ ప్రయత్నించకపోవడమే నిజమైన ఓటమి.